# ARTHA SASTHRA & NITI SASHTRA

## M.A. (SANSKRIT) I Semester Paper -I

**Director**

**Dr.Nagaraju Battu**

M.H.R.M., M.B.A., L.L.M., M.A. (Psy), M.A., (Soc), M.Ed., M.Phil., Ph.D.

Centre for Distance Education

Acharya Nagarjuna University

Nagarjuna Nagar-522510

Phone No.0863-2346208, 0863-2346222, Cell No.9848477441

0863-2346259 (Study Material)

Website: www.anucde.info

e-mail: anucdedirector@gmail.com

M.A (Sanskrit): ARTHA SASTHRA & NITI SASHTRA

## భర్తృహరి

భర్తృహరి వ్రాసిన నీతి, శృంగార, వైరాగ్య శతకాలు శతకత్రయమనే పేరుతో ప్రసిద్ధమైనవి మానవులందరికి జీవితంలో ప్రతి అవస్థలో ప్రేరణను ఇచ్చేవి ఈ మూడు శతకాలు. మానవుని ప్రారంభదశలో నీతిని బోధించేది నీతి శతకం. యౌవనావస్థ కొరకు శృంగార శతకం, వృద్ధావస్థ కొరకు వైరాగ్య శతకం ఉపయోగపడగలవు. ఈ శతకత్రయాలను వ్రాసిన భర్తృహరి ఎవరు, ఏ కాలంవాడు అన్న విషయంలో ఓరెడంత అభిప్రాయభేదమున్నది.

### భర్తృహరి ఎవరు ?

ప్రాచీన భారతీయ సంప్రదాయాన్ననుసరించి భర్తృహరి విక్రమాదిత్యుని అన్న. భర్తృహరి తన భార్య పింగళ దుశ్చర్యను సహించలేక విరక్తుడై అరణ్యానికి వెళ్ళిపోయెనట. దీన్ని బలపరిచే శ్లోకం—

విప్రేణాభూత పూర్వంఫలమధితపసాలంబి సూర్యప్రసాదాత్
లబ్ధ్వా తస్మాత్ స్వయం తత్ప్రవరతరజరాపంచనాకుంచనార్థమ్
హిత్వామోహం స్వకాన్తాప్యతివిమలధియా తం నిషేవ్యాత్త భిక్షో
యోగీంద్రో భర్తృహర్యాహ్వయ ఇహకురుతేఽ ద్యాపివిద్యావిలాసమ్.

ఒకానొక బ్రాహ్మణుడు తనకు సూర్యప్రసాదంచేత లభించిన ఫలాన్నొక దాన్ని ప్రభువైన భర్తృహరికి ఇచ్చెను. అతడు దాన్ని తన ప్రియ భార్యకు ఇచ్చెను అమె దాన్ని తన జారునికిచ్చెను. అతడు దాన్ని తన వేరొక ప్రియురాలికిచ్చెను. ఈ సంగతి తెలిసి భర్తృహరి లోకం మీద విరక్తి చెంది విరాగియై అరణ్యానికి వెళ్ళిపోయెను. భర్తృహరి శతకపీఠికలో రామచంద్ర బుధేంద్రుడు పేర్కొనిన శ్లోకమిది ఒకవేళ భర్తృహరి విక్రమాదిత్యుని అన్నయే అయినట్లయితే అతని కాలం క్రీ. పూ. ప్రథమ శతాబ్దమని చెప్పవలసి వుంటుంది.



క్రీ. శ. 691 ప్రాంతంలో భారతదేశానికి వచ్చిన ఇత్సింగ్ అన్న చైనా యాత్రికుడు అప్పటికి 40 సంవత్సరాల ముందు భర్తృహరి జీవించి వున్నాడని, అతడు బౌద్ధుడని తెలిపెను. ఈ పండిత భర్తృహరి మహాభాష్యానికి వ్యాఖ్యానం మరియు వాక్యపదీయమన్న వ్యాకరణ గ్రంథాన్ని వ్రాసినవాడు. అప్పుడు వైయాకరణుడు భర్తృహరి క్రీ. శ. 651 లో మరణించాడని నిర్ణయించవచ్చును. ఈ భర్తృహరి ఏడు సార్లు సన్యాసాన్ని తీసుకొని తిరిగి లౌకిక సుఖం మోహంతో తిరిగి వచ్చాడనీ ఇత్సింగ్ చెప్పి భర్తృహరి తన లౌకిక సుఖవాంఛను నిందిస్తూ చెప్పిన శ్లోకాన్ని ఉద్ధరించాడు. ఈ కథనాన్ని ఆధారం చేసుకొని వైయాకరణుడు భర్తృహరి, శతకకర్త భర్తృహరి ఒక్కరే అని వింటర్‌నిట్స్ అభిప్రాయపడినాడు. కాని భర్తృహరి ప్రసిద్ధమైన శతకరచనలను గూర్చి ఇత్సింగ్ ప్రసంగించలేదు, పైగా శతకకర్త భర్తృహరి బౌద్ధుడుగా అసలే కన్పించడు. అతడు శైవుడుగా, వేదాంతిగా కన్పిస్తాడు. ఒకవేళ బౌద్ధుడు కాకముందు భర్తృహరి శైవ బ్రాహ్మణుడై వుండి రాజాస్థానాన్ని ఆశ్రయించి సుఖాలను అనుభవించి ఉంటాడు. అప్పుడే అతడు శతకాలను వ్రాసివుంటాడు. తర్వాత విరాగియై బౌద్ధమతాన్ని తీసుకొన్న తర్వాత వైయాకరణుడై వుంటాడు. అందుకే ఇత్సింగ్ భర్తృహరి శాస్త్ర రచనలను గూర్చి ప్రసంగించాడు కాని శతకాలను గూర్చి ప్రసంగించలేదని అయినా ఒకచోట భర్తృహరి మానవనీతిసూత్రాలను రచించినట్లుగా ఇత్సింగ్ చెప్పిందాన్నిబట్టి శతకరచయిత ఇతడే అని నిర్ణయించవచ్చునని వింటర్‌నిట్స్ నిర్ణయించాడు. అప్పుడు భర్తృహరి సమయాన్ని క్రీ. శ. 650 పూర్వమని నిర్ణయించవచ్చునని వింటర్‌నిట్స్ అన్నాడు.

మరొక సంప్రదాయాన్ననుసరించి భర్తృహరి గోరక్షనాథుడనే శివసిద్ధయోగి శిష్యుడు. మత్స్యేంద్రనాథ, గోరక్షనాథులు నాథసంప్రదాయమనే యోగసంప్రదాయ ప్రవర్తకులు. వీరు మొదట బౌద్ధసిద్ధ సంప్రదాయానికి చెందినవారు తర్వాత శివుని ఆలంబన దేవతగా గ్రహించి యోగ సంప్రదాయాన్ని బోధించినవాడు మత్స్యేంద్రుడు. దాన్ని ప్రచారం చేసినవాడు గోరక్షనాథుడు. బౌద్ధసిద్ధ సంప్రదాయంలో 84 మంది సిద్ధగురువులున్నారు నాథసంప్రదాయంలో 9 మంది గురువులున్నారు. వారిని నవనాథులని పిలుస్తారు నాథ సంప్రదాయం క్రీ. శ. 7 వ శ॥ నుంచి క్రీ. శ. 14 శ॥ వరకు భారతదేశమంతటా వ్యాపించింది దీనిలో యోగానికి

ప్రాధాన్యముంది. నాథ గురువులు సిరిని వైరాగ్యాన్ని బోధిస్తూ తిరిగేవారు. మూఢ విశ్వాసాలను కులభేదాలను వీరు ఖండించారు. సామాన్యజనుల్లో ఇది బాగా వ్యాపించివుండేది. గోరక్షనాథ పేరుతో చాలా ప్రాంతాల్లో చాలా మంది చలామణి అయ్యారు. అటువంటప్పుడు ఏ గోరక్షనాథునికి భర్తృహరి శిష్యుడో నిర్ణయించి చెప్పలేము. అప్పుడు భర్తృహరి కాలం క్రీ. శ. 7 వ శ॥ నుంచి క్రీ. శ. 14 వ శ॥ నడుమ ఎప్పుడైనా కావచ్చును.

భట్టి కావ్య రచయిత భట్టి. ఈ భర్తృహరి ఇద్దరు ఒక్కరే అని ఒక వాద మున్నది. వాళ్ళిద్దరి శైలిలో ఎక్కడా సామ్యంలేదు. భట్టికావ్య రచయిత భట్టిని మల్లినాథాదులు భర్తృహరి పేరుతోపాటు పేరుగా పేర్కొన్నారు. ఒకవేళ భట్టి కావ్య రచయిత పేరు భర్తృహరియే అయినా అతడు, శతకత్రయకర్త భర్తృహరి వేరువేరు వ్యక్తులని వారి గ్రంథాధారాలను బట్టి తెలుస్తున్నది. బలమైన ఆధార మేది లేందే వీరిద్దరు ఒక్కరనే వాదాన్ని అంగీకరించలేము.

సంప్రదాయాన్ననుసరించి భర్తృహరి మొదట సుఖసంసారజీవితాన్ని గడుపుతూ ఏదో ఒక సంఘటన చేత ప్రభావితుడై సంసారజీవితాన్ని విడిచి విరాగియై, సన్యాసియై అరణ్యవాస జీవితాన్ని గడిపెనని తెలుస్తున్నది. సంప్రదాయ కథనం, ఈత్సింగ్ చెప్పిన కథనం రెండు కూడ దీన్ని బలపరుస్తున్నవి. శతకత్రయం, వ్యాకరణ గ్రంథాలను పరిశీలిస్తే అతడు ఈత్సింగ్ చెప్పినట్లుగా బౌద్ధసన్యాసిగా కాక శివాభిమానిగా, మీమాంసకుడుగా కన్పిస్తాడు. కాని మొత్తం మీద శతకత్రయకర్త మరియు వ్యాకరణకారుడు ఇద్దరు భర్తృహరులు ఒకే వ్యక్తిఅని అంగీకరిస్తే భర్తృహరి కాలం దాదాపుగా క్రీ. శ. 600-650 నడుమ అని నిశ్చయించవచ్చును.

### భర్తృహరి శ్లోకాలకు గల విశేష ప్రచారం

శతకత్రయంలోని భర్తృహరి శ్లోకాలు సరళమైనవి మరియు భావగాంభీర్యం కలవి దీర్ఘసమాసాలు లేకుండ సుందర, మధుర, సరళ, సరసమైన భాషలో వ్రాయబడినవి. ఈ శతకత్రయం నుంచి ఒక్క శ్లోకమైనా కంఠస్థంగా రాని సంస్కృతజ్ఞుడు వుండడు. ఈ శ్లోకాల్లో భావాలు సంక్షిప్తంగా సూత్రప్రాయంగా వుండి పాఠకుల హృదయాల్లోకి దూసుకొనిపోతవి. భర్తృహరి ప్రయోగించిన



అలంకారాలు సహజమైనవి, అక్లిష్టమైనవి. మరియు విషయ్యాగాహిత్యమ తోప్పంటట్లుగా వున్నవి. కవి సూక్ష్మేక్షికను ప్రదర్శించేవిగా వున్నవి. భర్తృహరి శ్లోకాలు భారతదేశంలో ప్రాచీనకాలం నుంచి మిక్కిలి ప్రచారంలో వుండటమేకాక ఆధునిక కాలంలో పాశ్చాత్యుల దృష్టిని విశేషంగా ఆకర్షించినవి. క్రీ శ. 1651 ప్రాంతంలో డచ్ మిషనరీకి చెందిన అబ్రహాం రాజర్ వీటిని డచ్ భాషలోకి అనువదించాడు. తర్వాత ఇవి లాటిన్, గ్రీకు, జర్మన్, ఫ్రెంచ్, ఇంగ్లీషు భాషల్లోకి అనువదింపబడినవి. అనేక భారతీయ దేశభాషల్లోకి కూడ శతకత్రయం అనువదింపబడింది.

### భర్తృహరి శతకత్రయం

శతకత్రయంలో మొదటిది నీతిశతకం. దీనిలో 108 శ్లోకాలున్నవి. శృంగార వైరాగ్య శతకాల్లో ఒక్కొక్క దానిలో 100 శ్లోకాం చొప్పున వున్నవి. శతకత్రయంలో శృంగార శతకమొక్కటే భర్తృహరి రచన అని కొందరు విమర్శకులు తలంచారు మరికొందరు విమర్శకులు మూడు శతకాలను వేరు వేరు కవులు వ్రాసారని తర్వాత ఒక్కచోట సంగ్రహ పరుపబడినవని తలంచారు. సంప్రదాయాన్ని అనుసరించి మహాభారతాన్ని వ్యాసుడు, అర్థశాస్త్రాన్ని కౌటిల్యుడు వ్రాసారని ఎట్లా నమ్ముతున్నమో అదే విధంగా శతకత్రయాన్ని భర్తృహరి వ్రాసాడని విశ్వసించాలని ఎస్. కే. డే అభిప్రాయపడినాడు. అన్ని ముక్తక కావ్యాలల్లో వలెనే దీనిలోను ప్రక్షిప్త శ్లోకాలుండి వుంటవి.

నీతిశతకంలో భర్తృహరి యొక్క జీవిత పరిశీలనా శక్తిని చక్కగా చూడవచ్చును. దీనిలో పండితుల ప్రశంస, మూర్ఖుల నింద, సదాచారం, మహాపురుషుల సత్పురుషుల వర్తనం, ధనంవల్ల మానవునిలో కలిగే మార్పులు, పరోపకారం, సేవాధర్మం, దుర్జనుల నింద మొదలైనవి వున్నవి. శృంగార శతకంలో స్త్రీ ప్రశంస, స్త్రీ సౌందర్యం, సంయోగ శృంగారం, వేశ్యానింద, వివిధ ఋతువుల్లో మానవుని కామాసక్తి మొదలైనవి వర్ణింపబడినవి. వైరాగ్య శతకంలో మానవుని తృష్ణ, అజ్ఞానం, విషయ త్యాగం, ఆత్మగౌరవం, పరబ్రహ్మధ్యానం, కాలమహిమ, వ్యర్థజీవితం, కాశీవాససుఖం మొదలైనవి వర్ణింపబడినవి.

శ్రీరస్తు

# భర్తృహరి సుభాషితములు

## నీతి శతకము

శ్లో॥ దిక్కాలాద్యనవిచ్ఛిన్నానన్తచిన్మాత్రమూర్తయే,
స్వానుభూత్యేకమానాయ నమః శాన్తాయ తేజసే.

క. అచ్ఛము దిక్కాలాద్యన
వచ్ఛిన్నా నంతచిద్ఘ వఘనంబు నిజ
స్వచ్ఛానుభూతిమానము
సచ్ఛాంతము తేజ మే న జస్రముఁదలఁతున్.

తా. దేశకాలాది పరిమితిలేక జ్ఞానమాత్ర స్వరూపమై అనుభవము చేతనే ఎఱుంగఁదగినదై శాంతమయిన జ్యోతిస్స్వరూప మగు పరబ్రహ్మమునకు నమస్కారము.

### మూర్ఖ పద్ధతి

శ్లో॥ బోద్ధారో మత్సరగ్రస్తాః ప్రభవః స్మయదూషితాః,
అబోధోపహతాశ్చాన్యే జీర్ణ మఙ్గే సుభాషితమ్, 1

తే. బోద్ధ లగువారు మత్సర పూర్ణమతులు
ప్రబలగర్వవిదూషితుల్ ప్రభువు లెన్న
నితరమనుజు లబోధోప హతులు గాన
భావమున జీర్ణ మయ్యె సుభాషితంబు

తా. తెలిసినవారలు అసూయతో నున్నారు. ప్రభువులు గర్వాంధులు. సామాన్యులకు వినునంతటి తెలివిలేదు. కావున నేను చెప్పఁదలఁచిన సుభాషితము నాయందే అఱఁగిపోయినది.

శ్లో॥ అజ్ఞః సుఖమారాధ్యస్సుఖతరమారాధ్యతే విశేషజ్ఞః,
జ్ఞానలవదుర్విదగ్ధం బ్రహ్మాపి నరం నరంజయతి.

క. తెలియనిమనుజుని సుఖముగఁ
దెలుపం దగు సుఖతరముగ దెలుపఁగ వచ్చున్
దెలిసినవానిం దెలిసియుఁ
దెలియనినరుఁ దెల్ప బ్రహ్మ దేవునివశమే.

తా. తెలియని వానికి సులభముగ దెలుపవచ్చును. చక్కగ దెలిసిన వానికి సమాధానము చెప్పుట మఱింత సులభము. స్వల్ప జ్ఞానము కలిగి సర్వజ్ఞుడనని గర్వపడు వానిని సృష్టికర్తయగు బ్రహ్మయు రంజింప జేయనేరడు.

శ్లో॥ ప్రసహ్య మణిముద్ధరేన్మకరవక్త్రదంష్ట్రాన్తరా
త్సముద్రమపి సంతరేత్ప్రచలదూర్మిమాలాకులం,
భుజఙ్గమపి కోపితం శిరసి పుష్పవద్ధారయే
న్నతు ప్రతినివిష్టమూర్ఖజన చిత్తమారాధయేత్. 3

చ. మకర ముఖాంతరస్థ మగు మానికమున్ బెకలింప వచ్చుఁ బా
యక చలదూర్మి కానికర మైనమహోదధి దాఁట వచ్చు మ
స్తకమునఁ బూవుదండవలె సర్పమునైన భరింప వచ్చు మ
చ్ఛిక ఘటియించి మూర్ఖజన చిత్తముఁ దెల్ప నసాధ్య మేరికిన్.

తా. మొసలినోటిలోని కోఱలనడుమనుండు రత్నము (ముత్యము) నైనను ప్రయత్నించి బయటికి దీయవచ్చును. పెద్దయలలు గల సముద్రమునైనను దాటవచ్చును. కోపముచేత బుసకొట్టు పాము నైనను పూలదండవలె శిరమున దాల్చవచ్చును; కాని దురాగ్రహము చేత మూఢుడయిన వాని మనమును సమాధాన పెట్టుట సాధ్యముకాదు.

శ్లో॥ లభేత సికతాసు తైలమపి యత్నతః పీడయన్
పిబేచ్చ మృగతృష్ణికాసు సలిలం పిపాసార్దితః,
కదాచిదపి పర్యటన్ శశవిషాణమసాదయే
న్నతు ప్రతిని విష్టమూర్ఖజనచిత్తమారాధయేత్. 4

తే. తివిరి యిసుమునఁ దైలంబుఁ దీయవచ్చుఁ
దవిలి మృగతృష్ణలో నీరు ద్రావవచ్చుఁ
దిరిగి కుందేటికొమ్ము సాధింపవచ్చుఁ
జేరి మూర్ఖులమనసు రంజింపరాదు.



తా. ప్రయత్నపడి ఇసుకనుండి కూడ చమురు తీయవచ్చును. ఎండమావులందు సైతము నీరును సంపాదించి త్రాగవచ్చును. తిరిగి కుందేటి కొమ్మునైనను సాధింపవచ్చును. కాని దురాగ్రహముగల మూఢుని మనస్సును మాత్రము సమాధాన పెట్టుటకు సాధ్యముగాదు.

శ్లో॥ వ్యాళం బాలమృణాళతన్తుభీరసౌ రోద్ధుం సముజ్జృమ్భతే
భేత్తుం వజ్రమణీం శిరీషకుసుమప్రాన్తేన సన్నహ్యతి,
మాధుర్యం మధుబిన్దునా రచయితుం క్షారామ్బు ధేరీహతే
మూర్ఖాన్యః ప్రతినేతుమిచ్ఛతి బలాత్సూక్తైః సుధాస్యన్దిభిః. 5

మ. కరిరాజున్ బిసతంతుసంతతులచేఁ గట్టన్ విజృంభించువాఁ
డురువజ్రంబు శిరీషపుష్పములచే నూహించు భేదింపఁదీ
పు రచింపన్ లవణాబ్ధికిన్ మధుకణం బుం జిందు యత్నించు ని
ద్ధరజీన్ మూర్ఖులఁ దెల్ప నెవ్వఁడు సుధాధారానుకారోక్తులన్.

తా. మదపుటేనుఁగును తామరతూటిదారముతో బంధింప జూచువాడును, దిరిసెనపువ్వు కొనచేత వజ్రమును గోయజూచువాడును, లవణసముద్రము నందలి నీరును తియ్యగా జేయుటకు నందొక తేనెబొట్టును విడుచువాడును, మంచి మాటలతో మూర్ఖులను సమాధాన పెట్టదలచువాడును సమానులు.

శ్లో॥ స్వాయత్తమేకా న్తహితం విధాత్రా వినిర్మితం ఛాదన మజ్ఞతాయాః,
విశేషతః సర్వవిదాం సమాజే విభూషణం మౌనమపణ్డితానామ్,6

తే. స్వవశము హితంబు మూఢతా చ్ఛాదనంబు
గాఁగ నీగలి నిర్మించెఁ గమలభవుఁడు
సర్వవిదు లగుసుజనుల సభలలోన
మౌనమె విభూషణము మూఢ మానవులకు.

తా. బ్రహ్మ మూఢులు తమ మూఢత్వమును దాచుకొనుటకుగాఁ దమకు స్వాధీనమైయుండునట్లు మౌనమును సృజించెను. పండితుల యెదుట మౌనముగ నుండుటయే మూఢుల కలంకారము.

శ్లో॥ యదా కించిద్జ్ఞోఽహం గజ ఇవ మదాన్ధః సమభవం
తదా సర్వజ్ఞోస్మీత్యభవదవలిప్తం మమ మనః,
యదా కించిత్కించిద్బుధజనసకాశాదవగతం
తదా మూర్ఖోస్మీతిజ్వర ఇవ మదో మే వ్యపగతః. 7

చ. తెలివి యొకింత లేనియెడఁ దృప్తుఁడ నై కరిభంగి సర్వమున్
దెలిసితి నంచు గర్వితమతిన్ విహరించితిఁ దొల్లి యిప్పుడు
జ్ఞులమతు లైన పండితుల సన్నిధి నించుక బోధశాలి నై
తెలియనివాఁడ నై మెలఁగితిని గతమయ్యె నితాంతగర్వమున్.

తా. నేను కొంచెముగఁ దెలిసికొనియుండు కాలమున మద గజమువలె మదించి నేనే సర్వజ్ఞుడనని తలంచితిని. పిదప పెద్దలవలన కొద్దికొద్దిగ ఎప్పుడు తెలిసికొంటినో అప్పుడు నేను మూర్ఖుడననియు, నాకేమియు దెలియ దనియు తలంచి జ్వరమును వదలి సుఖపడినట్లు నన్నుఁ బట్టియున్న గర్వమును విడిచి సుఖపడితిని.

శ్లో॥ క్రిమికులచితం లాలాక్లిన్నం విగన్ధి జుగుప్సితం
నిరుపమరస ప్రీత్యా ఖాద న్నరాస్థి నిరామిషమ్,
సురపతిమపి శ్వా పార్శ్వస్థం విలోక్య న శఙ్కతే
నహి గణయతి క్షుద్రోజన్తుః పరిగ్రహఫల్గుతామ్. 8

చ. క్రిమిసముదాయసంకులము గేవలనింద్యము పూతిగంధ హే
యమును నిరామిషంబులు ఖ రాంగభవం బగునెమ్ముఁ గుక్కదా
నములుచుఁ జెంత నున్న సురనాథునిఁ గన్గొని సిగ్గుఁ జెంద ద
ల్ప మని నిజస్వభావముఁ ద లంపదు నీచపుఁబ్రాణియెయ్యెడన్.

తా. కుక్క పురుగులు గలిగినదియు జొల్లుచేత తడిసినదియుఁ గంపు కొట్టుటచే రోతపుట్టించునదియు మాంసము లేనిదియు నగు గాడిద యెముకను అతి ప్రీతితో కొఱుకుచు తన సమీపమునకు దేవేంద్రుఁడు వచ్చి నిలిచినను చూచి సిగ్గుపడదు. నీచ ప్రాణి తాను గ్రహించిన వస్తువు తుచ్ఛమా కాదా యను విషయమును లెక్కచేయదు గదా !



శ్లో॥ శిరశ్శార్వం స్వర్గాత్పశుపతిశిరస్తః క్షితిధరం
మహీధ్రాదుత్తుఙ్గదవనిమవనేశ్చాపి జలధిం,
అధో గఙ్గా సేయం పదముపగతా స్తోక మథవా
వివేకభ్రష్టానాం భవతి వినిపాతః శతముఖః. 9

శా. ఆకాశంబుననుండి శంభునిశిరం బందుండి శీతాద్రి సు
శ్లోకంబైనహిమాద్రినుండి భువి భూ లోకంబునందుండి య
స్తోకాంభోధిఁ బయోధినుండి పవనాం ధోలోకముం జేరె గం
గాకూలంకష పెక్కుభంగులు వివేక భ్రష్టసంపాతముల్.

తా. గంగానది ప్రథమమున నాకాశమునుండి ఈశ్వరుని తల మీఁదను, అచ్చటినుండి హిమవత్పర్వతము మీఁదను, ఆ పర్వతమునుండి భూమిమీఁదను, భూమినుండి సముద్రమునకును, అచ్చటనుండి పాతాళమునకు వచ్చెను. గొప్పస్థితి నుండి తొలఁగినవారి కిదేవిధముగ బలు విధములగుపాట్లు సంభవించును.

శ్లో॥ శక్యో వారయితుం జలేన హుతభుక్ఛత్రేణ సూర్యాతపో
నాగేన్ద్రో నిశితాఙ్కుశేన సమదో దణ్డేన గౌ ర్గర్దభః,
వ్యాధిర్భేషజసఙ్గ్రహైశ్చ వివిధైర్మన్త్ర ప్రయోగైర్విషం
సర్వస్యౌషధమ స్తి శాస్త్రవిహితం మూర్ఖస్య నాస్త్యౌషధమ్ 10

చ. జలముల నగ్ని ఛత్రమునఁ జండమయూఖుని దండతాడనం
బుల వృషగర్దభంబులను బొల్పగుమత్తకరీంద్రమున్ సృణిం
జెలఁగెడురోగ మౌషధము చే విషముం దగుమంత్రయు క్తి ని
మ్ము లఁ దగఁ జక్కఁజేయనగు మూర్ఖునిమూర్ఖతమాన్పవచ్చునే

తా. అగ్నికి జలంబును, ఎండకు గొడుగు, మదగజంబునకు అంకుశంబును, ఎద్దుగాడిద మొదలగు జంతువులకుఁ గఱ్ఱయు, రోగంబునకు వివిధంబులగు మందులును, సర్పవిషంబునకుఁ బలువిధంబులగు మంత్రంబులును శాస్త్రములందు నివారకములుగ చెప్పఁబడియున్నవి. కాని మూర్ఖుని, మూర్ఖత్వమును పోఁగొట్టునట్టి యౌషధ మేశాస్త్రమునందును జెప్పఁ బడలేదు.

## విద్వత్పద్ధతి

శ్లో॥ శాస్త్రోపస్కృతశబ్దసున్దరగిరః శిష్యప్రదేయాగమా
విఖ్యాతాః కవయో వసన్తి విషయే యస్య ప్రభోర్నిర్ధనాః,
తజ్జాడ్యం వసుధాధిపస్య సుధియ స్త్వర్థం వినాఽపీశ్వరాః
కుత్స్యాః స్యుః కుపరీక్షకైర్న మణయో యైరర్ఘతః పాతితాః 11

చ. సకలకలావిభూషితులు శబ్దవిదుల్ నయతత్త్వబోధకుల్
ప్రకటకవీంద్రు లేన్నృపతి పజ్జను నిర్ధను లై చరింతు రా
విక్రుతపుజాడ్య మాదొరది విత్తము లేకయ వారు పూజ్యు లం
ధకజనదూషితంబులు ఘ నంబులు గావె యమూల్యరత్నముల్.

తా. వ్యాకరణాదిశాస్త్ర పఠనముచేత నిర్దుష్టముగను మనోహరంబు గను పలుకుచు విద్యార్థులకు శాస్త్రంబుల బోధించుచు సుప్రసిద్ధులయిన పండితులు ఏ ప్రభువు నొద్దనైనను ధనవిహీను లయియుండిరేని అది ఆ ప్రభువుయొక్క తెలివిలేమినే తెలుపును. రత్న పరిజ్ఞానములేని వర్తకుండమూల్యమణులను తక్కువ వెలగల వానినిగా చెప్పినంత మాత్రముచేతనే ఆ రత్నంబులకు లోపము రాదుగదా !

శ్లో॥ హర్తుర్యాతి న గోచరం కిమపి శం పుష్ణాతి యత్సర్వదా
ప్యర్థిభ్యః ప్రతిపాద్యమానమనిశం ప్రాప్నోతి వృద్ధిం పరాం,
కల్పాన్తేష్వపి న ప్రయాతి నిధనం విద్యాఖ్యమ న్తర్ధనం 2005
యేషాం తాన్ప్రతి మానముజ్ఝత నృపాః క స్తైః సహ స్పర్ధతే. 12

ఉ. హర్తకుఁ గాదు గోచర మ హర్నిశమున్ సుఖపుష్టి సేయు స
త్కీర్తి ఘటించు విద్య యను దివ్యధనం బఖిలార్థికోటికిం
బూర్తిగ నిచ్చినన్ బెరుఁగుఁ బోదు యుగాంతపు వేళనైన భూ
భర్తలు తద్ధనాధికుల పట్టున గర్వము మాను టొప్పగున్.

తా. విద్యాధనమును దొంగలు హరింపలేరు. అది (ధనమువలె గాక) ఎల్లప్పుడు సుఖమునే కలుగఁజేయును; కోరినవారి కెల్లప్పు డిచ్చుచుండినను మఱింత వృద్ధినొందును. ప్రళయకాలమప్పుడును నశింపదు. ఇట్టి విద్యాధనముగల వారియెడ సామాన్యధనముగల రాజుల దురాగ్రహ ముడుగవలయును. వారి నెదుర్కొనుట కెవ్వరును జాలరు.



శ్లో॥ పరిగతపరమార్థాన్ పణ్డితాన్ మాఽవమంస్థా
స్తృణమివ లఘు లక్ష్మీర్నైవ తాన్ సంరుణద్ధి,
అభినవమద రేఖాశ్యామగణ్డస్థలానాం
న భవతి బిసతన్తుర్వారణం వారణానామ్. 13

తే. ప్రభులు పండితు లగువారి వలన గర్వ
కలన మానుఁడు వారు మీ కలిమి తృణము
లీలఁ బోలింప లేమి మృ ణాళ గుణము
భూరిమదవారణములకు వారణంబె.

తా. ఓయీ! యథార్థ మెఱింగిన పండితుల నవమానింపకుము. నీ సంపదను చూచి నీ మాటల భరింతు రని తలఁచెదవేమొకాని వారు నీ సంపదను గడ్డి పోఁచవలె చూతురు. నూతనముగ మదధారకారుటచేత నలు పెక్కిన చెక్కిళ్ళుగల మదగజంబుల తామరతూఁటిచేత ఁ గట్టివేయుట సాధ్యమగునా!

శ్లో॥ అమ్భోజినీవనవిహార విలాసమేవ
హంసస్య హన్తినితరాం కుపితో విధాతా,
న త్వస్య దుగ్ధజలభేదవిధౌ ప్రసిద్ధాం
వైదగ్ధ్యకీర్తిమపహర్తుమసౌ సమర్థః. 2006 14

చ. వనజభవుండు కోపమున వాహనమైనమరాళభర్తకున్
వనజవనీవిహారకల నంబు దొలంగ ఁగఁ జేయుఁగాని గుం
భనమున దుగ్ధజీవనవి భాగవిధాననిరూఢనైపుణీ
జనితమహాయశోవిభవ సారము హంసకు మాన్పఁ జాలునే.

తా. బ్రహ్మకు హంసమీఁద కోపమువచ్చునేని పద్మసరోవరములందు విహరింప కుందునటుల చేయఁగలఁడు గాని నీరక్షీరంబుల వేఱుపఱచుటయందుఁ గల నేర్పును తీసివేయఁజాలఁడుగదా?

శ్లో॥ కేయూరాణి న భూషయన్తి పురుషం హారా న చన్ద్రోజ్జ్వలా
న స్నానం న విలేపనం కుసుమం నాలఙ్కృతా మూర్ధజా,
వాణ్యేకా సమలఙ్కరోతి పురుషం యా సంస్కృతా ధార్యతే
క్షీయన్తేఽఖిలభూషణాని సతతం వాగ్భూషణం భూషణమ్. 2003 15

ఉ. భూషలు గావు మర్త్యులకు భూరిమయాంగదతారహారముల్
భూషితకేశపాశమృదు పుష్పసుగంధజలాభిషేకముల్
భూషలు గావు పూరుషుని భూషితుఁ జేయుఁ బవిత్రవాణి వా
గ్భూషణమే సుభూషణము భూషణముల్ నశియించు నన్నియున్.

తా. పురుషునకు భుజకీర్తులు, సూర్యహారములు, చంద్రహారములు, మొదలగు సొమ్ములుగాని, స్నానము, చందనము పూసికొనుట, పూలు ముడుచుకొనుట, కురులు దువ్వుకొనుట మొదలగువానిలో నేదియుఁగాని యలంకారము నియ్యఁజాలదు. శాస్త్ర సంస్కారముగల వాక్కు ఒకటియే అలంకారమును కలుగఁజేయును. సువర్ణమయాది భూషణములన్నియు నశించును. వాగ్భూషణ మొక్కటియే నశింపని భూషణము.

శ్లో॥ విద్యా నామ నరస్య రూపమధికం ప్రచ్ఛన్నగుప్తం ధనం
విద్యా భోగకరీ యశస్సుఖకరీ విద్యా గురూణాం గురుః,
విద్యా బన్ధుజనో విదేశగమనే విద్యా పరా దేవతా
విద్యా రాజసు పూజ్యతే నహి ధనం విద్యావిహీనః పశుః. 16

ఉ. విద్య నిగూఢగుప్త మగు విత్తము రూపము పూరుషాళికిన్
విద్య యశస్సు భోగకరి విద్య గురుండు విదేశబంధుఁడున్
విద్య విశిష్టదైవతము విద్యకు సాటి ధనంబు లే దిలన్
విద్య నృపాలపూజితము విద్య నెఱుంగనివాఁడు మర్త్యుఁడే.

తా. పురుషునకు విద్యయే రూపము. విద్యయే రహస్యముగ దాఁచిపెట్టఁబడిన ధనము. విద్యయే సకలభోగములను కీర్తిని సుఖమును కలుగఁజేయును. విద్యయే గురువువలె అన్నియు బోధించును. పరదేశమునందు చుట్టమువలె సహాయ మొనర్చును. విద్యయే పరమాత్మ. విద్యయే రాజ పూజితము. ధన మిట్టిది కాదు. ఇట్టి విద్యలేనివాడు పశుతుల్యుఁడు.

శ్లో॥ క్షాన్తిశ్చేత్కవచేన కిం కిమరిభిః క్రోధో ఽస్తి చేద్దేహినాం
జ్ఞాతిశ్చేదనలేన కిం యది సుహృద్దివ్యౌషధైః కిం ఫలం,
కిం సర్పైర్యది దుర్జనాః కిము ధనైర్విద్యాఽనవద్యా యది
వ్రీడాచేత్కిము భూషణైస్సుకవితా యద్యస్తి రాజ్యేన కిమ్. 17



చ. క్షమ కవచంబు క్రోధ మది శత్రువు జ్ఞాతి హుతాశనుండు మి
త్రము దగుమందు దుర్జనులు దారుణపన్నగముల్ సువిద్య వి
త్త ముచితలజ్జ భూషణ ము దాత్తకవిత్వము రాజ్య మీక్షమా
ప్రముఖపదార్థముల్ గలుగు పట్టునఁ దత్కవచాదు లేటికిన్.

తా. ఓరుపున్న యెడల కవచము లక్కఱలేదు. కోప మున్న యెడల (ఉపద్రవము గలుగఁజేయుటకు) శత్రువు లక్కఱలేదు. దాయాది యున్న యెడల వేఱె నిప్పు అక్కఱలేదు. మిత్ర ముండెనేని సిద్ధౌషధము లక్కఱలేదు. దుర్జను లుండిరేని సర్పము లక్కఱలేదు.

శ్లో॥ దాక్షిణ్యం స్వజనే దయా పరిజనే శాఠ్యం సదా దుర్జనే
ప్రీతిః సాధుజనే నయో నృపజనే విద్వజ్జనే చార్జవం,
శౌర్యం శత్రుజనే క్షమా గురుజనే కాన్తాజనే ధృష్టతా
యే చైవం పురుషాః కలాసు కుశలాస్తేష్వేవ లోకస్థితిః 18

చ. వరకృప భృత్యులందు నిజ సర్గమునం దనుకూలవృత్తి కా
పురుషులయందు శాఠ్యము సు బుద్ధులయం దనురక్తి దాల్మి స
ద్గురువులయందు గౌరవము కోవిదులందు నయంబు రాజులం
దరిజనులందు శౌర్యము మృ గాక్షులయందుఁ బ్రగల్భభావ మీ
వరుసఁ గళాప్రవీణు లగు వారలయందు వసించు లోకముల్.

తా. బంధువులయందు దాక్షిణ్యముతో నుండుటయు (దాక్షిణ్యమనఁగా వారి యిష్టానుసారము నడచుట), సేవకులయందు దయ, దుర్జనులయందు కఠినముగ నుండుట, సజ్జనులయందు ప్రీతియు, రాజులయందు అనుసరణమును, విద్వాంసుల యందు గ్రమప్రవర్తనమును, శత్రువులయందు బరాక్రమమును, పెద్దలయందు ఓర్పును, స్త్రీలయందు దిట్టతనమును ఏ పురుషులు గనబఱతురో అట్టివారలే లోకస్థితికి గారణభూతులు.

శ్లో॥ జాడ్యం ధియో హరతి సిఞ్చతి వాచి సత్యం
మానోన్నతిం దిశతి పాప మపాకరోతి,
చేతః ప్రసాదయతి దిక్షు తనోతి కీర్తిం
సత్సంగతిః కథయ కిం న కరోతి పుంసామ్. 19

తే. సత్యసూక్తి ఘటించు ధీ జడిమ మాన్పు
గౌరవ మొసంగు జనులకుఁ గలుష మడఁచుఁ
గీర్తిఁ బ్రకటించు చిత్తవి స్ఫూర్తిఁ జేయు
సాధుసంగంబు సకలార్థ సాధనంబు.

తా. సత్సహవాసము బుద్ధిమాంద్యమును బోగొట్టును. సత్య వాక్యములనే పలుకజేయును. మంచి గౌరవము నిచ్చును. పాపముల బోగొట్టును. మనస్సు బాగుచేయును. దిక్కులయందు గీర్తిని వ్యాపింపజేయును. వే యేల? అది చేయజాలని మంచి యేలోకమునను లేదు.

శ్లో॥ జయన్తి తే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః,
నాస్తి తేషాం యశఃకాయే జరామరణజం భయమ్. 20

క. సుకృతాత్ములు రససిద్ధులు
సుకవీంద్రులు విజయనిధులు సుమ్ము తదీయా
ధికకీర్తిశరీరంబులు
ప్రకటజరామరణజన్మ భయరహితంబుల్.

తా. తత్తద్రసానుగుణముగ వర్ణించు నైపుణ్యముండుటచేత ధన్యాత్ములగు కవీశ్వరులు జరామరణములు లేని తమ కీర్తి శరీరములచేత సిద్ధౌషధ సేవచే జరామరణముల నతిక్రమించిన యోగులవలె సర్వదా ప్రకాశించుచుందురు.

## మానశౌర్య పద్ధతి

శ్లో॥ క్షుత్క్షామోఽపి జరాకృశోఽపి శిథిలప్రాయోపి కష్టాం దశా
మాపన్నోఽపి విపన్న దీధితిరపి ప్రాణేషు నశ్యత్స్వపి.
మత్తేభేన్ద్ర విభిన్నకుమ్భపిశితగ్రాసై కబద్ధస్పృహః
కిం జీర్ణం తృణమత్తి మానమహతామ గ్రేసరః కేసరీ. 21

ఉ. గ్రాసము లేక స్రుక్కిన జ రాకృశ మైన విశీర్ణ మైన సా
యాసము నైన నష్టరుచి యైనను బ్రాణభయార్త మైన ని
స్త్రాసమదేభకుంభపిశి తగ్రహలాలసశీలసాగ్రహా
గ్రేసరభాసమానమగు కేసరి జీర్ణతృణంబు మేయునే?



తా. శూరాగ్రణియగు సింగము ఆకలిచే డస్సినను, ముదిమి చేజిక్కినను, కష్టస్థితిని బొందినను, కాంతివిహీన మయినను, ప్రాణములు పోవుచున్నను మదించిన ఏనుగుయొక్క కుంభస్థలమును పగులఁగొట్టి యందలి మాంసమును భుజింపదలచునేకాని ఎండుగడ్డిని తినునాయేమి ?

శ్లో॥ స్వల్పస్నా యువసావసేకమలినం నిర్మాంసమప్యస్థిగోః
శ్వా లబ్ధ్వా పరితోషమేతి న చతత్తస్య క్షుధాశాన్తయే,
సింహో జమ్బుకమఙ్కమాగతమపి త్యక్త్వా నిహన్తి ద్విపం
సర్వః కృచ్ఛ్రగతోఽపి వాఞ్ఛతి జనః సత్త్వానురూపంఫలమ్. 22

ఉ. స్నాయువసావసేకమలి నమ్మగునెమ్ము గ్రహించి జాగిలం
బాయతమోదమందుఁ జన దాఁకలి దానికిఁ జెంత నున్నగో
మాయువు దానిఁజూచి పరి మార్పక సింగము దంతిఁగూల్చు నే
చాయల నెల్లవారు నిజ సత్త్వసమానఫలార్థులే కదా.

తా. కుక్క మాంసహీనమై సన్నని నరములు క్రొవ్వు స్వల్పముగ నుండిన మలినమైన యెముక దొరికినంతనే సంతోషము నొందునుగాని అయ్యది దానియాకలిని దీర్పదు. సింగము తన యెదుట జంబుకములు చరించుచుండినను వానిని వదలి వనంబంతయు గ్రుమ్మరి గజరాజమును చంపును. కావున జనులు కష్టకాలమునందును తమ శక్తికి దగినలాభమునే కోరుదురుగాని ఎచ్చు తక్కువ లుగఁ గోరరు.

శ్లో॥ లాఙ్గూలచాలనమధశ్చరణావఘాతం
భూమౌ నిపత్య వదనోదరదర్శనం చ,
శ్వా పిణ్డదస్య కురుతే గజపుఙ్గవస్తు
ధీరం విలోకయతి చాటుశతైశ్చ భుఙ్క్తే. 23

ఉ. వాలముఁద్రిప్పు నేలఁబడి వక్త్రముఁ గుక్షియుఁ జూపుఁగ్రిందట
గాలిడుఁ ద్రవ్వుఁ బిండదుని కట్టెదుటన్ శునకంబు భద్రశుం
డాలము శాలితండులగు డంబులు చాటువచశ్శతంబుచే
నోలి భుజించు ధైర్యగుణ యుక్తిగఁ జూచు మహోన్నతస్థితిన్.

తా. కుక్క తనకు పిడికెడు నన్నము పెట్టువానియెదుట తోక నాడించు కాలితోనే భూమియందుఁ బడి నోరు కడుపు జూపించుట మొదలగు నీచకృత్యము లెన్నియో చేయును. గజశ్రేష్ఠము ధైర్యముతో జూచుచు మావటివానిచేత ప్రియ వాక్యములచేత లాలింపబడుచు నాహారమును గ్రహించును.

శ్లో॥ పరివర్తిని సంసారే మృతః కో వా న జాయతే,
స జాతో యేన జాతేన యాతి వంశస్సమున్నతిమ్. 24

తే. ప్రాణిలోకంబు సంసార పతిత మగుట
వసుధపైఁ గిట్టి పుట్టని వాఁడు గలఁడె
వానిజన్మంబు సఫల మె వ్వానివలన
వంశమధికోన్నతి వహించి వన్నె కెక్కు

తా. చావు పుట్టుక లనుననవి యెప్పుడును గల యీ సంసారచక్రమున జచ్చిన వారందఱును బుట్టువారే. అట్లు పుట్టినవారిలో నశింపని వారెవరు? ఎవని పుట్టుకవలన వంశము కీర్త్యాదులచేత వాసిగాంచునో వాడే జన్మించినవాడు. వాని జన్మయే గణనీయము.

శ్లో॥ కుసుమస్తబక స్యేవ ద్వయీ వృత్తిర్మనస్వినః,
మూర్ధ్ని వా సర్వలోకస్య శీర్యతే వన ఏవ వా. 25

తే. కుసుమగుచ్ఛంబునకుఁ బోలెఁ బొసఁగు శౌర్య
మానవంతున కివి రెండు మహితగతులు
సకలజనమస్తకప్రదేశముల నైన
వనమునం దైన జీర్ణ భా వంబుఁ గనుట.

తా. మహనీయుడగు విద్వాంసునకు పుష్పగుచ్ఛమునకు బోలె ఎల్లఱ చేత శిరసావహింపబడుటయో, లేక అరణ్యముననే క్రమ్గుటయో ఈ రెండుగతులే తక్క వేఱువిధము లేదు.

శ్లో॥ సన్త్యన్యేఽపి బృహస్పతిప్రభృతయస్సమ్భావితా, పఞ్చషా
స్తాన్ప్రత్యేష విశేషవిక్రమరుచీ రాహుర్న వైరాయతే,



ద్వావేవ గ్రసతే దివాకరనిశా ప్రాణేశ్వరౌ భాస్వరౌ
భ్రాతః పర్వణి పశ్య దానవపతిశ్శీర్షావశేషాకృతిః. 26

మ. గురుముఖ్యుల్ గలరేవురాఱ్వుకు శుభాం గుల్ ఖేచరుల్ వారిలో
వరవిక్రాంతవిహారి రాహు వెపుడున్ వైరంబు సేయండు భా
స్వరులన్ భాస్కరయామినీచరులనే బాధించుచున్నాఁడు ద
త్పరతన్ మస్తకశేషమూర్తి యగునాదైత్యుండు గర్వంబునన్.

తా. బృహస్పతి మొదలగు గణనీయములైన అయిదాఱు గ్రహములున్నను పరాక్రమ శీలుడగు రాహువు వారి తెరువు బోక శీర్షావశిష్టుడై యుండియు తేజోవంతులగు దివాకర నిశాకరు (సూర్యచంద్రులను మాత్రమే) పర్వకాలములందు బీడించుచున్నాడు.

శ్లో॥ వహతి భువనశ్రేణిం శేషః ఫణాఫలకస్థితాం
కమఠపతినా మధ్యేపృష్ఠం సదా సచ ధార్యతే,
తమపి కురుతే క్రోడాధీనం పయోధిరనాధరా
దహహ ! మహతాం నిస్సీమానశ్చరిత్రవిభూతయః. 27

మ. భువనశ్రేణి వహించు శేషుఁడు ఫణా భోగంబుపై సంతతం
బవలీలన్ భరియుంచుఁ బృష్ఠమునఁ గూ ర్మాధీశ్వరుం డాతనిన్
ధవళక్రోడావశాత్ముఁ జేయు నతనిన్ వారాశి యశ్రాంతిచే
నవురా! ధీరచరిత్రసంపద లసం ఖ్యాత ప్రభావోన్నతుల్.

తా. ఆదిశేషుడు పదునాలుగు లోకములను తన పడగలచేత మోయు చున్నాడు. అతనిని ఆదికూర్మమూర్తి మూపున వహించు చున్నాఁడు. ప్రళయ కాలసముద్రు డట్టి యాదికూర్మమును ఆదివరాహునికి లోబడినవానినిగా జేయుచున్నాడు. కావున మహాత్ముల మహిమకు మేర లేదు.

శ్లో॥ వరం ప్రాణోచ్ఛేదః సమదమఘవన్ముక్తకులిశ
ప్రహారైరుద్గచ్ఛద్బ హులదహనోద్గారగురుభిః,
తుషారాద్రేః సూనోరహహ ! పితరి క్లేశవివశే
న చాసౌ సంపాతః పయసి పయసాం పత్యురుచితః. 28

*

చ. సమధికభీషణజ్వలన జాలవినిర్గమదుస్సహంబుచే
సమదసురేంద్రము క్తకులి శక్షతిచే నుచితంబు ప్రాణఘా
తము హిమవత్కుమారునకుఁ దండ్రి నిశాతశతారపాతఖే
దమున మునుంగుచున్న తఱిఁదా జలరాశిఁ జొరంగ నర్హమే.

తా. హిమవంతుని కుమారుడగు మైనాకునికి, దేవేంద్రుడు తన బలిమి కొలది వేయి నిప్పులు గ్రక్కుచు నోర్వరాక మీదబడు కులిశము యొక్క ధారహతిచే జచ్చుటే కొంచెము మంచిదిగాని, అపాటుచే మూర్ఛనొందిన తన తండ్రిని వదలి తన ప్రాణములను రక్షించుకొన సముద్రము జొచ్చి దాగి యుండుట తగునా ?

శ్లో॥ యదచేతనోఽపి పాదైః స్పృష్టః ప్రజ్వలతి సవితురినకాన్తః,
తత్తేజస్వీ పురుషః పరకృతనికృతిం కథం సహతే? 29

తే. అర్కకాంత మచేతనం బయ్యు సవితృ
పాదములు సోఁకినంతనె ప్రజ్వరిల్లుఁ
గాన నభిమానవంతుఁ డెం దైన శత్రు
కృతతిరస్కార మెట్లు స హింప నేర్చు.

తా. సూర్యకాంతమణి అచేతన మయినను సూర్యునిపాదములు (కిరణములు) తనకు సోకినంత మాత్రనే మం(డిప)డును. కావున తేజోవంతులు పరులు చేయు పరాభవమును సహించి యూరకుండరు.

శ్లో॥ సింహః శిశురపి నిపతతి మదమలినకపోలభిత్తిషు గజేషు,
ప్రకృతిరియం సత్త్వవతాం నఖలు వయస్తేజసాం హేతుః. 30

క. విదలింప నుఱుకు సింగపుఁ
గొదమయు మదమలినగండ కుంజరములపై
నిది బలశాలికి నైజము
గద తేజోనిధికి వయసు కారణ మగునే.

తా. సింగము బాల్యదశయం దుండినను మదధారలు స్రవించుటచే మలినము లయిన గోడలవంటి చెక్కిళ్లు గల మదగజంబులమీది కుఱుకును. ఇది బలవంతుల స్వభావము. పరాక్రమ ప్రకటనమునకు వయసు మొదలగునవి పనిలేదు.



## అర్థపద్ధతి

శ్లో॥ జాతిర్యాతు రసాతలం గుణగుణస్తత్రాప్యధో గచ్ఛతాత్
శీలం శైలతటాత్పతత్వభిజనస్సన్దహ్యతాం వహ్నినా,
శౌర్యే వైరిణీ వజ్రమాశు నిపతత్వర్థోఽస్తు నః కేవలం
యెనైకేన వినా గుణాస్తృణ వప్రాయాస్సమస్తా ఇమే. 31

ఉ. జాతి దొలంగుఁ గాత గుణ శక్తి రసాతలసీమకుం జనుం
గాత కులంబు బాది యగుఁ గాత నగంబుననుండి శీలముం
బాతముఁ జెందుఁ గాత బహు భంగుల విత్తమె మాకు మేలు వి
ఖ్యాతగుణంబు లెల్లఁ దృణ కల్పము లొక్కధనంబు లేవడిన్.

తా. జాతి పాతాళమునకు బోయినను, సద్గుణము లంతకంటె గ్రింద పడినను, శీలము కొండమీదనుండి క్రిందపడినను, వంశము తగలబడినను, శౌర్యమునందు బిడుగుపడినను మా కేమియు లోపములేదు. మాకు ద్రవ్య మొక్కటి యున్న జాలును. ఈ ద్రవ్యము లేకపోవునేని పైన చెప్పినవి యుండియు గడ్డిపోచకైనను కొఱగావు.

శ్లో॥ యస్యాస్తి విత్తం స నరః కులీనః స పణ్డితస్స శ్రుతవాన్ గుణజ్ఞః,
స ఏవ వక్తా సచ దర్శనీయః సర్వే గుణాః కాఞ్చనమాశ్రయన్తి. 32

క. ఏనరునకు విత్తముగల, దానరుఁడు కులీనుః దధికుఁ దార్యుఁడతండే
ధీనిధి ధన్యుఁడు నేర్పరి, నానాగుణగణము కాంచ నంబున నిలుచున్.

తా. లోకమునందు ధనముగలవాడే కులీనుడనియు, పండితుడనియు, శాస్త్రజ్ఞుడు అనియు, గుణావగుణముల నెఱింగినవాడనియు, చక్కని వాగ్ధోరణికలవాడనియు, చూడదగినవాడనియు, రూపవంతు డనియు జెప్పబడును. దన మొకటి ఉండునేని పై గుణములు లేకపోయినను వానియం దీగుణము లున్నవని జనులు తలంతరు.

శ్లో॥ దౌర్మన్త్ర్యాన్నృ పతిర్వినశ్యతి యతిస్సఙ్గాత్సుతో లాలనా
ద్విప్రోఽనధ్యయనాత్కులం కుతనయాచ్ఛీలం ఖలోపాసనాత్,
హ్రీర్మద్యాదనవేక్షణాదపి కృషిః స్నేహః ప్రవాసాశ్రయా
న్మైత్రీ చాప్రణయాత్సమృద్ధిరనయాత్త్యాగాత్ప్రమాదాద్ధనమ్. 33

మ. యతి సంగంబున బాలుఁడాదరముచే జ్యాభర్త దుర్మంత్రిచే
శ్రుతిహానిన్ ద్విజుఁ డన్వయంబు ఖలుచేఁగ్రూరాప్తిచే శీలము
ద్ధతిచే మిత్రత చూపులేమిఁ గృషి మద్యప్రాప్తిచే సిగ్గు దు
ర్మతిచే సంపదలున్ నశించుఁజెడు నర్థంబుల్ ప్రమాదంబునన్.

తా. దుర్మంత్రివలన రాజును, సంగము వలన యతియు, లాలించుటచే బుత్రుడును, వేదాధ్యయనము లేమిచేత బ్రాహ్మణుడును, కుపుత్రుని వలన వంశమును, దుర్మార్గుల సేవ వలన సదాచారమును, మద్యపానము వలన లజ్జయు, తఱచుగ జూడకపోవుటచేత వ్యవసాయమును, దేశాంతర సంచారము చేత స్నేహమును, అనురాగము లేమిచేత మైత్రియు, నీతిలేమిచేత సంపదయు, అపాత్రదానముచేతను, పరాకుచేతను దనమును నశించును.

శ్లో॥ దానం భోగో నాశస్తిస్రో గతయో భవన్తి విత్తస్య,
యన్న దదాతి న భుఙ్క్తే తస్య తృతీయా గతిర్భవతి. 34

క. దానము భోగము నాశము
పూనికతో మూఁడుగతులు భువి ధనమునకున్
దానము భోగము నెఱుఁగని
దీనునిధనమునకు గతి దృతీయమె పొసఁగున్.

తా. ధనవ్యయమునకు సత్పాత్రదానము, తా ననుభవించుట, దొంగలు మొదలగు వారలు హరించుట అని మూడుదారులు గనబడుచున్నవి. ఎవడు సత్పాత్రమున కియ్యక తాను ననుభవింపక యుండునో వానిధనమునకు మూడవ దారియే (అనగా చోరులు మొదలగువారు హరించుటయే) అగును.

శ్లో॥ మణిశ్శాణోల్లీఢః సమరవిజయీ హేతిదళితో
మదక్షీణో నాగః శరది సరిదాశ్యానపులినా,
కలాశేషశ్చన్ద్రః సురతమృదితా బాలవనితా
తనిమ్నా శోభన్తే గళితవిభవాశ్చార్థిషు నరాః. 35

ఉ. శాణవిఘృష్టరత్నమును శస్త్రహతుం డగుశూరుఁడున్ మద
క్షీణగజంబు సైకతవిశిష్టశరన్నదియున్ నవక్షపా



ప్రాణవిభుండు చందసుర తాలస బాలికయున్ ధనైకవి
శ్రాణనశూరులుం గడుఁగృశత్వమునం బ్రభఁగాంతు రిద్ధరిన్.

తా. సానబెట్టబడిన మణియు, ఆయుధక్షతములు గలిగియున్న శూరుఁడును, మదజలస్రావము చేత జిక్కిన గజమును; శరత్కాలమున ఎండిన యిసుక తిన్నెలు గల నదియు, కలామాత్రావశిష్టుడగు చంద్రుడును, రతిక్రీడచే డస్సిన నవయౌవనయగు బాలయు సత్పాత్ర దానముచేత నైశ్వర్యమును గోలుపోయిన రాజులును ఎంత కృశించినను విశేషముగ బ్రకాశింతురు.

శ్లో॥ పరిక్షీణః కశ్చిత్ స్పృహయతి యవానాం ప్రసృతయే
న పశ్చాత్సమ్పూర్ణః కలయతి ధరిత్రీం తృణసమాం,
అతశ్చానేకాన్తా గురులఘుతయార్థేషు ధనినా
మవస్థా వస్తూని ప్రథయతి చ సంకోచయతి చ. 36

ఉ. చేరి యొకండు నెవ్వఁబడి చిక్కుచుఁ జేరెడుశాలిధాన్యమే
కోరు నతండు పిమ్మట న కుంఠధనోన్నతుఁడై వసుంధరం
బూరికి సాటిగాఁదలఁచు భూరిధనాఢ్యులచా ప్పనేకమై
గౌరవమున్ లఘుత్వమును గైకొను వస్తువులందు నెల్లెడన్.

తా. దారిద్ర్యము ననుభవించునపు డొక గుప్పెడు ధాన్యము నపేక్షించునతడే కాలాంతరమున ఐశ్వర్యమునందునేని భూమండలము నంతయు గడ్డిపరక వలె గాంచును. కాబట్టి సమయము ననుసరించి వస్తువులు అధికములనియు నల్పములనియు జెప్పబడును. ఒకప్పుడు అల్పమైనది మఱొకప్పు దధికముగను అదియే మరల నల్పమైనదిగను తోచును.

శ్లో॥ రాజన్ దుధుక్షసి యది క్షితిధేనుమేతాం
తేనాద్య వత్సమివ లోకమముం పుషాణ,
తస్మింశ్చ సమ్యగనిశం పరిపుష్యమాణే
నానాఫలం ఫలతి కల్పలతేవ భూమిః. 37

తే. ధరణి ధేనువుఁ బిదుకంగఁ దలఁచితేని
జనులఁ బోషింపు మధిప న త్సములమాడ్కి

జనులు పోషింపఁబడుచుండ జగతి కల్ప
లతతెఱంగున సకలఫ లంబు లొసఁగు.

తా. రాజా! భూమి యను గోవునుండి ధనమును పితుకదలచితివేని ఆవు దూడను పోషించిన విధంబుగ జనులను బోషింపుము. ఆ జనులను జక్కగ నీవు పోషించితివేని భూమి కల్పవల్లి వలె గోరినవాని నన్నింటిని ఫలింపజేయును.

శ్లో॥ సత్యాఽనృతా చ పురుషా ప్రియభాషిణీ చ
హింస్రా దయాళురపి చార్థపరా వదాన్యా,
నిత్యవ్యయా ప్రచురనిత్యధనాగమా చ
వారాఙ్గనేవ నృపనీతిరనేకరీతిః. 38

తే. సత్య మనృతంబు పరుషోక్తి సరసభాష
ప్రాణిహింసయు దయయు లో భంబు నీఁగి
కనకసంగ్రహవ్యయములు గలుగు వార
రమణికైవడి బహురీతి రాజనీతి.

తా. రాజనీతి కొన్ని తావుల సమయోచితముగ సత్యమిశ్రముగను, కొన్ని తావుల నసత్యయుతముగను, ఒకచోట నిష్ఠురముగను, ఒకతావున చెవుల కింపుగను నుండుచు, ఒకచోట బాధించుచు, మఱొక తావున దయను గనంబఱచుచు, ఒకతావున పిసిడితనము నొందుచు, మఱొకచోట దానము నొనర్చుచు, నొకచోట నెప్పుడు వ్యయపెట్టుచు మఱొకవిధముగ నెల్లపుడు సంపాదించుచు, వారాంగన వలె నానాప్రకారముల నుండును.

శ్లో॥ ఆజ్ఞాకీర్తిః పాలనం బ్రాహ్మణానాం
దానం భోగో మిత్రసంరక్షణం చ,
యేషామేతే షడ్గుణా న ప్రవృత్తాః
కోఽర్థస్తేషాం పార్థివోపాశ్రయేణ ? 39

తే. ఆజ్ఞయును గీర్తియును భూసు రావనంబు
దానమును భోగ మిత్రసం త్రాణనములు
షడ్గుణంబులు గలుగ వే జనులయందు
వారిఁగొల్చిన ఫల మేమి వసుమతీశ.



తా. దుర్జనశిక్షణము, సత్కీర్తి, బ్రాహ్మణపరిపాలనము, సత్పాత్ర దానము, స్రక్చందన విహారాది భోగములు, ఆపన్నులగు మిత్రాదుల రక్షించుట అను సద్గుణషట్కము లేని రాజుల సేవించుటవలన లాభమేమియు లేదు.

శ్లో॥ యద్ధాత్రానిజఫాలపట్టలిఖితం స్తోకం మహద్వా ధనం
తత్ప్రాప్నోతి మరుస్థలేఽపి నితరాం మేరౌ చ నాతోఽధికం,
తద్ధీరో భవ విత్తవత్సు కృపణాం వృత్తిం వృథా మా కృథాః
కూపే పశ్య పయోనిధావపి ఘటో గృహ్ణాతి తుల్యం జలమ్. 40

చ. వనజభవుండు నెన్నొసట వ్రాసినసొమ్ము ఘనంబొ కొంచెమో
విను మరుభూమి కేఁగిన లభించును మేరువుఁ జేరఁ బోయినన్
ధన మధికంబు రాదు కదు దైన్యము మాను ధనాఢ్యులందు న
వ్వననిధి నూతఁ దుల్యముగ వారి గ్రహించు ఘటంబు సూడుమా.

తా. తన నొసట వ్రాసినంత ధనము కొద్దిదైనను గొప్పదైనను మరు స్థలమునం దున్నను తప్పక పొందును. మేరువునందైనను అతనికంటె నధిక ముగ బొందడు. కావున ధనవంతులను జూచి దీనత్వమును గనంబఱుపకుము. కుండను బావియందు ముంచినను సముద్రమున ముంచినను దాని పరిమితమైన జలముమాత్రమే గైకొనునుగదా. ఈ దృష్టాంతముగ నెచటికి బోయినను ప్రాప్తమెంతో యంతే లభించును గాని యెక్కువ గలుగదు. కలిగినంతమట్టుకు తృప్తి పొందియుండవలెను.

## దుర్జన పద్ధతి

శ్లో॥ అకరుణత్వమకారణవిగ్రహః పరధనే పరయోషితి చ స్పృహా
సుజనబన్ధుజ నేష్వసహిష్ణుతా ప్రకృతిసిద్ధమిదం హి దురాత్మనామ్. 41

తే. కారణము లేనికలహంబు గరుణలేమి
పరవధూపరధనవాంఛ బంధుసాధు
జనములం దసహిష్ణుత్వ మనఁగ జగతిఁ
బ్రకృతిసిద్ధంబు లివి దుష్ట నికరమునకు.

తా. దయాహీనత, నిష్కారణమైన కలహము, పరుల ధనము నందును పరస్త్రీల యందును ఆసక్తి, సజ్జనులయందును, బంధువులయందును ఓర్పులేమియు ఇవి దుర్జనుల స్వభావసిద్ధగుణములు.

శ్లో॥ దుర్జనః పరిహర్తవ్యో విద్యయాఽలంకృతోఽపి సన్,
మణినా భూషితస్సర్పః కి మసౌ నభయంకరః? 42

తే. విద్యచే భూషితుం డయి వెలయుచున్నఁ
దొదరి వర్జింప నగుఁ జుమీ దుర్జనుండు
చారుమాణిక్యభూషిత శస్తమస్త
కంబు గలపన్నగము భయం కరము గాదె.

తా. పాము శిరమునందు రత్నము కలదైనను భయంకర మగుటచే దూరముగ నెటులు వదలదగిన దగుచున్నదో, అట్లే దుర్జనుడు విద్యావంతుడైనను దూరముగ విడువదగినవాడు.

శ్లో॥ జాడ్యం హ్రీమతి గణ్యతే వ్రతశుచౌ దంభః శుచౌ కైతవం
శూరే నిర్ఘృణతా మునౌ విమతితా దైన్యం ప్రియాలాపిని,
తేజస్విన్యవలి ప్తతా ముఖరతా వక్తవ్యశక్తిస్థిరే
తత్కో నామ గుణోభవేత్స గుణినాం యో దుర్జనైర్నాఙ్కితః. 43

శా. హ్రీరమ్యుం జడుఁగాఁగ, సువ్రతుని మా యింగా, శుచిం దంభిఁగా.
శూరున్ నిర్దయుఁగా మునిన్ విమతిఁగా, శ్రోత్రప్రియాలాపు ని
స్సారుంగా, బలవంతు గర్వితునిగా, సద్వక్త వాచాలుఁగాఁ,
గ్రూరుం డెన్ని సుధీగుణంబు దురితా రూఢంబు జేయుంగదా!

తా. లజ్జగలవాని మందునిగను, తపోవంతుని డంబముగలవానిగను, శుచిగల వానిని వేషధారునిగను, శూరుని దయాహీనునిగను చెప్పును. ఆత్మస్వరూపమును మననము చేయు వానిని బుద్ధిహీనుడని దూషించును. ప్రియముగ మాట లాడువానిని చూచి దీనుఁడుగా గణించును. తేజోవంతుని గర్విగా ప్రకటించును. సభలలో జక్కగ యుక్తియుక్తముగ మాటలాడువానిని వదరుబోతుగా నెంచును. ఇట్లు గుణవంతుల గుణములలో దుర్జనులు దోషముగా గణింపని దేదియు లేదు.

శ్లో॥ లోభ శ్చే దగుణేన కిం? పిశునతా య ద్యస్తి కిం పాతకైః ?
సత్యం చే త్తపసా చ కిం? శుచి మనో య ద్యస్తితీర్థేన కిం?
సౌజన్యం యది కిం బలేన? మహిమా యద్యస్తి కిం మణ్డనైః?
సద్విద్యా యది కిం ధనై ? రపయశో యద్యస్తి కిం మృత్యునా? 44



చ. వగ గొనులోభమున్ బిశున భావము సత్యము చిత్తశుద్ధియుం
దగుసుజనత్వమున్ సుమహితత్వము విద్యయు లోకనిందయుం
దగిలిన, దుర్గణంబు దురి తంబు దపంబును దీర్థసేవ భూ
ష్యగణము సొమ్ములుం ధనచ యంబును జావురు వేఱ యున్నవే?

తా. అత్యాశ యున్న అది యొక్కటియే యత్యధికనిందను కలుగజేయును; అందుకు వేఱొకదుర్గుణ మక్కఱలేదు. పిశునత్వము (కొండెములు చెప్పుట) ఉండునేని నరకములో ద్రోయుటకు వేఱుపాపము లక్కఱలేదు. సత్యమున్న లేక, సర్వజనులను సమముగా జూచుగుణమున్న, అగుణ మొక్కటియే పాపములను బోగొట్ట జాలియుండ చాంద్రాయణాది తపస్సు చేయనక్కఱ లేదు. ద్రోహచింత మొదలగు దుష్టసంకల్పము లేక నిర్మలమగు మనస్సున్న మోక్ష దాయకమైన తీర్థసేవ యక్కఱలేదు. మంచితనముండెనేని స్వకార్య నిర్వహణమునకు స్వజన మక్కఱలేదు. గౌరవ ముండునేని యలంకారము లక్కఱలేదు. చక్కని విద్యయుండునేని వేఱుధన మక్కఱలేదు. అపకీర్తియుండునేని అది యొక్కటియే మృతప్రాయము గనుక వేఱుగ చావనక్కఱలేదు. కావున పై విషయములో నన్నిటిని చక్కగ నాలోచించి దుర్గుణములు త్యజించి సుగుణములు గ్రహింపవలయునని భావము.

శ్లో॥ శశీ దివసధూసరో, గళితయౌవనా కామినీ,
సరో విగతవారిజం, ముఖమనక్షరం స్వాకృతేః,
ప్రభు ర్ధనపరాయణః, సతతదుర్గతిస్సజ్జనో,
నృపాఙ్గణగతః ఖలో, మనసి సప్తశల్యాని మే. 45

చ. దినమలినాంగుఁ డైనహిమ దీప్తియుఁ, బ్రాయము దప్పునాతియున్,
వనరుహశూన్య మౌకొలను, వర్ణితరూప నిరక్షరాస్యమున్,
ధనపరుఁడైనరాజు సత తంబును లేమిని గుందుసాధువున్,
జనపతిచెంత దుర్జనుఁడు, శల్యము లే డివి నామనంబునన్.

తా. పగటియందు దేజోహీనుడైన చంద్రుడును, గత యౌవన యగు కామినియు, తామరలు లేనికొలనును, చదువు లేని సుందరుడును, కేవల ధనాశ గల భూపాలుడును, సర్వదా దరిద్రుడగు సజ్జనుడును, ప్రభువుల సమీపమున జేరి యితరుల కార్యవిఘాతము చేయుచుండు దుర్జనుడును ఈ యేడుగురును శల్యము వలె మనస్సునకు దుఃఖమును కలుగజేయుదురని యభిప్రాయము.

శ్లో॥ న కశ్చిచ్చణ్డ కోపానా, మాత్మీయో నామ భూభుజామ్,
హోతారమపి జుహ్వానం, స్పృష్టో దహతి పావకః. 46

క. మనుజులలో నెవ్వఁడు దగఁ
దనవాఁ డనువాఁడు దుష్ట ధరణీశునకున్ ?
దనకయి వ్రేలిమి వేల్చెడు
జనునితనువుఁ గాల్చు వాయు సఖుఁడదయుం డై.

తా. అగ్నిహోత్రుడు తన తృప్తికై ఆజ్యాదులు హోమము చేయువానిని సైతము తాకినంతమాత్రాన మొగమోటమి లేక కాల్చును. అట్లే అతికోపులగు భూపాలురకును స్థిరముగ ప్రేమించదగినవాడు ఒకడును నుండడు. వారెంతటి హితకారినైనను ఇంచుక తప్పిన చంపింతురు.

శ్లో॥ మౌనాన్మూక, ప్రవచనపటుర్వాచకో జల్పకో వా,
ధృష్టః పార్శ్వే భవతి చ వసన్, దూరతోఽ ప్యప్రగల్భః,
క్షాన్త్యా భీరు, ర్యది న సహతే ప్రాయశో నాభిజాతః,
సేవాధర్మః పరమగహనో యోగినామప్యగమ్యః. 47

ఉ. మౌనముచేత మూఁగయు, సమంచితవక్త ప్రలాపి, చెంగటం
బూని వసింప దిట్ట, దమ ముందట దవ్వుగ నుండెనేని శా
లీనుఁడు, దాల్మి భీరుఁ, దవ లిప్తుండు దాలిమి లేనిబంటు, భూ
జానులసేవ దుష్కర మ సాధ్యము యోగులకైన నిద్ధరన్.

తా. సేవకు డగువాడు ఏమియు బలుకకయుండునేని వానిని మూగవాడనియు, చక్కగ మాట్లాడునేని వదరుబోతనియు, సమీపమున నున్న భయభక్తులు లేని వాడనియు, దూరముగనున్న చేతకాని వాడనియు, సహించువాడగునేని పిఱికి యనియు, ఓర్పులేనియెడల సద్వంశజాతుడు కాడనియు ప్రభువులు తలఁతురు. కావున ఇట్టి సేవా ధర్మమునందు చక్కగ జరించుట యోగీశ్వరులకైనను అలవి కాదు.

శ్లో॥ ఉద్భాసితాఖిలస్య విశృఙ్ఖలస్య
ప్రోద్గాఢవిస్మృతనిజాధమకర్మవృత్తేః,
దైవా దవాప్తవిభవస్య గుణద్విషోఽ స్య
నీచస్య గోచరగతైః సుఖమాస్యతే కైః ? 48



చ. ఖలు లగువారి నెల్లనధి కారసమర్థులఁ జేసి, తా నిర
ర్గళగతియై నికృష్టనిజ కర్మము విస్మృతిపా లొనర్చి, ని
శ్చలగుణవైరియై విధివ శంబున సంపద గాంచి ద్రుళ్లుచున్
మెలఁగున్నృపాలు దేశమున మేలు లభించునె యెట్టి వానికిన్ ?

తా. దుర్జనులకే సహాయమొనర్చుచు వారిని జేరదీసి స్వేచ్ఛాచారుఁడై తా నింతకుముం దనుభవించిన హీనస్థితిని దైవయోగము చేతబట్టిన సంపదచేత పొగరెక్కి మఱచి గుణవంతుల ద్వేషించు నీచుని కంటబడినవా రెవ్వరును సుఖపడరు. అట్టివానికి గోచరింపక బ్రదుకుటయే క్షేమమని యుపదేశము.

శ్లో॥ ఆరమ్భగుర్వీ క్షయిణీ క్రమేణ లఘ్వీ పురావృద్ధిముపైతి పశ్చాత్,
దినస్య పూర్వార్ధ పరార్ధభిన్నా ఛాయేవ మైత్రీ ఖలసజ్జనానామ్. 48

తే. మొదలఁ జూచినఁ గడు గొప్ప పిదపఁగుఱుచ.
యాదిఁ గొంచెము తర్వాత నధిక మగుచుఁ,
దనరు, దినపూర్వపరభాగ జనితమైన
చాయపోలికఁ దుర్జనస జ్జనులమైత్రి.

తా. దురాత్ములస్నేహము ప్రాతఃకాలపునీడవలె ప్రథమమున విస్తారముగ నుండి క్రమక్రమముగ క్షీణించిపోవును. సజ్జనుల మైత్రి సాయంకాలపు నీడవలె ప్రథమమున చిన్నదై క్రమక్రమముగ వృద్ధినందుచువచ్చును. కనుక నీ రెంటిలో నేది యుక్తమో దానిని బుద్ధిమంతుడు కైకొనవలెను.

శ్లో॥ మృగమీనసజ్జనానాం తృణజలసన్తోషవిహితవృత్తీనామ్,
లుబ్ధకధీవరపిశునా నిష్కారణమేవ వైరిణో జగతి 50

తే. కసవుచే నీటిచే మోద కలనచేత
బ్రదుగు మృగమీనసజ్జన ప్రకరమునకు
శబరకై వర్తసూచక జనులు జగతిఁ
గారణము లేనిపగవారు గారె తలంప.

తా. పరుల బీడింపకయే గడ్డిపరకలచేత కాలయాత్రను గడపుకొను జింకలు మొదలయిన మెకములకు బోయలును, నీటిచేత బ్రదుకు మీనములకు జాలర్లును,

దొరికినదానితో నంతసించి కాలయాత్ర చేయు సజ్జనులకు కొండెగాండ్రును అకారణవైరులయి లోకమున నగంబడుచున్నారు.

## సుజన పద్ధతి

శ్లో॥ వాఞ్ఛా సజ్జనసఙ్గతౌ, పరగుణే ప్రీతి ర్గురౌ నమ్రతా,
విద్యాయాం వ్యసనం, స్వయోషితి రతి, ర్లోకాపవాదా ద్భయం,
భక్తిః శూలిని, శక్తి రాత్మదమనే, సంసర్గముక్తిః ఖలై,
రేతే యేషు వసన్తి నిర్మలగుణా, స్తేభ్యో నమః కుర్మ హే. 51

మ. సుకృతిశ్రేష్ఠులగోష్ఠియుం, బరగుణ స్తోమంబునం బ్రీతి, దే
శికసం సేవయు, విద్యయందు రుచి, స్వ స్త్రీకేళి, లోకాపవా
దకథాభీతియు, శంభుభక్తి, దమనో ద్యచ్ఛక్తియున్, సాధుదూ
షకసాంగత్యవిముక్తియుం, గలమనీ షావంతులం గొల్చెదన్.

తా. సత్సహవాసమునం దాసక్తియు, పరులగుణమునందు బ్రీతియు, గురువుల యందు అణకువయును, విద్యలయం దాసక్తియును, స్వభార్యయందు సంభోగమును, జనాపవాదమునకు వెఱచుటయు, ఈశ్వరునియందు భక్తియు, అవమానము గలిగిన సామర్థ్యమును చూపుటయు, దుస్సహవాసమును విడుచుటయు, ఇట్టి నిర్మల గుణములు గలవారికి నమస్కారము.

శ్లో॥ విపది ధైర్య మథాభ్యుదయే క్షమా
సదసి వాక్పటుతా, యుధి విక్రమః,
యశసి చాభిరతి ర్వ్యసనం శ్రుతౌ
ప్రకృతిసిద్ధ మిదం హి మహాత్మనామ్. 52

ఉ. ఆపదలందు ధైర్యగుణ, మంచితసంపదలందుఁ దాల్మియున్,
భూపసభాంతరాళమునఁ బుష్కలవాక్చతురత్వ, మాజి బా
హాపటుశక్తియున్, యశము నందనురక్తియు, విద్యయందు వాం
ఛాపరివృద్ధియున్, బ్రకృతి సిద్ధగుణంబులు సజ్జనాళికిన్.

తా. ఆపదలు వచ్చినప్పుడు ధైర్యము, ఐశ్వర్యము వచ్చినపుడు ఓర్పు, సభయందు వాక్పాటవము, యుద్ధమునందు శౌర్యము చూపుట, కీర్తియం దాసక్తి, వేదశాస్త్రాభ్యాసము నందు చింత-ఇవి మహాత్ములకు స్వభావగుణములు.



శ్లో॥ కరే శ్లాఘ్యస్త్యాగః, శిరసి గురుపాదప్రణయితా,
ముఖే సత్యా వాణీ, విజయి భుజయో ర్వీర్యమతులమ్,
హృది స్వచ్ఛా వృత్తిః శ్రుతమధిగతం చ శ్రవణయో,
ర్వినాఽ ప్యైశ్వర్యేణ ప్రకృతిమహతాం మణ్డనమిదమ్. 53

చ. కరమున నిత్యదానము, ముఖంబున సూనృతవాణి, యౌఁదలం
గురుచరణాభివాన, మకుంఠితవీర్యము దోర్యుగంబునన్,
వరహృదయంబునన్ విశద వర్తన, మంచితవిద్య వీనులన్
సురుచిరభూషణంబు లివి శూరులకున్ సిరి లేనియప్పుడున్.

తా. మహాత్ములకు ఐశ్వర్యములేమి చేత బంగారు సొమ్ములు లేక పోయినను ఈ క్రింది జెప్పబోవునవి స్వాభావికాలంకారములుగ గనబడుచున్నవి. ఎట్లన : హస్తములకు సత్పాత్రదానము, శిరమునకు గురు పాదనమస్కృతియు, ముఖమునకు సత్యవచనమును, భుజములకు జయ స్వభావమగు పరాక్రమమును హృదయమునకు అకళంకమయిన ప్రవర్తనయు, చెవులకు శాస్త్రశ్రమణమును ఇవియే అలంకారములు.

శ్లో॥ ప్రాణాఘాతాన్నివృత్తిః, పరధనహరణేసంయమః, సత్యవాక్యం
కాలే శక్త్యా ప్రదానం, యువతిజనకథా మూకభావః, పరేషామ్
తృష్ణాస్రోతో విభఙ్గో, గురుషు చ వినయః, సర్వభూతానుకమ్పా,
సామాన్యం సర్వశాస్త్రేష్వనుపహతవిధిః శ్రేయసామేష పన్థాః. 54

మ. పరహింసాపరకీయవిత్తహరణా భావంబు సత్యవ్రతా
దరముం దానపరత్వ మన్యవనితో దంతోక్తి మూకత్వ ముం
బరతృష్ణాఝురభంజనంబు గురునమ్రత్వంబునుం బ్రాణభృ
త్కరుణాశాస్త్రసమత్వసద్విధులు భద్రప్రాప్తికిన్ మార్గముల్.

తా. జీవహింసను విడిచి పరుల ద్రవ్యమునందు మనసును బోనీక సత్యము పలుకుచు దేశకాలము లెఱిగి శక్తికొలది దానము చేయుచు బర స్త్రీల విషయమును గుఱించి ఏమియు బలుకక మౌనము వహించి అత్యాశను నిలిపి గురువులయందు వినయమును గనంబఱచుచు సకల ప్రాణులందు దయను చూపుచు సకలశాస్త్రము లందు సమభావమున నుండుట అనునదియే సకల శ్రేయములను బొందుటకు మార్గము.

శ్లో॥ సంపత్సు మహతాం చిత్తం భవేదుత్పలకోమలమ్,
ఆపత్సు చ మహాశైలశిలాసఙ్ఘాతకర్కశమ్. 55

తే. సంపదలు గల్గుతఱి మహా జనులహృదయ
మభినవోత్పలకోమలం బగుచు వెలయు;
నాపదలు వొందునపుడు మ హామహీధ
రాశ్మసంఘాతకర్కశం బై తనర్చు.

తా. మహాత్ములమనస్సు సంపదలు సంభవించునేని కలువకంటె కోమలముగ నుండును. ఆపదలు వచ్చునేని పెద్దకొండయందలి రాతి గుండువలె కఠినముగ నుండును. అనగా సంపదలు వచ్చిన గర్వించి కఠినులు కారనియు, ఆపదలు వచ్చిన వెలవెల బోరనియు భావము.

శ్లో॥ ప్రియా న్యాయ్యా వృత్తి ర్మలినమసుభఙ్గేఽ ప్యసుకరం
త్వసన్తో నాభ్యర్థ్యాః, సుహృదపి న యాచ్యః కృశధనః,
విప ద్యుచ్చైర్థైర్యం, పదమనువిధేయం చ మహతాం
సతాం కేనోద్దిష్టం విషమ మసిధారావ్రత మిదమ్ ? 56

మ. అసమానప్రియనీతివర్తనము, ప్రాణాంతంబునందున్ మలీ
మస మగ్రాహ్య, మదుష్టయాచన, మసం పత్ప్రార్థనాభావమున్,
వ్యసనావాప్తిని ధైర్యముం, బుధజనా త్యంతానుకూలత్వ; మీ
యసిధారావ్రతచర్య యెవ్వఁడు మహార్యశ్రేణికిం దెల్పెనో.

తా. న్యాయమయిన వృత్తి నవలంబించుటయు, ప్రాణాపాయము సంభవించినను అకార్యము లొనర్పకుండుటయు, దుర్జనుల బ్రార్థింపకుండుటయు, ప్రాణమిత్రుడైనను ధనహీనుడగునేని వానిని యాచింప కుండుటయు, ఆపదలయందు ధైర్యమును, మహాత్ముల కనుకూలముగ నడచుటయు అను ఈయసిధారా వ్రతము సజ్జనులకు స్వభావముగ బట్టుపడినదిగాని ఒకరి యుపదేశముచేత రాలేదు.

శ్లో॥ ప్రదానం ప్రచ్ఛన్నం, గృహముపగతే సంభ్రమవిధిః
ప్రియం కృత్వా మౌనం, సదసి కథనం చాప్యుపకృతేః,
అనుత్సేకో లక్ష్మ్యాం, నిరభిభవసారాః పరకథాః
సతాం కేనోద్దిష్టం విషమ మసిధారా వ్రతమిదమ్ ! 57



మ. పొసఁగం దానము గుప్త, మర్థి భవనం బుం జేరుచో సంభ్రమో
ల్ల సదుత్థానవిధానముం, బ్రియవిధుల్ గావించి మౌనంబు, రా
జసభన్ మిత్రకృతిప్రకాశముఁ గు త్సాకర్మవైముఖ్య, మీ
యసిధారావ్రతచర్య యెవ్వఁడు మహా ర్యశ్రేణికిం దెల్పెనో !

తా. రహస్యముగ దానము చేయుటయు, గృహమునకు వచ్చిన యర్థికి సంతోషముతో బ్రియము సేయుటయు, వానికి చేసిన మేలును చెప్పకుండుటయు తన కితరులు చేసిన మేలును సభలయందు బలుకుటయు, సంపదలు వచ్చినప్పుడు గర్వము లేకుండుటయు, ఇతరులను గుఱించి నిందగా మాట్లాడక పోవుటయు అను ఈ అసిధారావ్రతము సజ్జనులకు స్వభావసిద్ధము. ఒకరి యుపదేశమున వచ్చినది కాదు. అసిధారావ్రతము చూ. 56 శ్లోకము క్రింద.

శ్లో॥ సన్తప్తాయసి సంస్థితస్య పయసో నామాపి న శ్రూయతే,
ముక్తాకారతయా త దేవ నలినీపత్రస్థితం దృశ్యతే,
అన్తస్సాగరశుక్తి మధ్య పతితం తన్మౌక్తికం జాయతే,
ప్రాయేణాధమమధ్యమోత్తమజుషా మేవంవిధా వృత్తయః. 58

ఉ. నీరము తప్తలోహమున నిల్చి యనామక మై నశించు, నా
నీరమె ముత్యమట్లు నళి నీదళసంస్థితమై తనర్చు, నా
నీరమె శుక్తిలోఁబడి మ ణీత్వముఁ గాంచు సమంచితప్రభం;
బౌరుషవృత్తు లి ట్లధము మధ్యము నుత్తముఁ గొల్చువారికిన్.

తా. కాలిన యినుముపైన పడిన నీటిచుక్క ఊరుపేరు లేక నశించి పోవును. ఆ బిందువే తామరాకుమీద బడునేని ముత్యమువలె గనబడును. ఆ బిందువే సముద్రాంతర్గత మగు ముత్తెపు చిప్పయందు బడునేని మౌక్తికమణి యగును. కావున ఆశ్రయము ననుసరించినవారి కాయాశ్రయానుసారము నీచులు, మధ్యములు! ఉత్తములు, అను పేరులు వచ్చును. అనఁగా వరుసగా సర్వనాశము, సౌఖ్యాభాసమును వాస్తవసౌఖ్యమును కలుగును.

శ్లో॥ యః ప్రీణయే త్సుచరితైః పితరం స పుత్త్రో,
య ద్భర్తు రేవ హిత మిచ్ఛతి తత్కళత్రం,

తస్మిత్ర మాపది సుఖే చ సమక్రియం య,
దేతత్ త్రయం జగతి పుణ్యకృతో లభన్తే. 2003 59

చ. జనకునిఁ బూజలం గదుఁ బ్ర సన్నుని జేయునతండు పుత్త్రుఁ, దే
వనిత మెలంగు భర్తృవశ వర్తిని యై యది సత్కళత్ర, మే
జనుఁడు విపత్తిసౌఖ్యసదృశ క్రియుఁ డాతఁడు మిత్త్రుఁ; డీత్రయం
బును జగతిన్ లభించుఁ గదుఁ బుణ్యముఁ జేసినయట్టివారికిన్.

తా. మంచినడవడిచేత దండ్రిని సంతోషపెట్టువాడే పుత్రుడు, భర్తకు హితము గోరునదియే పెండ్లము. ఆపత్సమయమునందును సంపదలయందును సమానముగ చెలిమిచేయునతడే మిత్త్రము. ఇట్టి పుత్రుడును భార్యయు స్నేహితుడును పుణ్యాత్ములకుగాని లభించరు.

శ్లో॥ నమ్రత్వేనోన్నమన్తః పరగుణకథనైః స్వాన్గుణాన్ఖ్యాపయన్తః,
స్వార్థా న్సంపాదయన్తో వితతపృథుతరారమ్భయత్నాః పరార్థే,
క్షాన్త్యైవాక్షేపరూక్షాక్షరముఖరముఖా న్దుర్జనా న్దుఃఖయన్తః,
సన్తస్సాశ్చర్యచర్యా జగతి బహుమతాః కస్య నాభ్యర్చనీయాః? 60

చ. నతులగుచున్ మహోన్నతిఁ ద నర్చురు, నన్యగుణోక్తిచే గుణో
న్నతిఁ బ్రకటించుచున్. బరజ న ప్రియకార్యసమర్థతన్ సమం
చితనిజకార్యసంగ్రహముఁ జేయుచు, నిష్ఠురవాదులన్ క్షమా
ధృతి నిరసించుచుం, బరఁగు ధీరులు పూజ్యులు గారె యేరికిన్ ?

తా. సత్పురుషులు అణకువగలిగియే ఔన్నత్యమును పొందుదురు. పరులగుణములనే శ్లాఘించుటచేత తమ సహృదయత్వమును గనంబఱతురు. పరుల కార్యసాఫల్యమునకై ఎక్కువ ప్రయత్నించి వారి కార్యమును సానుకూలము చేయుచు తమ కార్యముల నొనర్చుకొనుచుందురు. తమ్మును కఠినముగ పరుషముగను నిందించు దుర్జనులయందు ఓర్పును గనంబఱచుచునే వారిని దుఃఖపెట్టుదురు. ఇట్టి ఆశ్చర్యకరమగు నడవడి గల మహాత్ము లెవరికి బూజ్యులుగారు? అందఱికిని బూజ్యులే.





శ్లో॥ భవన్తి నమ్రాస్తరవః ఫలోద్గమై పరోపకార లక్షణం
ర్నవామ్బుభి [1]ర్దూరవిలమ్బినో ఘనాః,
[2]అనుద్ధతా స్సత్పురుషాస్సమృద్ధిభిః
స్వభావ ఏవైష పరోపకారిణామ్. 2004 61

తే. తరువు లతిరసఫలభార గురుతఁ గాంచు,
నింగి వ్రేలుచు నమృత మొసఁగు మేఘఁ,
దుద్ధతులు గారు బుధులు స మృద్ధిచేత;
జగతి నుపకర్తలకు నది సహజగుణము.

తా. వృక్షములు ఫలకాలమున నమ్రములై (వంగి) యుండును. నూతనాం బువులు గల మేఘములు బరువుచే క్రిందుగనే వ్రేలాడుచుండును. సత్పురుషులు సంపదలు వచ్చినప్పుడు గర్వము వహింపరు. ఇది పరోపకారపరాయణుల స్వభావము. ఈనమ్రత, క్రిందుగ నుండుట, గర్వము లేకుండుట అనునవి పరోపకారులకు సహజగుణములు.

శ్లో॥ శ్రోత్రం శ్రుతేనైవ న కుణ్డలేన, దానేన పాణిర్నతుకఙ్కణేన,
విభాతి కాయః కరుణాపరాణాం, పరోపకారేణ న చన్దనేన. 62

తే. అమరుఁ జెవి శాస్త్రమునఁ, గుండ లమునఁ గాదు;
వలయమున నొప్ప, దీవిచే వెలయుఁ బాణి;
యురుదయాఢ్యులమేను ప రోపకార
కలన రాణించు; గంధంబు వలనఁ గాదు.

తా. దయావంతులగు సత్పురుషుల చెవులకు శాస్త్రశ్రవణ మలంకారము గాని కుండలములు గావు. వారి హస్తములకు అలంకారము సత్పాత్రదానము గాని కంకణములు గావు. వారి దేహమున కలంకారము పరోపకారముగాని చందనము పూసికొనుట గాదు.

శ్లో॥ పద్మాకరం దినకరో వికచం కరోతి.
చన్ద్రో వికాసయతి కైరవచక్రవాలమ్,
నాభ్యర్థితో జలధరోఽపి జలం దదాతి,
సన్తః స్వయం పరహితే విహితాభియోగాః. 63

1. భూరి - పా. 2. అనర్థితాః - పా.

తే. ద్యుమణి పద్మాకరము వికచముగఁ జేయుఁ
గుముదహర్షంబు గావించు నమృతసూతి,
యర్థితుఁడు గాక జలమిచ్చు నంబుదరుఁడు;
సజ్జనులు గారె పరహితా చరణమతులు.

తా. సూర్యుడు ప్రార్థింపబడకయే తామర కొలనిని వికసింపజేయును. చంద్రుడు ప్రార్థింపబడకయే కలువల వికసింపజేయుచున్నాడు. మేఘుడు యాచింపబడకయే నీటిని ఇచ్చుచున్నాడు. సత్పురుషు లెప్పుడు పరులకు హితమొనర్చుట యందే ఇష్టపడువారు.

శ్లో॥ ఏతే సత్పురుషాః పరార్థఘటకా స్స్వార్థాన్ పరిత్యజ్య యే
సామాన్యాస్తు పరార్థ ముద్యమభృతః స్వార్థావిరోధేన యే,
తేఽమీ మానుషరాక్షసాః పరహితం స్వార్థాయ నిఘ్నన్తి యే
యే తు ఘ్నన్తి నిరర్థకం పరహితం తే కే న జానీమహే. 64

మ. తమకార్యంబుఁ బరిత్యజించియుఁ బరా ర్థప్రాపకుల్ సజ్జనుల్,
దమకార్యంబు ఘటించుచున్ బరహితా ర్థవ్యాపృతుల్ మధ్యముల్
దమకై యన్యహితార్థఘాతుకజనుల్ దైత్యుల్, వృథాన్యార్థభం
గము గావించెడువార లెవ్వరొ యెఱుం గన్ శక్యమే యేరికిన్ ?

తా. తమ కార్యముల విడిచి పరుల కార్యములను చేయువారు సత్పురుషులు, తమ కార్యములకు భంగము లేకుండ పరుల కార్యముల నొనర్చువారు మధ్యములు. తమ కార్యము నిమిత్తమై పరుల కార్యమును చెడగొట్టువారు మనుష్యులలో రాక్షసులు. తమకు ప్రయోజనము ఏమాత్రము లేకపోయినను పరులకు నష్టము చేయువారల కేపేరు పెట్టవచ్చునో నాకు తెలియుట లేదు. ఈ యుత్తమాది పక్షములలో నేది మేలయినదో దానిని ఆయుష్మంతుడగువాడు ఆశ్రయింపవలయునని తాత్పర్యము.

శ్లో॥ పాపా న్నివారయతి, యోజయతే హితాయ,
గుహ్యం నిగూహతి, గుణాన్ ప్రకటీకరోతి.
ఆపద్గతం చ న జహాతి, దదాతి కాలే;
సన్మిత్రలక్షణ మిదం ప్రవదన్తి సన్తః. 65

తే. అఘమువలన మరల్చు, హి తార్థకలితుఁ
జేయు, గోప్యంబు దాఁచుఁ, బో షించు గుణము,



విడువఁ డాపన్ను, లెవడి వేళ నిచ్చు;
మిత్రుఁ డీలక్షణంబుల మెలంగుచుండు.

తా. చెడుపనులనుండి వారించుట, మంచిపనులు జేయుటకు ప్రోత్సాహించుట, రహస్యసంరక్షణము, సద్గుణముల ప్రకటించుట, ఆపత్కాలమున విడువకుండుట, కాలముల కావశ్యక మగుదానిని ఇచ్చుట, ఇవి సన్మిత్రున కుండవలసిన లక్షణములు.

శ్లో॥ క్షీరేణాత్మగతోదకాయ హి గుణా దత్తాః పురా తేఽఖిలాః
క్షీరోత్తాప మవేక్ష్య తేన పయసా స్వాత్మా కృశానౌ హుతః,
గన్తుం పావక మున్మన స్తదభవద్దృష్ట్వా తు మిత్రాపదం
యుక్తం తేన జలేన శామ్యతి, సతాం మైత్రీ పునస్త్వీదృశీ. 66

చ. క్షీరము మున్ను నీటి కొసఁగెన్ స్వగుణంబులు దన్నుఁజేరుటన్,
క్షీరము దప్త మౌట గని చిచ్చుతికెన్ వెతచే జలంబు, దు
ర్వారసుహృద్విపత్తిఁ గని వహ్నిఁ జొరం జనె దుగ్ధ, మంతలో
నీరముఁ గూడి శాంతమగు, నిల్చు మహాత్ములమైత్రి యీగతిన్.

తా. పాలు తనయందు గలసిన జలమునకు తన గుణములన్నియు నిచ్చెను. తన కిట్టిసాయ మొనర్చినక్షీరమునకు గలుగుతపనమును గాంచి జలము అగ్ని యందుఁ బడెను. తనకు మిత్రమగుజల మగ్నియందుఁ బడుటను చూచి క్షీరము తానుగూడ అగ్నియందుఁ బడఁబోఁగా దానితో మరల జలము కలియుటచేత శాంతిల్లుచున్నది. సజ్జనసహవాసము ఇంతయే అని యర్థము.

(పాలతో మొట్టమొదటి జలము కలుపఁబడును. పిదప నది ప్రొయ్యిమీఁద కాఁచఁబడును. అది కాఁగునపుడు జలమంతయు నిగిరిపోవును. అది యిగురఁగా పాలు పొంగి పైకివచ్చును. అప్పుడు జలమును చల్లఁగా పాలు పొంగక యణఁగిపోవును. ఈ వ్యాపారము క్షీర నీరములకు సహజసిద్ధములైనది. ఈ రెంటికిని స్వాభావికమయిన యీ వ్యాపారమును కవి ఒండొరుల తాపమునకు తాళలేని హేతువుచేఁ గలిగిన స్నేహ వ్యాపారముగా నుత్ప్రేక్షించినాఁడు. కావున నిందు క్రియానిమిత్తక్రియాస్వరూపోత్ప్రేక్షీయుత్ప్రేక్ష 'సతాం మైత్రీ పున స్త్వీదృశీ' అనుచోటఁగల అర్థాంతరన్యాసముచే నిర్వహింపఁబడుటవలన రెంటికినీ విజాతీయ సంకరము.)

శ్లో॥ ఇతః స్వపితి కేశవః, కుల మితస్తదీయద్విషా
మితశ్చ శరణార్థినాం శిఖరిణాం గణాః శేరతే,
ఇతోఽపి బడబాలనః సహ సమస్త సంవర్తకై
రహో వితత మూర్జితం భరసహం చ సిన్ధో ర్వపుః. 67

చ. ఒకయెడఁ బవ్వళించు హరి, యొక్కయెడన్ వసియించు రాక్షస
ప్రకరము, లొక్కచో నడఁగుఁ బర్వతసంఘము, లొక్కెడన్ బలా
హకములతోడ నుండు బడ బాగ్నియు; విస్తృత మూర్జితంబునుం
బ్రకటభరక్షమం బగుచు భాసిలు నౌర సముద్ర మెంతయున్.

తా. సముద్ర మనేక విధముల నాశ్చర్యకరముగా నున్నది. ఎట్లన: ఒక ప్రక్క కడుపున పదునాలుగులోకములు ధరించిన మహావిష్ణువు పరుండుటకును వేఱొక ప్రక్క అవిష్ణు శత్రులగు కాలకేయాదు లాయన వలని భయము లేక కాఁపురముండుటకును తగియున్నది. ఒక వంక ఇంద్రునినుండి తమ్ముఁ గాపాడు కొనుటకు వచ్చిన మైనాకాదిపర్వతముల గుంపును మోచుచున్నది. మఱియొక వైపున ప్రళయకాల మేఘములతోఁ గూడి బడబానలము నీటి నెంత పీల్చుచున్నను అంత వర్ధిల్లుచున్నది. అట్లే మహాత్ములు ఎంతెంత వారికో ఆశ్రయభూతులుగా నుందురు.

శ్లో॥ జాతః కూర్మః స ఏకః పృథుభువనభరాయార్పితం యేన పృష్ఠం
శ్లాఘ్యం జన్మధ్రువస్య భ్రమతి నియమితం యత్ర తేజస్వి చక్రమ్,
సంజాతవ్యర్థపక్షాః పరహితకరణే నోపరిష్టాన్న చా ధో
బ్రహ్మాణ్డోదుమ్బరా న్తర్మశకవ దపరే జన్తవో జాతనష్టాః. 68

చ. వితతజగద్భరంబు దన వీఁపునఁ దాల్చిన కూర్మనాథుఁడున్
సతతము చంద్రభాస్కరంబు చక్రముఁ ద్రిప్పుధ్రువుండు సజ్జనుల్;
ప్రతిభ నజాండజంతుఫల రంధ్రవసన్మశకంబులట్ల నిం
దితవిఫలార్థసంగతి జ నించి నశించుఁ దదన్యజంతువుల్.

తా. విస్తార మగు సకలలోకభారమును భరించిన ఆదికూర్మలు యొక్క జన్మమును. జ్యోతిశ్చక్రమును మేరువుపై నుండి భ్రమింపఁజేయుటకు ప్రధానుఁడగు ధ్రువునియొక్క జన్మమును ఈ రెండే లెక్కింపఁదగినవి. తక్కిన వారందఱు పరోపకారము చేయఁజాలనివా



రగుటచేత ఆదికూర్మమువలెఁ గ్రిందను ధ్రువునివలె ఊర్ధ్వభాగమునను లేక బ్రహ్మాండ మను అత్తిపండులోని పురుగుల వలెఁ బుట్టి నశించుచున్నారు.

శ్లో॥ తృష్ణాం ఛిన్ధి, భజ క్షమాం, జహి మదం పాపే రతిం మా కృథాః,
సత్యం బ్రూ హ్యనుయాహి సాధుపదవీం, సేవస్వ విద్వజ్జనమ్,
మాన్యా న్మానయ, విద్విషో ఽ ప్యనునయం * ప్రఖ్యాపయ ప్రశ్రయం,
కీర్తిం పాలయ, దుఃఖితే కురు దయా, మేత **త్సతాం చేష్టితమ్. 69

శా. ఆశాసంహరణంబు, నోర్మియు, మద త్యాగంబు, దుర్దోషవాం
ఛాశూన్యత్వము, సత్యమున్, బుధమతా చారంబు, సత్సేవయున్,
వైశద్యంబును, శత్రులాలనము, మా న్య ప్రీతియుం, బ్రశ్రయ
శ్రీశాలిత్వము, దీనులందుఁ గృపయున్, శిష్టాలికిన్ దర్మముల్.

తా. అత్యాశను త్యజించి ఓర్పు కలిగి మదమును విడిచి దుష్కార్యము లందు మనసును పోనీయక సత్యమునే పలుకుచు పెద్దలు పోయిన మార్గమున నడచుచు, విద్వాంసుల సేవించుచు, పూజ్యుల మన్నించుచు, శత్రువునైనను చక్కఁగఁజూచుచు, పెద్దలయందు అడఁకువ కలిగి కీర్తికి భంగము రానివిధంబుగ చరించుచు, దుఃఖితులయందు దయను గనఁబఱచుచుండుము. ఇవి సత్పురుషుల లక్షణములు.

శ్లో॥ మనసి వచసి కాయే పుణ్యపీయూషపూర్ణా
స్త్రిభువన ముపకారశ్రేణిభిః ప్రీణయన్తః,
పరగుణపరమాణూన్ పర్వతీకృత్య నిత్యం
నిజహృది వికసన్తః సన్తి సన్తః కియ న్తః. 70

చ. హృదయవచశ్శరీరముల నెంతయుఁ బుణ్యసుధాప్రపూర్ణు లై
ముదము బహూపకారముల మూఁడుజగంబులకున్ ఘటించుచున్
వదలక సాధుసద్గుణల వంబులు గొండలు సేసి మెచ్చుచున్
మదిని వికాసయుక్తు లగు మాన్యులు గొందఱు వొల్తురిద్ధరన్.

* ప్రహ్లాదయ స్వాన్గుణాన్ - పా. ** సతాం లక్షణమ్ - పా.

తా. మనోవాక్కాయములయందును సత్కర్మల నొనర్చుటయను అమృతముచేత పూర్ణులయి ముల్లోకములందున్నవారికి ఉపకార మొనర్చుచున్న వారలయి పరులయం దుండిన అణువులవంటి సద్గుణములనైనను కొండంతగా భావించి వికసించుచున్న హృదయముల గల సజ్జనులు కొందరు మాత్రమే యుందురు.

## ధైర్య పద్ధతి

శ్లో॥ రత్నైర్మహార్ఘైస్తుతుషుర్న దేవా, న భేజిరే భీమవిషేణ భీతిమ్,
సుధాం వినా న ప్రయయుర్విరామం న నిశ్చితార్థాద్విరమన్తి ధీరాః

తే. తనిసిరే వేల్పు లుదధిర త్నములచేత ?
వెఱచిరే ఘోరకాకోల విషముచేత ?
విడిచిరే యత్న మమృతంబు వొడమురనుక ?
నిశ్చి తార్థంబు వదలరు నిపుణమతులు.

తా. అమృతమునకై పాలసంద్రమును మథింపుచున్న దేవతలు అందలి రత్నలాభమునకు సంతోషింపక అందు పుట్టిన కాలకూటవిషమునకు భయపడక అమృతము కలుగునంతదనుక తమ పట్టును వదలరైరి. ధీరు లెప్పుడు తాము దలంచినకార్య మగునంతవఱకు తమ ప్రయత్నమును వదలరు.

శ్లో॥ ప్రారభ్యతే న ఖలు విఘ్నభయేన నీచైః
ప్రారభ్య విఘ్ననిహతా విరమ న్తి మధ్యాః,
విఘ్నై ర్ముహుర్ముహు రపి ప్రతిహన్యమానాః
ప్రారబ్ధ ముత్తమగుణా న పరిత్యజన్తి 72

శా. ఆరంభింపరు నీచమానవులు వి ఘ్నాయాససంత్రస్తులై,
యారంభించి పరిత్యజించు రురువి ఘ్నాయత్తులై మధ్యముల్,
ధీరుల్ విఘ్ననిహన్యమాను లగుచున్ ధృ త్యున్నతోత్సాహులై
ప్రారబ్ధార్థము లజ్జగింపరు సుమీ ప్రజ్ఞానిధుల్ గావునన్.

తా. అధములు విఘ్నములు సంభవించునని కార్యము నారంభింప వెఱతురు. మధ్యములు ఆరంభించి విఘ్నములు వచ్చినప్పుడు వదలుదురు. ధీరులెన్ని పర్యాయము లెట్టి విఘ్నములు వచ్చినను తాము పట్టిన కార్యమును విడువరు.



శ్లో॥ క్వచి త్పృథ్వీ శయ్యః, క్వచి దపి చ పర్యఙ్కశయనః,
క్వచి చ్ఛాకాహారః, క్వచి దపి చ శాల్యోదనరుచిః,
క్వచి త్కన్థాధారీ, క్వచి దపి చ దివ్యామ్బరధరో,
మనస్వీ కార్యార్థీ న గణయతి దుఃఖం న చ సుఖమ్. 73

మ. ఒకచో నేలను బవ్వళించు, నొకచో నొప్పారుఁ బూ సెజ్జపై,
నొకచో శాకము లారగించు, నొకచో నుత్కృష్టశాల్యోదనం,
బొకచోఁ బొంత ధరించు, నొక్కొకతఱిన్ యోగ్యాంబర శ్రేణి; లె
క్కకు రానీయఁడు కార్యసాధకుఁడు దుఃఖంబున్ సుఖంబున్ మదిన్.

తా. కార్యార్థి యగు ధీరుఁడు వీలునుబట్టి ఒకచోట భూశయ్యము, ఒకచోట పఱుపులయందు శయనించుటయు, ఒకతావున కాయగూరల నారగించుటయు, ఒకచోటను శాల్యోదనంబు సేవించుటయు, ఒకతావున బొంతగుడ్డను కట్టుకొనుటయు, ఒకచోట పీతాంబరములఁ ధరించుటయుఁ గలిగియుండును. కాని కష్టములు వచ్చినవని దుఃఖమును గాని సుఖము వచ్చినదని సంతోషముగాని పొందఁడు.

శ్లో॥ నిన్దన్తు నీతినిపుణా, యది వా స్తువన్తు,
లక్ష్మీః సమావిశతు, గచ్ఛతు వా యథేష్టమ్,
అద్యైవ వా మరణ మస్తు, యుగా న్తరే వా
న్యాయ్యా త్పథః ప్రవిచల న్తి పదం న ధీరాః. 74

శా. నీతి ప్రౌఢవిహారు లైననిపుణుల్ నిందిపనీ మెచ్చనీ,
ఖ్యాతిం జెందిన సంపదల్ నిలువనీ గాఢంబుగా సాగనీ,
ఘాతం బిప్పుడ పొందనీ నియతియైఁ గానీ యుగాంతంబునన్,
నీతిశ్లాఘ్యపదంబు దప్పరు గదా నిత్యంబు ధీరోత్తముల్.

తా. నీతివేత్తలు నిందించినను భూషించినను సంపదలు వచ్చినను పోయినను మరణ మిప్పుడే కలిగినను కల్పాంతరమునకుఁ గలిగినను ధీరులయినవారు న్యాయ మార్గమును దాఁటి ఒక అడుగునైనను పెట్టరు.

శ్లో॥ కాన్తాకటాక్షవిశిఖా న*లునన్తి యస్య
చిత్తం, న నిర్దహతి కోపకృ శానుతాపః,
**తర్షన్తి భూరివిషయా శ్చ న లోభపాశై
ర్లోక త్రయం జయతి కృత్స్న మిదం స ధీరః. 75

ఉ. మానవతీకటాక్షశిత మార్గణముల్ విదలింపఁ జాల వె
వ్వానిమనంబు, కోపమయ వహ్ని దహింపదు, లోభపాశసం
తానము మాల్యచందనవి తానములున్ వెత సేయ నోప కె
వ్వానివశంబునన్ మెలఁగు, వాఁడు జయించు జగంబులన్నియున్.

తా. ఎవని మనస్సు కామినులచూపు లను బాణములచే క్షతము కాదో, ఎవని హృదయమును కోపాగ్నిదహింపదో, ఎవని మనస్సు అత్యాశయను పాశములచే లాగబడదో అట్టిధీరుఁడు ముల్లోకములఁ జయించును.

శ్లో॥ కదర్థిత స్యాపి హి ధైర్యవృత్తే ర్నశక్యతే ధైర్యగుణః ప్రమార్ష్టుమ్, 2004
అధోముఖ స్యాపి కృతస్య వహ్నే ర్నాధః శిఖా యాతి కదాచి దేవ. 76

తే. నియతిచేతఁ గదర్థితుం డయిన ధైర్య
పరుని ధైర్యగుణంబు మా న్పంగఁ దరమె?
క్రిందు సేయంగఁబడినట్టి కృష్ణపథుని
కీల యెందైన మీఁదుగాఁ గెరలుఁ గాదె !

తా. ధైర్యవంతునికి ఎట్టి దుఃఖము సంభవించినను అతని ధైర్యమును పోఁగొట్టుట అసాధ్యము. అగ్నిని తలక్రిందుగా పెట్టినను అగ్నిజ్వాల యూర్ధ్వము గనే ప్రసరించునుగాని అధోముఖముగ ప్రసరింపదు.

శ్లో॥ వరం తుఙ్గా చ్ఛృఙ్గా ద్గురుశిఖరిణః క్వాపి విషమే
పతిత్వా యం కాయః కఠినదృషదన్తే విదలితః,
వరం న్యస్తో హస్తః ఫణిపతిముఖే తీక్ష్ణదశనే
వరం వహ్నౌ పాత, స్త దపి న కృతః శీలవిలయః. 77

* ఖనన్తి - పా. ** కర్షన్తి - పా.



చ. ఉరుతపర్వ తాగ్రమున నుండి దృఢం బగుఱాతిమీఁద స
త్వరముగఁ ద్రెళ్ళి కాయము హ తంబుగఁ జేయుట మేలు, గాలిమే
పరిదొరవాతఁ గే లిడుట బాగు, హుతాశనమధ్యపాతమున్
వర మగుఁ, జారుశీలగుణ వర్జన మర్హము గాదు చూడఁగన్.

తా. ఎత్తయిన పర్వతశిటఖరమునుండి కఠినమయిన ఱాతిమీఁదపడి దేహమును వదలుటయు, భయంకరములగు విషజ్వాలల వెళ్ళఁగ్రక్కు కోరలుగల ఆదిశేషుని నోటియందు చేతిని పెట్టుటయు, అగ్నియందుఁబడుటయు ఇవి ఒక పక్షమున మేలనవచ్చును గాని సత్త్వభావమును విడుచుటమాత్రం మేలుగాదు.

శ్లో॥ వహ్నిస్తస్య జలాయతే, జలనిధిః కుల్యాయతే, తక్షణా
న్మేఃరు స్వల్పశిలాయతే, మృగపతిః సద్యః కురఙ్గాయతే,
వ్యాలోమాల్యగుణాయతే, విషరసః పీయూషవర్షాయతే
యస్యాఙ్గాఽఖిలలోకవల్ల భతమం శీలం సమున్మీలతి. 78

చ. అతనికి వార్ధి కుల్య యగు, నగ్ని జలం బగు, మేరుశైల మం
చితశిలలీల నుండు, మద సింహము జింక తెఱంగుఁ దాల్చుఁ,గో
పితఫణి పూలదండ యగు, భీష్మవిషంబు సుధారసం బగున్,
క్షితి జనసమ్మతం బగుసు శీల మ దెవ్వనియందు శోభిలున్.

తా. ఎవఁడు సత్త్వభావము కలిగియుండునో, అట్టివానికి అగ్ని జలమువలె చల్లగను, మేరుపర్వతము చిన్నఱాతివలెను, సింగము జింకవలెను, సర్పము పూలమాలవలెను, విషము అమృతమువలెను అగును.

శ్లో॥ ఛిన్నోఽపి రోహతి తరుః క్షీణోఽప్యుపచీయతే పున శ్చన్ద్రః,
ఇతి విమృశన్తస్సన్తః, సన్తప్యన్తే న విప్లుతా లోకే. 79

తే. ఖండితం బయ్యు భూజంబు వెండి మొలచు,
క్షీణుఁ డయ్యును వభివృద్ధిఁ జెందు సోముఁ,
డివ్విధమున విచారించి * యొదలు దెగిన
జనములకుఁదాప మొందరు సాధుజనులు.

* యొదలుడిగిన - పా.

తా. సజ్జనులు. ఛేదింపఁబడిన వృక్షము మరల అంకురించుటయు, క్షీణించిన చంద్రుఁడు మరల వృద్ధినందుటయుఁ గాంచుచున్న వారలయి తమక్షు దుఃఖము కలిగిన సమయమున సంతాపము నందరు.

శ్లో॥ ఐశ్వర్యస్య విభూషణం సుజనతా, శౌర్యస్య వాక్సంయమో,
జ్ఞాన స్యోపశమః, శ్రుతస్య వినయో, విత్తస్య పాత్రే వ్యయః,
అక్రోధస్తపసః, క్షమా ప్రభవితు, ర్ధర్మస్య నిర్వ్యాజతా,
సర్వేషా మపి సర్వకారణ మిదం శీలం పరం భూషణమ్. 80

ఉ. జానుగ భూతికిం దొడవు సజ్జనభావము, శౌర్యలక్ష్మికిన్
మౌనము, నీతి విద్యకు, శ మంబు సుబుద్ధికి, విత్తవృద్ధికిన్
దానము, దాల్మి శక్తికిని, దర్మనిరూఢి కదంభవృత్తియుం,
బూనికతోడ సర్వగుణ భూషణ మెన్నఁగ శీలమే సుమీ.

తా. సంపదలు కలిగి సుజనుఁడుగ నుండుటయు, శూరుఁడై మితభాషి యగుటయు, జ్ఞానవముండి ఇంద్రియలోలత లేకుండుటయు, విద్యావంతుఁడై వినయము కలిగియుండుటయు, ధనముండి సత్పాత్రయందు వినియోగించుటయు, తపస్వియై కోపం లేకుండుటయు, సమర్థుఁడై ఓర్పుండుటయు, నెపము లేక ధర్మము నొనర్చుటయు ఇవన్నియు వానికి అలంకారముతో సమానము. కనుక నాయైశ్వర్యాదులు గల వానికి ఆసౌజన్యాదులకంటె నిదియే మేలైన భూషణ మని తాత్పర్యము.

## దైవ పద్ధతి

శ్లో॥ నేతా యస్య బృహస్పతిః, ప్రహరణం వజ్రం, సురాః సైనికాః,
స్వర్గో దుర్గ, మనుగ్రహః ఖలు హరే, రైరావనో వారణః,
ఇత్యాశ్చర్యబలాన్వితో పి బలభి ద్భగ్నః పరైః సఙ్గరే.
తద్వ్యక్తం నను దైవ మేవ శరణం ధిగ్ ధిగ్ వృథా పౌరుషమ్.

చ. గురుఁడు గురుఁడు, వాలు శతకోటి, సుపర్వులు వాహహినీపతుల్,
సురభవనంబు గోట, మధు సూదనుఁడున్ సయిదోడు, దంతి ది
క్కరిపతి గాఁగ నొప్పుబల ఘాతియు దాయల కోడె నాజిలో;
శరణము దైవమే, పురుషశక్తి నిరర్థక మెన్నిభంగులన్.



తా. బృహస్పతి గురువై వజ్ర మాముధమై దేవతలు సేనలోని వారలయి స్వర్గముకోటయై విష్ణుమూర్తి యనుగ్రహము గలవాఁడై ఐరావతగజము కలిగి ఈ విధముగ ఆశ్చర్యమును కలుగఁజేయు శక్తిగల ఇంద్రుఁడే శత్రువులచేత యుద్ధమునం దోడిపోయెను. కావున దైవబలమే ప్రధానముకాని పౌరుష మెందుకును పనికిరాదు.

శ్లో॥ భగ్నాశస్య కరణ్డ పిణ్డితతనో ర్మ్లానేన్ద్రియస్య క్షుధా
కృత్వాఽఖు ర్వివరం స్వయం నిపతితో నక్తం ముఖే భోగినః,
తృప్తస్తత్పిశితేన సత్వర మసౌ తే నైవ యాతః పథా
స్వస్థా స్తిష్ఠత దైవ మేవహి పరం వృద్ధౌ క్షయే కారణమ్. 82

ఉ. రాతిరి మూషకంబు వివ రం బొనరించి కరండబద్ధ మై
భీతిలి చిక్కి యాస చెడి పెద్దయు డస్సినపామువాత సం
పాతముఁజెందె, దానిఁదిని పాము దొలంగె బిలంబుత్రోవనే;
యేతతి హానివృద్ధులకు నెక్కటి దైవము కారణం బగున్.

తా. ఒకరాత్రియందు ఆహారార్థము యెలుక ఒక పెట్టెకు రంధ్రము చేసి అందులో దూరెను. అంతకుమున్ను ఒక పాము ఆ పెట్టెయందుండెను. ఇరకటము వలన దాని దేహము ముద్దయయి బయటికి వెళ్ళుట ఇఁక లేఁదని నిశ్చయించుకొని ఆకలిచేత ఇంద్రియపాటవము దప్పి కృశించుచుండెను. ఆ యెలుక లోనికి ప్రవేశింపఁగానే సర్పము దానిని భుజించి ఆయెలుకచేసిన రంధ్రమునుండి బయటికి పాఱిపోయెను. కావున వృద్ధిక్షయములకు దైవమే కారణము. మీరు నెమ్మదిగ నుండుడు.

శ్లో॥ యథా కన్దుకపాతే నో త్పత త్యార్యః పత న్నపి,
తథా త్వనార్యః పతతి మృత్పిణ్డపతనం యథా. 83

క. కందుకమువోలె సుజనుఁడు
గ్రిందం బడి మగుట మీఁది కి న్నెగయుఁ జుమీ,
మందుఁడు ఘృత్పిండమువలెఁ
గ్రిందం బడి యడఁగి యుదుఁ గృపణత్వమునన్

తా. చెండు క్రిందఁబడి మరల లేచునట్లు సజ్జనుఁడు హీనస్థితి నందినను వెంటనే ఉన్నతస్థితి నందును. మంటిముద్ద క్రిందఁబడి యట్లే యుండునట్లు దుర్జనుఁడు హీనస్థితి నందిన యిట్లే యుండును.

శ్లో॥ ఖర్వాటోదివసేశ్వరస్య కిరణైః సంతాపితే మస్తకే
వాఞ్ఛ న్దేశ మనాతపం విధివశా త్తాలస్య మూలం గతః,
తత్రా ప్యస్య మహాఫలేన పతతా భగ్నం సశబ్దం శిరః,
ప్రాయో గచ్ఛతి యత్ర దైవహతకస్త త్రైవయా న్త్యాపదః. 84

మ. ధర ఖర్వాటుఁ డొకండు సూర్యకరసం తప్తప్రధానాంగుఁ డై
త్వరతోడన్ బరువెత్తి చేరి నిలిచెన్ దాళద్రుమచ్ఛాయఁ, ద
చ్ఛిరముం దత్ఫలపాతవేగమున వి చ్చెన్ శబ్దయోగంబుగాఁ,
బొరి దైవోపహతుండు వోవుకడకుం బోవుంగదా యాపదల్.

తా. బట్టతలవాఁ డొకఁడు మధ్యాహ్న కాల సూర్యునివేడిమిచేత తన తల మాడుచుండుటకుఁ దాళఁజాలక నీడ గల ప్రదేశమును కోరి తాటిచెట్టు క్రిందికిఁ బోయెను. దైవికముగ అప్పు డాచెట్టునుండి యొకపండు వానితలమీఁదఁ బడి వానితల పటపట మని బ్రద్దలయ్యెను. దైవబలముచాలనివాఁ డెచటికిఁ బోయినను అచటికే ఆపదలన్నియుఁ బోవును.

శ్లో॥ గజభుజఙ్గ విహఙ్గమబన్ధనం, శశిదివాకరయోర్గ్రహపీడనమ్,
మతిమతాం చ విలోక్య దరిద్రతాం విధిరహో బలవానితి మే మతిః 85

తే. ఫణులు గజములుఁ బక్షులుఁ బట్టువడుట,
రవిసుధాకరులకు నైన రాహుబాధ
బుద్ధిమంతులలేమియుఁ, బొసఁగఁ జూచి
విధి బలాఢ్యుఁ డటంచు భా వింతు మదిని.

తా. బంధింపశక్యముగాని గజసర్పవిహంగముల యొక్క బంధనమును, సూర్య చంద్రాదులకుఁ గల గ్రహపీడయు, బుద్ధిమంతులకు దరిద్రమును చూడ నామనంబునకు దైవ ప్రభావము బలవత్తర మని యభిప్రాయము.

శ్లో॥ సృజతి తావ దశేషగుణాకరం పురుషరత్నమలఙ్కరణం భువః
తదపి త, త్క్షణభఙ్గి కరోతి చే, దహహ కష్టమపణ్డితతా విధేః. 86

క. గుణమణిఖని యగుపూరుష
మణీ ధరణికి రవణముగ న మర్చినవిధి యా



గుణవంతుని వెసఁ దునిమిన
గుణహీనునిఁ గాఁగ నెన్ను కొనరే ధాతన్.

తా. దైవము సకల సద్గుణ సంపన్నుఁడును భూమికి అలంకారుఁడును అగు పురుషవర్యుని నిర్మించియు వెంటనే వానిని నశింపజేయుచున్నది: అయ్యయో దీనికిఁ దెలివి లేదు గదా !

శ్లో॥ అయమమృతనిధానం, నాయకోఽప్యోషధీనాం,
శతభిష గనుయాతః, శమ్భుమూర్ధ్నో, ఽవతంసః,
విరహయతి న చైనం రాజయక్ష్మా శశాఙ్కం;
హతవిధిపరిపాకః కేన వా లఙ్ఘనీయః ? 87

చ. శతభిషగాఢ్యుఁడున్ సతత శంభువతంసము నయ్యు, నోషధీ
తతులకు నాథుఁ డయ్యును. సు ధారససేవధి యయ్యుఁ, దారకా
పతి దనరాజయక్ష్మభవ బాధలఁ బావఁగ నోపఁ డక్కటా !
హతవిధికృత్య మెవ్వనికి నైన జగంబున దాఁటవచ్చునే !

తా. ఈకనఁబడు చంద్రుఁడు అమృతమునకు స్థానము. సకలౌషదులకు రాజు. సూర్గురు వైద్యులు వెంటనే యుందురు. జగత్పరిపాలకుఁడగు శివునికి, దాను స్వయముగ నలంకారము. ఇట్టి చంద్రుని సైతము క్షయరోగము బాధించు చున్నది. దైవవిధి దాఁటుటకు ఎవఁడును సమర్థుఁడు కాఁడు.

శ్లో॥ ప్రియసఖ [1]విపద్దణ్డాఘాత ప్రపాతపరమ్పరా
పరిచయ[2]బలే చిన్తాచక్రే నిధాయ విధిః ఖలః,
మృదమివ బలా త్పిణ్డీకృత్య ప్రగల్భకులాలవ
ద్భ్రమయతి మనో, నో జానీమః కిమత్ర విధాస్యతి. 88

చ. కలితవిపత్తి దండపద ఘట్టన సేయుచు మన్నుకైవడిన్
ఖలుఁడు విధాత పిండితము గా నొనరించి నితాంతచింత యన్
బలితపుసారెపై నిలిపి పాయక డెందము త్రిప్పుచున్న వాఁ
డలమి కులాలురీతిఁ దెలి యం గలవారమె యేమి సేయునో ?

1. విపద్దణ్డవ్రాత - పా. 2. చలే - పా.

తా. ఈ పాపిష్టి దైవము గడితేతీన కుమ్మరివలె నా మనస్సును ముద్దచేసి విపత్తు లనియెడి కొయ్యలచేత నెల్లప్పుడుఁ గొట్టుచు చింత యను చక్రమునఁ ద్రిప్పుచున్నాఁడు. ఏమి చేయుట కిట్లు చేయుచున్నాఁడో తెలియుట లేదు.

శ్లో॥ విరమ [1]విరమాయాసా దస్మా ద్దురధ్యవసాయతో
విపతి మహతాం ధైర్యధ్వంసం య దీక్షితు మీహసే,
అయి జడవిధే, కల్పాపాయే*ఽ_ప్య పేతనిజక్రమాః
కులశిఖరిణః క్షుద్రావైతే న వా జలరాశయః. 89

చ. దొసఁగులు వచ్చు వేళ గుణ ధుర్యులధైర్యగుణంబు సర్వముం
బస చెదు నంచుఁ జూచెదవు పాపపుదైవమ, యీదురాగ్రహ
వ్యసనము మాను మాను, ప్రళ యంబున వీతనిజక్రమంబు లై
పసి సెడ వించుకంతయును సాగరముల్ గులపర్వతంబులున్.

తా. ఓ తెలివిలేని దైవమా ! మహాత్ములకు ఆపదలను కలిగించి వారి ధైర్యమునకు భంగము కలుగఁజేయుఁ జూచుచున్నావుగాని ఇది సాధ్యము గాదు. కల్పాంతముననైనను కులపర్వతములు సప్త సముద్రములును తమ మేరలు తప్పునట్టి నీచములు కావుకదా?

శ్లో॥ దై వేన ప్రభుణా స్వయం జగతి య ద్యస్య ప్రమాణీకృతం
తత్త స్యోపనమే న్మనా గపి మహాన్నైవా శ్రయః కారణమ్;
సర్వాశాపరిపూరకే జలధరే వర్షత్యపి ప్రత్యహం
సూక్ష్మా ఏవ పతన్తి చాతకముఖే ద్విత్రాః పయోబిన్దవః. 90

తే. ఎవ్వనికి నిజ్జగంబున నెంతఫలము
దైవకృత మగునది వొందుఁ దప్ప కతనిఁ,
గారణము గాదు పెనుఁబ్రాపు ఘనునిఁ జేరు
చాతకమువాతఁ బడు నల్ప జలకణములు.

తా. ఎవని కెంత యని దైవము నిర్ణయించునో అయ్యది వానికి తనంతటనే దొరకును. దీనికై ఒకరి నా శ్రయింప నక్కఱ లేదు. నలుదిక్కుల వ్యాపించి మేఘము

1. విరసా – పా. * వ్యపేత – పా.



ప్రత్యహము వర్షించుచున్నను చాతకము నోటియందు సూక్ష్మబిందువులు రెండో మూఁడో పడునుగాని ఎక్కువ పడవు గదా ? అన్నిటికిని దైవము నియామకము గాన తక్కిన మన యాశయములు ఎంత పెద్దవైనను మనకు కల్గు ఫలము లంత పెద్దవిగా నుండునని తలఁపరాదు. కావున దైవమే శరణము.

**కర్మపద్ధతి**

శ్లో॥ నమస్యామో దేవా, న్ననుహతవిధేస్తేఽ_పి వశగా,
విధి ర్వన్ద్యః, సోఽ_పి ప్రతినియతక ర్మైకఫలదః
ఫలం కర్మాయత్తం, కి మమరగణైః ? కిం చ వధినా?
సమస్త త్కర్మభ్యో, విధిరపి న యేభ్యః ప్రభవతి. 91

చ. శిథిలత లేనిభక్తి నతి సేయుదు వేల్పుల, కాసుపర్వులున్
విధివశవర్తు, లావధియు విశ్రుతకర్మఫల ప్రదాత, య
య్యధికఫలంబు కర్మవశ, మట్ల గుటం బనియేమి వారిచే ?
విధి కధికంబు గర్మ మని వేమఱు మ్రొక్కి భజింతుఁ గర్మమున్.

తా. దేవతలకు నమస్కారము. వారు సైతము పాడు దైవమునకు లోబడినవారుగాన దైవమునకు మ్రొక్కెదను. అదైవము కర్మానుసారముగ ఫలము నిచ్చును గాన కర్మకు నమస్కారము. ఫలము కర్మా ధీనము గావున దేవతల తోడను దైవముతోడను మాకేమి? దేవతల చేతను దాట శక్యముగాని కర్మమునకే మ్రొక్కెదము.

శ్లో॥ బ్రహ్మా యేన కులాలవన్నియమితో బ్రహ్మాణ్డభాణ్డోదరే
విష్ణు ర్యేన దశావతారగహనే క్షిప్తో మహాసఙ్కటే,
రుద్రో యేన కపాలపాణిపుటకే భిక్షాటనం సేవతే
సూర్యో భ్రామ్యతి నిత్య మేవ గగనే తస్మై నమః కర్మణే. 92

చ. నలువ కులాలుభంగి నలి నబ్జ భవాండమునందు దేనిచే
నిలిచె, దశావతారవన నిష్ఠితుఁ డయ్యెఁ మురారి దేనిచేఁ
బెలుచఁ గపాలహస్తుఁ డయి భిక్షుకుఁడయ్యెఁ మురారి దేనిచేఁ,
నల రవి దేనిచేఁ దిరుగు, నాఘనకర్మము వంద్యమే కదా.

తా. బ్రహ్మ దేనిచేతఁ గుండవలె నుండు బ్రహ్మాండమధ్యమున నుండ నియోగింపఁబడెనో, దేనిచేత విష్ణువు పదియవతారము లెత్తుటయను కష్టమునకు బాల్పడెనో, రుద్రుఁడు దేనిచేత పుఱ్ఱెను పాత్రగాఁ గొని బిచ్చగాఁడై దిరిగెనో దేనిచేత సూర్యుఁడు ఆకాశమున సర్వదా తిరుగుచుండునో అట్టి సర్వనియమన శక్తిగల కర్మకు నమస్కారము.

శ్లో॥ యా సాధూం శ్చఖలాన్ కరోతి, విదుషోమూర్ఖాన్, హితాన్ ద్వేషిణః
ప్రత్యక్షం కురుతే పరోక్ష, మమృతం హాలాహలం తత్క్షణాత్,
తా మారాధయ! సత్క్రియాం భగవతీం భోక్తుం ఫలంవాఞ్ఛితం,
హేసాధో, వ్యసనైర్గుణేషు విపులే ష్వాస్థాం వృథా మాకృథాః. 93

మ. ఖలునిన్ సజ్జనుఁ గాఁగ, మూర్ఖజను సం ఖ్యావంతునిం గాఁగ,దా
యల సన్మిత్రులఁగా, నగోచరముఁ బ్ర త్యక్షంబుగాఁ, బ్రాణహృ
త్కలనం బైనమహావిషం బమృతముగాఁ, జేయు సత్కర్మ ము
జ్జ్వలనిష్ఠానిధివై భజింపుము వయ స్యా వాంఛితార్థాప్తికిన్.

తా. ఓయి నేర్పరీ! నీవు కోరిన కోర్కెలను బొందఁ దలఁచితివేని దుర్జనులఁ సజ్జనులుగను, మూర్ఖుని విద్వాంసునిగను, శత్రువులఁ మిత్రులుగను, ఇంద్రియాగోచరమును గోచరించుదానిగను, విషము నమృతముగను, జేయఁజాలిన సత్కర్మము నారాధింపుము. ఇతర విషయములకయి పాటుపడకుడు.

శ్లో॥ శుభ్రం సద్మ, సవిభ్రమా యువతయః, శ్వేతాతపత్రోజ్జ్వలా
లక్ష్మీ, రిత్యనుభూయతే చిర మనుస్యూతే శుభే కర్మణి;
విచ్ఛిన్నే నితరామనఙ్గకలహక్రీడాత్రుటత్తన్తుకం
ముక్తాజాల మివ ప్రయాతి ఝడితి భ్రశ్యద్దిశోఽ దృశ్యతామ్. 94

చ. లలితనికేతనప్రియువి లాసవతీధవళాతపత్రస
ద్విలసితవై భవం బనుభ వింపఁబడున్ సుకృతానువృత్తిచేఁ,
జెలు వగుపుణ్యకర్మము న శించిన నంగజసంగరత్రుట
త్కలితగుణోరుమౌక్తికని కాయములట్లు దొలంగు సంపదల్.

1. వక్రికామ్ - పా.



తా. మంచికర్మ యుండునేని, మంచి మేడలు, విలాసవతులగు జవ్వనులును, ఏకచ్ఛత్రాధిపత్యముగల రాజ్యలక్ష్మియు మొదలగునవి కలుగును. అసత్కర్మ తొలఁగునేని మేడలు మొదలగు సకలసంపదలు మిక్కుటమైన రతికేళియందు. తెగిన ముత్యాల పేరులోని ముత్యములవలె నలుగడలఁ జెదరిపోవును.

శ్లో॥ గుణవ దగుణవ ద్వా కుర్వతా కార్య మా దౌ
పరిణతి రవధార్యా యత్నతః పణ్డితేన,
అతిరభసకృతానాం కర్మణా మావిపత్తే
ర్భవతి హృదయదాహీ శల్యతుల్యో విపాకః. 95

తే. సగుణనిర్గుణ కార్యముల్ సలుపు సుమతి
సేఁతపరిణతిఁ గదుఁ బ్రతీ క్షింపఁ దగును,
బరుషకర్మవిపాకంబు ఫలముదనుక
హృదయము దహించు శల్యంబు రీతి జగతి.

తా. పండితుఁ డగువాఁడు మంచిదో చెడ్డదో యగు నొక కార్యమును చేయఁబూనునేని ప్రయత్నముగ నాలోచింపవలయును. అట్లు గాక అతిత్వరగ ఆలోచింపక చేసిన కార్యముల యొక్క ఫలితము మరణ పర్యంతము శల్యమువలె బాధించును.

శ్లో॥ స్థాల్యాం వై దూర్యమయ్యాం పచతి[1]తిలఖలం[2]చాన్దనై రిన్ధనౌఘైః
సౌవర్ణై ర్లాఙ్గలాగ్రై ర్విలిఖతి వసుధా[3]మర్కతూలస్య హేతోః.
ఛిత్త్వా కర్పూరఖణ్డాన్ వృతి మిహ కురు తే కోద్రవాణాం సమన్తాత్,
ప్రాప్యేమాం కర్మభూమిం న భజతి మనుజో[4]స్తపో మన్దభాగ్యః, 96

మ. చెలు వౌరత్నఘటంబునం దతండు సు శ్రీఖండఖండంబులం
దిలపిణ్యాకము వండె, నారుగల కర్షిన్ సప్తవర్ణావృతుల్
నిలిపెన్, జిల్లెడుదూదికై పుడమి దు న్నెన్ బై ఁడినాఁగేళ్ళ, ని
మ్ములఁ గర్మక్షితిఁ బుట్టి యెవ్వఁడు దపం బుల్ సేయఁం దప్రాజ్ఞతన్.

తా. కర్మభూమి యగు ఈ భరతఖండమున జన్మించియు ఎవఁడు తపము నాచరింపఁడో అట్టి భాగ్యహీనుఁడు వైడూర్యమణిచేత నిర్మింపబడిన వంటకుండ యందు

1. తిలఖలీం - పా. 2. ఇన్ధనైశ్చన్దనాద్యైః - పా. 3. అర్కమూలస్య - పా. 4. స్తతో - పా.

మంచి గంధపు కట్టెలతో తెలికమిండిని వండువానితోడను, జిల్లేడుదూది కొఱకు బంగారు నాగటితో భూమిని దున్నువానితోడను, కర్పూరపుటరంటుల నటికి వానితో అళ్ళకు కంచెవేయు వానితోను సమానుండగును. అనఁగా శ్రేయస్సు గోరువాఁడు సర్వ విధముల సత్కర్మము ననుష్ఠింపవలయు నని భావము.

LIBRARY

శ్లో॥ నై వాకృతిః ఫలతి, నైవ కులం, న శీలం,
విద్యాపి నైవ. న చ యత్నకృతాఽపి సేవా,
భాగ్యాని పూర్వతపసా ఖలు సఞ్చితాని
కాలే ఫలన్తి పురుషస్య యథైవ వృక్షాః. Context 97

తే. రమ్యరూపంబు విద్యయు రాజ్యసేవ
కులము శీలంబుఁ జాలవు ఫల మొసంగఁ;
బూర్వ పుణ్యసంచితభాగ్య ములు ఫలించుఁ
గాలమునఁ బనసాదివృ క్షములు కరణి.

తా. పురుషునకు ఆకారముగాని కులముగాని స్వభావముగాని విద్యగాని ప్రయత్న పూర్వకముగ చేసిన సేవగాని ఫలము నొసంగవు. పూర్వకృతమయిన తపస్సు వలనఁ గలిగిన భాగ్యమే వృక్షములవలె వాని వాని కాలము వచ్చినపుడు ఫలము నొసంగును. కావున తప్పక తపస్సు చేయవలసినది.

శ్లో॥ మజ్జత్వమ్భసి, యాతు మేరుశిఖరం, శత్రూన్ జయత్వాహవే,
వాణిజ్యం *కృషి సేవనాది సకలా విద్యాః కలాః శిక్షతామ్,
ఆకాశం విపులం ప్రయాతు కగవత్కృత్వా ప్రయత్నం పరం,
నాభావ్యం భవతీహ భాగ్యవశతో, భావ్యస్య నాశః కుతః ? 98

చ. సలిలముఁ జొచ్చినం, గనక శైలముఁ జేరిన, వైరివీరులం
గెలిచిన, రాజసేవఁదిల కించిన, వేదము లభ్యసించినం,
గళల తెఱం గెఱింగిన, ఖ గత్వము దాల్చినఁ, గర్మనిఘ్నతా
కలన సభావ్య మైన పని గాదు వినాశము లేదు భావికిన్.

తా. వర్తకముచేయుట, పైరుపెట్టుట, కొలువు కొలుచుట మొదలగు పనులెన్ని చేసినను, ఎన్ని విద్యలు నేర్చినను, ఎంత కష్టపడినను అదృష్టము లేక యేమాత్రఫలమును

* కృషి సేవనే చ – పా.



గలుగదు, మంచి యదృష్టము గలిగినయెడల వానికి ఫలము గలుగనీయక యడ్డపడుటకు నెవరికిని సాధ్యము గాదు. (అది కలుగనున్నదికాదు కాఁబట్టియే నీళ్ళలో మునుఁగుట మున్నగుపాట్లు పడినను కలుగఁజాల దని యాశయము.)

06
04
2003

శ్లో॥ వనే రణే శత్రుజలాగ్నిమధ్యే, గుహార్ణవే పర్వతమస్తకే వా,
సుప్తం ప్రమత్తం విషమస్థితం వా రక్షన్తి పుణ్యాని పురాకృతాని. 99

క. కాననమున రణమున సలి, లానలరిపుమధ్యమున మ హాబ్ధి నగాగ్ర
స్థానమున మత్తు నిద్రితుఁ, బూనికతోఁ బూర్వపుణ్య ములు రక్షించున్.

తా. పురుషుని అడవియందును, యుద్ధమునందును, శత్రువుల మధ్యను, నీళ్ళలోను, నిప్పునను, మహాసముద్రమునను, కొండచివరను, నిదురలోను, కైపులోను, అపాయమునను పురాకృతములు వానికి చెఱుపు కలుగనీయక కాపాడును.

శ్లో॥ భీమం వనం భవతి తస్య పురం ప్రధానం
సర్వే జనః *సుజనతా ముపయాతి తస్య,
కృత్స్నా చ భూ ర్భవతి సన్నిధిరత్నపూర్ణా
య స్యాస్తి పూర్వసుకృతం విపులం నరస్య. 100

తే. భువనమునఁ బూర్వసంభృత పుణ్యరాశి
యగుచు నుదయంబు గాంచిన సుగుణనిధికి
వనము పుర మగుఁ, బరు లాత్మజనము లగుదు,
రవని నిధిరత్న పరిపూర్ణ యయి ఫలించు.

తా. ఎవనికి తొలుత సంపాదింపఁబడిన యనల్పమైన పుణ్యముండునో, వానికి భయంకరమైన యడవియును భోగార్హ మగునగర మగును. వెలివారెల్లరును బంధువు లగుదురు. భూమియంతయు రత్నపు గనులతోడను మంచివస్తువుల తోడను నిండినదై యుండును.

మ. యమునా నీలసరోజ సౌరభరస వ్యాసంగిభృంగీకులో
పమకంఠద్యుతిలి ప్తశేషభుజగ ప్రాలంబజాంబూనదా
ద్రిమహాకార్ముకరూఢగూఢపదమౌ ర్వీసంప్రయుక్తత్రివి
క్రమశాతాంబకపాలి తాంబరచర క్రవ్యాత్పురాట్పాలకా. 101

* స్వజనతాం – పా.

మాలిని. ప్రమథగణపరీతా పాపజీమూతవాతా
కమలభువనసూతా గణ్యలీలా కిరాతా
శమితదనుజనేతా చారువక్త్రాంబుజాతా
సమరజయసమేతా సామవేదాంతగీతా.

క. సుమనోనాయక సంభృత
సుమనోర్చిత పదబిసప్ర సూన భవానీ
సుమనోహర సురనిర్ఝర
సుమనోదామా ర్ద్ర జూట జూటోద్దేశా.

గద్యము-ఇది శ్రీమదుమామాహేశ్వర కరుణాకటాక్షవీక్షాపాత్ర యేనుఁగు లక్ష్మణకవి రాజపౌత్ర తిమ్మనార్యపుత్ర వివిధ విద్వజ్జన విధేయ లక్ష్మణకవి నామధేయప్రణీతం బైన సుభాషిత రత్నావళీ కావ్యంబునందు నీతిశకంబున మూర్ఖపద్ధతియు, విద్వత్పద్ధతియు, మానశౌర్యపద్ధతియు, నర్థపద్ధతియు, దుర్జన పద్ధతియు, సుజనపద్ధతియుఁ, బరోపకారపద్ధతియు, ధైర్య పద్ధతియు, దైవ పద్ధతియుఁ, గర్మపద్ధతియు నను ప్రకరంబులు గల ప్రథమాశ్వాసము.

సుభాషిత త్రిశతియందు నీతి శతకము సమాప్తము.

Page no.

# కౌటిలీయమ్ అర్థశాస్త్రమ్

శ్రీః

## ప్రస్తావన

ఇతర శాస్త్రాలన్నింటికీ ఉన్నట్లుగానే అర్థశాస్త్రానికి కూడా అతిప్రాచీనమైన చరిత్ర ఉన్నది. అర్థశాస్త్రానికి సంబంధించిన ఈ ప్రాచీన వాఙ్మయంలోని విషయాలన్నీ చక్కగా ఆకళించుకొని, తన అనుభవాన్ని కూడా జోడించి అత్యుత్తమమైన "అర్థ శాస్త్రం" అనే గ్రంథాన్ని రచించిన మహామేధావి కౌటిల్యుడు. కౌటిల్యునికి తలిదండ్రులు పెట్టిన పేరు విష్ణుగుప్తుడు. చణకుని. కుమారు డవడం చేత (లేదా 'చణక' అనే ప్రదేశంలో పుట్టడంచేత) చాణక్యుడనే పేరు వచ్చింది. ఈతడు అర్థశాస్త్రంలో కొన్నిచోట్ల కార్యసాధనానికే ప్రాధాన్యం ఇచ్చి కుటిలము లైన మార్గాలు ఉపదేశించినాడనే కారణంచేత 'కౌటిల్యుడు' అనేపేరు తరవాత వచ్చి ఉంటుంది అని కొందరు అంటారు. కౌటిల్యుడు అనేది గోత్రనామం అని శామశాస్త్రిగారి అభిప్రాయము. కొన్ని ప్రకరణాల చివర 'కౌటిల్య' కు బదులు 'కౌటల్య' 'కౌటలీయ' అని కూడ ఉంది.

కౌటిల్యుని గురించీ, అతడు రచించిన అర్థశాస్త్రం గురించీ కొన్ని ప్రాచీన గ్రంథాలలో నిర్దేశాలు ఉన్నా చాలా కాలం వరకూ అది నష్టప్రాయం అయిపోయింది. ఈ అర్థశాస్త్రాన్ని పునరుద్ధరించిన గౌరవం మైసూరు ప్రాచ్యసంశోధనా సంస్థలో అధికారిగా ఉన్న ఆర్. శామశాస్త్రికి దక్కింది. ఆయన ప్రప్రథమంగా ఈ గ్రంథాన్ని గూర్చిన విపులమైన వర్ణనంతో కొన్ని భాగాలు "ఇండియన్ ఏంటిక్వెరీ" లో 1905 లో ప్రకటించారు. 1909లో సంపూర్ణగ్రంథాన్ని చక్కగా సంపాదించి ప్రచురించారు. పాండిత్యపూర్ణమైన భూమికలో కౌటిల్యుడు చంద్రగుప్తుని అమాత్యుడనీ, అతడే అర్థశాస్త్రం రచించినాడనీ, ఆ గ్రంథమే ఇది అనీ సప్రమాణంగా, సయుక్తికంగా ప్రతిపాదించినారు.

ఐతే భారతదేశానికి సంబంధించిన ఇతరగ్రంథాల విషయంలో చేసినట్లుగానే ఈ గ్రంథం విషయంలో కూడా చాలా మంది పాశ్చాత్యులు అనేక సందేహాలు ప్రకటించారు. డా.జొలీ ఈ అర్థశాస్త్రం క్రీ.శ. మూడవ శతాబ్దిలో ఎవరో రచించిఉంటారనీ, కౌటిల్యుడనే వాడు కల్పితవ్యక్తి అనీ వ్రాశాడు. ఇంచుమించుగా వింటర్‌నిట్జ్, కీథ్ మొదలైనవారు కూడా ఇలాంటి అభిప్రాయాన్నే వ్యక్తీకరించాడు. ఐతే హిల్‌బ్రాట్, హర్టల్, యాకోబీ, స్మిత్ మొదలైన పండితులు శామశాస్త్రిమతాన్నే సమర్థించారు. డా.జసవాల్, జొలీ చెప్పిన ఆక్షేపణలన్నింటికీ సమాధానం చెప్తుతూ ఇంతటి ఉద్గ్రంథాన్ని వంచనాగ్రంథం అనడం సాహసమే అవుతుందనీ, కౌటిల్యుడు కల్పితవ్యక్తికాడనీ,

నియమించాలి అనే విషయం చర్చించబడింది. "రాజు తనకి బాగా పరిచితులైన సహాధ్యాయులను అమాత్యులుగా నియమిస్తే మంచి" దని భారద్వాజు డన్నాడట. "వాళ్లు లోకువ కడతారు. అందుచేత తనతో సమానవ్యసనాలు, రహస్యమైన అలవాట్లు ఉన్నవాళ్ళను నియమిస్తే వాళ్లు తమను ఎక్కడ బయటపెడతాడో అని రాజుకు భయపడుతూ ఉంటారు" అని విశాలాక్షు డన్నాడట. "తన మర్మాలు వాళ్ళకి తెలుసు కాబట్టి రాజు, వాళ్ళు ఏమి చేసినా నిస్సహాయుడుగా ఉండిపోవలసి వస్తుంది. అందుచేత తనకి ప్రాణాపాయసమయంలో అడ్డుపడిన వాళ్ళని అమాత్యులుగా చేసుకోవాలి రాజు"అని పరాశరు డన్నాడట. "అది రాజభక్తి అయితే కావచ్చును. కాని బుద్ధిగుణం కాదు. అందుచేత ఏవైనా రాజకార్యాలని చక్కగా సామర్థ్యంతో నిర్వహించినవాళ్ళని నియమించాలి" అని పిశును డన్నాడట. "వాళ్ళని కాదు; పితృపితామహక్రమంలో వస్తున్న అమాత్యకుటుంబాలకి చెందినవారిని నియమించాలి" అని హేమదంతుడు అన్నాడట. "వాళ్లు రాజుగారి అధికారాలన్నీ స్వాయత్తం చేసుకొని రాజునే ఆడించడానికి ప్రయత్నిస్తారు. అందుచేత క్రొత్తవాళ్ళని వేసుకుంటే వాళ్లు రాజుకు భయపడుతూ ఉంటారు" అని వాతవ్యాధి అన్నాడట. "అట్లుకాదు; ఎంత శాస్త్రజ్ఞానం ఉన్నా కర్మ నిర్వహణంలో అనుభవం లేనివాడు ఏదైనా చిక్కు సమస్య రాగానే తబ్బిబ్బు అయిపోతాడు. అందుచేత గుణాలకే ప్రాధాన్యం ఇచ్చి అభిజన - ప్రజ్ఞా - శౌచ (Integrity) శౌర్యానురాగాలు ఉన్నవాళ్ళని అమాత్యులుగా చేసుకోవాలి" అని బాహుదంతీపుత్రుడు అన్నాడట. ఈ విధంగా అందరి మతాలూ చెప్పి "సర్వముపపన్న మితి కౌటిల్యః; కార్యసామర్థ్యాద్ధి పురుషసామర్థ్యం కల్ప్యతే, సామర్థ్యతశ్చ" అని అంటాడు కౌటిల్యుడు. అనగా వీళ్ళందరు చెప్పినదీ నిజమే. ఐతే పనిని పట్టి పురుషుణ్ణి నిర్ణయించుకోవాలి కాని వీడే ఉండాలి; వాడు కాదు అని అనడం మంచిది కాదు అని అర్థం. అందుచేత పైన చెప్పిన అన్ని రకాల వ్యక్తులనుంచి కూడా కార్యానుసారంగా ఎన్నుకొని అమాత్యులను నియమించుకోవాలి. ఐతే వీళ్ళని మంత్రిగా మాత్రం చేసుకోకూడదు అంటాడు.

> "విభజ్యామాత్యవిభవం దేశకాలౌ చ కర్మ చ,
> అమాత్యాః సర్వ ఏవైతే కార్యాః స్యుర్న తు మన్త్రిణః".

(అర్థశాస్త్రంలో అనేకప్రదేశాలలో ఇలాంటి విషయాలను గూర్చి చర్చించేటప్పుడు కౌటిల్యుడు ఈ విధంగా ప్రాచీనుల అభిప్రాయాలు చెప్పి చివరకు తన అభిప్రాయం చెపుతూ ఉంటాడు.)

దీనిని పట్టి రాజుకు చాలా సన్నిహితంగా మంత్రం (ఆలోచన) చెప్పకలిగినవాడు మంత్రి; చెప్పిన కార్యాలు చేసే వాళ్లు అమాత్యులు అనే భేదం మంత్రి - అమాత్యులలో



ఉన్నట్లు తెలుస్తున్నది. బహుశా అమాత్యుల స్థానం నేటి కార్యదర్శుల స్థానం వంటిది అయి ఉండవచ్చు. ఈ ఘట్టంలోనే ఈ పదాలు వేరు వేరు అర్థాలలో ఉపయోగింపబడినవి.

ఎనిమిదవ అధ్యాయంలో ఎట్టివారిని మంత్రిగాను, పురోహితుడుగాను నియమించాలి అనే విషయం చెప్పబడింది. తన దేశంలో పుట్టినవాడు, సద్వంశంలో పుట్టినవాడు, దుర్గుణాలు లేనివాడు, లలితకళలలో నిపుణుడు, అర్థశాస్త్రజ్ఞుడు, బుద్ధిమంతుడు, ధారణాశక్తి కలవాడు, నేర్పు కలవాడు, ఉత్సాహప్రభావాలు కలవాడు, కష్టాలు వచ్చినా సహించగలవాడు, శుచి యైనవాడు (Man of integrity) స్నేహశీలుడు, దృఢమైన భక్తి కలవాడు, శీల-బల-ఆరోగ్య-గాంభీర్యములు కలవాడు, గర్వం కాని, చాపల్యము కాని లేనివాడు, చూడడానికి బాగుండేవాడు, వైరం తెచ్చిపెట్టనివాడు - ఇట్టివానిని మంత్రిగా నియమించాలి. వేదవేదాంగాలలోను, అథర్వప్రక్రియలోను నిష్ణాతుడై దైవ-మానుష ఉపద్రవాలకి ప్రతీకారం చేయగలిగిన వానిని పురోహితుడుగా నియమించాలి.

ఎరలు చూపి రహస్యంగా అమాత్యుల శౌచాన్ని ఎలా పరీక్షించాలో తొమ్మిదో అధ్యాయంలో చెప్పబడింది. 10, 11 అధ్యాయాలలో గూఢచారుల నియుక్తి, వాళ్ళ పరీక్ష విశదీకరింపబడ్డాయి. రాజు తన రాష్ట్రంలో ఉన్న సామాన్యప్రజలను, ప్రధానులైన ప్రజలను ఏ విధంగా వశంలో ఉంచుకోవాలో 12వ అధ్యాయంలో చెప్పబడింది. శత్రురాజ్యంలో ఉన్న ప్రజలను ఏదో విధంగా మోసగించి తనకు వశం అయేటట్లు చేసుకొనే పద్ధతులు 13వ అధ్యాయంలో చెప్పబడ్డాయి.

"అధికారం" అనే 14వ ప్రకరణం : రాజు ఉత్తములైన మంత్రులతో కలిసి మంత్రణం చెయ్యాలి. మంత్రుల సంఖ్యను గూర్చిన పూర్వాచార్యుల మతాలను చెప్పి చివరకు కౌటిల్యుడు ముగ్గురు - నలుగురు మంత్రులతో ఆలోచించడం మంచిది అని అంటాడు. ఒక్కడితోటే చేస్తే సమస్య తెగదు. ఆ మంత్రి ఎదురుతిరగవచ్చు కూడా. ఇద్దరు మంత్రులతో చేస్తే వాళ్ళిద్దరూ సులభంగా ఏకం అయి రాజును పెడదారి పట్టించవచ్చును. నలుగు రుంటేనే చాలావరకు ఈ ప్రమాదాలు ఉండవు. మంత్రాలకి ఐదు అంగాలట :-

> "కర్మణామారమ్భోపాయః, పురుషద్రవ్యసంపత్,
> దేశకాలవిభాగః, వినిపాతప్రతీకారః,
> కార్యసిద్ధిరితి పఞ్చాఙ్గో మన్త్రః"

"పనులు చేపట్టడానికి ఉపాయము, పురుషబల-ధనబలాలు, దేశకాలాల విభాగము, విఘ్నాలకి ప్రతిక్రియ, కార్యసిద్ధి" మంత్రిపరిషత్తులో ఎంతమంది ఉండాలి అని ప్రశ్న. పన్నెండుగురు ఉండాలని మనుమతానుయాయులు, పదహారుగురు అని బృహస్పతిమతంవాళ్ళు, ఇరవై మంది అని శుక్రాచార్యమతంవాళ్లు. సామర్థ్యాన్ని పట్టి సంఖ్యానిర్ణయమని కౌటిల్యుడు. దగ్గర ఉన్నవాళ్ళని పిలిపించి వాళ్ళతో మంతనాలు చెయ్యాలి. దూరంగా ఉన్నవాళ్ళతో లేఖలద్వారా సంప్రతించాలి. ఈ సందర్భంలో, ఇంద్రుడు సహస్రాక్షు డెందు కయ్యాడో చెపుతూ కౌటిల్యుడు ఒక వాక్యం వ్రాస్తాడు -

"ఇన్ద్రస్య హి మన్త్రిపరిషదృషీణాం సహస్రమ్,

స తచ్చక్షుః. తస్మాదిమం ద్వ్యక్షం సహస్రాక్షమాహుః".

ఇంద్రుడి మంత్రిపరిషత్తులో వెయ్యిమంది ఋషులు ఉండేవారట. వాళ్ళే ఆయనికి నేత్రాలు. అందుచేత అతడు అసలు రెండు నేత్రాలవాడే అయినా సహస్రాక్షు డనే పేరు వచ్చినదట.

15వ అధ్యాయంలో దూతలు, వాళ్ళ లక్షణాలు వివరించబడ్డాయి. "రాజపుత్ర దర్శనం" అనే 16వ అధ్యాయంలో, రాజు తన పుత్రులను ఎలా పెంచుకోవాలో, వాళ్ళనుండి తిరుగుబాటు ప్రమాదము రాకుండా ఎలా చూచుకోవాలో చెప్పబడింది. అవసరమైతే వాళ్ళను కూడా ఎలా నశింపచెయ్యాలో చెప్పబడింది. తండ్రి అనుమానాలకి గురి అయిన రాజపుత్రుడు ఏమి చెయ్యాలో 17వ అధ్యాయంలో చెప్పబడింది.

రాజు పగలు ఎనిమిది భాగాలుగానూ, రాత్రి ఎనిమిది భాగాలుగానూ విభజించి ఏ ఏ పనులు (రాజ్యకార్యాలూ, స్వీయకార్యాలూ) చెయ్యాలో 18వ అధ్యాయంలో వర్ణింపబడింది. రాజ్యవ్యవహారాలు చూచేటప్పుడు తన దగ్గరికి వచ్చేవాళ్ళ నెవరినీ ఆపకుండా అందరితోటి కలవాలట. అట్లా కాకపోతే ప్రజలకోపానికి గురి అవుతాడు. ఆత్యయికకార్యాలు ఏవైనా (Urgent work) ఉంటే వెంటనే చూడాలి. కాలాతిపాతం (Postponement) చేయకూడదు. అలా చేస్తే ఆ పని కృచ్ఛ్రసాధ్యం (అతి కష్టం మీద సాధించతగినది) ఐనా అవుతుంది లేదా అసాధ్యం అయిపోతుంది.

"సర్వమాత్యయికం కార్యం శృణుయాన్నాతిపాతయేత్,

కృచ్ఛ్రసాధ్యమతిక్రాన్తమసాధ్యం వా విజాయతే".

ప్రజల సుఖంలోనే రాజు సుఖం ఉన్నది; ప్రజల హితంలోనే రాజు హితం ఉన్నది. రాజుకు తనకు ప్రియమైనది హితం కాదు. ప్రజలకు ప్రియమైనదే రాజుకు కూడ హితము.



"ప్రజాసుఖే సుఖం రాజ్ఞః ప్రజానాం చ హితే హితమ్,

నాత్మప్రియం హితం రాజ్ఞః ప్రజానాం తు ప్రియం హితమ్".

"నిశాన్తప్రణిధి" అనే 19వ అధ్యాయంలో రాజు తన ప్రాసాదంలోను, అంతఃపురం లోను ఎట్టి జాగ్రత్తలను తీసుకోవలెనో, విషాదులవలన ఎలా రక్షించుకోవలెనో చెప్పబడింది. కోటలోనికి వచ్చే ప్రతివస్తువునూ, బైటికి వెళ్ళే ప్రతివస్తువును కూడా రిజిస్టరులో ఎక్కించుకోవాలి. ప్రతి వస్తువుమీదా రాజముద్ర ఉండాలి.

"సర్వం చావేక్షితం ద్రవ్యం నిబద్ధాగమనిర్గమమ్,

నిర్గచ్ఛేదధిగచ్ఛేద్వా ముద్రాసంక్రాన్తభూమికమ్".

"ఆత్మరక్షితకం" అనే 20వ అధ్యాయంలో రాజు స్వీయరక్షణం విషయంలో ఎట్టి జాగ్రత్తలను తీసుకోవాలో చెప్పబడింది. ఎంతో పరిచయం ఉన్నవాళ్ళని కాని దగ్గరికి రానీయకూడదు. అన్నాదులలో విషం కలిపితే తెలుసుకొనే ఉపాయాలు వివరించబడ్డాయి. ధరించే వస్త్రాలంకారాదులను కూడా బాగా పరీక్షించి ధరించాలి. యానోద్యానాదులలో కూడా ఎంతో మెలకువగా ఉండాలి.

రెండవ అధికరణానికి "జనపదనివేశము" అని పేరు. మొదటి అధ్యాయంలో గ్రామాల నిర్మాణము, జలమార్గసేత్వాది నిర్మాణము మొదలైన విషయాలు చెప్పబడ్డాయి. బాల-వృద్ధ-వ్యాధిగ్రస్త-అనాథులను రాజు పోషించాలి. చిన్నపిల్లవాడు పెద్దవాడయేవరకూ అతని ఆస్తిని గ్రామస్థులు కాపాడాలి. భార్యను, పిల్లలనూ, తల్లిదండ్రులనూ, అప్రాప్తవ్యవహారాలైన (మైనర్లయిన) సోదరులనూ, అవివాహితలైన చెల్లెండ్రను, భర్తలు లేని సోదరీలను, శక్తి ఉండికూడా పోషించనివాళ్ళని శిక్షించాలి. ఐతే పైన చెప్పినవాళ్ళు పతితు లయినట్లయితే పోషించకపోయినా తప్పు లేదు. తల్లినిమాత్రం పతితయైనా పోషించవలసినదే. కుటుంబానికి దారి చూపించకుండా ఎవడైనా సంన్యసించినా, స్త్రీకి సంన్యాసం ఇప్పించినా వానిని శిక్షించాలి. వానప్రస్థులున్నా తప్పు లేదు కాని గ్రామంలో సంన్యాసుల్ని ఉండనివ్వకూడదు. సహకారసంఘాలు తప్ప మరే సంఘాలుకాని సంస్థలుకాని ఉండకూడదు. ఉద్యానాలు కాని విహారశాలలు కాని, నటనర్తక గాయకాదులు కాని గ్రామాలలో ఉండకూడదు. వాళ్ళవల్ల వ్యవసాయానికి విఘ్నం కలుగుతుంది.

"భూమిఛిద్రవిధానం" అనేది రెండవ అధ్యాయం. వ్యవసాయానికి ఉపయోగించని భూములను పశుగ్రాసం కోసం విడిచి పెట్టాలి. రెండు క్రోసుల (4మైళ్ళ) ప్రమాణం గల అరణ్యభాగాన్ని బ్రాహ్మణులు వేదాధ్యయన-యజ్ఞాద్యనుష్ఠానాలు చేసుకోవడానికి విడిచిపెట్టాలి. అనేక వృక్షాలూ, గోళ్లూ కోరలూ తీసివేసిన మృగాలూ

ఉన్న వనాన్ని రాజుకి విహారంకోసం ఏర్పరచుకోవాలి. వివిధదేశాలలో ఉండే మృగాలతో ఒక మృగవనం (Zoo) ఏర్పాటు చేయాలి. రాష్ట్రం పొలిమేరలలో ఏనుగులతో నిండిన దట్టమైన నాగవనం నిర్మించాలి.

దుర్గవిధానము, దుర్గనివేశము అనే 3,4 అధ్యాయాలలో జలదుర్గ-పర్వతదుర్గ-ధాన్వన (ఎడారి) దుర్గ-వనదుర్గాల నిర్మాణమూ, వాటిలో వివిధగృహాల నిర్మాణమూ, బాటలు వేయడము మొదలైన అంశాలు వివరింపబడ్డాయి. "సన్నిధాతృనిచయకర్మ" అనే ఐదో అధ్యాయంలో కోశగృహనిర్మాణమూ, కోశాధ్యక్షుని కర్తవ్యాలూ వివరింపబడ్డాయి. ఎవరైనా చెడ్డనాణాలు తెచ్చినప్పుడు పరీక్షించి, వాటిని అక్కడనే ఛేదించివేసి, ఆ తెచ్చిన వానిని కఠినంగా దండించాలి. ధాన్యాదులలో కల్తీసరుకు తెచ్చిన వానిని కూడా దండించాలి. కోశాధ్యక్షుడు బైటనుంచి ఎంత ఆదాయం వచ్చిందో, నగరంనుంచి ఎంత వచ్చినదో, ఎంత వ్యయమై ఎంత మిగిలిందో నూరుసంవత్సరాల లెక్కలు కూడా వెంటనే చెప్పగలిగిన స్థితిలో ఉండాలి.

"బాహ్యమభ్యన్తరం చాయం విద్యాద్వర్షశతాదపి,
యథా పృష్టో న సజ్యేత వ్యయశేషం చ దర్శయేత్".

"సమాహర్తృసముదయప్రస్థాపనం" అనే 6వ అధ్యాయంలో సమాహర్త (Collector of Taxes) చేయవలసిన విధులు, "అక్షపటలగాణనిక్యాధికారం" అనే 7వ అధ్యాయంలో అక్షపటలం (Account Office) లో గాణనిక్యుడు (Superintendent of Accounts) చేయవలసిన గణనపుస్తకాలను భద్రపరచడంవంటి విధులు, 8వ అధ్యాయంలో రాష్ట్రద్రవ్యాన్ని అపహరించే అధికారులకు ఇచ్చే దండమూ వివరించబడ్డాయి. రాజధనాన్ని అధికారులు ఏ విధంగా కాజేస్తూ ఉంటారో చెపుతూ అందుకు వాళ్లు అవలంబించే 40 ఉపాయాలు (రిజిష్టర్లు సరిగా వ్రాయకపోవడం, లెక్కలు తారుమారుచేయడం వంటివి) వర్ణింపబడ్డాయి.

9వ అధ్యాయములో అధ్యక్షుల మీద (Heads of the Departments) సర్వదా నిఘా వేసి ఉండాలనీ, డబ్బులో మసిలేవాళ్లు డబ్బు తినకుండా ఉండలేరు కాబట్టి చాలా జాగ్రత్తగా పర్యవేక్షిస్తూ ఉండాలనీ చెప్పబడింది. విషమైనా, తేనెయైనా నాలిక మొదటిదాకా వెళ్ళినతరువాత దానిని మింగకుండా ఉండడము ఎంత అశక్యమో, డబ్బు మధ్య మసలే రాజాధికారులు కొద్దిగానో గొప్పగానో తినకుండా ఉండలేరట.

"యథా హ్యనాస్వాదయితుం న శక్యం జిహ్వాతలస్థం మధు వా విషం వా,
అర్థస్తథాహ్యర్థచరేణ రాజ్ఞః స్వల్పోఽప్యనాస్వాదయితుం న శక్యః".

"శాసనాధికారం" అనే 10 వ అధ్యాయంలో రాజ్య పరిపాలనకు సంబంధించిన



వివిధశాసనాలు వ్రాయించే పద్ధతి చెప్పబడింది. ఈ సందర్భంలో భాషకి సంబంధించిన విషయాలు కూడా కొన్ని చెప్పబడ్డాయి. లింగ-వచన-కారక-క్రియాదులు సరిగా ప్రయోగించకుండా చేసే అపశబ్దాలను పరిహరించాలి. సంప్లవం అనే దోషం అనగా వర్గాన్ని (Punctuation mark) ఉంచవలసిన చోట ఉంచక, ఉంచకూడనిచోట ఉంచడం వంటి దోషం లేకుండా చూచుకోవాలట.

"కోశప్రవేశ్యరత్నపరీక్ష" అనే 11వ అధ్యాయంలో కోశాధ్యక్షుడు ఏ ఏ వస్తువులను కోశంలోనికి తీసుకొనవచ్చునో చెప్పబడింది. ఈ సందర్భంలో వివిధ రత్నజాతులూ, అగరుచందనాదివస్తువులూ, వివిధవస్త్రాదులూ వర్ణించబడినాయి.

"ఆకరకర్మాన్తప్రవర్తనం" అనే 12వ అధ్యాయంలో వివిధఖనిజాల సంగ్రహమూ, విక్రయమూ, "అక్షశాలాయాం సువర్ణాధ్యక్షః" అనే 13వ అధ్యాయంలో సువర్ణాధ్యక్షుడు వెండి బంగారాల విషయంలో తీసుకోవలసిన ప్రత్యేకమైన జాగ్రత్తలూ చెప్పబడ్డాయి. 14వ అధ్యాయంలో-సౌవర్ణికుడు (రాజ్యంలో ఉండే ప్రధానస్వర్ణకారుడు) ప్రజలకు అలంకారాలు ఏ విధంగా చేయించి ఇవ్వాలి అనే విషయమూ, ప్రసంగవశంచేత స్వర్ణకారులు సువర్ణాన్ని అపహరించడానికి అవలంబించే విధానాలు వివరింపబడ్డాయి. 15వ అధ్యాయంలో కోష్ఠాగారాధ్యక్షుడు (కొఠారి) వివిధ ధాన్యాదులను సేకరించేటప్పుడు అవలంబించవలసిన పద్ధతులు, వాటి ప్రమాణ -మూల్యనిర్ణయాదులు చెప్పబడినవి. 16వ అధ్యాయంలో పణ్యాధ్యక్షుడు (Chief supervisor of markets) వివిధ వస్తువులను ఏ విధంగా సేకరించాలో, ఏ విధంగా విక్రయించాలో వివరింపబడింది. దీనినిపట్టి వర్తకవ్యాపారం అంతా చాలావరకు ప్రభుత్వం ద్వారానే జరిగేదన్నట్లు తెలుస్తూన్నది. 17వ అధ్యాయంలో కుప్యాధ్యక్షుని (Head of the forest department) కర్తవ్యాలూ, అడవుల్లో లభించే మంచి కఱ్ఱ ఇచ్చే, ఉత్తమజాతి వృక్షాలూ, ఇతరవస్తువులూ వర్ణింపబడ్డాయి. 18వ అధ్యాయంలో వివిధ ఆయుధాల వర్ణనచేసి, ఆయుధాగారాధ్యక్షుని కర్తవ్యాలు నిరూపించబడ్డాయి. 19వ అధ్యాయంలో తూకాలూ, కొలతలు పరీక్షించే అధికారి (పౌతవాధ్యక్షుడు) కర్తవ్యాలు, ధరలు నిర్ణయించే విధానమూ చెప్పబడ్డాయి. 20వ అధ్యాయంలో మానాధ్యక్షుడు దేశకాలాల కొలతలు తెలుసుకొని ఉండాలి అని చెప్పి ఆ కొలతలన్నీ ఇవ్వబడ్డాయి. 21వ అధ్యాయంలో శుల్కాధ్యక్షుని (అమ్మకం పన్నుల అధికారి) కర్తవ్యాలు చెప్పబడ్డాయి. శుల్కవ్యవహారాధ్యాయం (22)లో ఏ వస్తువు మీద ఎంత శుల్కం వెయ్యాలో చెప్పబడింది. సూత్రాధ్యక్షాధ్యాయం(23)లో అనేక రకాలైన దారాలు, వాటిధరలు, త్రాళ్లు మొదలైన వాటిని గూర్చి చెప్పబడింది. ఈ

ధర్మశాలాధికారి పాషండులకి, బాటసారులకీ చోటు ఇచ్చేముందు స్థానికునికి చెప్పాలి. శిల్పులు వర్తకులు మొదలైనవాళ్ల క్రొత్తవాళ్ళకు తమ ఇళ్ళల్లో చోటు ఇవ్వవచ్చు కాని దేశకాలాలకి విరుద్ధంగా వ్యాపారం చేసేవాళ్ళూ ఇతరుల వస్తువులతో వ్యాపారం చేసేవాళ్ళూ ఎవరైనా వస్తే అధికారులకి తెలపాలి. మద్య మాంసాదులు అమ్మేవాళ్ళూ, అన్నం అమ్మేవాళ్ళూ (హోటలువాళ్ల) వేశ్యలు తమ పరిచితులను ఇంట్లో ఉంచుకోవచ్చు. అతివ్యయం చేసేవాళ్ళు ఎవరైనా వస్తే అధికారులకి తెలపాలి. ఇలాంటి నియమాలు ఎన్నో చెప్పబడినాయి. ఇళ్ల కాలుతున్నప్పుడు అక్కడ ఉండికూడా ఆర్పడానికి వెళ్ళనివాళ్ళని దండించాలి. ఇంటికి నిప్పు అంటించినవానికి వధ దండం. రథ్య (రోడ్డు) మీద బూడిద పోసినా, మురికినీరు వదలినా, పుణ్యస్థాన-ఉదకస్థానాదులను మలమూత్రాలచేత కలుషితం చేసినా దండించాలి. పిల్లి, కుక్క, నకులము, సర్పము మొదలైనవాటి మృతశరీరాలను గాడిద మొదలైనవాటి మృతశరీరాలను నగర మధ్యంలో వదలినా, నిర్ణీతమైన దారిని కాకుండా మరొక మార్గంలో శవాన్ని తీసుకొని వెళ్లినా దండించాలి. రాత్రి ప్రారంభంలో ఆరు గడియల తరవాత చివర ఆరు గడియలు రాత్రి ఉన్నప్పుడు రెండు పర్యాయాలు రాజప్రాసాదందగ్గర తూర్యశబ్దం చేయబడుతుంది. రాత్రి ఆ రెండు రాత్రిఘోషాల మధ్యకాలంలో రాజప్రాసాదప్రాంతంలో తిరిగేవాళ్ల దండనీయులు. నాగరికుడు ప్రతిరోజు జలస్థలమార్గాలూ, సురంగ మార్గాలూ, ప్రాకారాలు, గోపురాలు మొదలైనవాటిని పర్యవేక్షిస్తూ ఉండాలి. నడవడిక బాగున్న ఖైదీలనూ, కొందరిని ఏదో ఒక పనిచేయించుకొన్న తరవాతా విడిచిపెడుతూ ఉండాలి.

మూడవ అధికరణానికి "ధర్మస్థీయం" అని పేరు. మొదటి అధ్యాయంలో ధర్మస్థులైన ముగ్గురు అమాత్యులు కలిసి జనపదసంధి (గ్రామాలసీమ) సంగ్రహణ (పది గ్రామాల కేంద్రం) ద్రోణముఖ (400 గ్రామాల కేంద్రం) స్థానీయా (800 గ్రామాల కేంద్రం) లలో ప్రజల వ్యవహారాలు చూడాలి. ఏ వ్యవహారాలు గ్రాహ్యాలో ఏవి కావో ముందుగా నిర్ణయించుకోవాలి. వాదిప్రతివాదులు చెప్పే మాటలు యథాతథంగా వ్రాసుకోవాలి. సాక్షుల్ని పరీక్షించాలి. తప్పుడు సాక్ష్యం చెప్పేవాళ్ళని శిక్షించాలి. రెండవ అధ్యాయంలో వివాహ-స్త్రీధనాదులను గూర్చి చెప్పబడింది. మన్వాదిధర్మశాస్త్రాలలో చెప్పినట్లుగా బ్రాహ్మ-ప్రాజాపత్య-ఆర్ష-దైవ-గాంధర్వ-ఆసుర-రాక్షస-పైశాచా లనే ఎనిమిది విధాలైన వివాహాలు చెప్పబడ్డాయి. 'వృత్తి' అనీ 'ఆబంధ్యం' అనీ స్త్రీధనం రెండు విధాలు. రెండు వేలకి తక్కువ కాకుండా (మామగారు మొదలైనవాళ్లు) ఏర్పరచినది వృత్తి. అలంకారాలు ఆబంధ్యం. దీని విషయంలో ఇంత ఉండాలని నియమం లేదు.



భర్త మరణించిన స్త్రీ ధర్మకర్మపరురాలై ఉండాలనుకున్నప్పుడు కొంత ప్రీతిధనం (ప్రేమపూర్వకంగా ఇచ్చే ధనం) కలిపి ఆమె ధనాన్ని ఆమెకు ఇచ్చివేయాలి. ఇలా తీసుకున్న తరవాత కొంత కాలానికి ఆమె పునర్వివాహం చేసుకొనేపక్షంలో తాను తీసుకున్న ధనాన్ని వడ్డీతో సహా (మొదటి) భర్త బంధువులకి ఇచ్చివేయాలి. ఐతే ఆమె కుటుంబం కావాలనే ఉద్దేశ్యంతో పునర్వివాహం చేసుకుంటూన్న పక్షంలో మామగారూ భర్తా ఇచ్చిన ధనాన్ని వివాహసమయంలో ఆమెకు ఇవ్వాలి. మామగారి ఇష్టం లేకుండా పునర్వివాహం చేసుకొనే స్త్రీకి ఆ ధనం ఇవ్వవలసిన పనిలేదు. ఈ పునర్వివాహం జ్ఞాతులద్వారా అయినపక్షంలో ఆ జ్ఞాతులే ఆమెకు ధనం ఇవ్వాలి. పునర్వివాహం చేసుకొనే స్త్రీకి భర్త ఆస్తిమీద అధికారం ఉండదు. ధర్మబుద్ధి కలదైతే, అనగా పునర్వివాహం చేసుకొనని పక్షాన ఉంటుంది. పుత్రవతియైన స్త్రీ పుత్రుల పోషణాదులకోసమే పునర్వివాహం చేసుకుంటూన్న పక్షంలో ఆ ధనాన్ని పుత్రుల పేర నిర్దిష్టం చెయ్యాలి. ఎవరైనా ఒక స్త్రీ చాలామంది పురుషుల ద్వారా చాలా మంది పుత్రులను కన్నపక్షాన ఏ తండ్రివల్ల వచ్చిన ధనాన్ని ఆ పుత్రుడికే ఇవ్వాలి. ఐతే పుత్రులు లేని స్త్రీ పతివ్రతాధర్మం ప్రకారం పునర్వివాహం చేసుకొనని పక్షంలో పెద్దవాళ్ళదగ్గర ఉంటూ చివరివరకూ తన ధనం అనుభవించవచ్చు. చివరికి అది దాయాదులకి చెందుతుంది. భర్త జీవించి ఉండగా మరణించిన స్త్రీయొక్క ధనాన్ని పుత్రులూ పుత్రికలూ పంచుకోవాలి. పుత్రులు లేని పక్షాన పుత్రికలకే చెందుతుంది ఆ ధనం. ఎవరూ లేకపోతే భర్తకి చెందుతుంది. వివాహసమయంలో కట్నంగా ఇచ్చిన సొమ్మును (ఆ స్త్రీ మరణించినపుడు) పుట్టింటివాళ్లు తీసుకొనవచ్చును. ఈ విధంగా స్త్రీ ధనానికి సంబంధించిన కొన్ని విషయాలు చెప్పబడ్డాయి. భార్యకి పిల్లలు పుట్టకపోతే భర్త ఎనిమిది సంవత్సరాలు వేచి ఉండాలి. మృతశిశువును కనిన పక్షాన పది సంవత్సరాలు, ఆడపిల్లలనే కనిన పక్షాన 12 సంవత్సరాలూ నిరీక్షించి, అప్పటికీ పుత్రులు కలగకపోతే రెండవ భార్యను వివాహం చేసుకోవచ్చును. దీనికి విరుద్ధంగా ప్రవర్తించినవాడు శిక్షార్హుడు.

భార్య నీచుడూ, పరదేశప్రవాసి, రాజద్రోహి, ప్రాణఘాతకుడు, పతితుడు, నపుంసకుడు అయిన భర్తతో వివాహవిచ్ఛేదం చేసుకోవచ్చును.

"నీచత్వం పరదేశం వా ప్రస్థితో రాజకిల్బిషీ,
ప్రాణాభిహన్తా పతితస్త్యాజ్యః క్లీబో ఽపి వా పతిః".

ద్వాదశపణో దణ్డః, వైశ్యం ద్విగుణః, క్షత్రియం త్రిగుణః, బ్రాహ్మణం చతుర్గుణః." దేశోపద్రవాది పరిస్థితులను పట్టి ఒకప్పుడు వాళ్లుకూడా దాసులు కావచ్చును. దాసులచేత ఏ పనులు చేయించుకోవాలి. ఏవి చేయించకూడదు. వాళ్ళ విడుదల, వాళ్ళ ధనం మొదలైన విషయాలు చర్చించబడ్డాయి. కర్మకారులూ, వాళ్ళ జీతాలూ, వాళ్ళ కర్తవ్యాలూ, యజ్ఞం చేయించే యాజకులకూ, యజమానుడికీ (యజ్ఞం చేసేవాడు) మధ్య కలిగే వ్యవహారాలు మొదలైన విషయాలు 14వ అధ్యాయంలో చెప్పబడ్డాయి.

15వ అధ్యాయానికి పేరు "విక్రీతక్రీతానుశయము." అమ్మిన వస్తువును ఇవ్వని విక్రేత, కొన్న వస్తువును తీసుకొనని క్రేతా కూడా దండ్యులే. కన్యలో ఉన్న గుప్త దోషాన్ని చెప్పకుండా వివాహం చేసినవానికి 96 పణాలదండం. వరుని దోషాలు చెప్పకుండా వివాహం చేసినవానికి రెట్టింపు దండం. బ్రాహ్మణక్షత్రియవైశ్యులలో వివాహం అయిన దంటే దానికి మార్పులేదు. శూద్రులు ప్రథమసంయోగానంతరం కూడా భార్యాభర్తలు విడిపోవచ్చును. మొదటి మూడు వర్ణాలవాళ్లు కూడా సంయోగ సమయంలో లైంగికదోషా లేవైనా బయటపడినప్పుడు వాళ్లు విడిపోవచ్చు. పిల్లలు పుట్టినతరవాత మాత్రం ఇంక కుదరదు. 16వ అధ్యాయంలో ఇస్తానన్నది ఇవ్వకపోవడం (దత్తస్యానపాకర్మ), పరులసొత్తు విక్రయించడం, స్వస్వామిసంబంధము (సొత్తుమీద అధికారము) మొదలైన విషయాలు చర్చించబడినాయి. పది సంవత్సరాలపాటు ఇతరుల అధీనంలో ఉంచితే ఆ వస్తువు వారిదే అయిపోతుంది. వాస్తువు (ఇల్లు మొదలైనవి) అద్దెకు ఇరవై సంవత్సరాలపాటు ఎవరిక్రింద ఉంటుందో వారి సొత్తు అయిపోతుంది. 17వ అధ్యాయంలో బలాత్కారంగా చేసే దోపిడీ, మారణం మొదలైనవాటికి దండం చెప్పబడింది. ఈలాటి కార్యాలకి "సాహసం" అని పేరు. వాక్పారుష్యము (తిట్టడం), దండపారుష్యము (కొట్టడం) మొదలైనవాటికి ఇవ్వవలసిన శిక్షలు 18, 19 అధ్యాయాలలో చెప్పబడ్డాయి. ఎవరైనా ఒంటికంటివానివి, కుంటివానిని పట్టుకొని "ఆహా! నీ నేత్రదంతాదులు ఎంత అందంగా ఉన్నాయి" అని అంటూ పరిహసిస్తూ చేసే వాక్పారుష్యానికి 12 పణాలు దండం. "శోభనాక్షిదన్త ఇతి కాణఖంజాదీనాం స్తుతినిందాయాం ద్వాదశపణో దణ్డః".

20 వ అధ్యాయంలో ద్యూతగృహాలను ఏ విధంగా నడపాలో, పర్యవేక్షించాలో, అక్కడ వచ్చే వివాదాలను ఏవిధంగా పరిష్కరించాలో చెప్పబడింది. ఈ అధ్యాయంలో "ప్రకీర్ణకం "(Miscellaneous) అనే పేరుతో మరికొన్ని దండాలు కూడా చెప్పబడ్డాయి.



వ్యవహారాలను చూడడంతో పాటు ధర్మస్థులు (ధర్మాధికారులు) వ్యవహారానికి రాజాలనివాళ్లు-దేవ-బ్రాహ్మణ-తపస్వి-స్త్రీ-బాల-వృద్ధ-వ్యాధిగ్రస్త-అనాథాదులు ఎవరైనా కష్టాలలో ఉంటే వాళ్ళ వ్యవహారాలు స్వయంగానే పరిష్కరించాలి. దేశమూ, కాలమూ మొదలైన ఏవేవో వంకలు పెట్టి వాళ్ళకి కష్టం కలిగించకూడదు. విద్యా-బుద్ధి-పౌరుషాలు కలవారినీ, ఉత్తమవంశీయుల్నీ, పండితులనీ, మంచిపనులు చేసేవారినీ గౌరవించాలి.

నాల్గవ అధికరణానికి "కంటకశోధనం' అనగా సమాజవిద్రోహులను శిక్షించడం అని పేరు.ముగ్గురు ప్రదేష్టలు (Commissioners), ముగ్గురు అమాత్యులు కంటకశోధనం చెయ్యాలి. మొదటి అధ్యాయంలో ప్రజలను మోసగించి వాళ్ళకి కష్టం కలిగించే సాలీలు, చాకళ్లు, సువర్ణకారులు, లోహకారులు, వైద్యులు, నటనర్తకాదులు మొదలైనవాళ్ళని గూర్చి చెప్పబడింది. చాకళ్లు ఇతరుల వస్త్రాలు ధరించకూడదట. వాళ్లెప్పుడూ ముద్గరచిహ్నం గల వస్త్రాలే ధరించాలట. మరొక వస్త్రం ధరిస్తేదండనార్హులు. వైద్యుడు 'ప్రాణాబాధికాన్ని' (Serious case) చేపట్టేటప్పుడు ముందుగా అధికారులకు తెలపాలట. అట్లా చేయకపోయినా, తప్పుడు మందు ఇచ్చినా దండనార్హుడవుతాడు. "వర్తకులు, శిల్పులు, నటనర్తకాదులు, భిక్షుకులు, ప్రచ్ఛన్న విద్యలతో మోసం చేసేవాళ్ళు - వీళ్ళందరు దొంగలని చెప్పబడని దొంగలు. దేశపీడకులను అదుపులో ఉంచాలి.'

"ఏవం చోరానచోరాఖ్యాన్ వణిక్కారుకుశీలవాన్,

భిక్షుకాన్ కుహకాంశ్చాన్యాన్ వారయేద్దేశపీడనాత్.'

రెండవ అధ్యాయంలో సంస్థాధ్యక్షుడు (వ్యాపారసంస్థల అధికారి) వర్తకులు మంచి వస్తువులను, తగిన ధరలకు అమ్మేటట్లుగాను, ఎక్కువ లాభం తీసుకోకుండాను చూడాలని చెప్పబడింది. మూడవ అధ్యాయంలో దైవంవల్ల వచ్చే ఎనిమిది విధాలైన మహాభయాలనుంచి జనపదాన్ని ఎలా రక్షించాలో చెప్పబడింది. అగ్ని, ఉదకం, వ్యాధి, దుర్భిక్షం, ఎలుకలు, క్రూరమృగాలు, సర్పాలు, రాక్షసులు అనేవి ఎనిమిది మహాభయాలు. వీటి నివారణకోసం ఇతర ప్రయత్నాలతో పాటు అథర్వవేదోక్తప్రక్రియలు కూడా చెయ్యాలి.

అనేక వేషాలలో ఉన్న గూఢచారులనూ, సిద్ధపురుషుల మని చెప్పి కొన్ని తమాషాలు చేయకలిగిన వారినీ పంపించి ప్రజాకంటకులైన అధికారులనూ, దొంగలనూ వశీకరణవిద్యతో మోసం చేసేవాళ్ళనీ, కూటముద్రలు (నాణాలు) తయారు చేసే

వాళ్ళనీ, రసప్రయోగంచేత ఇతరులను చంపేవాళ్ళనీ, ఎలా పట్టించాలో నాలుగు - అయిదు అధ్యాయాలలో చెప్పబడింది. శంకింప తగినవాళ్ళను గుర్తించడం, దొంగిలించిన సొమ్ము గుర్తించడం, దొంగలను గుర్తించడం మొదలైన విషయాలు ఆరవ అధ్యాయంలో చెప్పబడ్డాయి. ఏడవ అధ్యాయం "ఆశుమృతకపరీక్ష (Post mortum) పరీక్షించి చెప్పబడ్డాయి. అపరాధాలు గుర్తించిన దొంగలకు వివిధదండనలు 8వ అధ్యాయంలో చెప్పబడ్డాయి. వాడు పతితుడని గుర్తుగా చేసిన బ్రాహ్మడికి శారీరకమైన దండనం ఇవ్వకూడదు. వాడు పతితుడని గుర్తుగా ఉండడం కోసం అతని లలాటంమీద ముద్రలు వేసి దేశం నుంచి వెడలగొట్టాలి. దొంగతనానికి కుక్కముద్ర, మనుష్యులను చంపినందుకు మొండెము ముద్ర గురుభార్యాగమనం చేస్తే భగముద్ర, సురాపానం చేస్తే మద్యధ్వజముద్ర వెయ్యాలి. దేశంనుంచి వెళ్ళగొట్టని పక్షంలో గనులలో పని చేయించాలి. తొమ్మిదవ అధ్యాయంలో ఆ యా శాఖలకు అధ్యక్షులైన అధికారులమీదా,. వారిక్రింద పనిచేసే చిన్న ఉద్యోగస్థులమీదా, సమాహర్తలు, ప్రదేష్టలూ కూడా పర్యవేక్షణం చేస్తూ వాళ్ళు అధికారదుర్వినియోగం చేయకుండా ఉండేటట్లు చూడాలని చెప్పబడింది. కొన్ని విధాల దొంగతనాలు చేసిన వాళ్ళని కొన్ని అవయవాలని ఖండించి దండించాలని "ఏకాంగవధనిష్క్రయము' అనే పదవ అధ్యాయంలో చెప్పబడింది. 11, 12 అధ్యాయాలలో చంపడము, అంతఃపురదూషణము, స్త్రీమానభంగము మొదలైన అపరాధాలకి వధ, అంగచ్ఛేదము మొదలైన దండాలు విధింపబడినవి. అభక్ష్యములూ, అపేయములూ అయిన వస్తువులను బ్రాహ్మణ క్షత్రియాదులచేత తినిపించడము, ఇతరుల ఇళ్ళల్లో ప్రవేశించడమూ, అర్ధరాత్రివేళ ప్రాకారం ఎక్కి దాటి ఇంటిలోనికి (తన ఇంటిలోనికైనా) ప్రవేశించడం, గోడ గట్టి లేకపోవడంచేతా, బండిచక్రాలు సరిగా లేకపోవుట చేతా, గోడలు సరిగా కప్పకపోవడంచేతా ఎవరి మృత్యువుకైనా కారణం అవడం వంటి అపరాధాలకు, అగమ్యాగమనానికి ఎలాంటి శిక్ష ఇవ్వాలో 13వ అధ్యాయంలో చెప్పబడింది.

ఐదవ అధికరణానికి పేరు "యోగవృత్తము.' మొదటి అధ్యాయంలో తనకు అడ్డు తగులుతారని అనిపించిన తన వాళ్ళను ఇతరులను కూడా కపటోపాయాలచేత ఎట్లా సంహరించాలో చెప్పబడింది. రెండవ అధ్యాయంలో కోశాన్ని నింపే ఉపాయాలు, మూడవ అధ్యాయంలో ఆయా భృత్యుల కివ్వవలసిన జీతాలు చెప్పబడినవి. ... రాజువద్ద ఎలా మసలుకోవాలో, రాజు చిత్తవృత్తిని ఎలా అనుసరించి



కూడా ఆ విషయం ఎవరికీ తెలియకుండా గోప్యంగా ఉంచి మంత్రి తగిన రాజకుమారుణ్ణి రాజుగా చేసి సామంతాదులందరూ అనుకూలంగా ఉండేటట్లు చెయ్యాలి. రాజపుత్రులు లేని పక్షంలో గర్భవతియైన రాజభార్యకు కాని, రాజకన్యకు కాని, రాజ్యాధికారం ఇవ్వాలి. లేదా రాజకుమారియందు సమానజాతీయుని ద్వారా పుత్రోత్పాదనం చేయించి వానిని రాజు చెయ్యాలి. "కన్యాయాం సమానజాతీయా దపత్యముత్పాద్య వాభిషిఞ్చేత్".

ఆరవ అధికరణం మండలయోన్యధికరణం. మొదటి అధ్యాయం :- రాజ్యానికి స్వామి (రాజు), అమాత్యులు, జనపదము, దుర్గము, కోశము, దండము (సేన), మిత్రులు అని ప్రకృతులు ఏడు. వీటి లక్షణాలు. రెండవ అధ్యాయం పేరు "శమవ్యాయామికం.' యోగక్షేమాలు శమ-వ్యాయామాలమీద ఆధారపడి ఉంటాయి. ఆ యా పనులకై తగిన అధికారులను నియమించడం వ్యాయామం. ఆ ఫలితాలను అనుభవించడానికి తగిన వాతావరణాన్ని సృష్టించడం శమం. ఈ రెండింటికీ ఆధారం షాడ్గుణ్యం. "నయ' "అపనయాలు' మనిషి చేతిలో ఉంటాయి. "అయ' "అనయాలు' దైవాధీనాలు. లోకయాత్రని ఈ దైవమానుషాలే నడిపిస్తూ ఉంటాయి. కనబడకుండా పని చేసేది దైవం, దైవం ద్వారా ఇష్టఫలం లభిస్తే అది అయం. అనిష్టం లభిస్తే అనయం. కనబడుతూ పని చేసేది మానుషం. దానివల్ల యోగక్షేమాల లాభం నయం; వాటి విఘాతం అపనయం. దైవాన్ని గూర్చి మనం చేసేది, ఏమీ లేదు కాబట్టి మానుష్యాన్ని గూర్చి జాగర్త పడాలి. ఆత్మసంపన్నుడూ, ద్రవ్యసంపన్నుడూ, ప్రకృతిసంపన్నుడూ ఐన నీతిమార్గాన్ని అవలంబించే రాజు "విజిగీషువు'. అతని నలుమూలలా సరిహద్దులలో ఉన్న రాజులు అరిప్రకృతి. ఆ రాజుల రాజ్యాలకి అవతల ఉన్నవాళ్లు మిత్రప్రకృతి. ఈ విధంగా తన సరిహద్దులో ఉన్నవాడు అరి ; దానికి అవతలవాడు మిత్రుడు; దానికి అవతల ఉన్నవాడు అరిమిత్రుడు. దానికి అవతల ఉన్నవాడు మిత్రమిత్రుడు. దానికి అవతల ఉన్నవాడు అరిమిత్రమిత్రుడు. విజయ యాత్రకి వెళ్ళదలచిన రాజుకు ఈ విధంగా ఎదుట ఐదు విధాల రాజులు ఉంటారు. అదే విధంగా వెనక - మొదట పార్ష్ణిగ్రాహుడు, వాని వెనక ఆక్రందుడు, వాని వెనక పార్ష్ణిగ్రాహాసారుడు, వాని వెనక ఆక్రందాసారుడు ఉంటారు. ఈ విధంగా విజిగీషువుతో కలిపి 10 మంది రాజులకి " రాజమండలము ' అని పేరు. ఈ విధంగా సహజ శత్రువులు, కృత్రిమశత్రువులు, సహజమిత్రులు, కృత్రిమమిత్రులు మొదలయిన విభేదాలు ఎన్నో వర్ణింపబడినవి.

ఏడవ అధికరణం "షాడ్గుణ్యాధికరణం.' మొదటి అధ్యాయము :- సంధి-విగ్రహ-ఆసన-యాన-సంశ్రయ-ద్వైధీభావాలకి "షాడ్గుణ్యం ' అని పేరు. కొన్ని షరతులమీద ఇద్దరురాజులు కలవడం సంధి. అపకారం చెయ్యడం విగ్రహం. ఉపేక్షించడం ఆసనం. దండెత్తడం యానం. స్వాత్మార్పణం చేయడం (లొంగి పోవడం) సంశ్రయం. సంధి-విగ్రహాలు రెండింటితోటి పని జరిపించడం ద్వైధీభావం. ఏడు అధ్యాయాల ఈ సప్తమాధికరణంలో రాజు ఈ రాజమండలంలోని రాజులతో ఎప్పుడు ఎలా ప్రవర్తించాలి, ఈ షాడ్గుణ్యాన్ని ఏ విధంగా ఉపయోగించాలి అన్న విషయాలు విస్తృతంగా వివరింపబడ్డాయి. అవసరమైనప్పుడు కపటయుద్ధం కూడా చేయవచ్చునని కౌటిల్యుడు చెప్పి ఉన్నాడు.

ఎనిమిదవ అధికరణం "వ్యసనాధికారికం '. ప్రథమాధ్యాయంలో పైన చెప్పిన ప్రకృతులకు కలిగే వ్యసనాలూ, వాటి ప్రతీకారమూ చెప్పబడ్డాయి. రెండవ అధ్యాయంలో రాజుకూ రాజ్యానికీ కలిగే వ్యసనాలు చెప్పబడ్డాయి. " ఆభ్యంతర కోపం ' (లోపల ఉన్న తిరుగుబాటు) అనీ బాహ్యకోపం అనీ కోపం రెండు విధాలు. అందు అభ్యంతరకోపం చాలా ప్రమాదకరమైనది. ఆనాడు అక్కడక్కడ ద్వైరాజ్యమూ, వైరాజ్యమూ మొదలైన పరిపాలనాపద్ధతు లుండేవి. ఇద్దరు రాజులుండడం ద్వైరాజ్యం. రాజే లేక ప్రజాపాలనమైతే వైరాజ్యం. వైరాజ్యంకంటె కొంత వరకు ద్వైరాజ్యమే మంచి దంటాడు కౌటిల్యుడు. మూడవ అధ్యాయంలో పురుషుల వ్యసనాలు చెప్పబడ్డాయి. కోపంవల్ల వాక్పారుష్యము, అర్థదూషణము (ధనం విషయంలో అన్యాయాచరణము) దండపారుష్యము అనే వ్యసనాలూ, కామంవల్ల వేట, ద్యూతము, స్త్రీలు, పానము అనే వ్యసనాలూ కలుగుతాయి.

నాల్గవ అధ్యాయం :- దైవంవల్ల కొన్ని అగ్నిపీడాదులైన ఆపదలు కలుగుతూ ఉంటాయి. చిన్న ఉద్యోగస్థులు పెద్ద అధికారులు-వీళ్ళలో చిన్నవాళ్ళు ఆపదలో చిక్కుకున్నా అంతగా ప్రమాదం లేదు. ఎందుచేత నంటే అలాంటివాళ్ళు చాలామంది లభిస్తారు. పెద్దవాళ్ళు పోకుండా చూచుకోవాలి. ఎందుచేతనంటే కొన్ని వేలమందిలో ఒక్కడు మాత్రమే అలాంటివాడు లభిస్తాడు. 'దేశవిహారం' (ప్రజలందరూ ఆనందవిలాసాలతో కాలం గడపడం)రాజవిహారం-వీటిలో 'రాజవిహారం' దేశానికి నష్టం కలిగిస్తుంది. దేశవిహారంవల్ల కొంత వ్యయం జరిగినా దాని వల్ల ప్రజలకి విశ్రాంతి లభించి ఇంకా ఎక్కువ పని చేయకలుగుతారు. ఇలాంటి విషయాలు ఈ అధ్యాయంలో



చాలా చెప్పబడినవి. సైన్యవ్యసనం కలగకుండాను, మిత్రవ్యసనం కలగకుండాను చూచుకొనవలెనని 5వ అధ్యాయంలో చెప్పబడింది. సైన్య-మిత్రవ్యసనం అనగా వాళ్ళకి రాజుమీద ద్వేషం కలగడం.

తొమ్మిదవ అధికరణానికి "అభియాస్యత్కర్మ ' అని పేరు. జిగీషువు పరునిపై దండెత్తి వెళ్ళ దలచినపుడు చూసుకోవలసిన విషయాలు ఈ అధికరణంలో చెప్పబడ్డాయి. ఇందులో ఉన్న తొమ్మిది అధ్యాయాలలో ప్రసంగవశంచేత కొన్ని ప్రధానమైన ఇతరవిషయాలు కూడా చెప్పబడ్డాయి. ప్రభావం (సైన్యబలాదికం) కంటె కూడా మంత్రశక్తి (ఆలోచనాశక్తి) గొప్పది. హిమవత్పర్వతంనుంచి దక్షిణసముద్రం వరకూ వ్యాపించి, తూర్పుపడమరలకు వెయ్యియోజనాల పరిమాణం గల దేశం చక్రవర్తి క్షేత్రం. అనగా ఆ భూమండలానికి అధిపతియైనవాడు చక్రవర్తి యని కౌటిల్యుడు మొదటి అధ్యాయంలో చెప్పినాడు. రెండవ అధ్యాయం-మూలబలము, (రాజధాని రక్షణం కొరకు స్థిరంగా ఏర్పరచిన సేన) భృతక (జీతం ఇచ్చే) బలమూ, శ్రేణీబలము (వేరు వేరు పనులకోసం తయారుచేసిన సేన) మిత్రబలం, శత్రుబలం (లొంగిపోయిన శత్రువునుండి తీసుకున్న సేన), అటవీబలము అనే వివిధ బలాలని సమకూర్చుకొని యుద్ధానికి బయలుదేరాలి. మూడవ అధ్యాయం :- తాను అటు వెళ్ళిన తరువాత వెనకనుంచి రాజధానిలో ఏ ఉపద్రవాలూ రాకుండా, చూచుకొని, ప్రకృతికోపానికి ప్రతిక్రియ చేసుకోవాలి. "సూచీముఖా హ్యనర్థాః ఇతి లోకప్రవాదః ' "అనర్థాలు ప్రారంభంలో ఎప్పుడూ చిన్నవిగానే ఉంటాయి ' అని లోకోక్తి ఉన్నది కదా అంటాడు చాణక్యుడు. అందుచేత చిన్న విషయాన్ని కూడా ఉపేక్ష చెయ్యకూడదు. నాల్గవ అధ్యాయం :- లాభనష్టాలు బాగా ఆలోచించుకొని ఏమాత్రం లాభం ఉన్నదని తోచినా నిస్సంశయంగా ముందుకు దూకాలి. ఆ సందర్భంలో లాభవిఘ్నాలను వివరించాడు- "లాభవిఘ్నాః-కామః, కోపః, సాధ్వసం (పిరికి తనం), కారుణ్యం, హ్రీః (సిగ్గు), అనార్యభావః (విశ్వాసఘాతుకత్వం), మానః (అహంకారం), సానుక్రోశతా (ఎక్కువజాలి), పరలోకాపేక్షా (పరలోకభయం) దామ్భికత్వం, అత్యాశిత్వం (దురాశ), దైన్యం, అసూయా, హస్తగతావమానః (చేతికి చిక్కిన దాని విషయంలో చిన్నచూపు), దౌరాత్మికం (దుష్టస్వభావం,) అవిశ్వాసః, భయం, అవికరః (శత్రువును తిరస్కరించకపోవడం), శీతోష్ణవర్షాణామాక్షమ్యం, మంగలతిథినక్షత్రేష్టిత్వమితి (మంచి ముహూర్తంకోసం చూస్తూ ఉండడం).

"నక్షత్రమతిపృచ్ఛన్తం బాలమర్థోఽతివర్తతే,

అర్థో హ్యర్థస్య నక్షత్రం కిం కరిష్యన్తి తారకాః'

ఎక్కువగా నక్షత్రాలను గూర్చి ఆలోచిస్తూ కూర్చున్నవాని అర్థం (లాభం) చెయ్యిజారిపోతుంది. అర్థం సాధించడానికి కావలసిన నక్షత్రం అర్థమే. తారకలు ఏం చేస్తాయి.

"నాధనాః ప్రాప్నువన్త్యర్థాన్ నరా యత్నశతైరపి,

అర్థైరర్థాః ప్రబధ్యన్తే గజాః ప్రతిగజైరివ.'

"ధనం లేనివాళ్లు ఎన్ని ప్రయత్నాలు చేసినా అర్థాన్ని సంపాదించలేరు. ఏనుగును మరొక ఏనుగు సహాయంతో బంధించినట్లు అర్థాన్ని అర్థంతోనే బంధించాలి.''

ఐదవ అధ్యాయం : సంధ్యాదులను సరిగా ప్రయోగించక పోతే అనేక ఆపదలు వస్తాయి. అందుచేత వాటి ప్రయోగంలో అప్రమత్తుడుగా ఉండాలి. ఆరు, ఏడు అధ్యాయాలు :- రాజద్రోహులవల్లా, శత్రువులవల్లా వచ్చే ఆపదలు వాటి ప్రతిక్రియలు. అర్థానర్థసంశయాలకి సంబంధించిన ఆపదలు వాటి ప్రతిక్రియలు.

పదవ అధికరణం "సాంగ్రామికాధికరణం'-యుద్ధంకోసం సేనానివేశమూ, పరసేనాస్కందనమూ, సైన్యంవెనక వైద్యులు, సైనికుల ఆనందంకోసమై స్త్రీలు, ఇతరవస్తువులూ తీసికొని వెళ్ళడం, చతురంగబలాల మోహరింపు, యుద్ధరంగంలో రాజు ఉండవలసిన స్థానము, వివిధవ్యూహాలు-ఈ విషయాలన్నీ ఈ అధికరణంలో వర్ణింపబడ్డాయి. 'సంఘవృత్తం' అనే 11వ అధ్యాయంలో సంఘరాజ్యాలలో (గణతంత్ర రాజ్యాలలో) భేదాలు కల్పించే ఉపాయాలు చెప్పబడ్డాయి.

"ఆబలీయసాధికరణం' అనే 12వ అధికరణంలో దుర్బలుడు బలవంతుడైనవానికి లొంగిపోవడం విషయంలో అభిప్రాయభేదాలు చెప్పబడ్డాయి. దుర్బలుడు తాత్కాలికంగా సంధి చేసికొని సమయానికి వేచి ఉండడం మంచిది. సమయానుకూలంగా బలవంతుడైనవాని శత్రువులతో సంధి చేసికొని బలవంతుణ్ణి నశింపచెయ్యాలి. ఈ అధికరణం నాల్గవ అధ్యాయంలో రహస్యంగా శత్రురాజ్యంలో ప్రవేశించి శస్త్ర-అగ్ని-రస (విషపూరిత రసాయనాలు) ప్రయోగం చేసి ఆ రాజ్యంలో అల్లకల్లోలం పుట్టించే పద్ధతులు చెప్పబడ్డాయి. అదే విధంగా శత్రురాజును



శస్త్రవిషప్రయోగాదికూటోపాయాలచేత, దేవాలయాదులలో ఉన్నప్పుడూ చంపే విధానం ఐదవ అధ్యాయంలో చెప్పబడింది.

"దుర్గలంభోపాయము' అనే 13వ అధికరణంలో అనేక రూపాలలో ఉన్న గూఢచారులనూ,జటాధారులై నాలుగువందల సంవత్సరాల వయస్సు కలవారం అని చెపుతూ, శిష్యమండలి పరివృతులైన "యోగు'లను శత్రుదుర్గంలోనికి ప్రవేశపెట్టించడం, శ్మశానవృక్షాదులపైన దాగి పిశాచాదులు అరుస్తున్నట్లుగా అరుస్తూ మాకు ఈ పూజలు కావాలి, ఆ పూజలు కావాలి, లేకపోతే రాజ్యాన్ని కబళించివేస్తాం - ఈ విధంగా పలికించడం, ఆహారాదుల సరఫరా లేకుండా ఆపివేయడం వంటి ఉపాయాల చేత దుర్గాన్ని ఆక్రమించుకొనే విధానం వర్ణింపబడింది.

"ఔపనిషదికం' అనేది 14వ ప్రకరణం. చాతుర్వర్ణ్యాన్ని రక్షించడానికై రాజు అధార్మికుల విషయంలో ఈ ఔపనిషదిక ప్రక్రియ ప్రయోగించాలంటాడు కౌటిల్యుడు. "చాతుర్వర్ణ్యరక్షార్థమౌపనిషదికమధర్మిష్ఠేషు ప్రయుఞ్జీత'. మొదటి మూడు అధ్యాయాలలో చచ్చిన కప్పలు, పాములు, ఎలుకలూ వంటి జంతువులనూ, ఇతర పదార్థాలనూ కలిపి వివిధరోగాలు కలిగించే ప్రాణహానికరాలైన విషాలను ఎట్లు తయారుచేయాలో, ఎలా ప్రయోగించాలో విస్తృతంగా వర్ణింపబడింది. కొన్ని ఆభిచారిక ప్రయోగాలు కూడా వివరింపబడినవి. వీటితో శత్రువులను సంహరించి స్వజనాన్ని రక్షించుకోవాలి రాజు.

"మన్త్రభైషజ్యసంయుక్తా యోగా మాయాకృతాశ్చ యే,

ఉపహన్యాదమిత్రాం స్తైః స్వజనం చాభిపాలయేత్.'

నాల్గవ అధ్యాయంలో వీటికి కొన్ని విరుగుళ్ళు కూడా చెప్పబడ్డాయి.

చివరి అధికరణం "తంత్రయుక్తి.' ఇందులో అర్థశాస్త్రవిషయాలు, విషయప్రతిపాదనపద్ధతీ సంక్షిప్తంగా ఒక అధ్యాయంలో ప్రతిపాదింపబడినవి. దీని ప్రారంభంలో "అర్థశాస్త్రం' అనే పదానికి నిర్వచనం చెపుతూ "మనుష్యాణాం వృత్తిరర్థః మనుష్యవతీ భూమిరిత్యర్థః. తస్యాః పృథివ్యాః లాభపాలనోపాయః శాస్త్రమర్థశాస్త్రమితి " అని వ్రాసినాడు. "మనుష్యుల జీవనవిధానానికి 'అర్థం' అని పేరు. అనగా మనుష్యులతో కూడిన భూమి. ఆ భూమిని సంపాదించి పాలించే ఉపాయాన్ని బోధించే శాస్త్రం అర్థశాస్త్రం.'

"ఈ శాస్త్రం ధర్మార్థకామాలని ప్రవర్తింపచేసి రక్షిస్తుంది. అధర్మ-అనర్థ-విద్వేషాలని తొలగిస్తుంది '.

"ధర్మ మర్థం చ కామం చ ప్రవర్తయతి పాతి చ,

అధర్మానర్థవిద్వేషానిదం శాస్త్రం నిహన్తి చ '.

"ఎవరైతే పట్టుదలతో శాస్త్రాన్నీ, శస్త్రాన్నీ, నంద రాజులచేతుల్లో ఉన్న భూమిని కూడా ఒకేసారి ఉద్ధరించినాడో అతనిచేత ఈ శాస్త్రం రచింపబడింది '. "ప్రాచీన ఆచార్యులలో ఎన్నో అభిప్రాయభేదాలు ఉండడంచేత వాటి నన్నింటినీ పరిశీలించి విష్ణుగుప్తుడే స్వయంగా సూత్రమూ, భాష్యమూ కూడా రచించినాడు ' అని అంటూ కౌటిల్యుడు ఈ శాస్త్రాన్ని ముగించినాడు.

"యేన శాస్త్రం చ శస్త్రం చ నన్దరాజగతా చ భూః,

అమర్షేణోద్ధృతాన్యాశు తేన శాస్త్రమిదం కృతమ్. '

"దృష్ట్వా విప్రతిపత్తిం బహుధా శాస్త్రేషు భాష్యకారాణామ్,

స్వయమేవ విష్ణుగుప్తశ్చకార సూత్రం చ భాష్యం చ. '

ఈవిధంగా అత్యద్భుతమైన అర్థశాస్త్రాన్ని రచించిన మహామేధావి కౌటిల్యుడు, రీతి (theory)మాత్రమే కాకుండా ప్రయోగం (Practice) కూడా తెలిసిన కార్యదక్షుడు. అందుచేత ఈ అర్థశాస్త్రానికి ఒక ప్రత్యేకమైన స్థానం ఉన్నది. సేనాసన్నివేశాలూ, యుద్ధవిధానాలూ వంటి కొన్ని అంశాలు తప్ప మిగిలిన అన్ని విషయాలు కూడా ఆనాడు ఎంత ఆచరణయోగ్యాలుగా ఉండేవో, ఈ నాటికీ ఏనాటికీ కూడా అవి ఆ విధంగానే ఉంటాయి. అంత మహోన్నతదశలో ఉన్న నందసామ్రాజ్యాన్ని సమూలంగా నాశనం చేసి మౌర్యసామ్రాజ్యాన్ని స్థాపించి ప్రధానామాత్యుడుగా రాజ్యపాలనా కార్యక్రమాన్ని నిరాఘాటంగా నిర్వహించిన కర్మణ్యుడు వ్రాసిన గ్రంథానికి ఇంతటి త్రైకాలికప్రాశస్త్యం ఉన్నదంటే ఆశ్చర్యం లేదు.

కౌటిల్యుడు అరిస్టాటల్‌కి సమకాలికుడు. అరిస్టాటల్ మహావిజేత అయిన అలెగ్జాండర్‌కు గురువు. అయితే కౌటిల్యుడు మౌర్యవంశీయప్రథమచక్రవర్తియైన చంద్రగుప్తునికి గురువు, రాజ్యస్థాపకుడు, మంత్రీ కూడాను. కౌటిల్యుని భావాలలోనూ, అరిస్టాటల్ భావాలలోనూ అక్కడక్కడ కొన్ని సామ్యాలు ఉండడం గమనార్హమైనది.



ప్లేటో శిష్యుడైన అరిస్టాటల్ క్రీ.పూ. 335లో అథెన్సు నగరంలో ఒక విద్యాలయం నెలకొల్పి అక్కడ ఉండగా "రాజనీతి ' ( Politics) అనే పేరుతో ఐదు వేరు వేరు సమయాలలో పుస్తకాలు వ్రాశాడు. రాజనీతికి వైయక్తికజీవితంమీద అత్యధికమైన అధికారం ఉన్నదనీ, దీనిమీదనే ఇతరశాస్త్రాలూ, కళలూ మొదలైనవి ఆధారపడి ఉన్నాయనీ ఆయన సిద్ధాంతీకరించాడు. దండనీతియే అన్ని శాస్త్రాలకీ ఆధారం అని కౌటిల్యుడు నొక్కి వక్కాణించాడు. రాజనీతి అనేది ఏదో విధంగా రాజ్యం నడపడానికి కాదు ; సమాజంలో ఉత్తమమైన ఆదర్శాలనూ, నైతికప్రవృత్తినీ నెలకొల్పడమే దాని ప్రధానలక్ష్యం అని అరిస్టాటల్ అభిప్రాయం. ఇది, ధర్మాన్ని ఆధారంగా చేసుకొని అర్థ-కామాలకు పుష్టి చేకూర్చడం రాజు ప్రధానకర్తవ్యం అనే కౌటిల్యుని అభిప్రాయానికి చాలా సన్నిహితంగా ఉన్నది.

అరిస్టాటల్ అభిప్రాయం ప్రకారం రాజ్యం అత్యుత్తమమైన రాజ్యాంగవిధానం ద్వారా పాలింపబడాలి. అధికారులు కార్యనిర్వహణదక్షులైనంత మాత్రంచేత ప్రయోజనం లేదు. సద్గుణాలు కలవారుగా కూడా ఉండాలి. రాజ్యపాలకులు సుస్థిరంగా ఉంటేనే దీనిని సాధించడానికి శక్యం అవుతుంది.

కౌటిల్యుడు కూడా తన చుట్టు ప్రక్కల సంఘరాజ్యాలలోని లోపాలను, దౌర్బల్యాలనూ గురించి 'రాజ్యం సుస్థిరంగా ఉండాలంటే ఒక వ్యక్తి సర్వాధికారిగా ఉండాలి; అప్పుడే రాజ్యం యోగక్షేమాన్వితంగా ఉంటుందని' అంటాడు. ఒక ఘట్టంలో గణతంత్రరాజ్యాలను గూర్చి వ్రాస్తూ - ఐకమత్యం ఉన్నంతవరకూ ఇవి చాలా బలిష్ఠంగానే ఉంటాయి. కాని ఇవి దుర్బలాలు అవడానికే ఎక్కువ అవకాశాలున్నాయి. ఎందుచేతనంటే - ఇలాంటి రాజ్యాలలో బాధ్యత వహించేవాడు ఒక్కడూ ఉండడు - అని అంటాడు కౌటిల్యుడు. పాలింప తగినవారికంటె ఎక్కువగా పాలకులను దృష్టిలో పెట్టుకుని వ్రాయబడిన రాజనీతిగ్రంథం అర్థశాస్త్రం. దీనిని పట్టి - రాజ్యంలో మాత్స్యన్యాయం ప్రబలకుండా రాజ్యాన్నంతటినీ ఒక్క నియమబద్ధక్రమంలో, సుఖ సంతోషాలతో నిండిన జీవనపద్ధతిలో నడిపించడమే రాజుయొక్క ప్రధానలక్షణంగా ఉండాలి అని కౌటిల్యుని అభిప్రాయంగా తెలుస్తుంది.

క్రీ.పూ. 600-323 ప్రాంతంలో భారతదేశంలో స్వయంపాలనాధికారం గల ఎన్నో రాజ్యసంఘాలు లేదా సంఘరాజ్యాలు ఉండేవి. వీటికీ ఆనాడు గ్రీసు-ఇటలీ దేశాలలో ఉండే (సంఘ) నగర రాజ్యాలకీ చాలా పోలికలు ఉన్నాయి. ఇవి ఆనాడు భారతదేశంలో ప్రప్రథమంగా ప్రజాప్రభుత్వస్థాపనం కోసం చేసిన ప్రయత్నానికి.

చిహ్నాలు.

సింధునదీతీరప్రాంతంలో అగ్రశ్రేణులు : ముచికర్ణికులు, అంబిష్టులు, వసతులు మొదలైన గణతంత్రప్రభుత్వం నడిపిన సంఘాలు (Tribes) ఉండేవి. పశ్చిమాన కాంభోజులు, కటులు, సౌభూతులు, యౌధేయులు, సిబులు, మాల్యులు, క్షుద్రకులు అనే మహాశూరులైన జనుల సంఘాలు ఉండేవి. కుకురులు, కురులు, పాంచాలులు అనే గణరాజ్యాలు, అంతకు పూర్వం వృష్ణులు ఉండేవారని కౌటిల్యుడు స్పష్టంగా చెప్పి ఉన్నాడు. అదే విధంగా అతనికాలంలో, నేటి బెంగాలు-బీహారు ప్రాంతాలలో సాక్యులు, కోలూలులు, మల్లులు, భగ్గులు, మోరియులు మొదలైన గణరాజ్యాలు ఉండేవి. ఈ సంఘాల పరిపాలన అతి విస్తృత సంఖ్యాకులైన సభ్యులు గల సభలద్వారా నడపబడేది. వృజిక సంఘంలో 7707 గురు రాజులు (సభ్యులు), శక సంఘములో 500 మంది సభ్యులు, యౌధేయ సంఘంలో 5000 మంది సభ్యులు, అంబష్ఠసంఘంలో వయోవృద్ధులూ ఉండేవారు. రాజ్యపాలన అంతా వీళ్ళ చేతులలో ఉండేది. గ్రీసులోని నగర రాజ్యాలలో (City States) ఉన్నట్లుగానే తీర్మానాలు ప్రవేశపెట్టడం, మతదానం, తీర్మానాలు చేయడం మొదలైన విషయాలలో అతిజటిలమైన నియమనిబంధనలు ఉండేవి. రాజును ఎన్నుకోవడం న్యాయవ్యవస్థ మొదలైన విషయాలలో ఇక్కడ ఉన్న పద్ధతులకీ గ్రీసులో ఉండే పద్ధతులకీ చాలా పోలికలు ఉండేవి. గ్రీసులోని స్పార్టా గణతంత్రరాజ్యంలో ఇద్దరు రాజులు ఉండేవారు. అట్టి ద్వైరాజ్యం భారతదేశంలో కూడ ఉండేదని కౌటిల్యుడు స్పష్టంగా చెప్పి ఉన్నాడు. ప్రజలకు చాలా స్వాతంత్ర్యం ఉండేది. ఐతే అచిరకాలంలోనే, ఈ సంఘరాజ్యాలు గ్రీసునగరరాజ్యాలవలె అనేకరకాలైన అంతరంగికవిభేదాలవలన కలిగిన ద్వేషాలు, పాలకుల స్వార్థపరత్వమూ, అసూయా మొదలయినవాటిచేత దుర్బలాలైపోయినాయి. దీనికి తోడు బౌద్ధ-జైన-భాగవత మతాలు ఇంకా విభేదాలకి దారితీసినవి. ఇల్లూ, సమాజమూ విడిచిపెట్టి ప్రజలు ఏదో అజ్ఞాతప్రపంచాన్ని అన్వేషించడం కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. దీనితో సంఘాల ఐకమత్యమూ బలమూ దెబ్బతిన్నాయి.

అరిస్టాటల్ వలెనే కౌటిల్యుడు కూడ సంఘరాజ్యాలు చాలా సంఘటితంగానూ బలవత్తరంగానూ ఉంటాయని ప్రశంసించినాడు. " సంఘా హి సంహతత్వాదధృష్యాః పరేషామ్ ' (XI. I) - ఐతే నిపుణుడైన రాజు ఒక సంఘానికి మరొక సంఘానికి విరోధం కల్పించి ఆ రెండూ దుర్బల మయిపోయేటట్లుగా చెయ్యాలి. ఈ సంఘరాజ్యాలు బలంగా ఉన్న పక్షంలో సామదానాలచేత వాటి సహాయం సంపాదించుకొనడం రాజుకు ఎంతయినా అవసరం అంటాడు కౌటిల్యుడు. ఏమైనా - ఒక వ్యక్తి రాజదండభయం లేనంతవరకూ తన కర్తవ్యాలను ఏ విధంగా సరిగా నిర్వర్తించదో అదేవిధంగా సంఘాలుకూడ తాము ఏ పరిస్థితులలోనైనా ఒక ప్రభువుయొక్క ఆజ్ఞను మన్నించి తీరాలి అనే మాట లేకపోవడంచేత చాలాకాలం పాటు సుసంఘటితంగా ఉండజాలవనీ అందుచేత "చతురంతమహీపాలత్వం' అనే ప్రధానాదర్శం గల ఐకరాజ్యమే ( ఒకే రాజు ఉండడం) మంచిదనీ కౌటిల్యుని అభిప్రాయము.

రాజును గూర్చీ రాజుయొక్క కర్తవ్యాలను గూర్చీ అర్థశాస్త్రాదులలో ఉన్న నియమనిబంధనాలనుపట్టి చూస్తే రాజు కూడా నిరంకుశంగా ప్రవర్తింపజాలడనీ అతడుకూడ వేతనం తీసుకొనే ఒక ప్రజాసేవకుని వంటివాడేననీ స్పష్టమవుతుంది. అతని కుటుంబంలోని పరిజనానికి కూడ కౌటిల్యుడు జీతం నిర్ణయించి ఉన్నాడు. యువరాజు - రాజమాత- రాజమహిషి మొదలైనవాళ్ళకి సంవత్సరానికి జీతం 48,000. ఈ విధంగా ఆ యా అధికారులకు నిర్ణయించబడింది (ఐదవ అధికరణం). పేరుకి 'స్వామి' అని అన్నా రాజుయొక్క అధికారాలన్నీ అపరాధులను శిక్షించడం వరకే సీమితమై ఉన్నాయి. అడుగడుగునా అమాత్య మతానుసరణము, ప్రజాక్షేమదృష్టి, ధర్మం అనే అడ్డంకులు విధింపబడి ఉన్నాయి. ఈ విధంగా రాజు ప్రజలశ్రేయస్సును ప్రధానలక్ష్యముగా ఉంచుకొని త్రయీధర్మాన్ని పరిరక్షించాలని కౌటిల్యుని అర్థశాస్త్ర సారాంశము.

బౌద్ధ-జైనమతాలు ఆవిర్భవించిన ఒకటి రెండు శతాబ్దుల లోపుగా కౌటిల్యుడు జనించినాడు. ఇంకా అప్పటికి కూడా వైదిక కర్మకలాపాలు జరుగుతూ ఉండేవి. అగ్నిష్టోమము, మధ్యమోపసదము, అహర్గణము, బృహస్పతిసవనము, రాజసూయము మొదలైనవి అర్థశాస్త్రంలో పేర్కొనబడినవి. అథర్వప్రోక్తమైన అభిచారయోగాల ప్రయోగం కూడా విస్తృతప్రచారంలో ఉండేది. దేశోపద్రవాలని తొలగించడం కోసం అగ్ని-యమ-వరుణ-అశ్వినీదేవతా-వైశ్రవణ-జయంతులను పూజించాలని అంటాడు కౌటిల్యుడు. వైజయంతుడు - వైశ్రవణుడు - అపరాజితుడు - దుర్గ - అప్రతిహత - శివుడు - విష్ణువు మొదలైన ఇతర దేవతలను కూడా కోటలో స్థాపించి పూజించాలి. బౌద్ధమతం ఉపదేశించిన అహింసాసిద్ధాంతసన్న్యాసాదులవల్ల దేశం ఎంత దుర్బలం అయిపోతుందో మొట్టమొదట గ్రహించినవాడు కౌటిల్యుడు. సన్న్యాసం స్వీకరించడం కంటె దేశరక్షణ

కోసం గృహస్థుడుగా ఉండడం మంచిదంటాడు. కుటుంబ పోషణకు కావలసిన ఏర్పాట్లు చేయకుండా సన్యాసం తీసుకొనే వాళ్ళనీ, స్త్రీలకి సన్యాసం ఇప్పించేవాళ్ళనీ దండించాలని శాసించాడు. సన్యాసులు గ్రామంలో నివసిస్తే గ్రామస్థులు కూడా అకర్మణ్యులై పోతారనే భయంచేత వాళ్ళకి గ్రామనివాసం నిషేధించినాడు.

సాధారణంగా కౌటిల్యుణ్ణి మాకియవెల్లితో పోలుస్తూండడం అలవాటు. 1494లో ఫ్రాన్సు ఇటలీమీద దండయాత్ర చేసినది మొదలు ఫ్లారెన్స్ అనేక బాధలకు గురి అయింది. తరువాతి 20 సంవత్సరాలలో ఆ నగరరాజ్యం గణరాజ్యం చేయబడింది. మళ్ళీ ఫ్రాన్స్ దాడిచెయ్యడంతో ఆ ఫ్లారిన్స్ పరిపాలనావిధానాదికం అంతా అస్తవ్యస్తం అయిపోయింది. ఇలాంటి పరిస్థితులను కళ్ళారా చూచిన మాకియవెల్లి మానసికస్థితి ఎలా ఉంటుందో మనం ఊహించుకోవచ్చును. అతని అభిప్రాయము ప్రకారం ప్రపంచం ఇంతకంటె మంచిదవుతుందనే ఆశ లేదు. ఇంతకంటె చెడ్డదీ కాకపోవచ్చు. ఎల్లప్పుడూ ఇది ఇలా ఉండేదే. ఒకమాటు జరిగిన మంచివిషయాలైనా, చెడ్డవిషయాలైనా మాటిమాటికీ జరుగుతూ ఉండవచ్చును. మానవు డెప్పుడూ స్వార్థపరుడే. సామాజికశ్రేయస్సు అనే దృష్టి లేకుండా స్వలాభం కోసమే ప్రయత్నిస్తూ ఉంటాడు. మానవుడు కృతఘ్నుడు, వంచకుడు, చపలస్వభావుడు, పిరికిపంద, దురాశాపరుడు. అవసరాన్ని పట్టి మాత్రమే మంచితనం చూపిస్తూ ఉంటాడు. అందుచేత చక్రవర్తి మానవుణ్ణి భయపెట్టి పరిపాలించాలి కాని అతనిలో ప్రేమభావాన్ని పుట్టించి పాలించడం అనేది కల్ల. ఇలాంటి నిరాశావాదం (Pessimism) ఈతని 'రాజు' ('Prince')అనే గ్రంథంలో కనబడుతుంది. సంపూర్ణాధిపత్యం సాధించడం కోసం ఎలాంటి సాధనాన్నైనా అవలంబించవచ్చు ననేది ఈయన సిద్ధాంతము.

జాగర్తగా పరిశీలిస్తే కౌటిల్యుడికీ, ఈతనికీ ఏ విధమైన పోలికలూ లేవనే విషయం స్పష్టం అవుతుంది. కౌటిల్యుడు దండానికి ప్రాధాన్యం ఇచ్చినా అపరాధాన్ని మించిన దండాన్ని నిషేధించాడు. ధర్మానికీ, అర్థానికీ, కామానికీ సమప్రాధాన్యం ఇస్తూ శాంతిని పరిరక్షించడమే రాజుయొక్క ప్రధానకర్తవ్యం. ఈ శాంతిసాధనం అనే పరమాదర్శం కేవలం భయపెట్టడం వల్ల సాధ్యం అయేది కాదు. ప్రజల మనఃపూర్వకమైన సహకారంవల్ల మాత్రమే సాధ్యం అవుతుంది. వర్ణధర్మం, ఆశ్రమధర్మం ఈ రెండింటినీ జాగర్తగా పరిరక్షిస్తే సమాజానికి శ్రేయస్సు లభిస్తుందని నమ్మిన వ్యక్తి కౌటిల్యుడు.

వర్ణధర్మం సాంఘికాభివృద్ధికి హేతువైతే ఆశ్రమధర్మం వైయక్తికసమున్నతికి



సాధనం అని నమ్మిన రోజులు అవి. బహుశా వర్ణధర్మం అనేది జన్మతః సిద్ధము అనేమాట వదిలేస్తే (వేదకాలంలో ఆ విధంగానే ఉండేదని విమర్శకుల అభిప్రాయము.) ఇది ఈనాడుకూడా కొంతవరకూ ఉపయోగకరం కావచ్చునేమో. ఇలాంటి ప్రధానమైన భేదం ఉండడంచేత కౌటిల్యుణ్ణి మాకియవెల్లితో పోల్చడం అంత యుక్తం కాదు. తన కాలంలో ఫ్లారెన్సునగరరాజ్యవ్యవస్థ ఛిన్నాభిన్నం అవడం చూచి మాకియవెల్లి ప్రభావితు డయినట్టుగా ఆనాటి కొన్ని సంఘరాజ్య - గణరాజ్యాలలోని పరిస్థితులను చూచి కౌటిల్యుడు ప్రభావితుడై ఏకరాజరాజ్యస్థాపనాన్ని సమర్థించి ఉండవచ్చు. అంతవరకే వారిద్దరి మధ్యా ఉన్న పోలిక. ఈలాంటి సామ్యవైషమ్యాలను ఇటు కౌటిల్యుడికీ, అటు ఇతరదేశరాజ్యశాస్త్రనిపుణులకీ మధ్య ఎన్నో చూపవచ్చును.

అయితే ఇక్కడ ఒక ఊహకి అవకాశం లేకపోలేదు. మాకియవెల్లి కౌటిల్యుని అర్థశాస్త్రం చేత ప్రభావితుడై తాను రచించిన "ది ప్రిన్స్ ' అనే గ్రంథంలో రాజకీయ కుటిలత్వం విషయంలో కౌటిల్యునికంటె ఒక అడుగు ముందుకు వెళ్లి ఉంటాడు. పాశ్చాత్యులు ప్రప్రథమంగా భారతదేశంలో పదిహేనవశతాబ్దంలో అడుగుపెట్టారు. పోర్చుగీసువాళ్లు 1498లో కాలీకట్‌కు జలమార్గం ప్రారంభించారు. దాదాపు పదిహేను సంవత్సరాల తరవాత మాకియవెల్లి "ది ప్రిన్స్ ' రచించాడు. అనాడు ఇంత స్వల్ప కాలంలో అర్థశాస్త్రం మాయికవెల్లి చేతులలోనికి వెడుతుందా అని సందేహం కలగవచ్చు. ఆ విషయం సందిగ్ధమే అయినా అంతకు పూర్వమే అర్థశాస్త్రాదులు అరేబియన్ దేశాల ద్వారా పాశ్చాత్యదేశాలకి వెళ్లడానికి అవకాశం లేకపోలేదు. పెర్షియన్, అరబిక్ భాషానువాదాల ద్వారా ఎనిమిదవ శతాబ్దం ప్రాంతంలోనే పంచతంత్రం పాశ్చాత్యదేశాలకి వెళ్లిన దని పండితులు సప్రమాణంగా నిరూపించారు. అలాంటప్పుడు ఆ యా కాలాలలో ఇతరశాస్త్రగ్రంథాలు కూడా అక్కడికి చేరి ఉండడం అసంభావ్యం కాదు. రెండువేలఐదువందల సంవత్సరాల పూర్వం నాటి శుల్బసూత్రంలోని జ్యామితికి (భూమికొలతకు) సంబంధించిన ఒక సూత్రం పైథాగరస్ థీరం అనే పేరుతో ప్రసిద్ధిలోనికి తెచ్చుకొన్నారు పాశ్చాత్యులు. పదకొండు-పన్నెండు శతాబ్దులకు చెందిన లీలావతి గణితంలో ఉన్న గురుత్వాకర్షణ శక్తి సిద్ధాంతం న్యూటన్ పేరుతో చలామణీ అయిపోతూన్నది. గణితశాస్త్రానికి, ఖగోళశాస్త్రానికి, వేదాంతశాస్త్రానికి, అలంకారశాస్త్రానికి, ఇంకా ఎన్నోశాస్త్రాలకీ సంబంధించిన ఎన్నో అతిప్రాచీనమైన విషయాలు మొన్నమొన్నటి పాశ్చాత్యపండితులు కనుగొన్నట్లుగా చాటుకుంటున్నారు. మన భారతీయ మహామేధాసంపన్నులు కూడా అలాగే ప్రచారం చేస్తున్నారు.

భారతదేశీయులకు ఎప్పుడు చూచినా పారలౌకికచింత మాత్రమే తప్ప ఐహికమైన రాజ్యపాలనాదివిషయాలలో ఏమాత్రం జ్ఞానం లేదు అని ఒక నియమబద్ధ మైన పద్ధతిలో పాశ్చాత్యపండితు లందరూ ప్రచారం చేస్తూ ఆనందిస్తూన్న రోజులలో హటాత్తుగా ఈ అర్థశాస్త్రం బైట పడడంతో ఏమి చేయాలో తోచక వాళ్లు అనేకవాదాలు, నిరర్థకాలైన వాదాలు లేవదీశారు. అవన్నీ ఎంత అర్థవిహీనమైనవో జాగర్తగా పరిశీలిస్తే అందరికీ తెలుస్తుంది. చివరికి నిష్పాక్షికదృష్టి గల కొందరు పాశ్చాత్యపండితులే ఆ వాదాలన్నీ త్రోసి పుచ్చడం గమనార్హం. కౌటిల్యునికి పూర్వమే ఎన్నో శతాబ్దాలనుంచి అర్థశాస్త్ర సంప్రదాయం అవిచ్ఛిన్నంగా వస్తూన్న దనే విషం కౌటిల్యుడు అక్కడక్కడ చేసిన మతభేదనిర్దేశాలను పట్టి స్పష్టంగా తెలుస్తున్నది. ప్రతి భారతీయుడు గర్వించవలసిన విషయం ఇది.

'అర్థశాస్త్రం' అనగానే దీనిలో కేవలం ఆర్థికవ్యవహారాలు మాత్రమే చర్చించ బడతాయి; అనగా ఇది నేటి ఎకనామిక్స్ వంటిది అనే భ్రాంతి కలుగుతుంది. 'అర్థ' పదానికి కౌటిల్యుడు చెప్పిన అర్థం "మనుష్యుల జీవనవిధానం, మరొకవిధానంగా చెప్పాలంటే 'అర్థం' అనగా "మనుష్యులున్న భూమి ' ("దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్ ' కదా!) అని పైన చూచి ఉన్నాం. అందుచేత దేశానికి, మానవసమాజానికి, సంబంధించిన అన్ని విషయాలు కూడా దీనిలో చర్చించబడి ఉన్నాయి. రాజులు, ప్రజలు, మంత్రులు, అమాత్యులు, రాజ్యంలోని ఆ యా శాఖలు, వాటి అధిపతులు, పాలనావిధానాలు, సాంఘికవ్యవస్థలు, అపరాధాలు, దండాలు, వ్యవసాయం, వర్తకం, పన్నులు, గ్రామనగరాలు, అరణ్యాలు, వృక్షాలు, మృగాలు, రసాయనశాస్త్రం, ఆయుర్వేదం, రాజ్యవిస్తరణ, రాజ్యసంరక్షణ, ఒకటేమిటి రాష్ట్రస్వరూపం -పరిపాలనాదులకి సంబంధించిన అన్ని విషయాలూ కూడ చర్చించబడ్డాయి. నిజానికి ఈ విషయా లన్నీ ఒక్క ఈ గ్రంథం పరిధిలోనికి వస్తాయా అని కొందరికి సందేహం కలగవచ్చు. ఆనాటి పద్ధతి అది. యాభై సంవత్సరాలు వెనుకకు తిరిగి చూస్తే ఈనాడు విశ్వవిద్యాలయాలో ఉన్నన్ని శాఖలు ఆనాడు ఉండేవి కావు. పొలిటికల్‌సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ మొదలైనవి చరిత్రశాఖాంతర్గతంగా ఉండేవి. సైన్సులలో కేవలం ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీవంటివి మాత్రమే ఉండేవి. ఇప్పుడు కొత్తగా పేర్లు పెట్టి స్వతంత్ర విషయాలుగా బోధించబడే వన్నీ వాటిలోనే అంతర్గతంగా ఉండేవి. ఏవో కొన్ని సౌకర్యాలను దృష్టిలో పెట్టుకొనడంవల్లా, ఒకప్పుడు రాజ్యవిస్తరణాభిలాషవల్లా వేరు



వేరు సబ్జెక్టులు ఏర్పరచబడుతున్నాయి. ఈ విషయా లన్నీ ఎలా ఉన్నా అర్థశాస్త్రం మాత్రం ఒక చిన్న ప్రాచీన భారతీయలౌకికవిషయవిశ్వకోశం అని చెప్పడంలో సందేహం లేదు.

విదేశీయపరిపాలనం స్థిరంగా నెలకొల్పబడడానికి పూర్వం భారతదేశంలో ఆ యా రాజ్యాల పాలనావిధానం అర్థశాస్త్రానుసారమే జరిగే దని చెప్పడానికి ఆధారాలున్నాయి. శివాజీ రాజ్యపాలనావిధానం అర్థశాస్త్రానుసారం జరిగిం దని ప్రొఫెసర్ యస్. ఆర్. కులకర్ణి "శివకాలీన రాజనీతి ఆణి రణనీతి ' అనే మరాఠీభాషలో రచించిన గ్రంథంలో సప్రమాణంగా నిరూపించారు. విదేశీయపరిపాలనాగమనానంతరం కూడా ఎన్నో పరిపాలనాదులకు సంబంధించిన అంశాలు (అర్థశాస్త్రంలో చెప్పినవి) ఈనాటి వరకు అనువర్తిస్తూనే ఉన్నాయి. ఇవన్నీ పరిశీలిస్తూంటే భారతీయులకు పరిపాలనా విధానమే తెలియదు అని అంటూ కొందరు విదేశీయులు, అన్యమతస్థులు, తన్మానస పుత్రులైన ఆధునికపండితంమన్యులు చేసే ప్రచారం ఎంత హాస్యాస్పద మైనదో స్పష్టం అవుతుంది. ఇందుకు ఎవరినీ తప్పుపట్ట పని లేదు. మూలగ్రంథాలు చదవకపోవడం, చదివినా కొన్ని పూర్వకృతనిర్ణయాలతో చదవడం - ఇవే ఇందుకు మూలకారణం.

ఈ అర్థశాస్త్రానికి మహామహోపాధ్యాయ టి. గణపతిశాస్త్రిగారు 'శ్రీమూలం' అనే చక్కని సంస్కృతవ్యాఖ్య రచించి దానితో తొలిసారిగా 1923 సంవత్సరంలో తిరువనంతపురం నుంచి ఈ గ్రంథం ప్రకటించారు. ఈ వ్యాఖ్య చాల ప్రామాణికమైన వ్యాఖ్య. దీనిని విస్తృతటీకాసహితమైన ఆంగ్లభాషానువాదంతో ప్రొఫెసర్ ఆర్.పి. కాంగ్లే బొంబాయి విశ్వవిద్యాలయంనుండి 1960 సంవత్సరంలో ప్రచురించారు. ప్రొ.కాంగ్లే మ.మ.గణపతిశాస్త్రిగారి వ్యాఖ్యనే కాక చాలమంది పాశ్చాత్యుల అనువాదాలు కూడ పరిశీలించి తమ గ్రంథం వెలువరించారు. ఇది ప్రామాణికమైన గ్రంథం. అర్థశాస్త్రంలోని భాష, శైలీ కూడా చాల ప్రాచీనమైనవి. వ్యాఖ్యానసహాయం లేకపోతే ఈ గ్రంథం పూర్తిగా అర్థం కాదు. ఈ ఆంధ్రభాషానువాదంలో పైరెండు గ్రంథాలసహాయం గ్రహించబడింది. ఈ గ్రంథాల సహాయం లేకపోతే నావంటివానికి ఏతదనువాద-వ్యాఖ్యారచన సాధ్యమయేది కాదు. పై గ్రంథాలలో ఎక్కడనైనా అర్థభేదాలు వచ్చినప్పుడు చాలాచోట్ల కాంగ్లే చెప్పిన అర్థాన్ని, కొన్ని చోట్ల నాకు నచ్చిన అర్థాన్నీ గ్రహించడం జరిగింది. కొన్నిచోట్ల ఇద్దరి అభిప్రాయాలు చూపబడ్డాయి. ఈ గ్రంథంలో ప్రతిపాదించిన అనేక విషయాలలో కొన్నింటిని గ్రహించి విస్తృతాలైన వివేచనాత్మక గ్రంథాలు రచించడానికి అవకాశం

ఉంది. సంస్కృతజ్ఞులు, విజ్ఞానశాస్త్రవేత్తలు కలిసి పరిశీలించవలసిన విషయాలు కొన్ని ఉన్నాయి. మేధావులైన యువకులు ఆ విషయాలను జాగర్తగా పరిశీలించి, వాటిని లోకంలో చాటి మన ప్రాచీన భారతీయ విజ్ఞానౌన్నత్యాన్ని పునరుద్ధరించవలసి ఉంది. ఇలా ప్రాచీనగ్రంథాలలో (అవి ఇలాంటి గ్రంథాలైనా ధర్మశాస్త్రేతిహాసపురాణాదులైనా కావ్యనాటకాదులైనా తత్త్వశాస్త్రాదిగ్రంథాలైనా) ఎక్కడైనా తమకు నచ్చని విషయాలు చూడగా ఇదేదో అస్పృశ్యగ్రంథం అనుకొని ఈసడించుకొనే ప్రవృత్తి ఈనాడు ఎక్కువగా కనబడుతున్నది. ఇది చాల శోచనీయమైనస్థితి. విదేశీయులు ప్రయత్నపూర్వకంగా అంటించిన రోజురోజుకూ పెరుగుతూన్న జాడ్యం. ఏ గ్రంథాన్నైనా పరిశీలించేటప్పుడు విమర్శకుడు ఆ కాలంలో ఉన్న పరిస్థితులను ఊహించుకొని వాటి దృష్టితో ఆ గ్రంథాన్ని పరిశీలించాలి గాని తా నున్న దేశకాలాదులను పట్టి పరిశీలించకూడదు. అప్పుడు ఆ గ్రంథంలో నూటికి తొంబైవంతులైనా మంచి విషయాలు, తనకు కూడ ఉపయోగించే విషయాలు, కనబడతాయి. పది విషయాలు బాగాలేకపోతే వాటిని పరిత్యజించవచ్చు. బాగున్నవి గ్రహించి వాటిని స్వదేశకాలాదులకు అనువుగా మలుచుకోవాలి. ప్రాచీను లంతా ఒట్టి దద్దమ్మలు; మనమే మహామేధావంతులం అనే పూర్వనిర్ణయంతో ఏతాదృశ గ్రంథాలు పరిశీలించేవాడు చివరికి ఆత్మదూషణ, ఆత్మవంచన చేసికొన్న వాడవుతాడు. పరపరిహాసపాత్రు డౌతాడు. గుణదోషపరీక్ష నిష్పాక్షికదృష్టితో చేయడం చాల అవసరం.

శ్రీః

# కౌటిలీయమ్ అర్థశాస్త్రమ్

## విషయసూచిక

1. వినయాధికారికమ్ - ప్రథమమధికరణమ్:- 1 - 96

విద్యాసముద్దేశః - 15. వృద్ధసంయోగః - 20. ఇన్ద్రియజయః - 23. అమాత్యోత్పత్తిః - 28. మన్త్రిపురోహితోత్పత్తిః - 32. ఉపధాభిః శౌచాశౌచజ్ఞానమమాత్యానామ్ - 34. గూఢపురుషోత్పత్తిః - 39. గూఢపురుషప్రణిధిః - 43. స్వవిషయే కృత్యాకృత్యపక్షరక్షణమ్ - 49. పరవిషయే కృత్యాకృత్యపక్షోపగ్రహః - 53. మంత్రాధికారః - 57. దూతప్రణిధిః - 63. రాజపుత్రరక్షణమ్ - 69. అవరుద్ధవృత్తమ్ - 76. రాజప్రణిధిః - 79. నిశాన్తప్రణిధిః - 85. ఆత్మరక్షితకమ్ - 90.

శ్రీః

ఓం స్వస్తి శ్రీగణేశాయ నమః

# కౌటిలీయమ్ అర్థశాస్త్రమ్

పుల్లెల శ్రీరామచన్ద్రేణ విరచితయా బాలానన్దిన్యాఖ్యయా
ఆన్ధ్రభాషావ్యాఖ్యయా సముల్లసితమ్.

## వినయాధికారికమ్ - ప్రథమమ్ అధికరణమ్

### ప్రథమోఽధ్యాయః రాజవృత్తిః

### ప్రకరణాధికరణసముద్దేశః

ఓం నమః శుక్రబృహస్పతిభ్యామ్.

మూలమ్. పృథివ్యాః లాభే పాలనే చ యావన్త్యర్థశాస్త్రాణి పూర్వాచార్యైః ప్రస్థాపితాని ప్రాయశః తాని సంహృత్య ఏకమిదమ్ అర్థశాస్త్రం కృతమ్.

అథ బాలానన్దినీవ్యాఖ్యాయాః ప్రారమ్భః

వ్యాఖ్య. నత్వా శ్రీతాతపాదాద్యాన్ శాస్త్రమన్త్రాదిసద్గురూన్,
కౌటిలీయార్థశాస్త్రం తద్ వ్యాకరోమ్యాన్ధ్రభాషయా.

ఓం శుక్రాచార్యునకు బృహస్పతికి నమస్కారము.

"చాణక్యుడు" అనే నామాంతరం గల కౌటిల్యుడు లేదా కౌటల్యుడు (ఆయనకు విష్ణుగుప్త డని కూడ మరొక పేరు) అర్థశాస్త్రం రచించడానికి ప్రారంభించి ఆ కార్యం నిర్విఘ్నంగా కొనసాగడానికై బ్రహ్మవిష్ణుశివాత్మకమైన "ఓం" కారాన్ని ఉచ్చరించి అర్థశాస్త్ర ప్రవర్తకులైన ఆచార్యులలో కూటస్థులైన శుక్రాచార్యునకు, బృహస్పతికి నమస్కరిస్తున్నాడు. శుక్రాచార్యుడు రాక్షసుల గురువు. ఇతడు రచించిన అర్థశాస్త్రానికి "ఔశనసం"అనిపేరు. దాని సంగ్రహమే "శుక్రనీతి". బృహస్పతి రచించిన గ్రంథానికి "బార్హస్పత్యం" అని పేరు.

పృథివ్యా ఇతి :- భూమిని సంపాదించడానికి, దానిని పాలించడానికి పూర్వాచార్యులు ఎన్ని అర్థశాస్త్రాలు ప్రచారంలోనికి తీసికొనివచ్చారో (రచించి ఉన్నారో) వాటిని అన్నింటినీ చాలా వరకు ఒక చోట చేర్చి, అనగా ఆ గ్రంథాలనుంచి విషయాలు సేకరించి, ఈ అర్థశాస్త్రం రచించబడింది.

అవతారిక :- ఈ అర్థశాస్త్రంలో మొత్తం పదిహేను అధికరణాలు ఉన్నాయి. ప్రకరణా లనే పేరుతో వీటి అవాంతరవిభాగం చేయబడింది. మొత్తం ప్రకరణాల సంఖ్య ఒకవంద ఎనభై (180). వాటిలోని విషయాలను వివరిస్తున్నాడు.

మూ. తస్యాయం ప్రకరణాధికరణసముద్దేశః - 1. విద్యాసముద్దేశః 2.వృద్ధసంయోగః 3. ఇన్ద్రియజయః 4. అమాత్యోత్పత్తిః 5. మన్త్రిపురోహితోత్పత్తిః 6. ఉపధాభిః శౌచాశౌచజ్ఞాన మమాత్యానామ్ 7. గూఢపురుషోత్పత్తిః 8.గూఢపురుషప్రణిధిః 9. స్వవిషయే కృత్యాకృత్యపక్షరక్షణమ్ 10. పరవిషయే కృత్యాకృత్యపక్షోపగ్రహః 11. మన్త్రాధికారః 12. దూతప్రణిధిః 13.రాజపుత్రరక్షణమ్ 14. అవరుద్ధవృత్తమ్ 15. అవరుద్ధే చ వృత్తిః 16. రాజప్రణిధిః 17. నిశాన్తప్రణిధిః 18. ఆత్మరక్షితకమ్ ఇతి వినయాధికారికం ప్రథమాధికరణమ్.

## మొదటి అధికరణం - వినయాధికారికం

వ్యా. తస్యేతి :- ఇది (చెప్పబడనున్నది) ఆ అర్థశాస్త్రంలోని ప్రకరణాధికరణాల సముద్దేశం. వివిధవిషయాలను ప్రతిపాదించే శాస్త్రగ్రంథాలలో శాస్త్రకారులు కొన్ని పద్ధతులు అవలంబిస్తారు. ముందు చెప్పదలచిన విషయాల పేర్లు చెపుతారు. దీనికి 'ఉద్దేశం' అని పేరు. తరువాత వాటి లక్షణాలు వివరించి పిమ్మట పరీక్ష చేస్తారు. "త్రివిధా(ఽ)స్య శాస్త్రస్య ప్రవృత్తిః- ఉద్దేశో, లక్షణం, పరీక్షా చేతి. తత్ర ఉద్దేశస్తు నామ మాత్రేణ వస్తుసంకీర్తనమ్ (తర్కభాష పే. 5). ఇక్కడ సముద్దేశం అనగా ఉద్దేశమే. ఇది ఈనాడు మనం గ్రంథారంభంలో ఇచ్చే విషయసూచిక వంటిది.

1. విద్యలను గూర్చిన విచారం, 2. పెద్దల సహవాసం, 3. ఇంద్రియాలను అదుపులో ఉంచుకొనడం, 4. అమాత్యుల పుట్టుక, అనగా అమాత్యులను నియమించడం, 5. మంత్రి పురోహితుల ఉత్పత్తి (నియమించడం), 6.రహస్యోపాయా



లతో అమాత్యుల నడవడికను (న్యాయానుసారం ప్రవర్తిస్తున్నారా, న్యాయవిరుద్ధంగా ప్రవర్తిస్తున్నారా అనే విషయాన్ని) పరీక్షించడం, 7. గూఢచారుల ఉత్పత్తి (స్వరూపస్వభావాదికం), 8. గూఢచారులను ఆ యా కార్యాలకై నియోగించడం, 9. తన దేశంలో ఉన్న కృత్యులను (కోపం ఉన్నవాళ్లను, లుబ్ధులను) అకృత్యులను గూర్చి తెలిసికొని సంరక్షించుకొనడం, 10. పరుల దేశంలోని కృత్యాకృత్యపక్షాలను తన వైపు త్రిప్పుకొనడం (శత్రురాజ్యంలోని క్రుద్ధలుబ్ధులనూ, ఇతరులనూ కూడా తనకు అనుకూలంగా చేసికొనడం), 11. మంత్రాధికారం, 12. దూతలను ఆ యా పనులమీద పంపడం, 13. రాజపుత్రులనుండి రక్షణం, 14. రాజుకు అనుకూలంగా ఉండని రాజపుత్రుల ప్రవృత్తి, 15. అట్టి రాజపుత్రుల విషయంలో రాజు అవలంబించవలసిన ప్రవృత్తి, 16. రాజు కర్తవ్యం, 17. రాజప్రాసాదంలో పాటించవలసిన నియమాలు, 18.రాజు తనను తాను రక్షించుకొనడం. ఇది వినయాధికారికం అనే మొదటి ప్రకరణం. వినయం అనగా రాజుకు కావలసిన విద్యాభ్యాసాదికం, ట్రైనింగు. దానికి సంబంధించినది వినయాధికారికం.

"బాలానందిని" అనే కౌటిలీయార్థశాస్త్రాంధ్రవ్యాఖ్యానంలో, వినయాధికారికమైన మొదటి అధికరణంలో రాజవృత్తి అనే ప్రథమాధ్యాయం సమాప్తం.

* * * *

## I— అథ ద్వితీయోఽధ్యాయః

ప్రథమం ప్రకరణమ్ - విద్యాసముద్దేశః; తత్ర ఆన్వీక్షికీస్థాపనా

మూ. 1. ఆన్వీక్షికీ, త్రయీ, వార్తా, దణ్డనీతిశ్చేతి విద్యాః.

2. త్రయీ వార్తా దణ్డనీతిశ్చేతి మానవాః; త్రయీవిశేషో హ్యాన్వీక్షికీతి.

3. వార్తా దణ్డనీతిశ్చేతి బార్హస్పత్యాః, సంవరణమాత్రం హి త్రయీ లోకయాత్రావిద ఇతి.

4. దణ్డనీతిరేకా విద్యేత్యౌశనసాః, తస్యాం హి సర్వవిద్యారమ్భాః ప్రతిబద్ధా ఇతి.

5. చతస్ర ఏవ విద్యా ఇతి కౌటిల్యః. తాభిర్ధర్మార్థౌ యద్ విద్యాత్ తత్ విద్యానాం విద్యాత్వమ్.

వ్యా. ఆన్వీక్షికి, త్రయి, వార్త, దండనీతి అనేవి విద్యలు.

వి. పదార్థాల స్వరూపాన్ని యుక్తులచేత (హేతువులచేత) పరీక్షించే విద్య ఆన్వీక్షికి (Philosophy). ఋగ్యజుఃసామవేదాలు 'త్రయి'. కృషి (వ్యవసాయం), పశుపాలన, వర్తకం వీటికి వార్త (Economics) అని పేరు. "దణ్డనీతి అనగా రాజనీతి (Political Science).

2. త్రయి,వార్త, దండనీతి ఈ మూడే విద్యలు అని మానవులు. త్రయిలో ఒక విశేషమే (భేదమే) ఆన్వీక్షికి కదా?

వి. ఈ గ్రంథంలో మానవులు అని నిర్దేశింపబడిన చోటల్లా మానవఅర్థశాస్త్రం అనే ఒక ప్రాచీన అర్థశాస్త్రాన్ని అనుసరించేవారు అని అర్థం. అంతేకాని ఇది మనుస్మృతికి నిర్దేశం కాదు.

3. వార్త, దండనీతి అనేవే విద్యలు అని బార్హస్పత్యులు, అనగా బృహస్పతి రచించిన అర్థశాస్త్రాన్ని అనుసరించేవారు. లోకయాత్ర, అనగా లోకవ్యవహారం, తెలిసిన వానికి త్రయి కేవలం అచ్ఛాదనం మాత్రమే.

వి. లోకవ్యవహారం ఎంత బాగా తెలిసినవాడైనా అతనికి త్రయీజ్ఞానం లేకపోతే వానిని లోకులు నాస్తికుడు అంటారు. అలా అనిపించుకొనకుండా ఉండడం కోసం త్రయి అనేది పైన వేసుకునే ముసుగు మాత్రమే. లోకవ్యవహారానికి, దానివల్ల ప్రయోజనం ఏదీ లేదు అని వాళ్ల అభిప్రాయం.

3.దండనీతి ఒక్కటే విద్య అని ఔశనసులు. ఎందువలన అనగా సమస్తమైన ఇతర విద్యల ఆరంభాలు అనగా యోగక్షేమాలు, ఆ దండనీతిమీదనే ఆధారపడి ఉన్నాయి.

వి. ఔశనసు లనగా శుక్రాచార్యుడు రచించిన అర్థశాస్త్రం అనుసరించేవాళ్లు.

4. మొదట చెప్పిన నాలుగు విద్యలే విద్యలు అని కౌటిల్యుని అభిప్రాయం. (మానవుడు) వాటి సాహాయ్యంతో ధర్మార్థాలను తెలుసుకుంటాడు కాబట్టి ఆ విద్యలు 'విద్యలు' అని చెప్పబడుతున్నాయి.

వి. విద్య అనగా ఏదైనా ఒక విషయం తెలుసుకొనడానికి సాధనం అయినది అని అర్థం. కౌటిల్యుడు ఒక విషయాన్ని గూర్చి చర్చించేటప్పుడు ఇతరుల అభిప్రాయాలు ముందుగా చెప్పి ""కాని కౌటిల్యుడు ఇలా అంటాడు" అని అంటూ, తన పేరు ప్రథమ పురుషలో నిర్దేశిస్తూ, తన మతం చెపుతూ ఉంటాడు.

మూ. సాంఖ్యమ్, యోగః, లోకాయతం చేత్యాన్వీక్షికీ. ధర్మాధర్మౌ త్రయ్యామ్. అర్థానర్థౌ వార్తాయామ్. నయాపనయౌ దణ్డనీత్యామ్. బలాబలే చైతాసాం హేతుభిరన్వీక్షమాణా ఆన్వీక్షికీ లోకస్యోపకరోతి, వ్యసనేఽభ్యుదయే చ బుద్ధి మవస్థాపయతి; ప్రజ్ఞావాక్యక్రియావైశారద్యం చ కరోతి.

శ్లో. ప్రదీపః సర్వవిద్యానాముపాయః సర్వకర్మణామ్,
ఆశ్రయః సర్వధర్మాణాం శశ్వదాన్వీక్షికీ మతా.

ఇతి కౌటిలీయార్థశాస్త్రే వినయాధికారికే ప్రథమాధికరణే ద్వితీయోఽధ్యాయః
విద్యాసముద్దేశే ఆన్వీక్షికీస్థాపనా.

వ్యా. సాంఖ్యం, యోగం, లోకాయతం అనేవి ఆన్వీక్షికి. త్రయియందు (వేదత్రయంలో) ధర్మాధర్మాలు (చెప్పబడ్డాయి). వార్తలో అర్థానర్థాలు (లాభనష్టాలు) చర్చించబడతాయి. దండనీతిలో నీతిమార్గం అవినీతిమార్గం (చర్చించబడతాయి). హేతువులచేత, అనగా యుక్తులచేత, ఈ విద్యలలో బలాబలాలను పరీక్షించి ఆన్వీక్షికి లోకాలకు ఉపకారం చేస్తుంది. వ్యసనసమయంలో అయినా, అభివృద్ధిసమయంలో



అయినా బుద్ధిని నిలకడగా ఉండేటట్లు చేస్తుంది. ప్రజ్ఞావైశారద్యాన్ని, అనగా బుద్ధిలో, ఆలోచనలలో సామర్థ్యాన్నీ, మాటలలో నేర్పునూ, పనులలో సామర్థ్యాన్నీ కలిగిస్తుంది.

వి. సాంఖ్యయోగాలు భారతదేశంలో అతిప్రాచీనకాలంనుంచీ ప్రచారంలో ఉన్న దర్శనాలు. ఒకదానితో ఒకటి దగ్గర సంబంధం ఉన్నవి. ఆత్మస్వరూపాదులను బోధిస్తాయి. లోకాయతం అనేది నేడు ఒక నాస్తికమతంగా పరిగణింపబడుతున్నది. పరలోకాదులలో నమ్మకం లేక ఇహలోకవ్యవహారాలకే ప్రాధాన్యం ఇచ్చేవాళ్ళు లోకాయతులని ఈనాడు మన కున్న అభిప్రాయం. అయితే ప్రాచీనకాలంలో ఇది కూడా ఒక గౌరవాస్పదమైన విద్యావిశేషంగా పరిగణింపబడే దన్నట్లు అర్థశాస్త్రాదిగ్రంథాల నుండి తెలుస్తున్నది.

2. "ఈ ఆన్వీక్షికి ఎల్లప్పుడూ అన్ని విద్యలకీ దీపం అనీ, అన్ని కర్మలకీ ఉపాయం అనీ, సకలధర్మాలకీ ఆశ్రయం అనీ పెద్దలు చెపుతారు."

"బాలానందిని అనే కౌటిలీయార్థశాస్త్రాంధ్రవ్యాఖ్యానంలో వినయాధికారికం అనే మొదటి అధికరణంలో విద్యాసముద్దేశంలో ఆన్వీక్షికీస్థాపన అనే విషయం ప్రతిపాదించే ద్వితీయాధ్యాయం సమాప్తం.

## I – అథ తృతీయోఽధ్యాయః

### ప్రథమే ప్రకరణే - విద్యాసముద్దేశః: తత్ర త్రయీస్థాపనా

మూ. 1. సామర్గ్యజుర్వేదాః త్రయః త్రయీ, అథర్వవేదేతిహాసవేదౌ చ వేదాః. శిక్షా, కల్పో, వ్యాకరణమ్, నిరుక్తమ్, ఛన్దోవిచితిః, జ్యోతిషమితి చాఙ్గాని.

2. ఏష త్రయీధర్మశ్చతుర్ణాం వర్ణానామ్ ఆశ్రమాణాం చ స్వధర్మ స్థాపనాదౌపకారికః

3. స్వధర్మో బ్రాహ్మణస్య అధ్యయనమ్, అధ్యాపనమ్, యజనమ్, యాజనమ్, దానమ్, ప్రతిగ్రహశ్చేతి. క్షత్రియస్య అధ్యయనమ్, యజనమ్, దానమ్, శస్త్రాజీవః, భూతరక్షణం చ. వైశ్యస్యాధ్యయనమ్, యజనమ్, దానమ్, కృషిపాశుపాల్యే, వాణిజ్యా చ. శూద్రస్య ద్విజాతిశుశ్రూషా, వార్తా, కారుకుశీలవకర్మ చ.

వ్యా. సామవేదం, ఋగ్వేదం, యజుర్వేదం అనే మూడు వేదాలు "త్రయి". ఈ త్రయి అథర్వవేదము, ఇతిహాసవేదమూ - ఇవన్నీ వేదాలు. శిక్ష (వర్ణాలను ఎలా ఉచ్చరించాలో చెప్పే శాస్త్రం), కల్పం ( ఆ యా యజ్ఞాలు చేసే విధానాన్ని బోధించే శాస్త్రం), వ్యాకరణం, నిరుక్తం (పదాల నిర్వచనాన్ని చెప్పే శాస్త్రం), ఛందఃశాస్త్రం, జ్యోతిషం - ఈ ఆరూ వేదాంగాలు.

2. వేదత్రయంలో చెప్పిన ఈ ధర్మం నాలుగు వర్ణాలవాళ్లని, నాలుగు ఆశ్రమాల వాళ్లనీ తమ తమ ధర్మాలలో నిలపడం ద్వారా (సమాజానికి) ఉపకారం చేస్తుంది.

3. వేదాధ్యయనం, వేదాలు బోధించడం, యజ్ఞాలు చెయ్యడం, యజ్ఞాలు చేయించడం, దానం (ఇవ్వడం), ఎవరైనా ఇస్తే తీసికొనడం ఇది బ్రాహ్మణుని స్వధర్మం. వేదాధ్యయనం, యజ్ఞాలు చేయడం, దానం చెయ్యడం, ఆయుధాలు జీవనోపాధిగా చేసుకొనడం, ప్రజలను, ఇతరప్రాణులను రక్షించడం క్షత్రియుని స్వధర్మం. వేదాధ్యయనం, యజ్ఞాలు చేయడం, దానాలు చేయడం, వ్యవసాయం, పశుపోషణ, వర్తకం ఇవి వైశ్యుని స్వధర్మం. ద్విజుల (బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యుల)కు సేవ చేయడం, వార్త, శిల్పాలు, గాన, నటనాదులు శూద్రుని స్వధర్మం.

వి. కారుః=శిల్పి. కఱ్ఱలు, రాళ్లు, లోహాలు మొదలైన వాటితో పని చేసేవాడు. కుశీలవః=పాటలు పాడుతూ, వేషాలు వేస్తూ, స్తోత్రాలు చేస్తూ సంచరించేవాడు.

మూ. 1. గృహస్థస్య స్వకర్మాజీవః, తుల్యైరసమానర్షిభిః వైవాహ్యమ్, ఋతుగామిత్వమ్, దేవపిత్రతిథిభృత్యేషు త్యాగః శేషభోజనం చ.

2. బ్రహ్మచారిణః స్వాధ్యాయః, అగ్నికార్యాభిషేకౌ, భైక్షవ్రతత్వమ్, ఆచార్యే ప్రాణాన్తికీ వృత్తిః, తదభావే గురుపుత్రే సబ్రహ్మచారిణి వా.

3. వానప్రస్థస్య బ్రహ్మచర్యం, భూమౌ శయ్యా, జటాజినధారణమ్, అగ్నిహోత్రాభిషేకౌ, దేవతాపిత్రతిథిపూజా వన్యశ్చాహారః.

4. పరివ్రాజకస్య సంయతేన్ద్రియత్వమ్, అనారమ్భః, నిష్కించనత్వమ్, సంగత్యాగః, భైక్షమ్ అనేకత్ర, అరణ్యవాసో, బాహ్యాభ్యన్తరం చ శౌచమ్.

వ్యా. 1. తనకు విధించిన కర్మను జీవనోపాధిగా గ్రహించడం, సమానమైన ఋషులు లేని అనగా సగోత్రులు లేదా గోత్రాలలో ఋషులు కలిసినవారు కాని, తనతో సమానమైన వాళ్లతో వివాహసంబంధం, ఋతుకాలాలలోనే భార్యాసంగమం చేయడం



దేవతలకు, పితృదేవతలకు, అతిథులకు, భృత్యులకు అనగా తన పోషణపై ఆధారపడి ఉన్న వాళ్లకు ఇచ్చి మిగిలినది తినడం, ఇది గృహస్థుని ధర్మం.

2. స్వాధ్యాయాధ్యయనం, అగ్నికార్యం (ప్రాతఃకాలం సాయంకాలం అగ్నిపూజ చేయడం, మూడు పూటలా స్నానం చేయడం, భిక్షావృత్తి అవలంబించడం, జీవితాంతంవరకు ఆచార్యగృహంలో ఉంటూ ఆచార్యునికి సేవ చేయడం, ఆచార్యుడు లేకపోతే అతని పుత్రునికి గాని, తన వేదశాఖ ఏదో అదే స్వశాఖగా గల వృద్ధునికి గాని సేవ చేస్తూ ఉండడం బ్రహ్మచారికి స్వధర్మం.

వి. వేదాధ్యయనం పూర్తి అయేవరకు గురుకులంలో ఉండే బ్రహ్మచారి ఉపకుర్వాణబ్రహ్మచారి. తరువాత అతడు గృహస్థాశ్రమంలో ప్రవేశించవచ్చు. గృహస్థాశ్రమంలో ఇచ్ఛ లేనివాడు పైన చెప్పినట్లు ఆజీవితాంతం గురుశుశ్రూష చేస్తూ బ్రహ్మచర్యాశ్రమంలోనే ఉండిపోవచ్చును. అతడు నైష్ఠికబ్రహ్మచారి.

3. బ్రహ్మచర్యం పాటించడం, నేలమీద శయనించడం, జటలు, అజినమూ (లేడిచర్మ) ధరించడం, అగ్నిహోత్రం చేయడం, మూడు పూట్లా స్నానం, దేవతలను, పితృదేవతలను, అతిథులను పూజించడం, వనంలో లభించే వస్తువులు మాత్రమే ఆహారంగా భుజించడం ఇది వానప్రస్థుని స్వధర్మం.

4. ఇంద్రియాలను అదుపులో ఉంచుకొనడం, ఏ పనులూ ప్రారంభించక పోవడం, కొంచెము కూడా ధనం లేకపోవడం, సంగం విడిచిపెట్టడం, అనేకగృహాలకు లేదా గ్రామాలకు వెళ్ళి భిక్షం సంపాదించడం, అరణ్యంలో నివసించడం, శరీరం బైటా, లోపలా కూడా అనగా శరీరాన్ని, మనస్సును మాటలను కూడా శుచిగా ఉంచుకొనడం ఇది సంన్యాసికి స్వధర్మం.

మూ. 1. సర్వేషామహింసా, సత్యం, శౌచమఅనసూయా, ఆనృశంస్యం క్షమా చ.

2. స్వధర్మః స్వర్గాయ ఆనన్త్యాయ చ. తస్యాతిక్రమే లోకః సంకరాదుచ్ఛిద్యేత.

3. శ్లో. తస్మాత్ స్వధర్మం భూతానాం రాజా న వ్యభిచారయేత్,
స్వధర్మం సందధానో హి ప్రేత్య చేహ చ నన్దతి.
వ్యవస్థితార్యమర్యాదః కృతవర్ణాశ్రమస్థితిః,
త్రయ్యా హి రక్షితో లోకః ప్రసీదతి న సీదతి.

ఇతి కౌటిలీయార్థశాస్త్రే వినయాధికారికే ప్రథమాధికరణే తృతీయోఽధ్యాయః
విద్యానముద్దేశే త్రయీస్థాపనా.

వ్యా. 1. అహింస, సత్యమూ, మనోవాక్కాయముల శుచిత్వము, అసూయ లేకపోవడం, క్రూరత్వం లేకపోవడం, ఓర్పు అనేవి అందరికీ ధర్మాలే. స్వధర్మాన్ని ఆచరించడం వల్ల స్వర్గం, అనంతమైన ఆనందమూ లభిస్తాయి. స్వధర్మాన్ని అతిక్రమిస్తే సాంకర్యంవల్ల లోకం నశిస్తుంది.

2. అందువలన రాజు ప్రజలలో ఎవరూ స్వధర్మాన్ని విడవకుండా ఉండేటట్లు చూడాలి. స్వధర్మం ఆచరించేవాడు ఇహలోకంలోను మరణానంతరమూ కూడా సంతోషంతో ఉంటాడు.

సంరక్షించబడిన పూజ్యములైన కట్టుబాట్లు గలదై, వర్ణాశ్రమస్థితిని కాపాడుతూన్న లోకం వేదత్రయంచేత రక్షించబడుతూ సుఖంగా ఉంటుంది. ఎన్నటికీ నశించదు.

'బాలానందిని" అను కౌటిలీయార్థశాస్త్రాంధ్రవ్యాఖ్యానంలో వినయాధికారికమైన మొదటి అధికరణంలో, విద్యాసముద్దేశంలో త్రయీస్థాపన అను మూడవ అధ్యాయం సమాప్తం.

## I – అథ చతుర్థోఽధ్యాయః

### ప్రథమే ప్రకరణే విద్యాసముద్దేశే వార్తాదణ్డనీతిస్థాపనా

మూ. కృషిపాశుపాల్యే వణిజ్యా చ వార్తా, ధాన్యపశుహిరణ్యకుప్య విష్టిప్రదానా దౌపకారికీ, తయా స్వపక్షం పరపక్షం చ వశీకరోతి దణ్డకోశాభ్యామ్.

వ్యా. వ్యవసాయం, పశువుల పాలనం, వర్తకం ఈ మూడింటికీ "వార్త" అని పేరు. ఇది ధాన్యమూ, పశువులూ, బంగారమూ, కుప్యమూ, కర్మకరులూ వీటిని సంపాదించి పెట్టడం ద్వారా ఉపయోగిస్తుంది. కోశదండాల ద్వారా స్వపక్షాన్నీ, పరపక్షాన్నీ కూడా వశంలో ఉంచుతుంది.

వి. వెండిబంగారాలు మినహా మిగిలిన ధాతువులు, అరణ్యంలో లభించే వెదురూ ఇతరములైన కఱ్ఱలు మొదలైనవి - వీటికి 'కుప్యం' అని పేరు. దండం అనగా, ఇక్కడ, సేన అని అర్థం.

మూ. ఆన్వీక్షకీత్రయీవార్తానాం యోగక్షేమసాధనో దణ్డః. తస్య



నీతిర్దణ్డనీతిః. అలబ్ధలాభార్థా, లబ్ధపరిరక్షణీ, రక్షితవివర్ధినీ, వృద్ధస్య తీర్థేషు ప్రతిపాదనీ చ. తస్యామాయత్తా లోకయాత్రా. తస్మాల్లోకయాత్రార్థీ నిత్య ముద్యతదణ్డః స్యాత్. న హ్యేవంవిధం వశోపనయన మస్తి భూతానాం యథా దణ్డః ఇత్యాచార్యాః.

వ్యా. అన్వీక్షికి, త్రయి, వార్త వీటి యోగక్షేమాలకి సాధన మైనది దండం. అనగా దండభయం ఉంటేనే లోకంలో జనులు పై విషయాల మీద తగిన శ్రద్ధ చూపుతారు. ఆ దండాన్ని గూర్చి చెప్పేది, లేదా ఆ దండం ప్రయోగించే విధానం "దండనీతి". ఇది ఇంతకు ముందు సంపాదించనిదానిని సంపాదించడానికీ, సంపాదించినదానిని రక్షించు కొనడానికీ, రక్షించుకొన్నదానిని వృద్ధి చేయడానికీ, వృద్ధిచేసిన దానిని తీర్థములకు ఇవ్వడానికీ ఉపకరిస్తుంది. లోకయాత్ర అంతా దండనీతిమీదనే ఆధారపడి ఉంటుంది. అందువలన లోకయాత్ర సరిగా నడవాలనుకొనే రాజు ఎల్లపుడూ ఈ దండాన్ని ఎత్తి పట్టుకొని ఉండాలి. ప్రజల్ని వశంలో ఉంచుకొనడానికి దండాన్ని మించిన మరొక సాధనం లేదు అని కొందరు ఆచార్యులు అన్నారు.

వి. 'తీర్థం' అనగా ఎవ రెవరికి ధనం ఇవ్వాలో, అనగా ఏ ఏ పనులకై ధనం ఖర్చుపెట్టాలో అది. ఇక్కడ దండం అనగా శిక్ష (Punishment) అని అర్థం.

మూ. నేతి కౌటిల్యః. తీక్ష్ణదణ్డో హి భూతానాముద్వేజనీయః, మృదు దణ్డః పరిభూయతే. యథార్హదణ్డః పూజ్యః. సువిజ్ఞాతప్రణీతో హి దణ్డః ప్రజాః ధర్మార్థకామైర్యోజయతి. దుష్ప్రణీతః కామక్రోధాభ్యామ్, అజ్ఞానాత్ వానప్రస్థపరివ్రాజకానపి కోపయతి, కిమఙ్గ పునర్గృహస్థాన్. అప్రణీతో హి మాత్స్యన్యాయముద్భావయతి; బలీయానబలం హి గ్రసతే దణ్డధరాభావే. తేన గుప్తః ప్రభవతీతి.

వ్యా. అట్లు కాదు అని కౌటిల్యుడు. దండానికి అంత ప్రాధాన్యం ఇవ్వకూడదు అని అర్థం. తీక్ష్ణంగా శిక్షించేవాడు ప్రజలకు ఉద్వేగం, భయంతో కూడిన ద్వేషం, కలిగిస్తాడు. మృదువుగా దండించేవాడు తిరస్కరించబడతాడు (ప్రజలకి లోకువ అవుతాడు). ఎంత అవసరమో అంత దండప్రయోగం చేసేవాడు పూజింపదగిన వాడవుతాడు. బాగా తెలిసికొని (యథాశాస్త్రంగా) ప్రయోగించబడిన దండం ప్రజలకు ధర్మార్థ కామాలను అందజేస్తుంది. కామక్రోధాలచేతగాని, తెలివితక్కువతనంచేతగాని చెడ్డగా ప్రయోగించబడిన దండం వానప్రస్థులకు, సంన్యాసులకుకూడా కోపం కలిగిస్తుంది.

(వాళ్లు కూడా ఎదురు తిరిగేటట్లు చేస్తుంది). ఇంక గృహస్థుల మాట చెప్పాలా? అసలే విధించని దండం, అసలే దండం విధించకపోతే అది (సమాజంలో) మాత్స్యన్యాయాన్ని ప్రవర్తింపచేస్తుంది. దండధరుడు (శిక్షించేవాడు) లేకపోతే ఎక్కువ బలం ఉన్నవాడు దుర్బలుణ్ణి మ్రింగివేస్తాడు. (తగువిధంగా ప్రయోగించిన) దండంచేత రక్షింపబడిన దుర్బలుడు కూడా సమర్థుడవుతాడు. బలవంతుడు అవుతాడు.

వి. చిన్న చేపను పెద్ద చేప మింగేస్తుంది. ఇదే మాత్స్యన్యాయం.

శ్లో. చతుర్వర్ణాశ్రమో లోకో రాజ్ఞా దణ్డేన పాలితః,
స్వధర్మకర్మాభిరతో వర్తతే స్వేషు వేశ్మసు.

ఇతి కౌటిలీయార్థశాస్త్రే వినయాధికారికే ప్రథమాధికరణే చతుర్థోఽధ్యాయః
విద్యాసముద్దేశః సమాప్తః.

వ్యా. "తగువిధమైన దండప్రయోగం చేస్తూ రాజుచేత పాలించబడే చతుర్వర్ణ-చతురాశ్రమరూపమైన ఈ లోకం తన ధర్మం పాటిస్తూ తమ ఇండ్లల్లో సుఖంగా ఉంటుంది". దండం లేకపోతే ఎవరిళ్లల్లో వాళ్లుకూడా సుఖంగా ఉండజాలరని భావం.

"బాలానందిని" అనే కౌటిలీయార్థశాస్త్రాంధ్రవ్యాఖ్యానంలో వినయాధికారికమైన ప్రథమాధికరణంలో నాల్గవ అధ్యాయం, విద్యాసముద్దేశంలో వార్తాస్థాపన, దండనీతిస్థాపన సమాప్తం

విద్యాసముద్దేశం సమాప్తం.

## I – అథ పఞ్చమోధ్యాయః

### ద్వితీయే ప్రకరణే వృద్ధసంయోగః

మూ. 1. తస్మాద్దణ్డమూలాస్తిస్రో విద్యాః. వినయమూలో దణ్డః ప్రాణభృతాం యోగక్షేమావహః.

2. కృతకః స్వాభావికశ్చ వినయః. క్రియా హి ద్రవ్యం వినయతి నాద్రవ్యమ్. శుశ్రూషాశ్రవణగ్రహణధారణవిజ్ఞానోహాపోహతత్త్వాభినివిష్టబుద్ధిం విద్యా వినయతి, నేతరమ్.

3. విద్యానాం తు యథాస్వమ్ ఆచార్యప్రామాణ్యాద్ వినయః నియమశ్చ.



వ్యా. 1. అందువలన ఆన్వీక్షికి, త్రయి, వార్త అనే మూడు విద్యలు దండం (దండనీతి) మీద ఆధారపడి ఉంటాయి. వినయంమీద అనగా శాస్త్రజ్ఞానం మీద, ఆధారపడిన, శాస్త్రజ్ఞానంతో కూడిన దండం మానవులకు యోగక్షేమాలను ఇస్తుంది.

2. కృత్రిమమూ, అనగా ప్రయత్నం చేసి సంపాదించినదీ, స్వాభావికమూ, అనగా సహజంగా అప్రయత్నంగా వచ్చినదీ, అని వినయం రెండు విధాలు. క్రియ (శాస్త్రాభ్యాసాదికం) ద్రవ్యాన్ని (యోగ్యత ఉన్న వ్యక్తిని) సంస్కరిస్తుంది కాని అద్రవ్యాన్ని (ఏ మాత్రమూ యోగ్యత లేనివానిని) సంస్కరించదు. (ఉదాహరణకి శాణంతో రాయగా రాయగా వజ్రానికి మెరుపు వస్తుంది కాని మట్టిబెడ్డకు రాదు).శుశ్రూష (వినాలనే కోరిక), వినడం, గ్రహించడం, ధారణం (మరిచిపోకుండా ఉండడం), విజ్ఞానం (ధరించిన విషయాలలో ఏది సాధ్యము, ఏది అసాధ్యము అనే జ్ఞానం), ఊహ (మాటలలో చెప్పనిదానిని అనుమానప్రమాణాదులచే తెలుసుకొనడం), అపోహ(యుక్తివిరుద్ధమైన దానిని విడిచివేయడం), యథార్థాన్ని తెలుసుకొనాలనే పట్టుదల-ఇవి ఉన్నవానికే విద్య వినయాన్ని సంపాదిస్తుంది కాని ఇవి లేనివానికి ఉపయోగించదు.

3. విద్యల విషయంలో, ఆ యా విద్యల స్వరూపాన్ని పట్టి, ఆచార్యుని ప్రామాణ్యాన్ని పట్టి (ఆ విద్యను బోధించే ఆచార్యుడు ఏ పద్ధతిలో ఉండాలని చెపుతాడో దానిని అనుసరించి) వినయమూ (Training), నియమమూ ఉంటాయి.

వి. స్పష్టంగా చెప్పబడని దానిని ఊహించుకోవడం 'ఊహ'. యుక్తికి విరుద్ధమైనదానిని త్యజించడం 'అపోహ'.

మూ. వృత్తచౌలకర్మా లిపిం, సంఖ్యానం చోపయుఞ్జీత. వృత్తోపనయస్త్రయీమాన్వీక్షికీం చ శిష్టేభ్యః, వార్తామధ్యక్షేభ్యః, దణ్డనీతిం చ వక్తృప్రయోక్తృభ్యః.

వ్యా. చౌలకర్మ పూర్తి అయినవాడు (రాజకుమారుడు). లిపీ, గణితమూ నియమపూర్వకంగా అభ్యసించాలి. ఉపనయనం అయిన తరువాత ఆ యా శాస్త్రాలలో నిష్ణాతులైన శిష్టులనుండి త్రయిని, ఆన్వీక్షికిని, ఆ యా శాఖాధ్యక్షులనుండి వార్తను, విషయాన్ని బోధించగలిగియుండి ఆ శాస్త్రం ప్రయోగం (Putting in practice) కూడా తెలిసినవాళ్లనుండి దండనీతినీ నియమపూర్వకంగా అభ్యసించాలి.

వి. బాలునికి మూడవ సంవత్సరంలో కాని, ఐదవ సంవత్సరంలో కాని చేసే

ఒక వైదికసంస్కారం 'చౌలం'. ఈనాటి పుట్టువెంట్రుకలు తీయించడం వంటిది.

మూ. బ్రహ్మచర్యం చ ఆషోడశాద్ వర్షాత్. అతో గోదానమ్, దారకర్మ చ. అస్య నిత్యశ్చ విద్యావృద్ధసంయోగో వినయవృద్ధ్యర్థమ్; తన్మూలత్వాత్ వినయస్య.

వ్యా. పదహారు సంవత్సరాల వయస్సువరకు బ్రహ్మచర్యాశ్రమం, అటుపిమ్మట గోదానవ్రతము; వివాహము. వివాహానంతరం కూడా వినయవృద్ధికోసం విద్యావృద్ధుల సహవాసం నిత్యమూ ఉండాలి. ఎందుచేత ననగా వినయానికి విద్యావృద్ధుల సాంగత్యమే మూలం.

వి. 'గోదానవ్రతం' అనగా బ్రహ్మచర్యాశ్రమం తరవాత గృహస్థాశ్రమంలో ప్రవేశించే ముందు చేసికొనే ఒక వ్రతం. "గావః ద్యన్తే ఖణ్డ్యన్తే అస్మిన్ ఇతి గోదానమ్" కేశాలు ఖండించే వ్రత మని అర్థం. బ్రహ్మచారిగా ఉన్నపుడు కేశాలు ఖండించుకొనగూడదు. ఈ వ్రతం స్నాతకానికి అంగం. ఇక్కడ వినయం అనగా అణకువ, శాస్త్రసంస్కారం అని అర్థాలు (Discipline).

మూ. 1. పూర్వమహర్భాగం హస్త్యశ్వరథప్రహరణవిద్యాసు వినయం గచ్ఛేత్, పశ్చిమ మితిహాసశ్రవణే. పురాణమ్, ఇతివృత్తమ్, ఆఖ్యాయికా, ఉదాహరణమ్, ధర్మశాస్త్రమ్, అర్థశాస్త్రం చేతి ఇతిహాసః. శేషమహోరాత్రభాగమ్ అపూర్వగ్రహణమ్, గృహీతపరిచయం చ కుర్యాత్, అగృహీతానామ్ ఆభీక్ష్ణ్యశ్రవణం చ.

2. శ్రుతాద్ధి ప్రజ్ఞోపజాయతే, ప్రజ్ఞాయా యోగః, యోగాత్ ఆత్మవత్తేతి విద్యాసామర్థ్యమ్.

వ్యా. పగటి మొదటి భాగంలో (ప్రారంభంలో) ఏనుగులను, గుఱ్ఱాలను, రథాలను నడపడంలోను, ఆయుధవిద్యయందూ శిక్షణ పొందాలి. చివరి భాగంలో ఇతిహాసాలు వినడంలో శిక్షణ పొందాలి. పురాణమూ (బ్రహ్మపురాణాదికం), ఇతివృత్తం (రామాయణ భారతాదికం), ఆఖ్యాయిక (దివ్యపురుషుల చరిత్ర, మనుష్యుల చరిత్ర మొ.) ఉదాహరణం (తంత్రాఖ్యాయిక-పంచతంత్రం మొదలైనవి), ధర్మశాస్త్రం, అర్థశాస్త్రం ఇవన్నీ "ఇతిహాసం". మిగిలిన పగటి భాగాన్ని (మధ్యభాగాన్ని), అవకాశం లభించిన రాత్రిభాగాన్ని పూర్తిగా కొత్త విషయాలు తెలుసుకొనడానికీ, తెలిసినదానిని గట్టి



పరచుకొనడానికి (గృహీతపరిచయానికి), బాగా తెలియనివాటిని గూర్చి మాటిమాటికీ వినడానికీ వినియోగించాలి.

2. వివిధశాస్త్రాల అధ్యయనంవల్ల ప్రజ్ఞ (మూడు కాలాలకీ సంబంధించిన విషయాల జ్ఞానం) కలుగుతుంది. ప్రజ్ఞవల్ల యోగం (శాస్త్రంలో చెప్పిన విషయాల అనుష్ఠానంలో శ్రద్ధ-Practical application) కలుగుతుంది. యోగంవల్ల ఆత్మవత్త (ఆత్మవిశ్వాసం, ఆత్మనిగ్రహం - self possession) కలుగుతుంది. ఇదే విద్యలవల్ల కలిగే సామర్థ్యం.

శ్లో. విద్యావినీతో రాజా హి ప్రజానాం వినయే రతః,
అనన్యాం పృథివీం భుంక్తే సర్వభూతహితే రతః.

ఇతి కౌటిలీయార్థశాస్త్రే వినయాధికారికే ప్రథమాధికరణే పఞ్చమోఽధ్యాయః వృద్ధసంయోగః..

వ్యా. తాను విద్యలలో శిక్షితుడై, సకలభూతములకు హితాన్ని చేయడంలో ఆసక్తి కలిగి, ప్రజలకు శిక్షణ ఇవ్వడంలో శ్రద్ధ గల రాజు మరొక రాజు లేని భూమిని పరిపాలిస్తాడు. అనగా ఏకచ్ఛత్రాధిపత్యం సాగిస్తాడు.

'బాలానందిని" అనే కౌటిలీయార్థశాస్త్రాంధ్రవ్యాఖ్యానమునందు వినయాధికారికమైన ప్రథమాధికరణంలో 'వృద్ధసంయోగం' అనే పంచమాధ్యాయం సమాప్తం.

## I – అథ షష్ఠోఽధ్యాయః

### తృతీయే ప్రకరణే - ఇన్ద్రియజయః కామాదిషడ్రిపువర్జనం చ

మూ. విద్యావినయహేతురిన్ద్రియజయః కామక్రోధలోభమానమదహర్షత్యాగాత్ కార్యః. కర్ణత్వగక్షిజిహ్వాఘ్రాణేన్ద్రియాణాం శబ్దస్పర్శరూపరసగన్ధేష్వవిప్రతిపత్తిః ఇన్ద్రియజయః, శాస్త్రార్థానుష్ఠానం వా. కృత్స్నం హి శాస్త్ర మిదమ్ ఇన్ద్రియజయః.

వ్యా. విద్యవల్ల కలిగే వినయానికి హేతువైన ఇంద్రియజయాన్ని కామ-క్రోధ-లోభ(దురాశ)-మాన(నేను గొప్పవాడ ననే బుద్ధి)-మద(ధనాదులవలన కలిగిన

గర్వం)-హర్షాలను త్యజించడం ద్వారా సంపాదించుకోవాలి. కర్ణములు, త్వగింద్రియము, నేత్రాలు, జిహ్వ, ముక్కు అనే ఇంద్రియాల ద్వారా శబ్ద-స్పర్శ-రూప-రస-గంధాలను విరుద్ధమైన రీతిలో కాక సామాన్యరీతిలో అనుభవించడం "ఇంద్రియజయం". లేదా శాస్త్రాలలో బోధించిన విషయాలను అనుష్ఠించడం "ఇంద్రియజయం". ఎందుచేతననగా మొత్తం ఈ శాస్త్రమే "ఇంద్రియజయం" - అనగా ఇంద్రియజయాన్ని బోధిస్తుంది.

మూ. తద్విరుద్ధవృత్తిరవశ్యేన్ద్రియశ్చతురన్తోఽపి రాజా సద్యో వినశ్యతి- యథా దాణ్డక్యో నామ భోజః కామాద్ బ్రాహ్మణకన్యామభిమన్యమానః సబన్ధురాష్ట్రో వినవాశ, కరాలశ్చ వైదేహః; కోపాత్ జనమేజయో బ్రాహ్మణేషు విక్రాన్తః, తాలజఙ్ఘశ్చ భృగుషు; లోభాదైలశ్చాతుర్వర్ణ్యమత్యాహారయమాణః సౌవీరశ్చాజబిన్దుః; మానాద్రావణః పరదారానప్రయచ్ఛన్, దుర్యోధనో రాజ్యాత్ అంశం చ, మదాత్ డమ్భోద్భవో భూతావమానీ, హైహయశ్చార్జునః; హర్షాద్వాతాపిరగస్త్యమత్యాసాదయన్, వృష్ణిసంఘశ్చ ద్వైపాయనమితి.

వ్యా. శాస్త్రానికి విరుద్ధమైన ప్రవృత్తి కలవారై ఇంద్రియాలు అదుపులో లేని రాజు నాలుగు దిక్కుల చివరివరకు వ్యాపించిన రాజ్యం ఉన్నవాడైనా వెంటనే నశిస్తాడు. ఎట్లనగా - భోజవంశానికి చెందిన దాండక్యుడు కామంవల్ల బ్రాహ్మణ కన్యను అభిలషించి, ఆమెను అపహరించి, ఆమె తండ్రి శాపంచేత బంధువులతోను, రాష్ట్రంతోను సహా నశించాడు. విదేహరాజైన కరాలుడు బ్రాహ్మణస్త్రీని అభిలషించి బ్రాహ్మణశాపంచేత సబంధురాష్ట్రంగా నశించాడు. జనమేజయు డనే రాజు అశ్వమేధయాగంలో కోపంవల్ల బ్రాహ్మణుల విషయంలో పరాక్రమం చూపి వాళ్ళ శాపం చేత నశించాడు. తాలజంఘుడు కోపంవల్ల భృగువంశీయుల విషయంలో పరాక్రమం చూపి నశించాడు. ఇలాపుత్రుడైన పురూరవు డనే రాజు లోభంవల్ల నాలుగు వర్ణాల ప్రజలనుండి అధికంగా ధనం తీసికొనడంవల్ల ఆ చాతుర్వర్ణ్యాల కోపంవల్ల (తిరుగుబాటువల్ల) నశించాడు. సువీరదేశరాజైన అజబిందువు కూడా లోభంవల్ల ఆ విధంగానే నశించాడు. ఐలుడు నైమిశంలోని బ్రాహ్మణయజ్ఞశాలలో ప్రవేశించి అపరిమితమైన ధనం తీసికొని పోతూండగా బ్రాహ్మణశాపంచేత నశించా డని మరొక కథ ఉన్నదట. మానంవల్ల రావణుడు పరభార్యను తిరిగి ఇవ్వకపోవడంచేత, దుర్యోధనుడు రాజ్యభాగం ఇవ్వకపోవడంచేత నశించారు. డంభోద్భవుడనే రాజు ప్రజ



లందరినీ అవమానించి చివరికి నరనారాయణులతో యుద్ధంలో మరణించాడు. హైహయవంశీయుడైన కార్తవీర్యార్జునుడు గర్వంవల్ల పరశురాముని తండ్రి విషయంలో అపరాధం చేసి పరశురాముని చేతిలో మరణించాడు. హర్షంవల్ల వాతాపి అగస్త్యుణ్ణి వంచించబోయి అతని శాపంచేత మరణించాడు. యాదవుల సముదాయం వ్యాసుణ్ణి వంచించబోయి అతని శాపంచేత నశించింది.

వి. "హర్షం" అనగా, ఇక్కడ, పెద్దలను పరిహసించడం ద్వారా, అవమానించడం ద్వారా ఆనందించడం అని అర్థం. వాతాపి ఇల్వలుల కథ ప్రసిద్ధమైనదే. యాదవులు ఒక పురుషునికి గర్భవతియైన స్త్రీ వేషం వేసి ఈమెకు ఏ శిశువు కలుగుతుంది అని నారదుణ్ణి అడిగినట్లు, అతడు మీ వంశం అంతా నశించడానికి హేతువైన ముసలం పుడుతుందని చెప్పినట్లు మహాభారతకథ. కాని ఇక్కడ వ్యాసుని పేరు ఉన్నది. కాని ఘటజాతకంలో వ్యాసుడనే ఉన్నదట.

శ్లో. ఏతే చాన్యే చ బహవః శత్రుషడ్వర్గమాశ్రితాః,
సబన్ధురాష్ట్రా రాజానో వినేశురజితేన్ద్రియాః.
శత్రుషడ్వర్గముత్సృజ్య జామదగ్న్యో జితేన్ద్రియః,
అమ్బరీషశ్చ నాభాగో బుభుజాతే చిరం మహీమ్.

ఇతి కౌటిలీయార్థశాస్త్రే వినయాధికారికే ప్రథమాధికరణే షష్ఠోఽధ్యాయః
ఇన్ద్రియజయే అరిషడ్వర్గజయః.

వ్యా. "వీళ్లు, ఇంకా ఎందరో రాజులు ఇంద్రియాలను జయించక కామక్రోధాద్యరిషడ్వర్గాన్ని ఆశ్రయించి (అరిషడ్వర్గానికి లొంగిపోయి) బంధువులతో, రాష్ట్రంతో సహా నశించారు".

పరశురాముడు, నాభాగుని కుమారుడైన అంబరీషుడు అరిషడ్వర్గాన్ని విడచి, జితేంద్రియులై చాల కాలం భూమిని అనుభవించారు.

వి. పరశురాముడు ఇరవైఒక్క పర్యాయాలు క్షత్రియవధ చేసినట్లు ఉన్నది కాని రాజ్యం చేసినట్లు పురాణాదులలో లేదు.

"బాలానందిని" అనే కౌటిలీయార్థశాస్త్రాంధ్రవ్యాఖ్యానంలో వినయాధికారికం అనే ప్రథమాధికరణంలో, ఇంద్రియజయంలో అరిషడ్వర్గత్యాగం అనే ఆరవ అధ్యాయం సమాప్తం.

## అథ సప్తమోఽధ్యాయః

### తృతీయే ప్రకరణే ఇన్ద్రియజయో రాజర్షివ్యవహారశ్చ

మూ. తస్మాదరిషడ్వర్గత్యాగేనేన్ద్రియజయం కుర్వీత, వృద్ధసంయోగేన ప్రజ్ఞామ్, చారేణ చక్షుః, ఉత్థానేన యోగక్షేమసాధనమ్, కార్యానుశాసనేన స్వధర్మస్థాపనమ్, వినయం విద్యోపదేశేన, లోకప్రియత్వమర్థసంయోగేన, హితేన వృత్తిమ్.

వ్యా. అందువలన రాజు అరిషడ్వర్గాన్ని విడచి ఇంద్రియజయం చెయ్యాలి. వృద్ధుల సహవాసంచేత ప్రజ్ఞను సంపాదించాలి. గూఢచారులచేత నేత్రాన్ని చెయ్యాలి. (గూఢచారులద్వారా చూడాలి). ఉత్థానంచేత అనగా నిత్యమూ కార్యవ్యాపృతుడవడంచేత యోగక్షేమాలు సాధించాలి. ఎవరు ఏమి చేయాలో శాసించడంచేత స్వధర్మస్థాపనం చెయ్యాలి (ఎవరి ధర్మం వాళ్లు చేసేటట్లు చూడాలి). విద్యోపదేశంచేత (తనకు ప్రజలకు కూడా వినయం (discipline) అలవడేట్లు చెయ్యాలి. ధనాన్ని సంపాదించి తగిన విధంగా ఖర్చుపెట్టడంచేత లోకులందరికీ ప్రియుడు కావాలి. హితమైన కార్యంచేత లోకవ్యవహారం నడపాలి.

మూ. ఏవం వశ్యేన్ద్రియః పరస్త్రీద్రవ్యహింసాశ్చ వర్జయేత్, స్వప్నమ్, లౌల్యమ్, అనృతమ్, ఉద్ధతవేషత్వమ్, అనర్థసంయోగం చ, అధర్మయుక్తమనర్థసంయుక్తం చ వ్యవహారమ్.

వ్యా. ఈ విధంగా రాజు జితేంద్రియుడై పరస్త్రీపరధనాలను, పరహింసను వర్జించాలి. అనుచితమైన నిద్రను (వేళకాని వేళలందు నిద్రనూ), చపలత్వాన్నీ, అసత్యాన్నీ, డాబుసరిగా కనబడే వేషాన్నీ, అనర్థసంయోగాన్నీ (అనర్థాన్ని కలిగించే వాళ్ళతో సంబంధాన్ని), అధర్మంతో కూడిన, అనర్థహేతువైన వ్యవహారాన్నీ (Transaction) త్యజించాలి.

మూ. ధర్మార్థావిరోధేన కామం సేవేత. న నిఃసుఖః స్యాత్. సమం వా త్రివర్గమన్యోన్యానుబన్ధమ్. ఏకో హ్యత్యాసేవితో ధర్మార్థకామానామాత్మాన మితరౌ చ పీడయతి.

వ్యా. ధర్మార్థాలకి బాధ కలగకుండా కామాన్ని సేవించాలి. లేదా ఒకదానితో



ఒకటి కలసి ఉన్న ఈ ధర్మార్థకామాలను సమంగానే సేవించాలి. ధర్మార్థకామాలలో ఏదో ఒకదానినే అధికంగా సేవిస్తే (ఒకదానికే ప్రాధాన్యం ఇస్తే) అది (ఆ సేవించబడినది) తననూ పీడిస్తుంది, మిగిలిన రెండింటినీ కూడా పీడిస్తుంది. అనగా ఒక్క ధర్మాన్నే సేవిస్తే ఆ ధర్మానికీ పీడ కలుగుతుంది. అర్థకామాలకీ పీడ కలుగుతుంది. ఇట్లే మిగిలిన రెండింటి విషయంలోను.

మూ. అర్థ ఏవ ప్రధాన ఇతి కౌటిల్యః; అర్థమూలౌ హి ధర్మకామావితి.

వ్యా. అర్థమే ప్రధానమైనది, ఎందుచేత ననగా ధర్మకామాలు రెండింటికీ అర్థమే మూలం, అని కౌటిల్యుని అభిప్రాయం.

మూ. మర్యాదాం స్థాపయేదాచార్యానమాత్యాన్ వా, య ఏనమపాయ స్థానేభ్యః వారయేయుః, - ఛాయానాలికాప్రతోదేన వా రహసి ప్రమాద్యన్త మభితుదేయుః.

వ్యా. రాజు ఆచార్యులను గాని, అమాత్యులను గాని మర్యాదనుగా (కట్టుబాటునుగా) స్థాపించుకోవాలి. అనగా తనవల్ల ఏదైనా పొరబాటు జరిగేటప్పుడు తనను హెచ్చరించడంకోసం తన గురువులను గాని, అమాత్యులను గాని ఆ విషయం చెప్పి స్థాపించుకోవాలి. వాళ్ళు అపాయస్థానాలనుండి, అనగా అపాయానికి హేతువులైన పనులనుండి నివారిస్తూండాలి. రహస్యంలో పొరబాటు చేస్తూన్న రాజును, (అంతఃపురాదులలో ఎక్కువ సమయం గడపడం వంటి పనులు చేస్తూన్నపుడు) ఛాయ, నాలిక అనే అంకుశంతో పొడుస్తూ ఉండాలి.

ఫి. మనిషి ఎండలో నిలచినపుడు నేలమీద పడిన నీడను పాదాలలో కొలిచి పగలు సమయం (టైము) ఎంతైనదో నిర్ణయించేవారు. గొట్టాలలో (నాలిక) నీళ్లుగాని ఇసుకగాని పోసి అది కారిపోవడాన్ని పట్టి కూడా నిర్ణయించేవారు. రాజు ఒక పనిచేయవలసిన సమయం దాటిపోతూన్నప్పుడు అంకుశంతో పొడిచినట్లు ఇవి చూపి ఆతనికి సమయం తెలుపుతూ ఉండాలి అని అర్థం.

అవ. స్వతంత్రుడైన రాజు ఈ విధంగా పారతంత్ర్యం ఎందుకు తెచ్చిపెట్టుకోవాలి అనే ప్రశ్నకు సమాధానం చెపుతున్నాడు-

శ్లో. సహాయసాధ్యం రాజత్వం చక్రమేకం న వర్తతే,
కుర్వీత సచివాంస్తస్మాత్ తేషాం చ శృణుయాన్మతమ్.

ఇతి కౌటిలీయార్థశాస్త్రే వినయాధికారికే ప్రథమాధికరణే సప్తమోఽధ్యాయః
ఇన్ద్రియజయే రాజర్షివృత్తమ్. ఇన్ద్రియజయః సమాప్తః.

వ్యా. "రాజత్వం అనేది సహాయులను దగ్గర ఉంచుకొని సాధించవలసినది. ఒక్క చక్రం ఉన్న బండి నడవదు. అందుచేత సచివులను ఏర్పాటుచేసుకోవాలి; వాళ్ల అభిప్రాయం వింటూండాలి."

వి. ఇంద్రియాలను జయించిన రాజు ఋషివంటివాడు. అందుచేత దీనికి రాజర్షివృత్తం అనిపేరు.

"బాలానందిని" అనే కౌటిలీయార్థశాస్త్రాంధ్రవ్యాఖ్యలో వినయాధికారికమైన ప్రథమాధికరణంలో
ఇంద్రియజయంలో రాజర్షివృత్తం అనే సప్తమాధ్యాయం సమాప్తం.

ఇంద్రియజయం సమాప్తం.

## అథ అష్టమోఽధ్యాయః

### చతుర్థే ప్రకరణే అమాత్యోత్పత్తిః

మూ. 1. సహాధ్యాయినః అమాత్యాన్ కుర్వీత, దృష్టశౌచసామర్థ్యత్వాదితి భారద్వాజః. తే హ్యస్య విశ్వాస్యా భవన్తీతి.

2. నేతి విశాలాక్షః. సహక్రీడితత్వాత్ పరిభవన్త్యేనమ్-యే హ్యస్య గుహ్యసధర్మాణః తాన్ అమాత్యాన్ కుర్వీత, సమానశీలవ్యసనిత్వాత్; తే హ్యస్య మర్మజ్ఞభయాన్నాపరాధ్యన్తీతి.

వ్యా. 1. సహాధ్యాయుల్ని (తనతో కలిసి చదువుకున్నవాళ్లని) అమాత్యులనుగా నియమించాలి. ఎందుచేతననగా వాళ్ల శౌచం (ఆర్థికవ్యవహారాదులలో మోసం చేయకపోవడం (Integrity), సామర్థ్యమూ ముందుగానే తెలిసి ఉంటాయి కదా, అని భారద్వాజుడు అన్నాడు.

2. అది యుక్తం కాదని అంటాడు విశాలాక్షుడు; ఎందుచేత ననగా చిన్నతనంలో కలిసి ఆడుకొన్నవాళ్లవడంచేత వాళ్లు రాజును లక్ష్యపెట్టరు. అందుచేత కొన్ని రహస్యమైన అలవాట్లలో తనతో సమానంగా ఉన్నవాళ్లని అమాత్యులనుగా నియమించాలి. సమానమైన శీలమూ, చెడ్డ అలవాట్లూ ఉన్నవాళ్లవడంచేత ఇతనికి



మన రహస్యాలన్నీ తెలుసును, జాగ్రత్తగా ఉండాలి అనే భయంచేత వాళ్ళు అపరాధం చెయ్యరు.

మూ. 1. సాధారణ ఏష దోష ఇతి పరాశరః, తేషామపి మర్మజ్ఞభయాత్ కృతాకృతాన్యనువర్తేత.

2. శ్లో. యావద్భ్యో గుహ్యమాచష్టే జనేభ్యః పురుషాధిపః,
అవశః కర్మణా తేన వశ్యో భవతి తావతామ్.

3. య ఏనమాపత్సు ప్రాణబాధయుక్తాస్వనుగృహ్ణీయుః తానమాత్యాన్ కుర్వీత; దృష్టానురాగత్వాదితి.

వ్యా. 1. "ఈ దోషం సాధారణమైనది; అనగా ఇద్దరికీ వర్తిస్తుంది" అని అంటాడు పరాశరుడు. "వీళ్లకి నా రహస్యాలన్నీ తెలుసును కదా" అనే భయంచేత రాజు కూడా వాళ్ళు పనులు సరిగా చేసినా చేయకపోయినా వాళ్లని అనుసరించి ఉండవలసివస్తుంది.

2. "రాజు తన రహస్యాన్ని (శీలభ్రంశం మొదలైనదానిని) ఎంతమందికి చెపుతాడో, ఆ పనికి అధీరుడై, అంతమందికీ కూడ లొంగి ఉండవలసి వస్తుంది.'

3. అందుచేత ఎవళ్లు ప్రాణాపాయహేతువులైన ఆపదలలో ఉపకరిస్తారో వాళ్లని అమాత్యులనుగా నియమించాలి. ఎందుచేతననగా వాళ్లకు తనమీద అనురాగం ఉన్నదనే విషయం తనకు తెలుసును.

మూ. నేతి పిశునః; భక్తిరేషా న బుద్ధిగుణః, సంఖ్యాతార్థేషు కర్మసు నియుక్తా యే యథాదిష్టమర్థం సవిశేషం వా కుర్యుః తానమాత్యాన్ కుర్వీత; దృష్టగుణత్వాత్ ఇతి.

వ్యా. "ఇది యుక్తం కాదు" అంటాడు పిశునుడు (చాడీలు చెప్పే నారదుడు). ఇది (ఆపత్సమయంలో ప్రాణాలు కూడా ఒడ్డి సహాయంచేయడం) రాజభక్తి అనిపించుకొంటుంది కాని బుద్ధిగుణం కాదు. "ఈ పనివల్ల ఇంత ఆదాయం రావాలి' అని ముందుగానే ఊహించిన (సంఖ్యాత=Calculated) పనులు చేయడానికి నియుక్తులై ఎవళ్లు అనుకొన్న ధనాన్ని కాని, అంతకు మించిన ధనాన్ని కాని సంపాదించి చూపగలుగుతారో వాళ్లని అమాత్యులుగా నియమించాలి. ఎందుచేతననగా వాళ్ల గుణం (బుద్ధిబలం) చూడబడింది. (దృష్ట=proved).

మూ. నేతి కౌణపదన్తః. అన్యైరమాత్యగుణైరయుక్తా హ్యేతే. పితృపైతామహానమాత్యాన్ కుర్వీత, దృష్టాపదానత్వాత్. తే హ్యేనమపచరన్తమపి న త్యజన్తి, సగన్ధత్వాత్. అమానుషేష్వపి చైతద్ దృశ్యతే - గావో హ్యసగన్ధం గోగణమతిక్రమ్య సగన్ధేష్వేవావతిష్ఠన్తే ఇతి.

వ్యా. 'అలా కాదు' అంటాడు కౌణపదంతుడు. వీళ్లకి అమాత్యులకుండవలసిన ఇతరగుణాలు లేవు కదా? తండ్రి తాతల దగ్గరనుంచీ వస్తున్న కుటుంబాలకి చెందిన వాళ్లని అమాత్యులనుగా నియమించాలి. వీళ్లు, అనగా ఆ వంశానికి చెందిన పూర్వీకులు, చేసిన పనులు తెలుసును కదా? (వీళ్ల తాతలు తండ్రులు, ఈ రాజవంశంవారితో మంచి సంబంధాలతో ఉండేవారు కాబట్టి వీళ్లుకూడా అదే విధంగా ఉంటారని ఆశించవచ్చునని అభిప్రాయం). తమ కేమైనా రాజు అపకారం చేసినా చాలా కాలంనుంచి పరిచయం ఉన్నవాళ్లవడంచేత వాళ్లు రాజును విడచి వెళ్ళిపోరు. మనుష్యులు కాని పశుపక్ష్యాదులలో కూడా ఇది కనబడుతుంది. గోవులు పూర్వపరిచయం లేని గోసముదాయాన్ని విడిచివేసి పరిచయం ఉన్న వాటితోనే నివసిస్తాయి.

మూ. నేతి వాతవ్యాధిః. తే హ్యస్య సర్వమవగృహ్య స్వామివత్ ప్రచరన్తీతి. తస్మాన్నీతివిదో నవానమాత్యాన్ కుర్వీత. నవాస్తు యమస్థానే దణ్డధరం మన్యమానాః నాపరాధ్యన్తీతి.

వ్యా. "అది సరికాదు" అని అంటాడు ఉద్ధవుడు (శ్రీకృష్ణుని మంత్రి). కులక్రమాగతులైన అమాత్యులు అన్ని విషయాలూ తమచేతిలో పెట్టుకొని వాళ్లే ప్రభువులన్నట్లు ప్రవర్తిస్తారు. అందుచేత కొత్తవాళ్లైన నీతిశాస్త్రవేత్తలను అమాత్యులనుగా నియమించాలి. కొత్తవాళ్లు దండధరుడైన రాజును యముణ్ణిగా భావించి అపరాధాలేవీ చేయరు.

మూ. నేతి బాహుదన్తీపుత్రః. శాస్త్రవిదదృష్టకర్మా కర్మసు విషాదం గచ్ఛేత్. అభిజనప్రజ్ఞాశౌచశౌర్యానురాగయుక్తానమాత్యాన్ కుర్వీత, గుణప్రాధాన్యాత్.

వ్యా. ఇదీ కాదంటాడు బాహుదంతీపుత్రుడు. శాస్త్రం తెలిసినవాడైనా పనిలో అనుభవంలేనివాడు(a man without experience and Practical Knowledge) ఏవైనా పనులు వచ్చినపుడు దిగాలు పడిపోతాడు. అందుచేత గుణాలకే ప్రాధాన్యం ఇచ్చి వంశశుద్ధి, ప్రజ్ఞ, శౌచం, శౌర్యం, అనురాగం ఉన్నవాళ్ళను అమాత్యులనుగా నియమించాలి.



మూ. సర్వముపపన్నమితి కౌటిల్యః, కార్యసామర్థ్యాద్ధి పురుషసామర్థ్యం కల్ప్యతే. సామర్థ్యతశ్చ-

శ్లో. విభజ్యామాత్యవిభవం దేశకాలౌ చ కర్మ చ,
అమాత్యాః సర్వ ఏవైతే కార్యాః స్యుర్న తు మన్త్రిణః.

ఇతి కౌటిలీయార్థశాస్త్రే వినయాధికారికే ప్రథమాధికరణే అష్టమోధ్యాయః
అమాత్యోత్పత్తిః.

వ్యా. (పైన చూపిన విధంగా) పూర్వాచార్యులు చెప్పిన దంతా యుక్తమే అని కౌటిల్యుని అభిప్రాయం. సహాధ్యాయాదుల్ని అమాత్యులనుగా నియమించడంలో సాధకబాధకాలు రెండూ ఉన్నాయి అనే మాట నిజమే అని అర్థం. పురుషుని సామర్థ్యాన్ని, అతని కున్న ఆ యా కార్యాలు చేయగలిగిన సామర్థ్యాన్ని పట్టి నిర్ణయించాలి. అనగా ఎంత సమర్థుడైనా ప్రతి ఒక్కడూ అన్ని పనులూ ఒకే విధంగా సాధించలేడు. ఒకడు ఒక పని సాధించకలుగుతే మరొకడు మరొక విధమైన పని సాధించకలుగుతాడు. ఒక పని బాగా సాధించకలడు కదా అని అన్ని పనులూ అదే విధంగా సాధించకలుగుతాడనేది లేదు అని అర్థం. అందుచేత కార్యసామర్థ్యాన్నీ, అనగా ఒక పని సాధించడానికి కావలసిన సామర్థ్యాన్నీ, పురుషునకు ఉన్న సామర్థ్యాన్నీ దృష్టిలో పెట్టుకొని -

"అమాత్యునికి (అమాత్యుడుగా నియమించబడబోయేవానికి) ఉన్న గుణసంపదను విడివిడిగా అంచనా వేసి, దేశకాలాలను, కర్మనూ కూడ దృష్టిలో ఉంచుకొని ఈ సహాధ్యాయ్యాదులందరినీ కూడ అమాత్యులుగా, ఆ యా పనులు సాధించే కర్మసచివుల్నిగా, నియమించాలి. వీళ్లని మంత్రులుగా (బుద్ధిసచివులుగా మాత్రం) నియోగించకూడదు".

"బాలానందిని" అనే కౌటిలీయార్థశాస్త్రాంధ్రవ్యాఖ్యానంలో వినయాధికారికమైన
ప్రథమాధికరణంలో అమాత్యోత్పత్తి అను అష్టమాధ్యాయం సమాప్తం.

## అథ నవమోఽధ్యాయః

### పఞ్చమే ప్రకరణే మన్త్రిపురోహితోత్పత్తిః

మూ. జానపదః, అభిజాతః, స్వవగ్రహః, కృతశిల్పః, చక్షుష్మాన్, ప్రాజ్ఞః, ధారయిష్ణుః, దక్షః, వాగ్మీ, ప్రగల్భః, ప్రతిపత్తిమాన్, ఉత్సాహప్రభావ యుక్తః, క్లేశసహః, శుచిః, మైత్రః, దృఢభక్తిః, శీలబలారోగ్యసత్త్వసంయుక్తః, స్తమ్భచాపల్యవర్జితః, సంప్రియః, వైరాణామకర్తేత్యమాత్యసంపత్. అతః పాదార్ధగుణహీనౌ మధ్యమావరౌ.

వ్యా. అమాత్యుడు (అనగా ప్రధానామాత్యుడు-మంత్రి) తన దేశానికి చెందినవాడు, మంచి వంశంలో పుట్టినవాడు, ఏవైన పొరబాట్లు చేసేటప్పుడు సులభంగా మరల్చదగినవాడు, శిల్పాలలో నేర్పరి, నిజమైన నేత్రమైన అర్థశాస్త్రంలో పండితుడు, సహజబుద్ధిసంపన్నుడు, జ్ఞాపకశక్తి లేదా పట్టుదల ఉన్నవాడు, సమర్థుడు, వాక్చాతుర్యం ఉన్నవాడు, ప్రగల్భుడు (bold), సమయస్ఫూర్తిగలవాడు (possessed of ready wit), ఉత్సాహమూ, ప్రభుశక్తి ఉన్నవాడు (ప్రభావ=commanding power), కష్టాలు సహించగలవాడు,శుచి అయినవాడు(up right) స్నేహశీలుడు, దృఢమైన భక్తి కలవాడు, మంచి శీలము(character), బలము, ఆరోగ్యము, ధైర్యము (సత్త్వమ్=spirit)ఉన్నవాడు, స్తంభము (మొండితనం stiffness), చాపల్యము (fickleness) లేనివాడు, సంప్రియుడు (అందరినీ ఆకట్టుకొనేవాడు amiable), అనవసరమైన తగాదాలు సృష్టించనివాడూ అయి ఉండాలి. ఇదే ప్రధానామాత్యునికి ఉండవలసిన గుణసంపద. ఈ గుణాలలో నాల్గవవంతు లేనివాడు మధ్యముడు, సగం లేనివాడు అధముడు.

మూ. తేషాం జనపదమవగ్రహం చాప్తతః పరీక్షేత; సమానవిద్యేభ్యః శిల్పం, శాస్త్రచక్షుష్మత్తాం చ; కర్మారమ్భేషు ప్రజ్ఞాం ధారయిష్ణుతాం దాక్ష్యం చ; కథాయోగేషు వాగ్మిత్వం, ప్రాగల్భ్యం, ప్రతిభానవత్త్వం చ; ఆపద్యుత్సాహప్రభావౌ క్లేశసహత్వం చ; సంవ్యవహారాత్ శౌచం, మైత్రతామ్, దృఢభక్తిత్వం చ; సంవాసిభ్యః శీలబలారోగ్యసత్త్వయోగమ్, అస్తమ్భమ్, అచాపల్యం చ; ప్రత్యక్షతః సంప్రియత్వమ్, అవైరిత్వం చ.



వ్యా. పైన చెప్పిన గుణాలలో పుట్టిన దేశాన్ని (Nationality). అవగ్రహాన్నీ (తప్పుదారి నుంచి సులభంగా మళ్లించడానికి శక్యమైనవాడు అనే విషయాన్ని (tractability) బంధుజనం నుంచి తెలుసుకొని పరీక్షించాలి. శిల్పనైపుణ్యాన్నీ, శాస్త్ర సహాయంతో చూడగల డనే విషయాన్నీ ఆ విద్యలలో ప్రవీణులైనవారి ద్వారా పరీక్షించాలి. పనులు సాధించే విధానాన్ని పట్టి (కార్యారంభః = handling of undertakings), అతని సహజబుద్ధిని, ధారణాశక్తినీ (ధారయిష్ణుతా =perseverence), నేర్పునూ పరీక్షించాలి. సంభాషణలలో అతని వాక్చాతుర్యాన్నీ, ప్రగల్భత్వాన్నీ, సమయస్ఫూర్తినీ పరీక్షించాలి. ఉత్సాహాన్నీ, ప్రభావాన్నీ, క్లేశాలను సహించే శక్తినీ ఆపత్సమయాలలో పరీక్షించాలి. సంవ్యవహారం (dealings) వల్ల శౌచాన్నీ, స్నేహశీలాన్నీ, దృఢభక్తినీ పరీక్షించాలి. వానితో సన్నిహితంగా ఉండేవాళ్ల ద్వారా శీలాన్నీ, బలాన్నీ, ఆరోగ్యాన్నీ, ధైర్యాన్నీ, మొండి పట్టు చాపల్యమూ లేకపోవడాన్నీ పరీక్షించాలి. సంప్రియత్వాన్నీ, అవైరిత్వాన్ని (కలహించే స్వభావం లేకపోవడాన్నీ) స్వయంగా పరిశీలించి తెలుసుకోవాలి.

మూ. ప్రత్యక్షపరోక్షానుమేయా హి రాజవృత్తిః. స్వయం దృష్టం ప్రత్యక్షం, పరోపదిష్టం పరోక్షం; కర్మసు కృతేనాకృతావేక్షణమనుమేయమ్. యౌగపద్యాత్తు కర్మణామనేకత్వాత్ అనేకస్థత్వాచ్చ దేశకాలాత్యయో మా భూదితి పరోక్షమమాత్యైః కారయేత్. ఇత్యమాత్యకర్మ.

వ్యా. రాజవ్యవహారం ప్రత్యక్షంగాను, పరోక్షంగాను, అనుమేయంగాను కూడా ఉంటుంది. స్వయంగా చూచినది ప్రత్యక్షం. ఇతరులు చెప్పినది పరోక్షం. పూర్తి అయిన పనిని పట్టి పూర్తికావలసినదిగా ఊహించబడేది అనుమేయం. చేయవలసిన పనులు ఎన్నో ఉంటాయి. చాలా పనులు ఒక్కమాటు చుట్టబెట్టుకొని వస్తాయి. అవి కూడా వేరు వేరు ప్రదేశాలలో ఉంటాయి. అలాంటప్పుడు (అన్నీ తానే చేయాలని రాజు అనుకొనకూడదు) దేశము, కాలము మించిపోకుండా ఉండాలంటే పరోక్షములైన పనులన్నీ అమాత్యులచేతనే చేయించాలి. ఇది అమాత్యకర్మ

మూ. పురోహితముదితోదితకులశీలం షడఙ్గే వేదే దైవే నిమిత్తే దణ్డనీత్యాం చ అభివినీతమ్, ఆపదాం దైవమానుషీణామ్ అథర్వభిరుపాయైశ్చ ప్రతికర్తారం కుర్వీత. తమాచార్యం శిష్యః పితరం పుత్రో భృత్యః స్వామినమివ చానువర్తేత.

వ్యా. అత్యున్నతమైన కులంలో పుట్టినవాడు, ఉత్తమమైన శీలం కలవాడు, ఆరు అంగాలు గల వేదంలోను, దైవంవల్ల (దేవతాప్రభావం వల్ల) కలిగే కొన్ని సూచనలలోను, (పూర్వజన్మలో చేసిన కర్మయొక్క పరిపాకమే దైవం, ఆ దైవాన్ని గూర్చి చెప్పే జ్యోతిఃశాస్త్రంలోను అని కూడా 'దైవే' అనే దానికి అర్థం), శకునాలలోను, దండనీతిలోను బాగా శిక్షితుడు, దైవంవల్ల కలిగే ఆపదలకు, మనుష్యులవల్ల కలిగే ఆపదలకు అథర్వవేదంలో చెప్పిన మంత్రాల ప్రయోగంచేతా, ఇతరోపాయాలచేతా ప్రతిక్రియ చేయగలవాడు అయినవానిని పురోహితుణ్ణిగా ఏర్పరచుకోవాలి. శిష్యుడైన రాజు ఆచార్యుడైన ఆ పురోహితుణ్ణి (అన్ని కార్యాలలోను అగ్రస్థానంలో ఉంచబడేవాడు అని "పురోహిత" శబ్దార్థం. పురః ధీయతే ఇతి పురోహితః) పుత్రుడు తండ్రిని వలె, భృత్యుడు స్వామిని (యజమానిని)వలె సర్వదా అనుసరించి ఉండాలి.

శ్లో॥ బ్రాహ్మణేనైధితం క్షత్రం మన్త్రిమన్త్రాభిమన్త్రితమ్,
జయత్యజితమత్యన్తం శాస్త్రానుగమశస్త్రితమ్.

*ఇతి కౌటిలీయార్థశాస్త్రే వినయాధికారికే ప్రథమాధికరణే నవమోఽధ్యాయః. మన్త్రి పురోహితోత్పత్తిః.*

వ్యా. వెనుక చెప్పిన గుణాలన్నీ ఉన్న పురోహితునిచేత వృద్ధిపొందింపబడి, మంత్రియొక్క మంతనం అనే మంత్రంచేత పవిత్రీకృతమై, దండనీతిశాస్త్రాన్ని అనుసరించడం అనే శస్త్రాన్ని పట్టిన క్షత్రియకులం చాలా అభివృద్ధిలో ఉంటుంది. దీనిని ఎవరూ జయించజాలరు.

*"బాలానందిని" అనే కౌటిలీయార్థశాస్త్రాంధ్రవ్యాఖ్యానంలో వినయాధికారికమైన ప్రథమాధికరణంలో "మంత్రిపురోహితోత్పత్తి" అనే తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.*

## అథ దశమోఽధ్యాయః

### షష్ఠే ప్రకరణే ఉపధాభిః శౌచాశౌచజ్ఞానమమాత్యానామ్

మూ. మన్త్రిపురోహితసఖః సామాన్యేష్వధికరణేషు స్థాపయిత్వా-మాత్యాన్ ఉపధాభిః శౌచయేత్.

వ్యా. మంత్రితోను, పురోహితునితోను కూడినవాడై (అనగా మంత్రి పురోహితుల సలహా ప్రకారం) రాజు అమాత్యులను కొన్ని సామాన్యములైన (అంతగా



ప్రధానం కాని) అధికరణాలలో (Offices) (అధికారాలలో) నియమించి ఉపధలచేత వాళ్ల శుచిత్వాన్ని పరీక్షించాలి.

వి. 'ఉపధ' అనగా రహస్యమైన పరీక్ష (secret test); ఏవేవో ప్రలోభనాలు చూపి పరీక్షించడం.

మూ. పురోహితమయాజ్యయాజనాధ్యాపనే నియుక్తమ్ అమృష్యమాణం రాజా అవక్షిపేత్. స సత్రిభిః శపథపూర్వకమేకైకమమాత్యముపజాపయేత్-అధార్మికోఽయం రాజా, సాధుధార్మికమన్యమస్య తత్కులీన మవరుద్ధం కుల్యమేకప్రగ్రహం సామన్తమాటవికమ్ ఔపపాదికం వా ప్రతిపాదయామః. సర్వేషామేతద్రోచతే, కథం వా తవేతి. ప్రత్యాఖ్యానే శుచిరితి ధర్మోపధా.

వ్యా. యాగం చేయించకూడనివానిచేత యాగం చేయించమనీ, వేదాధ్యయనం చేయకూడనివానికి వేదం చెప్పమనీ పురోహితుణ్ణి నియమించి, అతడు దానికి అంగీకరించకపోగా రాజు అతనిని పదవీచ్యుతుణ్ణి చెయ్యాలి, లేదా అవమానించాలి. అప్పుడా పురోహితుడు కొందరు సత్రులను (గూఢపురుషులను)పంపి వాళ్ల ద్వారా శపథపూర్వకంగా ఒక్కొక్క అమాత్యుణ్ణి భేదించాలి, పురిగొల్పాలి, అనగా వానికి రాజు విషయంలో ద్వేషం కలిగేటట్లు చెయ్యాలి. ఇలా చెప్పాలి- "ఈ రాజు అధార్మికుడు, సరే; ఇతని స్థానంలో మరొకరిని-ఇతని వంశానికే చెందిన వానిని కాని, రాజుచేత నిగ్రహించబడి కట్టడిలో ఉంచబడిన రాజు కుమారుణ్ణిగాని, మంచి వంశానికి చెందిన మరొకనిని గాని, ఈ రాజ్యానికి ప్రధానమైన ఆధారంగా ఉన్నవానిని గాని, సామంతుణ్ణి గాని అనగా పొరుగు రాజ్యంలో ఉన్న రాజును గాని, అడవికి రాజుగా ఉన్నవానినిగాని, లేదా మనం అందరం ఆలోచించి అంగీకరించిన మరొకనిని గాని స్థాపిద్దాం. మిగిలిన వాళ్లందరూ ఇష్టపడ్డారు; నీ మాటేమిటి?" దానికి అతడు అంగీకరించకపోతే శుచి అన్నట్లు, ఇది ధర్మోపధ.

వి. ఈ విధంగా రాజూ పురోహితుడూ కలిసి నాటక మాడాలి అని అర్థం. సత్రీ= మారువేషాలతో తిరిగే గూఢచారి. గూఢపురుషప్రణిధిప్రకరణంలో చెప్పబడుతుంది. ఏకప్రగ్రహః=ఈ రాజ్యానికి ఏకైకస్తంభంగా ఉన్నవాడు అని కొందరు, అందరిచేత సమంగా గౌరవించబడేవాడు అని కొందరూ అర్థం చెప్పారు. ఔపపాదికః= పర్వతసమీపంలో ఉన్న రాజు అని కూడా ఒక వ్యాఖ్యాత. ఇది ధర్మం పేరిట చేసే ఉపధ కాబట్టి 'ధర్మోపధ'

మూ. సేనాపతిరసత్ప్రగ్రహేణావక్షిప్తః సత్రిభిరేకైకమమాత్యముపజాపయేత్ లోభనీయేన అర్థేన రాజవినాశాయ- సర్వేషామేతద్ రోచతే; కథం వా తవేతి ప్రత్యాఖ్యానే శుచిః, ఇత్యర్థోపధా.

వ్యా. చెడ్డవాళ్లని చేరతీయడంచేత అవమానించబడిన లేదా ఉద్యోగంనుంచి తొలగించబడిన సేనాపతి, సత్రుల ద్వారా ఒక్కొక్క అమాత్యుణ్ణీ, ఆశించదగిన ధనం చూపించి, రాజును నశింపచేయడం కోసం పురిగొల్పాలి. "అందరూ ఇందుకు ఇష్టపడుతున్నారు; నువ్వు ఏమంటావు?" అని అడిగించాలి. దీనికి అతడు ఇష్టపడకపోతే శుచి అని అర్థం. ఇది అర్థోపధ.

మూ. పరివ్రాజికా లబ్ధవిశ్వాసా అన్తఃపురే కృతసత్కారా మహామాత్రమేకైకమ్ ఉపజపేత్ "రాజమహిషీ త్వాం కామయతే, కృతసమాగమోపాయా, మహాన్ అర్థశ్చ భవిష్యతి" ఇతి. ప్రత్యాఖ్యానే శుచిః. ఇతి కామోపధా.

వ్యా. అంతఃపురంలో గౌరవం పొందుతున్న పరివ్రాజిక (సంన్యాసిని)అమాత్యుల విశ్వాసం పొంది, ఒక్కొక్క అమాత్యుని దగ్గరికి వెళ్ళి ఇలా ఉపజాపం చెయ్యాలి (మనస్సు మార్చాలి) - "రాజభార్యకు నీమీద చాలా ప్రేమ ఉంది. సమాగమానికి తగిన ఉపాయాలు కూడా చేయించింది. ఇంకా మంచి ప్రయోజనం, ధనం మొదలైనది కూడా లభిస్తుంది" అని చెప్పాలి. అందుకు అతడు నిరాకరిస్తే 'శుచి' అని అర్థం. ఇది కామోపధ.

మూ. ప్రహవణనిమిత్తమేకోఽమాత్యః సర్వానమాత్యానావాహయేత్. తేనోద్వేగేన రాజా తానవరున్ధ్యాత్. కాపటికశ్ఛాత్రః పూర్వావరుద్ధః తేషామర్థమానావక్షిప్త మేకైకమమాత్యమ్ ఉపజాపేత్ - "అసత్ప్రవృత్తోఽయం రాజా, సాధు; ఏనం హత్వా అన్యం ప్రతిపాదయిష్యామః. సర్వేషామేతద్ రోచతే, కథం వా తవేతి, ప్రత్యాఖ్యానే శుచిరితి భయోపధా.

వ్యా. ఒక అమాత్యుడు ప్రహవణం నిమిత్తం (పెద్ద విందుకోసం) మిగిలిన అమాత్యులను అందరినీ ఆహ్వానించాలి. అందుకు సహించక రాజు వాళ్లనందరినీ ధనం లాగికొని బంధించాలి. అంతకు ముందే కారాగారంలో బద్ధుడై ఉన్న కాపటికఛాత్రుడు, ఆ అమాత్యులలో ధనమానాలు లాగికొని అవమానించబడిన ఒక్కొక్క అమాత్యుని దగ్గరికి వెళ్లి ఉపజాపం చెయ్యాలి (తిరుగుబాటు చేసేటట్లు



చెయ్యాలి)- "ఈ రాజు ప్రవర్తన ఏమీ బాగా లేదు, సరే; ఇతనిని చంపివేసి మరొకనిని తీసికొని వద్దాం; అందరికీ ఇది ఇష్టమే. నీ మాట ఏమిటి" అని అడగాలి. అందుకు అంగీకరించకపోతే అతడు శుచి అని అర్థం. ఇది భయోపధ.

వి. ఛాత్రః కాపటికః=ఉపాధ్యాయుడుగానో, విద్యార్థిగానో సంచరించే గూఢచారి.

మూ. తత్ర ధర్మోపధాశుద్ధాన్ ధర్మస్థీయకణ్టకశోధనేషు స్థాపయేత్; అర్థోపధాశుద్ధాన్ సమాహర్తృ-సంనిధాతృ-నిచయకర్మసు; కామోపధాశుద్ధాన్ బాహ్యాభ్యన్తరవిహారరక్షాసు; భయోపధాశుద్ధానాసన్నకార్యేషు రాజ్ఞః. సర్వోపధాశుద్ధాన్ మన్త్రిణః కుర్యాత్. సర్వత్రాశుచీన్ ఖనిద్రవ్యహస్తివనకర్మాన్తేషూపయోజయేత్.

వ్యా. ఈ చతుర్విధోపధాశుద్ధులలో ధర్మోపధాశుద్ధులను ధర్మనిర్ణయ స్థానాలలోను (Judiciary), సంఘద్రోహులను అణచివేయడానికీ నియమించాలి. అర్థోపధాశుద్ధులను సమాహర్తలనుగాను (administrator), సంనిధాత (Director of stores) ఉండే కోష్ఠాగారాలలోను (స్టోర్సులలోను) నియమించాలి. కామోపధాశుద్ధులను అంతఃపురంలోను, బైటా ఉండే విహారస్థానాల రక్షకులనుగా నియమించాలి. భయోపధాశుద్ధులను రాజుకు దగ్గర ఉండి చేసే (ఆత్మశరీరరక్షణాది) కార్యాలలో నియమించాలి. అన్ని ఉపధలలోను శుద్ధులైన వారిని మంత్రులనుగా నియమించాలి. అన్ని ఉపధలలోను అశుచులు అని తేలినవాళ్లని గనులలోను, అరణ్యంలో ఉండే వస్తువులను సేకరించడంలోను, గజవనాలలోను, కర్మాగారాలలోను నియమించాలి.

వి. నిచయకర్మ=వస్తువులను ప్రోగుచేయడం (storing)

శ్లో. త్రివర్గభయసంశుద్ధానమాత్యాన్ స్వేషు కర్మసు,
అధికుర్యాద్ యథాశౌచమిత్యాచార్యా వ్యవస్థితాః.

వ్యా. ధర్మ-అర్థ-కామ-భయ ఉపధలలో శుద్ధులైన అమాత్యులను వాళ్ల శుచిత్వాన్ని పట్టి ఆ యా కర్మలలో నియమించాలి అని ప్రాచీనులైన ఆచార్యులు నిర్ణయించినారు. అయితే ఈ ఉపధాప్రయోగం తనకు అభిమతం కాదని చెపుతున్నాడు.

శ్లో. న త్వేవ కుర్యాదాత్మానం దేవీం వా లక్ష్యమీశ్వరః,
శౌచహేతోరమాత్యానామేతత్ కౌటిల్యదర్శనమ్.

వ్యా. రాజు అమాత్యుల శౌచాన్ని పరీక్షించడం కోసం తనను, దేవినీ లక్ష్యంగా చేయకూడదు. "రాజు చెడ్డవాడు; రాణి నీమీద ప్రేమతో ఉంది" ఇత్యాది విధంగా తన పేరు, రాణీ పేరు ఈ పరీక్షలలోనికి తీసికొని రాకూడదు అని అర్థం. ఇది కౌటిల్యుని మతం.

శ్లో. న దూషణమదుష్టస్య విషేణేవామ్భసశ్చరేత్,
కదాచిద్ధి ప్రదుష్టస్య నాధిగమ్యేత భేషజమ్.

వ్యా. నీటిలో విషం కలిపి పాడు చేసినట్లు మంచివాని మనస్సు ఈ విధంగా పాడు చేయకూడదు. (సహజంగా మంచివాడైనా కూడ ఈ ప్రలోభనాలతో చెడ్డవాడు అయిపోవచ్చును అని భావం). ఒక మాటు చెడిపోయాడా వానికి ఇంక బాగుపడడానికి మందు దొరకకపోవచ్చును.

శ్లో. కృతా చ కలుషా బుద్ధిరుపధాభిశ్చతుర్విధా,
నాగత్వాన్తం నివర్తేత స్థితా సత్త్వవతాం ధృతౌ.

వ్యా. స్థిరనిశ్చయం గల ధీరులైన వారి బుద్ధి నాలుగు విధాలుగా ఉపధలచేత కలుషం చేయబడినట్లయితే అదేదో చివర చూచేవరకు, రాజు అంతం చేసేవరకు, వెనుకకు తిరగదు.

మూ. తస్మాద్ బాహ్యమధిష్ఠానం కృత్వాచార్యే చతుర్విధే,
శౌచాశౌచమమాత్యానాం రాజా మార్గేత సత్రిభిః.

ఇతి కౌటిలీయార్థశాస్త్రే వినయాధికారికే ప్రథమాధికరణే దశమోఽధ్యాయః
ఉపధాభిః శౌచాశౌచజ్ఞానమమాత్యానామ్.

వ్యా. అందువలన రాజు ఈ నాలుగువిధాలైన ఉపధలలో (తనకు కాని రాణికి గాని ఏమీ ప్రమేయం లేకుండా) బైటదానిని దేనినైనా (వ్యక్తులనుగాని, వస్తువులనుగాని) లక్ష్యం చేసి, సత్రుల ద్వారా అమాత్యుల శౌచాశౌచాలను అన్వేషించాలి (పరీక్షించాలి).

"బాలానందిని" అనే కౌటిలీయార్థశాస్త్రాంధ్రవ్యాఖ్యానంలో వినయాధికారికమైన ప్రథమాధికరణంలో ఉపధలచేత అమాత్యుల శౌచాశౌచజ్ఞానం అనే దశమాధ్యాయం సమాప్తం.



## అథ ఏకాదశోఽధ్యాయః

### సప్తమే ప్రకరణే గూఢపురుషోత్పత్తిః

మూ. ఉపధాభిః శుద్ధామాత్యవర్గో గూఢపురుషానుత్పాదయేత్, కాపటికోదాస్థిత గృహపతికవైదేహకతాపసవ్యఞ్జనాన్ సత్రితీక్ష్ణరసదభిక్షుకీశ్చ.

వ్యా. ఉపధలచేత అమాత్యుల నందరినీ పరీక్షించిన రాజు కాపటికులను, ఉదాస్థితులను, గృహపతికులను, వైదేహకులను, తాపసవ్యంజనులను, సత్రులను, తీక్ష్ణులను, రసదులను, భిక్షుకీలను గూఢచారులనుగా నియమించాలి. (వ్యంజనశబ్దం గృహపతిక - వైదేహకులకు కూడా అన్వయిస్తుంది. గృహపతివ్యంజనులు, వైదేహకవ్యంజనులు అని అర్థం. పైకి అలా కనబడే వాళ్లు అని అర్థం.

మూ. పరమర్మజ్ఞః ప్రగల్భః ఛాత్రః కాపటికః. తమర్థమానాభ్యాముత్సాహ్య మన్త్రీ బ్రూయాత్ - "రాజానం మాం చ ప్రమాణం కృత్వా యస్య యదకుశలం పశ్యసి తత్ తదానీమేవ ప్రత్యాదిశ' ఇతి.

వ్యా. ఇతరుల రహస్యాలను తెలిసికొనగలిగిన, ప్రౌఢుడైన విద్యార్థి "కాపటికుడు". మంత్రి అతనిని ధనంచేత, సత్కారంచేత ప్రోత్సహించి - "రాజును నన్ను ప్రమాణంగా చేసికొని (on the authority of the King and myself) ఎవనిలోనైనా ఏదైనా చెడును నీవు చూస్తే వెంటనే మాకు తెలపాలి" అని అతనితో చెప్పాలి.

మూ. ప్రవ్రజ్యాప్రత్యవసితః, ప్రజ్ఞాశౌచయుక్తః ఉదాస్థితః. స వార్తాకర్మప్రదిష్టాయాం భూమౌ ప్రభూతహిరణ్యాన్తేవాసీ కర్మ కారయేత్. కర్మఫలాచ్చ సర్వప్రవ్రజితానాం గ్రాసాచ్ఛాదనావసథాన్ ప్రతివిదధ్యాత్. వృత్తికామాంశ్చోపజపేత్-"ఏతేన వేషేణ రాజార్థశ్చరితవ్యః, భక్తవేతనకాలే చ ఉపస్థాతవ్యమ్" ఇతి. సర్వప్రవ్రజితాశ్చ స్వం స్వం వర్గముపజపేయుః.

వ్యా. కొంతకాలం పరివ్రాజకుడుగా దేశద్రిమ్మరిగా సంచరించే సంన్యాసిగా, (వైదిక-బౌద్ధ-జైన-కాపాలికాదులలో ఎవరైనా కావచ్చును) ఉండి, దానినుంచి (ఆ సంన్యాసంనుంచి) వెనుకకు వచ్చినవాడు, బుద్ధిబలము, శౌచమూ ఉన్నవాడు "ఉదాస్థితుడు". అతడు అధికమైన బంగారం (ధనం) శిష్యవర్గమూ ఉండి వార్తాకర్మకు (వ్యవసాయం, వర్తకం మొదలైనవాటికి) నిర్దేశించబడిన ప్రదేశంలో పనిచేయించాలి.

అలా, పని చేయించగా వచ్చిన ఫలంతో (లాభంతో) అందరు పరివ్రాజకులకు (వాళ్లు ఏ సంప్రదాయానికి చెందినా)ఆహారం, వస్త్రం, నివాసం ఏర్పాటు చెయ్యాలి. వాళ్లల్లో స్థిరమైన వృత్తి కావాలని అనుకొనే వాళ్ళు ఎవరైనా ఉంటే వాళ్లకి ఉపజాపం చెయ్యాలి. అనగా "మీరు ఈ వేషంతోనే తిరుగుతూ రాజుకు కావలసిన పని (రహస్యసమాచారం సేకరించడం అనే పని) చేస్తూ ఉండాలి. భోజనం వేళకీ, జీతం తీసికొనే వేళకీ ఇక్కడికి వస్తూ ఉండండి" అని రహస్యంగా చెప్పాలి. ఆ పరివ్రాజకులందరూ కూడా తమ తమ వర్గానికి (తమ సంప్రదాయానికి చెంది తమతో ఉన్నవాళ్లకి) ఇలాగే రహస్యంగా బోధించాలి.

మూ. కర్షకో వృత్తిక్షీణః ప్రజ్ఞాశౌచయుక్తః గృహపతికవ్యఞ్జనకః. సః కృషికర్మప్రదిష్టాయాం భూమావితి సమానం పూర్వేణ.

వ్యా. తన వృత్తిలో (వ్యవసాయంలో) నష్టపోయిన, ప్రజ్ఞాశౌచాలున్న వ్యవసాయదారుడు "గృహపతికవ్యంజనకుడు". అతడు వ్యవసాయం చేయడం కోసం ఇవ్వబడిన భూమిలో........ మిగిలిన దంతా వెనక చెప్పినదానితో సమానం. అనగా అతడు ధనంతోను పరివారంతోను అక్కడ వ్యవసాయం చేసి, వచ్చిన లాభంతో తనతో సమానులైన వాళ్ళందరికీ భోజన-వస్త్ర-నివాసాలు ఏర్పరుస్తూ, "మీరు ఈ పద్ధతిలోనే ఉండి రాజకార్యాలు చేస్తూ భోజన-వేతన సమయాలకి ఇక్కడికి వస్తూ ఉండండి" అని రహస్యంగా వాళ్లకు చెప్పాలి.

మూ. వాణిజకో వృత్తిక్షీణః ప్రజ్ఞాశౌచయుక్తః వైదేహకవ్యఞ్జనః. స వణిక్కర్మప్రదిష్టాయాం భూమావితి సమానం పూర్వేణ.

వ్యా. కొంతకాలం వ్యాపారం చేసి దానిలో నష్టపోయిన, ప్రజ్ఞ, శౌచము ఉన్న వర్తకుడు "వైదేహకవ్యంజనుడు". అతడు వర్తకం చేయడం కోసం తనకు నిర్దేశించిన ప్రదేశంలో ... ... మిగిలిన దంతా పైన చెప్పినట్లే. అనగా వర్తకం చేసి, వచ్చిన లాభంతో తనవంటివాళ్లకి, కూడా ఉన్నవాళ్లకి భోజన-వస్త్ర-నివాసాలు కల్పించి, రాజు పనులు చేయవలసిందిగా వాళ్లను రహస్యంగా ప్రోత్సహించాలి.

మూ. ముణ్డో జటిలో వా వృత్తికామః తాపసవ్యఞ్జనః. స నగరాభ్యాశే ప్రభూతముణ్డజటిలాన్తేవాసీ శాకం యవసముష్టిం వా మాసద్విమాసాన్తరం ప్రకాశమశ్నీయాత్; గూఢ మిష్టమాహారమ్. వైదేహకాన్తేవాసినశ్చైనం సమిద్ధయో



గైరర్చయేయుః, శిష్యాశ్చాస్యావేదయేయుః - "అసౌ సిద్ధః సామేధికః" ఇతి. స మేధాశాస్తిభిశ్చాభిగతానామఙ్గవిద్యయా శిష్యసంజ్ఞాభిశ్చ కర్మాణి అభిజనే అవసితాని ఆదిశేత్, అల్పలాభమ్, అగ్నిదాహమ్, చోరభయమ్, దూష్యవధమ్, తుష్టిదానమ్, విదేశప్రవృత్తిజ్ఞానమ్, ఇదమద్య శ్వో వా భవిష్యతి ఇదం వా రాజా కరిష్యతీతి.

వ్యా. స్థిరమైన వృత్తి కావాలనే కోరిక గల బోడితల సంన్యాసి లేదా జటలు ధరించిన సంన్యాసి "తాపసవ్యంజనుడు" (రాజు అలాంటివానిని చేరదీయాలని అర్థం). అతడు ఏదో ఒక నగరం దగ్గర బోడితల శిష్యులతోను, జటలు ధరించిన చాలమందితో నివసిస్తూ మాసానికో రెండు మాసాలకో ఒక మాటు నలుగురూ చూస్తుండగా ఏవైనా కూరగాయలు గాని, ఒక పిడికెడు పచ్చగడ్డిగాని తింటూండాలి (అనగా ఇతడు మామూలు ఆహారం తినడు, మాసానికి లేదా రెండు మాసాలకి ఒక సారి ఇలాంటి ఆహారం మాత్రమే తింటాడు అనే ప్రచారం కోసం అలా చెయ్యాలి.) రహస్యంగా తన కేది ఇష్టం అయితే అది తింటూ ఉండవచ్చు. వైదేహకుని శిష్యులు వచ్చి ఇతనిని అత్యధికమైన రహస్యశక్తులతో, ఇతని వద్ద గొప్ప శక్తులున్నాయి అని లేదా ఈయన శక్తివల్ల వేము ఈ ఈ లాభాలు పొందాము అని ప్రచారం చేస్తూ పూజించాలి. "ఇతడు భవిష్యత్తులో గొప్ప సంపదను ఇవ్వగలిగిన సిద్ధపురుషుడు" అని అతని శిష్యులు ప్రచారం చెయ్యాలి. తమకు కలగబోయే అభివృద్ధిని తెలుసుకోవాలని వచ్చేవాళ్లకు అంగవిద్యచేత (వచ్చి ప్రశ్నించే వాళ్ల అవయవాల కదలిక, ముఖచ్ఛాయ మొదలైన వాటిని పట్టి వాళ్ల స్వభావాదులను గుర్తించే విద్య అంగవిద్య) శిష్యుల సంజ్ఞలచేతా (అంతకు పూర్వమే వాళ్లని గూర్చి కొంత తెలుసుకొని ఉన్న శిష్యులు రహస్యంగా చేసి చూపే నేత్రచాలనాదిచేష్టలచేత) పూర్వం వాళ్ల వంశంలో (కుటుంబంలో) జరిగిన కొన్ని విషయాలు చెప్పాలి. ఏదో కొంచెం ధనలాభం కలుగుతుందనీ, అగ్నిదాహం (అగ్నిప్రమాదం), చోరభయం ఉండే అవకాశా లున్నాయనీ చెప్పాలి. రాజద్రోహులకు మరణశిక్ష పడుతుందనీ, రాజుకు అనుకూలంగా ఉన్నవాళ్లైతే ఏదో పెద్ద బహుమతి (రాజునుండి) రాబోతుందనీ చెప్పాలి. విదేశాలలో జరుగుతున్న పనులు తనకు తెలుసునని చెప్పాలి.కొన్ని విషయాలు ఈ రోజునో, రేపో జరగబోతాయనీ, రాజు ఇలా చేయనున్నాడనీ చెప్పాలి. (అనగా తన దగ్గరికి వచ్చేవాళ్ల స్వరూపస్వభావాదులను పట్టి ఇలాంటి విషయాలన్నీ

కల్పించి కొందరికి కొన్ని విషయాలు, కొందరికి కొన్ని విషయాలు చెప్పాలి అని అర్థం.

మూ. తదస్య గూఢాః సత్రిణః సంవాదయేయుః; సత్త్వప్రజ్ఞావాక్యశక్తి సంపన్నానాం రాజభావ్య మనువ్యాహరే న్మన్త్రిసంయోగం చ. మన్త్రీ చైషాం వృత్తికర్మభ్యాం వియతేత. యే చ కారణాదభిక్రుద్ధాస్తానర్థమానాభ్యాం శమయేత్. అకారణక్రుద్ధాన్ తూష్ణీం దణ్డేన రాజద్విష్టకారిణశ్చ.

వ్యా. ఈ తాపసుడు చెప్పిన అగ్నిదాహాదులను గూఢచారులు, సత్రులు నిజం అయేటట్లు చెయ్యాలి (అనగా అగ్నిదాహం, చౌర్యం మొదలైనవి వాళ్ల ఇళ్లల్లో జరిపించాలి). వచ్చినవాళ్లలో ఎవరైనా సత్త్వమూ (ధైర్యమూ), ప్రజ్ఞ, వాక్చాతుర్యం, శక్తీ ఉన్నవాళ్లు ఉంటే వాళ్లతో "మీకు రాజానుగ్రహం కలుగుతుంది, మంత్రులతో సంబంధం ఏర్పడుతుంది" అని జోస్యం చెప్పాలి. మంత్రి అలాంటివాళ్లకు వృత్తి, పనీ (employment)కల్పించాలి.

గూఢచారుల ద్వారా తెలిసినదానిని పట్టి, ఏదో తగిన కారణం చేత రాజు విషయంలో కోపం ఉన్న వాళ్లని, (మంత్రి) ధనంచేత, సత్కారంచేత శాంతింపచేయ్యాలి. ఏ కారణమూ లేకుండా రాజును ద్వేషించేవాళ్లి తూష్ణీందండం (గుట్టుచప్పుడు కాకుండా దండించడం (silent punishment)చేత చంపివేయాలి. రాజుకు విరుద్ధంగా ప్రవర్తించే ఇతరులను కూడా ఇలాగే దండించాలి.

శ్లో. పూజితాశ్చార్థమానాభ్యాం రాజ్ఞా రాజోపజీవినామ్,
జానీయుః శౌచమిత్యేతాః పఞ్చ సంస్థాః ప్రకీర్తితాః.

*ఇతి కౌటిలీయార్థశాస్త్రే వినయాధికారికే ప్రథమాధికరణే*
*ఏకాదశోఽధ్యాయః గూఢపురుషోత్పత్తౌ సంస్థోత్పత్తిః.*

వ్యా. ఈ గూఢచారులు రాజుచేత ధనసత్కారాలచేత ఆదరించబడుతూ (రాజభృత్యః=State servant) శౌచాన్ని తెలుసుకొంటూ ఉండాలి. ఈ విధంగా కాపటికుడు మొదలైన ఐదు సంస్థలు (establishments) చెప్పబడ్డాయి.

*"బాలానందిని" అను కౌటిలీయార్థశాస్త్రాంధ్రవ్యాఖ్యానంలో వినయాధికారికమైన మొదటి అధికరణంలో గూఢపురుషోత్పత్తిలో సంస్థోత్పత్తి అనే పదకొండవ అధ్యాయం సమాప్తం.*



## అథ ద్వాదశోఽధ్యాయః

### అష్టమే ప్రకరణే గూఢపురుషప్రణిధిః

మూ. యే చాస్య సమ్బన్ధినః అవశ్యభర్తవ్యాః తే లక్షణమ్, అఙ్గవిద్యామ్, జమ్భకవిద్యామ్, మాయాగతమ్, ఆశ్రమధర్మమ్, నిమిత్తమ్, అన్తరచక్రమ్ ఇత్యధీయానాః సత్రిణః సంసర్గవిద్యా వా.

వ్యా. ఎవరైతే రాజుతో సంబంధం కలిగి ఉంటారో అనగా రాజుకు చాలా దగ్గరగా ఉంటారో, ఆ కారణంచేతనే తప్పక పోషించదగినవారో వాళ్లు సత్రులు. ఈ సత్రులు లక్షణాన్ని (సాముద్రికశాస్త్రం మొ.) అంగవిద్యను (శరీరం స్పృశించినంత మాత్రంచేతనే శుభాశుభాదివిషయం గ్రహించే విద్య), జంభకవిద్యను (వశీకరణ విద్య, అంతర్ధానవిద్య) మాయాగతాన్ని (ఇంద్రజాలం), చతురాశ్రమధర్మాలనూ, శకునశాస్త్రాన్ని, అంతరచక్రాన్ని (అనగా దిక్చక్రంలో కలిగే కొన్ని ప్రాకృతికఘటనలను పట్టి లేదా పక్షులు మొదలైనవాటి ధ్వనులను పట్టి రాబోయే మంచి చెడుగులు చెప్పగలిగే విద్య), సంసర్గవిద్యను (కామశాస్త్రాదులను లేదా ఇతరులతో కలిసి మెలిసి ఉండే నేర్పు (the art of association with men) అభ్యసిస్తూ ఉంటారు.

వి. కాపటికాదులు ఐదుగురు ఒక చోట స్థిరంగా ఉండి రాజుకు రహస్యసమాచారాలు అందచేస్తూ ఉంటారు. సత్రులు మొదలైనవాళ్లు దేశసంచారం చేస్తూ రహస్యాలు సేకరిస్తారు. గూఢపురుషప్రణిధి అనగా గూఢపురుషులను ఆ యా పనులమీద నియోగించి పంపడం అని అర్థం.

మూ. 1. యే జనపదే శూరాః త్యక్తాత్మానః హస్తినం వ్యాలం వా ద్రవ్యహేతోః ప్రతియోధయేయుః తే తీక్ష్ణాః.

2. యే బన్ధుషు నిఃస్నేహాః క్రూరాశ్చాలసాశ్చ తే రసదాః.

వ్యా. 1. దేశంలో ఎవరైతే శూరులో తమ ప్రాణాలకి కూడ లెక్కచేయకుండా, ధనం కోసం, ఏనుగులతోను, లేదా వ్యాఘ్రాదిక్రూరమృగంతోను యుద్ధం చేస్తారో వారు తీక్ష్ణులు.

2. బంధువులమీద కూడా ప్రేమలేనివాళ్లు, క్రూరులు, సోమరులు అయినవాళ్లు రసదులు (విషం పెట్టేవాళ్లు)

మూ. పరివ్రాజికా వృత్తికామా దరిద్రా, విధవా, ప్రగల్భా,

బ్రాహ్మణ్యన్తఃపురే కృతసత్కారా, మహామాత్రకులాన్యభిగచ్ఛేత్. ఏతయా ముణ్డావృషల్యో వ్యాఖ్యాతాః. ఇతి సంచారాః.

వ్యా. వృత్తిని (భోగాలను) కోరేదీ, దరిద్రురాలు, భర్త మరణించినదీ, ప్రగల్భురాలూ (మాటకారి), అంతఃపురంలో సత్కారాలు అందుకొనేదీ, మహామాత్రుల (ఉన్నతాధికారుల) ఇళ్లకు వెడుతూ ఉండేదీ అయిన బ్రాహ్మణస్త్రీ "పరివ్రాజిక" ఈమెచేత ముండా, వృషలీ కూడ వ్యాఖ్యానింపబడి నట్లే అనగా ముండ అనగా బోడితల బౌద్ధభిక్షుకి, శూద్రస్త్రీ కూడ పైన చెప్పిన బ్రాహ్మణపరివ్రాజిక వలెనే ప్రవర్తిస్తారు అని అర్థం. వీళ్లు (సత్రి) మొదలైనవాళ్లు సంచారులు. దేశంలో సంచరించే గూఢచారులు.

మూ. తాన్ రాజా స్వవిషయే మన్త్రిపురోహితసేనాపతియువరాజ దౌవారికాన్తర్వంశికప్రశాస్తృసమాహర్తృసంనిధాతృప్రదేష్టృ పౌరవ్యావహారిక కర్మాన్తిక మన్త్రిపరిషదధ్యక్ష దణ్డదుర్గాన్తపాలాటవికేషు శ్రద్ధేయదేశవేషశిల్ప భాషాభిజనాపదేశాన్ భక్తితః సామర్థ్యాచ్చాపసర్పయేత్.

వ్యా. రాజు ఆ సంచారుల రాజభక్తిని, వాళ్ల కున్న సామర్థ్యాన్నీ దృష్టిలో పెట్టుకొని, మారువేషాలలో ఉన్న వాళ్ల దేశమూ, వేషమూ, శిల్పమూ, భాషా, బంధుజనమూ వీటిని అందరూ నమ్మ దగినట్లుగా ఉండేటట్లు జాగర్త వహించ మని చెప్పి, తన దేశంలో మంత్రి, పురోహితుడు, సేనాపతి, యువరాజు, ప్రధానద్వార పాలకుడు, అంతర్వంశికుడు (ప్రధానాంతఃపురపాలకుడు chief of the palace guards), ప్రశాస్త (నిదేశకుడు director), సమాహర్త (కార్యనిర్వాహకుడు administrator), సంనిధాత (భాండాగార నిదేశకుడు director of stores),ప్రదేష్ట (కంటకశోధకుడు అనగా అపరాధులను దండించేవాడు magistrate), నాయకుడు (commandent), పౌరవ్యావహారికుడు (పురంలోని వ్యవహారాలు చూచేవాడు city judge), కార్మాంతికుడు (కర్మాలయనిదేశకుడు director of factories), మంత్రిపరిషత్ (council of ministers), అధ్యక్షుడు (superintendent), దండపాలుడు (chief of the army staff), దుర్గపాలుడు (commandent of the fort), అంతపాలుడు (రాజ్యం సరిహద్దులలో రక్షించేవాడు (commandent of the frontier fort), ఆటవికుడు (ఆటవికుల పరిపాలకుడు forest chieftain)వీళ్లను ఈ సంచారులు గూఢచారిచర్యలకు గురి చేసేటట్లు చెయ్యాలి.



మూ. తేషాం బాహ్యం చారం ఛత్రభృఙ్గారవ్యజనపాదుకాసన యానవాహనోపగ్రాహిణః తీక్ష్ణా విద్యుః. తం సత్రిణః సంస్థాస్వర్పయేయుః.

వ్యా. తీక్ష్ణులు అధికారుల దగ్గర ఛత్రోపగ్రాహులు (గొడుగు పట్టేవాళ్లు) గాను, భృంగారోపగ్రాహులు (పానపాత్రలు తీసికొని వెళ్ళేవాళ్లు)గాను, వ్యజనోపగ్రాహులు (వింజామర వీచేవాళ్లు) గాను, పాదుకోపగ్రాహులు గాను, యాన (పల్లకీ బళ్లు మొదలైనవాటి) ఉపగ్రాహులు గాను, వాహనోపగ్రాహులు గాను (అశ్వాద్యుపగ్రాహులుగాను) ఉండి సేవిస్తూ వాళ్ల బైట సమాచారం (out of door activities) అంతా తెలుసుకోవాలి. ఆ సమాచారాన్ని సత్రులు సంస్థలకు అందజేయాలి.

మూ. సూద-ఆరాలిక-స్నాపక-సంవాహక-ఆస్తరక-కల్పక-ప్రసాధక-ఉదకపరిచారకా రసదాః, కుబ్జ-వామన-కిరాత-మూక-బధిర-జడ-అన్ధచ్ఛద్మానః నటనర్తక గాయనవాదక వాగ్జీవనకుశీలవాః స్త్రియశ్చ అభ్యన్తరం చారం విద్యుః. తం భిక్షుక్యః సంస్థాస్వర్పయేయుః.

వ్యా. వంటవాళ్లగాను, భక్ష్యాలు తయారుచేసేవాళ్లగాను, స్నానం చేయించేవాళ్లు గాను, ఒళ్లు పట్టేవాళ్లు గాను, పక్కలు (శయనాలు) అమర్చేవాళ్లగాను, మంగళ్లగాను, అలంకరించేవాళ్లు గాను, నీళ్లు అందించేవాళ్లు గాను, ఆ అధికారుల వద్ద సేవ చేస్తూన్న రసదులు, గూనివాళ్లగాను, పొట్టివాళ్లగాను, కిరాతులు(చిన్న దేహం కలవాళ్లగాను, మూగవాళ్లగాను, చెవిటివాళ్లగాను, లోకవ్యవహారం తెలియని అమాయకులుగాను, గ్రుడ్డివాళ్లగాను అభినయించేవాళ్లూ, నటులు(రసాలు అభినయించేవాళ్లు) నర్తకులు(కాళ్లు చేతులూ ఆడించి నృత్తం చేసేవాళ్లు), గాయకులు, వాదకులు(వాద్యాలు వాయించేవాళ్లు), వాగ్జీవులు (పాతకథలు చెప్పి పుస్తకాలు చదువుతూ జీవించేవాళ్లు), కుశీలవులు(వీధిపాటగాళ్లు), స్త్రీలు (మోసం చేసే స్త్రీలు, నపుంసకులూ కూడ) ఈ అధికారుల లోపలి (రహస్య) సమాచారాలు తెలుసుకోవాలి. ఆ సమాచారం భిక్షుకీలు సంస్థలకి అందచెయ్యాలి.

మూ. సంస్థానామన్తేవాసినః సంజ్ఞాలిపిభిః చారసంచారం కుర్యుః. న చాన్యోన్యం సంస్థాస్తే వా విద్యుః.

వ్యా. సంస్థలలోని అంతేవాసులు (పనిచేసేవాళ్లు) సంజ్ఞాలిపులచేత (తాము తమ సంకేతంచేత ఏర్పరచుకొన్న లిపులచేత) రహస్యవృత్తాంతం పంపాలి. వాళ్లల్లో ఒకరు పంపినది మరొకరికి గాని, ఒక సంస్థ పంపినది మరొక సంస్థకి గాని తెలియకూడదు.

వి. అంతేవాసులు = ఒక కార్యాలయంలో పనిచేసేవాళ్ళ, assistants. చారః = గూఢచారిచర్యచేత సేకరించిన రహస్యవృత్తాంతం; spied out information. చారసంచారః= రహస్యవృత్తాంతం పైకి పంపడం. Transmission of spied out information.

మూ. భిక్షుకీప్రతిషేధే ద్వాస్థపరమ్పరా మాతాపితృవ్యఞ్జనాః శిల్పకారికాః కుశీలవాః దాస్యో వా గీతపాఠ్యవాద్యభాణ్డగూఢలేఖ్యసంజ్ఞాభిర్వా చారం నిర్హరేయుః. దీర్ఘరోగోన్మాదాగ్నిరసవిసర్గేణ వా గూఢనిర్గమనమ్.

వ్యా. ఆ అధికారుల ఇండ్లలోనికి భిక్షుకీలు ప్రవేశించడం నిషిద్ధమైన పక్షంలో ద్వారపాలకుల పరంపర గాని, లోపల పనిచేసేవాళ్ళ తల్లులు తండ్రులు అనే వంకపెట్టుకొని వచ్చినవాళ్ళు గాని, శిల్పకారికలుగా వచ్చిన స్త్రీలు గాని, కుశీలవులుగా వీథిపాటల స్త్రీలుగా వచ్చినవాళ్ళు గాని, దాసీలు గాని, సేకరించిన రహస్యవృత్తాంతాన్ని రహస్యార్థం గల పాటలలో కూర్చి గాని, చదివే శ్లోకాదులలో కూర్చి గాని, వాద్యాలలోను లేదా సరుకులలోను దాచిన లేఖ్యాల (వ్రాసిన లేఖల ) చేత గాని, సంజ్ఞల (గుర్తుల) చేత గాని చారాన్ని (రహస్యవృత్తాంతాన్ని) బైటకు చేర్చాలి. ఈ ఉపాయా లేవీ కుదరవి పక్షాన ఇండ్లలో పనివాళ్ళుగా ఉన్న గూఢచారులే దీర్ఘరోగము, ఉన్మాదమూ అనే వంకచేత గాని, దేనికైనా నిప్పు అంటించి లేదా ఎవరికైనా విషం ఇచ్చి, ఆ కోలాహలంలో గాని తామే రహస్యంగా బైటకు వచ్చి రాజుకు లేదా మంత్రులు మొదలైన వాళ్లకు చారం అందజేయాలి.

వి. ద్వాస్థపరంపర అనగా ఒక ద్వారపాలకుడు రెండవవానికీ, రెండవవాడు మూడవవానికీ ఈ విధంగా వార్త అందించాలి అని కొందరి వ్యాఖ్య. ఈ గూఢపురుషులే ఒకరి వెనుక ఒకరు ద్వారాల దగ్గరికి వచ్చి. బైటకు అందజేయాలని మరికొందరి వ్యాఖ్య. మొదటి పక్షంలో ద్వారపాలకులు కూడా గూఢచారులే అయి ఉండాలి.

మూ. త్రయాణామేకవాక్యే సంప్రత్యయః. తేషామభీక్ష్ణనిపాతే తూష్ణీందణ్డః ప్రతిషేధో వా.

వ్యా. ముగ్గురు గూఢచారులకు ఏకవాక్యం ఉంటే, అనగా ముగ్గురు పంపిన చారం ఒకే విధంగా ఉంటే, దానిని నమ్మాలి. ఆ గూఢచారులు మాటిమాటికి తప్పులు చేస్తే వాళ్లకి తూష్ణీందండ మైనా ఇవ్వాలి. లేదా వాళ్లని ఆ అధికారంనుంచి తొలగించాలి. (చంపివేయడం ద్వారా).



మూ. కణ్టకశోధనోక్తాశ్చాపసర్పాః పరేషు కృతవేతనాః వసేయుః సంపాతనిశ్చారార్థమ్, త ఉభయవేతనాః.

వ్యా. కంటకశోధనాధికరణంలో చెప్పబడిన సిద్ధులు, ప్రవ్రజితులు, చక్రచరులు మొదలైన గూఢపురుషులు శత్రువులనుండి కూడా జీతాలు తీసికొంటూ శత్రురాష్ట్రాలలో (గూఢచారులుగా) నివసిస్తూ అక్కడ సేకరించిన రహస్యవృత్తాంతాన్ని తమ రాజుకు పంపాలి. వీళ్ల ఇటు తమ ప్రభువునుంచీ, అటు శత్రురాజునుంచీ జీతం తీసుకోవడం చేత ఉభయవేతనులు. రెండు వైపులనుంచీ జీతాలు తీసుకొనేవాళ్లు.

వి. అపసర్పః = గూఢచారి. సంపాతనిశ్చారార్థమ్ = రహస్యవార్తలు అనాయాసంగా చేరడం కొరకు లేదా అనాయాసంగా గూఢచారకార్యం చేయడంకోసం.

శ్లో. గృహీతపుత్రదారాంశ్చ కుర్యాదుభయవేతనాన్,
తాంశ్చారిప్రహితాన్ విద్యాత్ తేషాం శౌచం చ తద్విధైః.

వ్యా. ఉభయవేతనుల భార్యాపుత్రులను తనవద్ద ఉంచుకొని వాళ్లను (ఉభయవేతనులను) శత్రువులు మొదలైనవాళ్ల రాష్ట్రంలోనికి పంపాలి. శత్రువులు మొదలైనవాళ్లు కూడా అలాంటి ఉభయవేతనులను తన రాష్ట్రానికి పంపితే వాళ్లని గుర్తించి, అలాంటివాళ్ల సహాయంతో వాళ్ల శౌచాన్ని తెలుసుకోవాలి. ఉదాహరణకి ఎవడైనా ఉభయవేతనుడు కుశీలవుని వేషంలో తన రాష్ట్రంలో ఉంటే ఆ కుశీలవవేషంలోనే ఉన్న గూఢచారి ద్వారా వాని శౌచం పరీక్షిస్తూ ఉండాలి.

శ్లో. ఏవం శత్రౌ చ మిత్రే చ మధ్యమే చావపేచ్చరాన్,
ఉదాసీనే చ తేషాం చ తీర్థేష్వష్టాదశస్వపి.

వ్యా. ఈ విధంగా శత్రువు, మిత్రుడు, మధ్యముడు, ఉదాసీనుడు అయిన రాజుల విషయంలోను, వాళ్ల మంత్రి-పురోహిత-సేనాపతులు మొదలైన పద్దెనిమండుగురు అత్యుత్తమాధికారుల విషయంలోను గూఢచారిప్రయోగం చెయ్యాలి.

శ్లో. అన్తర్గృహచరాస్తేషాం కుబ్జవామనషణ్డకాః,
శిల్పవత్యః స్త్రియో మూకాశ్చిత్రాశ్చ మ్లేచ్ఛజాతయః.

వ్యా. గూనివాళ్లను, పొట్టివాళ్లను, షండుల్ని, శిల్పాలలో నేర్పు గల స్త్రీలను, మూగవాళ్లను, వివిధమ్లేచ్ఛజాతులవాళ్లను శత్రువులు మొదలైనవాళ్ల అంతఃపురాలలో గూఢచారులుగా ప్రవేశం పొందేటట్లు చెయ్యాలి.

శ్లో. దుర్గేషు వణిజః సంస్థా దుర్గాన్తే సిద్ధతాపసాః,
కర్షకోదాస్థితా రాష్ట్రే రాష్ట్రాన్తే వ్రజవాసినః.

వ్యా. దుర్గాలలో ఉన్న నగరాలలో వర్తకులను గూఢచారులుగా నియమించాలి. దుర్గాలకి వెలుపల లేదా సరిహద్దులలో సిద్ధుల్ని, తాపసుల్ని, రాష్ట్రంలో వ్యవసాయదారుల్నీ, ఉదాస్థితుల్నీ, రాష్ట్రం చివర గొల్లపల్లెలలో నివసించే గొల్లలు మొదలైనవాళ్లనీ గూఢచారులనుగా నియమించాలి.

శ్లో. వనే వనచరాః కార్యాః శ్రమణాటవికాదయః,
పరప్రవృత్తిజ్ఞానార్థాః శీఘ్రాశ్చారపరంపరాః.

వ్యా. వనాలలో సంచరించే జైనసంన్యాసులు, ఆటవికులు మొదలైన వాళ్లని వనంలో గూఢచారులనుగా నియమించాలి. ఈ విధంగా శత్రువులు మొదలైనవాళ్లు ఏమి చేస్తున్నారో తెలుసుకొనడం కోసం అతిశీఘ్రంగా పనులు చేసే గూఢచారుల పరంపరను నియమించాలి.

శ్లో. పరస్య చైతే బోద్ధవ్యాస్తాదృశైరేవ తాదృశాః,
చారసఞ్చారిణః సంస్థా గూఢాశ్చాగూఢసంజ్ఞితాః.

వ్యా. ఇతరులు తన రాష్ట్రంలో ప్రవేశపెట్టిన, గూఢచారులుగా కనబడని గూఢచారులైన తిరిగే సత్రితీక్ష్ణాదిగూఢచారులను(చారసంచారిణః), ఒకే చోట ఉండి గూఢచారి కార్యక్రమం జరిపేవాళ్లనీ(సంస్థాః) అదే విధమైన తన చారసంచారి-సంస్థల సహాయంతో తెలుసుకొంటూ ఉండాలి.

శ్లో. అకృత్యాన్ కృత్యపక్షీయైర్దర్శితాన్ కార్యహేతుభిః,
పరాపసర్పజ్ఞానార్థం ముఖ్యానన్తేషు వాసయేత్.

*ఇతి కౌటిలీయార్థశాస్త్రే వినయాధికారికే ప్రథమాధికరణే ద్వాదశోఽ ధ్యాయః*
*గూఢపురుషోత్పత్తౌ సంచారోత్పత్తిః, గూఢపురుషప్రణిధిః.*

వ్యా. కృత్యుల పక్షానికి చెందిన కార్యకారణాలచేత చూపబడిన అకృత్యులైన ముఖ్యులను ఇతరుల గూఢచారులను గూర్చి తెలుసుకొనడం కోసం రాజ్యం సరిహద్దులలో నివసింపచెయ్యాలి.



ఎ. రాజుచేత ఏ కారణం చేతనైనా అవమానితులై రాజు విషయంలో ద్వేషభావంతో ఉన్నవాళ్లు "కృత్యులు'. అలాంటివాళ్లు కానివాళ్లు అకృత్యులు. కృత్యులను శత్రువులు అనాయాసంగా తమవైపు త్రిప్పుకోకలుగుతారు. కృత్యపక్షంవాళ్లు ఏ యే ఉపాయాలు (కార్యహేతువులు; అనగా కార్యాలకు హేతువులు) పన్నుతూ ఉంటారో ముఖ్యులైన అధికారులకు బాగా తెలిపి వాళ్లు అకృత్యులు అనే విషయం నిశ్చితం చేసికొని, వాళ్లని శత్రువులు చేసే గూఢచారిచర్యలు కనిపెట్టడంకోసం రాజ్యసీమలలో నియమించాలి అని అర్థం.

"బాలానందిని" అనే కౌటిలీయార్థశాస్త్రాంధ్రవ్యాఖ్యానంలో వినయాధికారికమైన ప్రథమాధికరణంలో, "గూఢపురుషోత్పత్తి"యందు సంచారోత్పత్తి, గూఢపురుషప్రణిధి అను పన్నెండవ అధ్యాయం సమాప్తం.

## అథ త్రయోదశోఽధ్యాయః

### నవమే ప్రకరణే - స్వవిషయే కృత్యాకృత్యపక్షరక్షణమ్

మూ. 1. కృతమహామాత్యాపసర్పః పౌరజానపదానపసర్పయేత్.

2. సత్త్రిణో ద్వన్ద్వినః తీర్థసభాశాలాపూగజనసమవాయేషు వివాదం కుర్యుః. సర్వగుణసంపన్నశ్చాయం రాజా శ్రూయతే. న చాస్య కశ్చిద్ గుణో దృశ్యతే యః పౌరజానపదాన్ దణ్డకరాభ్యాం పీడయతి ఇతి.

వ్యా. 1. మహామాత్యుల (మంత్రిపురోహితాదుల)విషయంలో గూఢచార ప్రయోగం చేసిన పిమ్మట రాజు పౌరుల విషయంలోను, జానపదుల విషయంలోనూ కూడా చారప్రయోగం చెయ్యాలి.

2. సత్రులు(గూఢచారులు) ఒకరితో ఒకరు కలహం చేస్తూ, పుణ్యతీర్థాలలోను, సభలలోను, అన్నశాలలోను, పానీయశాలలోను, పూగములలోను (ఒకేవిధమైన జనుల సమావేశం (communal gathering) వివిధజనుల సమావేశాలలోను, వాగ్వివాదం చెయ్యాలి- "ఈ రాజు అన్ని మంచి గుణాలు ఉన్నవాడని వింటూంటాం; అయితే వీనిలో ఒక్క మంచి గుణం కూడా లేదు. పౌరుల్నీ, జానపదుల్నీ (పల్లెటూరు వారిని) కూడా కఠినమైన దండనంచేతా పన్నుచేతా పీడిస్తున్నాడు" అని ఒక రనాలి.

ఎ. ద్వన్ద్వినః= కలహిస్తూన్నవారు.

SANSKRIT LIBRARY
BOOK No:
NAGARJUNA UNIVERSITY

మూ. తత్ర యేఽనుప్రశంసేయుః తానితరస్తం చ ప్రతిషేధయేత్- "మాత్స్యన్యాయాభిభూతాః ప్రజాః మనుం వైవస్వతం రాజానం చక్రిరే. ధాన్యషడ్భాగం, పణ్యదశభాగం, హిరణ్యం చాస్య భాగధేయం ప్రకల్పయామాసుః. తేన భృతా రాజానః ప్రజానాం యోగక్షేమవహాః. తేషాం కిల్బిషం దణ్డకరా హరన్తి, యోగక్షేమవహాశ్చ ప్రజానామ్. తస్మాదుఞ్ఛషడ్భాగమారణ్యకా

...పి నివపన్తి, తస్యైతత్ భాగధేయం యోఽస్మాన్ గోపాయతీతి. ఇన్ద్రయమ

...మేతద్ రాజానః ప్రత్యక్షహేడప్రసాదాః. తానవమన్యమానం దైవోఽపి

...స్పృశతి. తస్మాత్ రాజానో నావమన్తవ్యాః" ఇతి క్షుద్రకాన్ ప్రతిషేధేత్.

అక్కడ ఈ మాటలు పలికినవాళ్లని అనుసరించి ఎవరైతే అదే విధంగా

..., మొదట ఆ మాట లన్న వానినీ కూడా మరొకడు (మరొక సత్రి)

...అని నిషేధించి ఇలా చెప్పాలి- "మాత్స్యన్యాయంచేత బాధపడుతున్న

...) వైవస్వతమనువును రాజునుగా చేసుకున్నారు. పండించిన

...పణ్యంలో (అమ్మే వస్తువులలో - వస్త్రాదులలో) పదవవంతు,

...వలసిన భాగంగా ఏర్పాటు చేశారు. దానిచేత పోషించబడిన

...నిర్వహిస్తూ ఉంటారు. రాజులు విధించే దండమూ,

...ప్రజల యోగక్షేమాలను నిర్వహిస్తాయి. అందుచేతనే

...గా "ఇది మనలను రక్షించే రాజుకు చెందవలసిన

...(రాలిన గింజలు ఏరుకొనడం ఉంఛం)

...స్తారు. ప్రత్యక్షమైన నిగ్రహానుగ్రహసామర్థ్యం

..., స్థానం. (ఇంద్రయముల అంశాలు

...త్యక్షంగా అనుగ్రహించే శక్తినీ,

...రాజులను అవమానించేవారికి

...ులను అవమానించకూడదు

...నిషేధించాలి.

...ౖరుపకుర్వన్తి వ్యసనే

...వర్తయన్తి, అమిత్రమాటవికం

వ

మి

గూ

శ్లో.

...రం

వక్ష్యా...

గూఢచార్యు...తి.

గూఢచారి కా... గూఢచార

సహాయంతో ...యంలోనూ

శ్లో. అకృత్వా

పరాపన...యోగ్యాలలోను,

(ఒకేవిధమైన

ఇతి కౌటిలీయ్...సమావేశాలలోను.

గూఢ... ఏని వింటూంటాం;

వ్యా. కృత్యు...పదుల్ని (పల్లెటూరు

ముఖ్యులను ఇతరుల ...వ" అని ఒక రవాలి.

సరిహద్దులలో నివసింపచే



వా ప్రతిషేధయన్తి, తేషాం ముణ్డజటిలవ్యఞ్జనాః తుష్టాతుష్టత్వం విద్యుః.

వ్యా. 1. సత్రులు రాజ్యంలో వ్యాపించే కింవదంతులను (పుకార్లను) కూడా తెలుసుకుంటూ ఉండాలి.

2. రాజుయొక్క ధాన్యంమీద, పశువులమీద, బంగారం(ధనం)మీదా జీవిస్తూ ఎవరు కష్టసమయంలోను, అభ్యుదయసమయంలోనూ కూడా వాటితో ఆ రాజుకు ఉపకరిస్తూ ఉంటారో, రాజువిషయంలో కోపించిన బంధువును గాని, రాష్ట్రాన్ని కాని ఆ కోపం తొలగించి శాంతింపచేస్తూ ఉంటారో, శత్రువును కాని, అడవులలో ఉండేవాళ్లను కాని రాజుకు అపకారం చేయకుండా నిషేధిస్తూ ఉంటారో వాళ్లందరూ రాజ్యంలో సంతోషంగా ఉన్నారా, సంతోషంగా లేరా అనే విషయాన్ని ముండుల వేషంలోను, జడదారుల వేషంలోను ఉన్న గూఢచారులు తెలుసుకుంటూ ఉండాలి.

మూ. తుష్టాన్ భూయః పూజయేత్. అతుష్టాన్ తుష్టిహేతోః త్యాగేన సామ్నా చ ప్రసాదయేత్. పరస్పరాద్వా భేదయేదేనాన్ సామన్తాటవికతత్కులీనావరుద్ధేభ్యశ్చ. తథాప్యతుష్యతో దణ్డకరసాధనాధికారేణ వా జనపదవిద్వేషం గ్రాహయేత్. విద్విష్టానుపాంశుదణ్డేన జనపదకోపేన వా సాధయేత్. గుప్తపుత్రదారానాకరకర్మాన్తేషు వా వాసయేత్ పరేషామాస్పదభయాత్.

వ్యా. సంతోషంతో ఉన్నవాళ్లని ఇంకా పూజించాలి. (బాగా ఆదరం చూపి వాళ్లకి తన విషయంలో ఇంకా సంతోషం కలిగేటట్లు చెయ్యాలి). సంతోషించనివాళ్లకి సంతోషం కలగడంకోసం ధనం ఇచ్చి గాని, సామంచేత గాని (మంచితనం చూపి గాని) ఎక్కువ అనుకూలులనుగా చేసుకోవాలి లేదా వాళ్లలో పరస్పరం భేదం కలిగించాలి. సామంతులతోను, ఆటవికులతోను, వాళ్ల కులానికే చెందినవాళ్లతోను, నిగ్రహించబడినవాళ్లతోను వీళ్లకి భేదం(చీలిక) కల్పించాలి. ఇంకా వాళ్లు సంతోషించకపోతే (తనకు అనుకూలులు కాకపోతే) వాళ్లకు దండసాధనాధికారం (శిక్ష విధించడం, జరిమానా వసూలుచేయడం అనే అధికారం), కరసాధనాధికారం (పన్ను వసూలు చేసే అధికారం) ఇచ్చి వాళ్లమీద ఆ ప్రాంతపు జానపదులకు ద్వేషం కలిగే టట్లు చెయ్యాలి. ఆ విధంగా జనపదద్వేషానికి గురి అయినవాళ్లని రహస్యదండంచేత కాని, జనపదకోపంచేత (ఆ ప్రాంతపు జానపదుల తిరుగుబాటు ద్వారా) గాని అణచివేయాలి. లేదా వాళ్ల పుత్రుల్ని భార్యల్ని తన అధీనంలో రక్షణంకోసం ఉంచుకొని వాళ్లను గనులలో కాని కర్మాలయాలలో (Factories) కాని నియమించాలి. అలా చేయకపోతే

వీళ్లు శత్రుపక్షంలో చేరిపోయే భయం ఉంటుంది.

మూ. క్రుద్ధలుబ్ధభీతావమానినస్తు పరేషాం కృత్యాః. తేషాం కార్తాన్తిక నైమిత్తికమౌహూర్తికవ్యఞ్జనాః పరస్పరాభిసంబన్ధమ్ అమిత్రప్రతిసమ్బన్ధం వా విద్యుః.

వ్యా. క్రుద్ధులు (రాజువిషయంలో కోపం ఉన్నవాళ్లు), దురాశ కలవాళ్లు, రాజుకు ఏకారణంచేత నైనా భయపడుతున్నవాళ్లు, (రాజుచేత) అవమానింపబడినవాళ్లు శత్రువులకు "కృత్యులు"; అనగా అనాయాసంగా శత్రువులు తమ వైపుకు తీసికొనడానికి శక్యమైనవాళ్లు. కార్తాంతికులు(దైవాన్ని గూర్చి అనగా జరగబోయేదాన్ని గూర్చి, చేప్పేవాళ్లు), శకునాలు చేప్పేవాళ్లు, జ్యోస్యం చెప్పేవాళ్లు-వీళ్ల వేషాలలో ఉన్న గూఢచారులు ఈ కృత్యులలో ఒకరితో ఒకరికి ఉన్న సంబంధాన్నీ, శత్రువుతో వీళ్ల కున్న సంబంధాన్నీ గూర్చి తెలుసుకోవాలి.

వి. అవమానినః=చాలా గర్వం కలవాళ్లు అని అర్థం కూడా అయి ఉంటుంది. 'అవమానితాః' అని ఉంటేనే పైన చెప్పిన అర్థం యుక్తంగా ఉంటుంది.

మూ. తుష్టానర్థమానాభ్యాం పూజయేత్. అతుష్టాన్ సామదానభేదదణ్డైః సాధయేత్.

శ్లో. ఏవం స్వవిషయే కృత్యానకృత్యాంశ్చ విచక్షణః,
పరోపజాపాత్సంరక్షేత్ ప్రధానాన్ క్షుద్రకానపి.

ఇతి కౌటిలీయార్థశాస్త్రే వినయాధికారికే ప్రథమాధికరణే త్రయోదశోఽధ్యాయః
స్వవిషయే కృత్యాకృత్యపక్షరక్షణమ్

...ృత్యులు"). అకృత్యులలో సంతోషంతో ...దాలి. సంతోషించనివాళ్లని సామ-దాన-

శ్లో. ...
వ్యా. ...
ముఖ్యులను ... శంలో ఉన్న కృత్యుల్నీ, అకృత్యుల్నీ కూడ,
సరిహద్దులలో సి... ...యినా శత్రువు చేసే గూఢచారచర్యకు

...ఆంధ్రవ్యాఖ్యానంలో వినయాధికారికమైన
...కృత్యపక్షరక్షణం" అనే పదమూడవ అధ్యాయం



## అథ చతుర్దశోఽధ్యాయః

### దశమే ప్రకరణే పరవిషయే కృత్యాకృత్యపక్షోపగ్రహః

మూ. 1. కృత్యాకృత్యపక్షోపగ్రహః స్వవిషయే వ్యాఖ్యాతః; పరవిషయే వాచ్యః.

2. సంశ్రుత్యార్థాన్ విప్రలబ్ధః, తుల్యకారిణోః శిల్పే వా ఉపకారే వా విమానితః, వల్లభావరుద్ధః, సమాహూయ పరాజితః, ప్రవాసోపతప్తః, కృత్వా వ్యయమలబ్ధకార్యః, స్వధర్మాత్ దాయాద్యాద్వా ఉపరుద్ధః, మానాధికారాభ్యాం భ్రష్టః, కుల్యైరన్తర్హితః, ప్రసభాభిమృష్టస్త్రీకః, కారాభిన్యస్తః, పరోక్తదణ్డితః, మిథ్యాచారవారితః, సర్వస్వమాహారితః, బన్ధనపరిక్లిష్టః, ప్రవాసితబన్ధుః ఇతి క్రుద్ధవర్గః.

వ్యా. 1. తన రాజ్యంలో కృత్యపక్షంవాళ్లనీ, అకృత్యపక్షంవాళ్లనీ వశం చేసికొనే విధానం చెప్పబడింది. ఇప్పుడు శత్రురాజ్యంలో ఈ విషయం చెప్పవలసి ఉంది.

2. ధనమో, వస్తువులో ఇస్తా నని చెప్పి ఇవ్వకుండా మోసగించబడినవాడు, ఏదైనా శిల్పంలో కాని, ఒక పనిలో కాని సమానమైన నైపుణ్యం కల ఇద్దరిలో ఒకనిని బాగా గౌరవించి రెండవవానిని అవమానిస్తే అలా అవమానించబడినవాడు, రాజుకు దగ్గరగా ఉన్నవాళ్లచేత పైకి రాకుండా చేయబడినవాడు, లేదా రాజగృహంలో ప్రవేశం లేకుండా చేయబడినవాడు, ద్యూతం మొదలైనవాటికి పిలిచి ఓడించబడినవాడు, (రాజు మూలకంగా) దూరదేశనివాసంచేత బాధపడ్డవాడు, ఖర్చుపెట్టి కూడా (రాజసేవకాదులకు లంచం మొదలైనవి ఇచ్చి కూడా) పని జరగనివాడు, తన ధర్మం నిర్వర్తించకుండానూ, తనకు రావలసిన దాయాద్యం(ఆస్తి) రాకుండానూ, అడ్డుకొనబడినవాడూ, తనకు రావలసిన సన్మానంనుంచీ, అధికారంనుంచీ భ్రష్టుడూ(తొలగించబడినవాడు), తన కులానికి చెందినవాళ్లచేతనే అణగద్రొక్కబడిన వాడు(లేదా రాజబంధ్వాదులచేత అణగద్రొక్కబడినవాడు), బలాత్కారంగా స్పృశించబడిన (అవమానించబడిన) భార్యాదులు కలవాడు, న్యాయస్థానంలో అభియోగం (కేసు)లో ఓడిపోయిన పిమ్మట జరిమానా వేయబడినవాడు (లేదా ఖైదులో బంధించబడినవాడు), ఇతరుల మాట పట్టుకొని దండించబడినవాడు, తాను చేయ దలపెట్టిన చెడ్డ ఆచారంనుంచి, అభిచారప్రయోగ-నిషిద్ధాచారాదులనుండి,

నివారించబడినవాడు. (రాజుచేత) ఉన్న ధనం అంతా లాగివేయబడినవాడు, పనులలో అద్భుతగలడంచేత బాధపెట్టబడినవాడు లేదా చాలాకాలం బంధించి బాధించబడ్డవాడు, దూరం పంపివేయబడిన బంధువులు కలవాడు వీళ్లందరూ కలిసి క్రుద్ధవర్గం అనగా వీళ్లందరూ క్రుద్ధవర్గానికి చెందిన వాళ్ళు. (రాజుమీద పగ పట్టి ఉంటారు).

మూ. స్వయముపహతః, విప్రకృతః, పాపకర్మాభిఖ్యాతః, తుల్య దోషదణ్డేనోద్విగ్నః, పర్యాత్తభూమిః, దణ్డేనోపహతః, సర్వాధికరణస్థః, సహసోప చితార్థః, తత్కులీనోపాశంసుః, ప్రద్విష్టో రాజ్ఞా, రాజద్వేషీ చేతి భీతవర్గః.

వ్యా. ధనాదులకోసం చేసిన హత్యాదులచేత స్వయంగా దూషితుడు (మహాపరాధం చేసినవాడు), అంతఃపురాదులలో చెడ్డ పనులు చేసినవాడు లేదా ఎవరిచేతనైనా పెద్ద అపకారానికి గురిచేయబడినవాడు, పాపాత్ముడుగా పేరుమోసినవాడు. తనతో సమానమైన దోషం కలవానిని(రాజు) శిక్షించడంచేత తనకు కూడా అలాంటి శిక్ష పడుతుందేమో అని దిగులుచెందినవాడు, ఇతరుల భూమి ఆక్రమించుకున్నవాడు, దండంచేత పీడితుడు, చాలా అధికారస్థానాలలో ఉన్నవాడు, హటాత్తుగా ఎక్కువ ధనవంతుడైపోయినవాడు, (ఏదో రాజకీయోద్యోగంలో ఉండి హటాత్తుగా పెద్ద ధనికుడై పోయినవాడు అని కొందరు 'సర్వాధికరణస్థః' 'సహసోపచితార్థః' అనే రెండు కలిపి అర్థం వ్రాశారు). ఆ రాజు కులానికి చెందిన మరొకడు అధికారంలోనికి రావాలని కోరుకుంటున్నవాడు, రాజుచేత ద్వేషించబడినవాడు, రాజును ద్వేషించేవాడు-వీళ్లు భీతవర్గం.

మూ. పరిక్షీణః, అత్యాత్తస్వః, కదర్యః, వ్యసనీ, అత్యాహితవ్యవ హారశ్చేతి లుబ్ధవర్గః.

వ్యా. ధనం అంతా పోయినవాడు, (రాజుచేత గాని ఇతరులచేత గాని) లాగికొనబడిన చాలా ధనం కలవాడు, లోభి, దుర్వ్యసనాలు ఉన్నవాడు, వ్యవహారాలలో చాలా దూకుడుగా పోయేవాడు - ఇది లుబ్ధవర్గం.

మూ. ఆత్మసంభావితః, మానకామః, శత్రుపూజామర్షితః, నీచైరుపహితః, తీక్ష్ణః, సాహసికః, భోగేనాసంతుష్టః ఇతి మానివర్గః.

వ్యా. తాను చాలా గొప్పవా డనుకునేవాడు, ఇతరులు తనను గౌరవించాలనే కోరిక గలవాడు, తన శత్రువులను ఇతరులు పూజించడంచేత ఆ పూజించినవాళ్లమీద కోపం ఉన్నవాడు, లేదా ఆ శత్రువులవిషయంలో అమర్షం ఉన్నవాడు, చిన్న స్థానంలో



ఉంచబడ్డవాడు, తన శరీరాన్ని గూర్చి కూడా లెక్కచేయనివాడు (తీక్ష్ణః), సాహసంతో కూడిన పనులు చేసేవాడు, లభించిన జీతానికి సంతృప్తిచెందనివాడు-వీళ్లు మానివర్గం.

మూ. తేషాం ముణ్డజటిలవ్యఞ్జనైర్యో యద్భక్తిః కృత్యపక్షీయః తం తేనోపజాపయేత్.

వ్యా. (శత్రురాష్ట్రంలో ఉన్న) ఈ కృత్యులలో ఏ కృత్యపక్షంవానికి ఎవనియందు భక్తి ఉంటుందో అట్టి ముండవేషంలో ఉన్న గూఢచారిచేత, జటిలవేషధారియైన గూఢచారిచేత, ఆ కృత్యపక్షంవానిలో భేదబుద్ధి పుట్టించాలి (వానిని రెచ్చగొట్టాలి).

మూ. "యథా మదాన్ధో హస్తీ మత్తేనాధిష్ఠితో యద్యదాసాదయతి తత్ సర్వం ప్రమృద్నాత్యేవమ్ అయమ్ అశాస్త్రచక్షుః అన్ధః రాజా అన్ధేన మన్త్రిణా అధిష్ఠితః పౌరజానపదవధాయాభ్యుత్థితః. శక్యమస్య ప్రతిహస్తి ప్రోత్సాహనేన అపకర్తుమ్. అమర్షః క్రియతామ్" ఇతి క్రుద్ధవర్గముపజాపయేత్.

వ్యా. "మత్తుడైన మావటివాడు ఎక్కిన మదాంధమైన ఏనుగ అందినదాని నల్లా నలగకొట్టివేసి నట్లు గ్రుడ్డిమంత్రి చెప్పుచేతలలో ఉన్న, శాస్త్రం అనే నేత్రం లేని, ఈ గ్రుడ్డిరాజు పౌరుల్నీ, జానపదుల్నీ చంపడానికే సిద్ధం అవుతున్నాడు. వీని శత్రువు ను ప్రోత్సహింపచేస్తే వీనిని తొలగించివేయడానికి శక్యం అవుతుంది. అందుచేత రాజుకు ఎదురుతిరగండి" అని చెపుతూ క్రుద్ధవర్గాన్ని రెచ్చగొట్టాలి.

మూ. "యథా లీనః సర్పః యస్మాద్ భయం పశ్యతి తత్ర విషముత్సృజతి ఏవమయం రాజా జాతదోషాశఙ్కః త్వయి పురా క్రోధవిషముత్సృజతి, అన్యత్ర గమ్యతామ్" ఇతి భీతవర్గముపజాపయేత్.

వ్యా. "ఒక చోట అణిగి ఉన్న సర్పం తనకు ఎవరివల్ల అపాయం కలుగుతుందని అనుకుంటుందో వానిమీద విషం విడిచిపెడుతుంది. (వానిని కరుస్తుంది). అదే విధంగా ఈ రాజు నీవల్ల ఏమి అపాయం వస్తుందో అనే అశంకతో నీమీద కోపం అనే విషాన్ని విడిచిపెడతాడు. నీవు మరొక చోటికి వెళ్లిపో" అని చెప్పి భీతవర్గం విషయంలో ఉపజాపం చెయ్యాలి. (భేదం నాటాలి).

మూ. "యథా శ్వగణినాం ధేనుః శ్వభ్యో దుగ్ధే న బ్రాహ్మణేభ్యః ఏవమయం రాజా సత్త్వప్రజ్ఞావాక్యశక్తిహీనేభ్యో దుగ్ధే, నాత్మగుణసంపన్నేభ్యః,

అసౌ రాజా పురుషవిశేషజ్ఞః సేవ్యతామ్" ఇతి లుబ్ధవర్గమ్ ఉపజాపయేత్.

వ్యా. "కుక్కలు పెంచేవాళ్ల ఆవు ఇచ్చే పాలు కుక్కలకోసమే కాని బ్రాహ్మణులకోసం కాదు. అదే విధంగా ఈ రాజు ధైర్యం, బుద్ధి, మాటకారితనం, శక్తి లేనివాళ్లకే ఉపయోగిస్తాడు కాని నీవంటి ఆత్మగుణాలు ఉన్నవాళ్లకి ఉపయోగించడు. ఆ రాజు పురుషులలో ఉన్న గుణాల తారతమ్యాన్ని గుర్తించగలవాడు. అందుచేత అతనిని సేవించండి" అని లుబ్ధవర్గానికి రహస్యంగా నూరిపోయాలి.

మూ. "యథా చణ్డాలోదపానః చణ్డాలానామేవ ఉపభోగ్యః నాన్యేషామ్, ఏవమ్ అయం రాజా నీచో నీచానామేవ ఉపభోగ్యో న త్వద్విధానామ్ ఆర్యాణామ్. అసౌ రాజా పురుషవిశేషజ్ఞః, తత్ర గమ్యతామ్" ఇతి మానివర్గమ్ ఉపజాపయేత్.

వ్యా. "చండాలుల నుయ్యి చండాలులకే అనుభవించడానికి తగి ఉంటుంది. ఇతరులకు కాదు; అదే విధంగా నీచుడైన ఈ రాజు నీచులకే ఉపభోగ్యుడు (దగ్గర జేరి అనుభవింపదగినవాడు), నీవంటి ఉత్తములకి ఉపభోగ్యుడు కాడు. ఆ రాజు పురుషుల తారతమ్యాన్ని గుర్తించగలవాడు, అక్కడికి వెళ్లండి" అని ఆత్మాభిమానవంతుల వర్గాన్ని ఉపజపింపచేయాలి. రాజువిషయంలో వాళ్లకి ద్వేషం పెంచాలి.

శ్లో. తథేతి ప్రతిపన్నాంస్తాన్ సంహితాన్ పణకర్మణా,
యోజయేత యథాశక్తి సాపసర్పాన్ స్వకర్మసు.

వ్యా. వాళ్లలో ఎవరైతే ఇందుకు అంగీకరిస్తారో వాళ్లచేత శపథం చేయించి, రాజుకు వ్యతిరేకంగా పనిచేసే టట్లు చేసి, వాళ్లతో ఉన్న గూఢచారులతో సహా వాళ్లను, వాళ్ల శక్తిని అనుసరించి ఆ యా కర్మలలో నియోగించాలి.

శ్లో. లభేత సామదానాభ్యాం కృత్యాంశ్చ పరభూమిషు,
అకృత్యాన్ భేదదణ్డాభ్యాం పరదోషాంశ్చ దర్శయేత్.

ఇతి కౌటిలీయార్థశాస్త్రే వినయాధికారికే ప్రథమాధికరణే చతుర్దశోఽధ్యాయః,
పరవిషయే కృత్యాకృత్యపక్షోపగ్రహః.

వ్యా. శత్రురాజ్యాలలో ఉన్న కృత్యులను సామదానోపాయాలచేత తన వైపు త్రిప్పుకోవాలి. అకృత్యులను భేదదండోపాయాలచేత తన వైపు త్రిప్పుకోవాలి. శత్రువులో ఉన్న దోషాలను వాళ్లకి చూపుతూ ఉండాలి.



"బాలానందిని" అనే కౌటిలీయార్థశాస్త్రాంధ్రవ్యాఖ్యానంలో వినయాధికారికమైన ప్రథమాధికరణంలో పరరాజ్యంలో కృత్యాకృత్యపరిగ్రహం అనే పద్నాల్గవ అధ్యాయం సమాప్తం.

## అథ పఞ్చదశోఽధ్యాయః

### ఏకాదశే ప్రకరణే మన్త్రాధికారః

మూ. 1. కృతస్వపక్షపరపక్షోపగ్రహః కార్యారమ్భాంశ్చిన్తయేత్, మన్త్రపూర్వాః సర్వారమ్భాః.

2. తదుద్దేశః సంవృతః కథానామ్ అనిఃస్రావీ, పక్షిభిరపి అనాలోక్యః స్యాత్. శ్రూయతే శుకశారికాభిర్మన్త్రో భిన్నః శ్వభిః అన్యైశ్చ తిర్యగ్యోనిభిః, తస్మాన్మన్త్రోద్దేశమనాయుక్తో నోపగచ్ఛేత్. ఉచ్ఛిద్యేత మన్త్రభేదీ.

వ్యా. 1. రాజు స్వపక్షపరపక్షాలను గూఢచారుల ద్వారా తన ఆధీనంలో ఉంచుకుని కార్యముల ప్రారంభాలను గూర్చి ఆలోచించాలి. ఏ పనైనా ముందుగా బాగా ఆలోచించి ప్రారంభించాలి.

2. ఆలోచనలు చేసే ప్రదేశం అన్ని వైపులా ఆచ్ఛాదించబడి విషయాలు పైకి వెళ్లని విధంగా ఉండాలి. పక్షులు కూడా చూడజాలని విధంగా ఉండాలి. మంత్రం (ఆలోచించిన విషయం) చిలకలు, గోరింకలు, కుక్కలు మొదలైన తిర్యగ్జంతువుల ద్వారా పైకి తెలిసిపోయి నట్లు వింటున్నాం కదా? అందుచేత అనుమతి లేనివాడు ఎవడూ కూడా మంత్రం జరిగే ప్రదేశానికి వెళ్లకూడదు. మంత్రాన్ని పైకి చెప్పిన వానిని చంపివేయాలి.

మూ. మన్త్రభేదో హి దూతామాత్యస్వామినామిఙ్గితాకారాభ్యామ్. ఇఙ్గితమన్యథావృత్తిః. ఆకృతిగ్రహణమాకారః.

వ్యా. దూతలయొక్క, అమాత్యులయొక్క, ప్రభువుయొక్క ఇంగితంచేత, ఆకారంచేత మంత్రం పైకి తెలిసిపోతుంది. స్వాభావిక మైనదానికంటె విలక్షణంగా ఉండే చేష్ట 'ఇంగితం'. స్వాభావికమైన ఆకారంకంటె భిన్నమైన ఆకారాన్ని (ముఖాదులందు) గ్రహించడం 'ఆకారం', ముఖం రంగు మారిపోవడం మొదలైనది.

మూ. తస్య సంవరణమ్, ఆయుక్తపురుషరక్షణమ్ ఆకార్యకాలాదితి. తేషాం హి ప్రమాదమదసుప్తప్రలాపకామాదిరుత్సేకః, ప్రచ్ఛన్నః, అవమతో

వా మన్త్రం భినత్తి. తస్మాత్ రక్షేన్మన్త్రమ్.

వ్యా. పని పూర్తి అయేవరకు ఇంగితాకారాలను కప్పిపుచ్చాలి; మంత్రంకోసం పిలిచిన అధికారులమీద ఒక కన్నువేసి ఉండాలి. ఎందుచేత ననగా - పొరబాటుచేత గాని, మద్యమదంచేత గాని, నిద్రలో కాని వాళ్లు చేసే పేలాపన, కామాదుల ఉద్రేకమూ, ఆ ప్రదేశంలో దాగి ఉన్నవాడు, వీడి కేమీ తెలియదులే అనుకొని నిర్లక్ష్యంచేసిన, అక్కడనే ఉన్నవాడు మంత్రాన్ని పైకి తెలిసిపోయే టట్లు చేస్తారు. అందువలన మంత్రాన్ని బాగా రక్షించాలి.

మూ. మన్త్రభేదో హ్యయోగక్షేమకరో రాజ్ఞః, తదాయుక్తపురుషాణాం చ. తస్మాద్గుహ్యమేకో మన్త్రయేత్ ఇతి భారద్వాజః. మన్త్రిణామపి మన్త్రిణో భవన్తి, తేషామప్యన్యే. సైషా మన్త్రిపరంపరా మన్త్రం భినత్తి.

వ్యా. మంత్రం పైకి తెలిసిపోవడం రాజుయొక్క, రాజు నియమించిన అధికారులయొక్క యోగక్షేమాలకు విఘాతం కలిగిస్తుంది. అందువలన రహస్యవిషయాన్ని గూర్చి (రాజు) ఒక్కడే ఆలోచన చెయ్యాలి అని భారద్వాజుడు అన్నాడు. ఎందుచేత ననగా - మంత్రులకు కూడా మంత్రు లుంటారు. వాళ్లకి మరి కొందరు మంత్రులు. ఈ విధంగా ఏర్పడిన మంత్రిపరంపర మంత్రం పైకి తెలిసిపోయే టట్లు చేస్తుంది.

శ్లో. తస్మాన్నాస్య పరే విద్యుః కర్మ కించిచ్చికీర్షితమ్,
ఆరబ్ధారస్తు జానీయురారబ్ధం కృతమేవ వా.

వ్యా. "అందువలన రాజు చేయదలచుకున్న ఏ పనీ కూడా ఇతరులకు తెలియకూడదు. (నిర్ణయం అయిన తరువాత) ఆ పని ప్రారంభించే అధికారులు ఆ ప్రారంభించిన పనిని గూర్చిగాని, లేదా పూర్తి అయిన పనిని గూర్చి గాని తెలుసుకునే టట్లు ఉండాలి." అనగా పని ప్రారంభించిన తరవాత అధికారులకు చివరికి సాధించవలసింది ఏదో తెలిస్తే తెలియవచ్చు. ఒకప్పుడు ఆ పని పూర్తి అయిన పిమ్మటనే ఆ విషయం తెలియవచ్చు అని భావం.

మూ. నైకస్య మన్త్రసిద్ధిరస్తీతి విశాలాక్షః, ప్రత్యక్షపరోక్షానుమేయా హి రాజవృత్తిః. అనుపలబ్ధస్య జ్ఞానమ్, ఉపలబ్ధస్య నిశ్చయబలాధానమ్, అర్థద్వైధస్య సంశయచ్ఛేదనమ్, ఏకదేశదృష్టస్య శేషోపలబ్ధిరితి మన్త్రిసాధ్య



మేతత్. తస్మాత్ బుద్ధివృద్ధైః సార్ధమాసీత మన్త్రమ్.

వ్యా. ఒక్కనికి మంత్రసిద్ధి ఉండదు అని విశాలాక్షుడు. అనగా రాజు ఒక్కడే కూర్చొని ఆలోచన చేస్తే విషయం సరిగా నిర్ణయించడానికి శక్యం కాదు అని అర్థం. ఎందుచేతననగా రాజవ్యవహారం ప్రత్యక్షంగాను, పరోక్షంగాను, అనుమేయంగాను (ఊహించవలసినదిగాను) మూడు విధాలుగా ఉంటుంది. తెలియని దానిని తెలుసుకోవడం, తెలుసుకున్నదానికి ఇది ఇంతే అని నిశ్చయరూపమైన బలాన్ని ఇవ్వడం, అర్థద్వైధం (విషయంలో రెండు పక్షాలు) కలిగి నప్పుడు సంశయాన్ని ఛేదించడం, కొంతవరకు తెలిసినదాని మిగిలిన అన్ని అంశాలూ తెలుసుకోవడం ఇవి మంత్రంచేతనే సాధ్యములు అవుతాయి. అందుచేత బుద్ధివృద్ధులతో (పరిణతమైన బుద్ధికలవాళ్లతో) మంత్రం కొనం కూర్చోవాలి.

శ్లో. న కంచిదవమన్యేత సర్వస్య శృణుయాన్మతమ్,
బాలస్యాప్యర్థవద్ వాక్యముపయుఞ్జీత పణ్డితః.

వ్యా. పండితుడు(తెలివైనవాడు) ఎవరినీ అవమానించకూడదు. అందరి మతాన్నీ (అభిప్రాయాన్నీ)వినాలి. అర్థం ఉన్నట్లయితే చిన్న పిల్లవాని మాటకూడా ఉపయోగించాలి (స్వీకరించాలి).

మూ. ఏతన్మన్త్రజ్ఞానం, నైతన్మన్త్రరక్షణమితి పారాశరాః, యదస్య కార్యమభిప్రేతం తత్ప్రతిరూపకం మన్త్రిణః పృచ్ఛేత్ - కార్యమిదమేవమాసీత్, ఏవం వా యది భవేత్ తత్ కథం కర్తవ్యమితి. తే యథా బ్రూయుః తత్ కుర్యాత్, ఏవం మన్త్రోపలబ్ధిః సంవృతిశ్చ భవతీతి.

వ్యా. ఇది మంత్రం తెలుసుకోవడం అవుతుంది కాని మంత్రరక్షణం కాజాలదు అని పరాశరమతం అంగీకరించే పారాశరులు అంటారు. (మరి రాజు ఏమి చేయాలనగా) తన కార్యం ఏది ఉన్నదో దానితో సమానమైన కార్యం ఒకటి చెప్పి మంత్రుల్ని - "పూర్వం ఇటువంటి కార్యం ఇలా జరిగింది. ఇది ఇలా అయితే ఏమి చేయడం మంచిది?" అని ప్రశ్నించాలి. వాళ్లు ఎలా చెపితే అలా చెయ్యాలి. ఈ విధంగా చేయడంవల్ల మంత్రమూ(మంత్రుల ఆలోచనా)లభిస్తుంది. అది రహస్యంగా కూడా ఉంటుంది. (అని పారాశరుల అభిప్రాయం).

మూ. నేతి పిశునః. మన్త్రిణో హి వ్యవహితమర్థం వృత్తమవృత్తం

వా పృష్టమ్ అనాదరేణ బ్రువన్తి, ప్రకాశయన్తి వా. న దోషః. తస్మాత్కర్మసు యే యేష్వభిప్రేతాః తైః సహ మన్త్రయేత్. తైర్మన్త్రయమాణో హి మన్త్రబుద్ధిం గుప్తిం చ లభతే ఇతి.

వ్యా. ఇది సరియైన పద్ధతికాదు అంటాడు పిశునుడు. ఎప్పుడో పూర్వం జరిగిపోయినదో ఎప్పుడో జరగబోయేదో విషయాన్ని గూర్చి అడిగితే మంత్రులు పెద్ద ఆదరం చూపకుండా ఏదో చెప్పివేస్తారు, లేదా రాజు అడిగిన దానిని నలుగురికీ తెలిపేస్తారు. ఈ పద్ధతిలో ఉన్న దోషం ఇదే. అందుచేత రాజు ఏ పనులలో ఎవరు ఉపయోగిస్తారు అని అనుకుంటాడో వాళ్లతో ఆలోచించాలి. వాళ్లతో ఆలోచించే పక్షంలో మంత్రజ్ఞానమూ లభిస్తుంది. అనగా సరియైన ఆలోచనా దొరుకుతుంది. ఆ మంత్రం సురక్షితంగానూ ఉంటుంది.

మూ. నేతి కౌటిల్యః. అనవస్థా హ్యేషా. మన్త్రిభిః త్రిభిః చతుర్భిర్వా మన్త్రయేత. మన్త్రయమాణో హ్యేకేన అర్థకృచ్ఛ్రేషు నిశ్చయం నాధిగచ్ఛేత్. ఏకశ్చ మన్త్రీ యథేష్ట మనవగ్రహః చరతి. ద్వాభ్యాం మన్త్రయమాణో ద్వాభ్యాం సంహతాభ్యామ్ అవగృహ్యతే: విగృహీతాభ్యాం వినాశ్యతే, త్రిషు చతుర్షు వా నైకాన్తం కృచ్ఛ్రేణోపపద్యతే మహాదోషమ్, ఉపపన్నం తు భవతి తతః పరేషు కృచ్ఛ్రేణ అర్థనిశ్చయో గమ్యతే, మన్త్రో వా రక్ష్యతే.

వ్యా. ఈ పద్ధతి సరియైనది కాదు అంటాడు కౌటిల్యుడు, దీనివల్ల అనవస్థ ఏర్పడుతుంది. అనగా- రాజు నిర్వహించవలసిన కార్యాలు అనేకం ఉంటాయి. ఒక్కొక్క కార్యాన్ని వేరువేరు మంత్రులతో ఆలోచించడం ప్రారంభిస్తే ఆ మంత్రుల సంఖ్యకు ఒక నియమం ఉండదు. ఏ కార్యాన్ని గూర్చి ఎవరితో ఆలోచించాలి అనేది కూడా ఒక్కొక్కప్పుడు తేలదు. అందుచేత (రాజు అన్ని కార్యాలూ కూడా)ముగ్గురు మంత్రులలో కాని నలుగురు మంత్రులతో కాని ఆలోచించాలి. కష్టమైన విషయాలలో ఒక్క మంత్రితో మాత్రమే ఆలోచిస్తే నిర్ణయానికి రాజాలడు. మంత్రి ఒక్కడే అయితే అతడు ఏ అడ్డూ లేక ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తాడు. ఇద్దరితో ఆలోచించే రాజును ఆ ఇద్దరూ ఒకరితో ఒకరు కలిస్తే తమ చెప్పుచేతలలో పెట్టుకుంటారు, వాళ్ళిద్దరికీ ఒకరితో ఒకరికి పడకపోతే రాజును నశింపచేస్తారు. ముగ్గురు లేదా నలుగురు మంత్రులు ఉంటే మహాదోషహేతువైన (గొప్ప ఆపదకు దారితీసే) రాజావగ్రహణం



మొదలైనది తప్పకుండా జరుగుతుంది అనే మాట ఉండదు. అనగా ఇద్దరు మంత్రులు మాత్రమే ఉన్నప్పుడు జరిగే అపాయం ముగ్గురున్నా నలుగురున్నా కూడ జరగవచ్చును కాని దానికి అవకాశం తక్కువగా ఉంటుంది అని అర్థం. అది జరుగుతే అతికష్టంమీద జరుగుతుంది. ఉపపన్నం మాత్రం అవుతుంది. అనగా ముగ్గురు, నలుగురు మంత్రులున్నా కూడ మహాదోషం జరగడానికి అవకాశం లేకపోలేదు. మంత్రులు అంతకంటె ఎక్కువమంది ఉంటే అతికష్టం మీద కాని కార్యనిశ్చయం జరగదు; మంత్రరక్షణం కూడా కష్టమే.

మూ. దేశకాలకార్యవశేన త్వేకేన సహ ద్వాభ్యామేకో వా యథా సామర్థ్యం మన్త్రయేత.

వ్యా. అయితే దేశాన్ని పట్టి, పని తొందరను పట్టి ఒక మంత్రితోగాని, ఇద్దరితో గాని, తాను ఒకడే కాని, ఆ మంత్రులకు, తనకు ఉన్న సామర్థ్యాన్ని అనుసరించి ఆలోచన జరపాలి.

మూ. కర్మణామ్ ఆరమ్భోపాయః, పురుషద్రవ్యసంపత్, దేశకాల విభాగః, వినిపాతప్రతీకారః, కార్యసిద్ధిః ఇతి పఞ్చాఙ్గో మన్త్రః. తానేకైకశః పృచ్ఛేత్ సమస్తాంశ్చ. హేతుభిశ్చైషాం మతిప్రవివేకాన్ విద్యాత్. అవాప్తార్థః కాలం నాతిక్రామయేత్. న దీర్ఘకాలం మన్త్రయేత, న చ తేషాం పక్ష్యైః యేషామపకుర్యాత్.

వ్యా. ఆ యా పనులు ఆరంభించడానికి ఉపాయం, పురుషసంపద, ద్రవ్యసంపద (అనగా ఆ పనులు సాధించగలిగిన పురుషబలం, కావలసిన వస్తువుల సమృద్ధి), ఏ దేశంలో ఏ కాలంలో ఏ పని చెయ్యాలి అనే దేశవిభాగకాలవిభాగాలు, పనులు ప్రారంభించి చేస్తూండగా వచ్చే అపాయాలకి ప్రతిక్రియ, కార్యాన్ని సాధించడం - ఇది ఐదు అంగాలు గల మంత్రం. అనగా కర్మారంభోపాయాదులు మంత్రానికి ఉన్న అంగాలు (aspects). ఆ మంత్రులలో ఒక్కొక్కరితోనూ సంప్రదించాలి; అందరితో కలిసీ సంప్రదించాలి. వాళ్ల మతభేదాలకి కారణాలు కూడా తెలుసుకోవాలి. విషయం నిశ్చయించిన తరవాత కాలం దాటబెట్టకూడదు. (వెంటనే చర్య తీసికోవాలి). చాలా సేపు మంతనాలు చేస్తూనే ఉండకూడదు. ఎవరికైతే అపకారం చేయనున్నాడో వాళ్ల పక్షానికి చెందినవాళ్లతో మంతనాలు చేయగూడదు.

మూ. 1. మన్త్రిపరిషదం ద్వాదశామాత్యాన్ కుర్వీతేతి మానవాః.

2. షోడశేతి బార్హస్పత్యాః.

3. వింశతిమ్ ఇత్యౌశనసాః.

4. యథాసామర్థ్యమ్ ఇతి కౌటిల్యః.

వ్యా. 1. పన్నెండుగురు మంత్రు లున్న మంత్రిపరిషత్తును నియమించా లని మానవులు.

2. పదహారుగురు ఉండా లని బార్హస్పత్యులు.

3. ఇరవైమంది ఉండా లని ఔశనసులు.

4. పని నిర్వహించే వాళ్ల సామర్థ్యాన్ని పట్టి (సంఖ్యానియమం లేకుండా) మంత్రులను నియమించా లని కౌటిల్యుడు.

మూ. తే హ్యస్య స్వపక్షం పరపక్షం చ చిన్తయేయుః. అకృతారమ్భమ్, ఆరబ్ధానుష్ఠానమ్, అనుష్ఠితవిశేషమ్, నియోగసంపదం చ కర్మణాం కుర్యుః. ఆసన్నైః సహ కార్యాణి పశ్యేత్, అనాసన్నైః సహ పత్రసంప్రేషణేన మన్త్రయేత. ఇన్ద్రస్య హి మన్త్రిపరిషద్ ఋషీణాం సహస్రమ్. స తచ్చక్షుః. తస్మాదిన్ద్రం ద్వ్యక్షం సహస్రాక్షమాహుః.

వ్యా. ఆ మంత్రులు తమ రాజ్యానికి సంబంధించిన విషయాలు శత్రురాజ్యానికి సంబంధించిన విషయాలు కూడా ఆలోచిస్తూ ఉండాలి. చేయని (చేయవలసిన)పని ప్రారంభించాలి. ప్రారంభించిన పని జరిపించాలి. చేసినదానికి మెరుగులు దిద్దాలి. నియోగసంపదను అనగా ఆ యా కర్మలు నిర్వహించే కార్యాలయాల కార్యాలలో సుసంపన్నత్వాన్ని సాధించాలి. దగ్గరగా ఉన్న మంత్రులతో కలిసి కార్యాలను గూర్చి ఆలోచన జరపాలి. దూరంగా ఉన్న మంత్రులతో లేఖల ద్వారా మంతనాలు చెయ్యాలి. ఇంద్రుని మంత్రిపరిషత్తులో వెయ్యిమంది ఋషులు ఉంటారు. వాళ్లే ఇంద్రునికి కళ్లు. అందుచేతనే ఇంద్రుడికి రెండు కళ్లు మాత్రమే ఉన్నా సహస్రాక్షుడు (వేయి కళ్లు ఉన్నవాడు)అని అంటారు.

మూ. ఆత్యయికే కార్యే మన్త్రిణః మన్త్రిపరిషదం చాహూయ బ్రూయాత్. తత్ర యద్ భూయిష్ఠాః కార్యసిద్ధికరం వా బ్రూయుః తత్ కుర్యాత్. కుర్వతశ్చ-



శ్లో. నాస్య గుహ్యం పరే విద్యుశ్ఛిద్రం విద్యాత్ పరస్య చ,
గూహేత్ కూర్మ ఇవాఙ్గాని యత్ స్యాత్ వివృతమాత్మనః.
యథా హ్యశ్రోత్రియః శ్రాద్ధం న సతాం భోక్తుమర్హతి,
ఏవమశ్రుతశాస్త్రార్థో న మన్త్రం శ్రోతుమర్హతి.

*ఇతి కౌటిలీయార్థశాస్త్రే వినయాధికారికే ప్రథమాధికరణే పఞ్చదశోఽధ్యాయః మన్త్రాధికారః.*

వ్యా. ఆలస్యం చేయడానికి వీలులేని తొందర పని ఏర్పడ్డప్పుడు మంత్రుల్నీ, మంత్రిపరిషత్తునూ పిలిచి వాళ్లకి చెప్పాలి. వాళ్లల్లో చాలామంది చెప్పినదానిని లేదా కార్యసిద్ధికి ఉపకరించేదానిని చెయ్యాలి. ఈ విధంగా పనులు చేస్తూండగా-"ఇతని రహస్యాలు శత్రువులకు తెలియకూడదు. శత్రువుల లోపాలు తెలుసుకుంటూ ఉండాలి. తన అంగం (రాజ్యానికి సంబంధించిన విషయం) ఏదైనా బైటపడిన ట్లయితే దానిని తాబేలు తన అవయవాలను తనలోనికి లాగికొన్నట్లుగా రహస్యంగా ఉండే టట్లు చేసుకోవాలి"."సత్పురుషుల ఇంట్లో శ్రాద్ధాన్ని భుజించడానికి శ్రోత్రియుడు కానివానికి ఎలా అర్హత లేదో అదే విధంగా శాస్త్రార్థం విననివానికి, అనగా అర్థశాస్త్రం అభ్యసించనివానికి, మంత్రాన్ని వినే అర్హత లేదు".

*"బాలానందిని" అనే కౌటిలీయార్థశాస్త్రాంధ్రవ్యాఖ్యానంలో, వినయాధికారికమైన మొదటి అధికరణంలో మంత్రాధికారం అనే పదిహేనవ అధ్యాయం సమాప్తం.*

## అథ షోడశోఽధ్యాయః

### ద్వాదశే ప్రకరణే దూతప్రణిధిః

మూ. ఉద్ధృతమన్త్రో దూతప్రణిధిః. అమాత్యసంపదోపేతో నిసృష్టార్థః. పాదగుణహీనః పరిమితార్థః. అర్ధగుణహీనః శాసనహరః.

వ్యా. మంత్రం నిశ్చిత మైన తరవాత దూతల ప్రయోగం జరగాలి. అమాత్యులకు ఉండే గుణసంపద అంతా ఉన్న దూత "నిసృష్టార్థుడు" అనగా కార్యభారం అంతా అతని మీద విడిచివేయవచ్చు నని అర్థం. నాల్గవ వంతు గుణాలు తక్కువ ఉన్నవాడు "పరిమితార్థుడు", (పరిమితమైన ప్రయోజనం కలవాడు, అనగా

వ్యా. (పరరాజ్యానికి వెళ్లిన దూత) ఆ రాజు తిరిగి వెళ్ల మనే వరకు అక్కడనే ఉండాలి. అక్కడ తనకు లభించిన ఆదరానికి పొంగిపోకూడదు. శత్రువుల మధ్య తానేదో ఎక్కువ బలం ఉన్నవా డని అనుకొనకూడదు.అనిష్టమైన మాటలు ఎవరైనా పలికినా సహించాలి. స్త్రీలను, మద్యపానాన్నీ వర్జించాలి. ఒంటరిగా శయనించాలి. ఎందుచేత ననగా నిద్రపోతూన్నవాళ్ల భావాలు, మత్తులో ఉన్నవాళ్ల భావాలు ఇతరులకు తెలిసిపోవడం అనేది చూస్తున్నాం. శత్రుదేశంలోని కృత్యపక్షం, వాళ్లవిషయంలో ఉపజాపాన్నీ (గూఢచారిచర్య, లేదా రెచ్చగొట్టడం), అకృత్యపక్షంలో గూఢచారులను ప్రయోగించడాన్నీ, ప్రకృతులకు వాళ్ల రాజువిషయంలో భక్తినీ, భక్తిలేకపోవడాన్నీ, ఆ ప్రకృతులలో ఉండే రంధ్రాలను(లోపాలను) తాపసుల వేషంలోను, వైదేహకవేషంలోనూ (ఈ శత్రుదేశంలో ఉంటూన్న) తమ గూఢచారులనుండి తెలుసుకోవాలి. లేదా ఆ తాపసవైదేహకవ్యంజనుల దగ్గర పనిచేసేవాళ్లనుండి (అంతేవాసులు) గాని, వైద్యుల వేషంలోను, పాషండుల (నాస్తికుల) వేషంలోను ఉన్న ఉభయవేతనులనుండి గాని తెలుసుకోవాలి. వాళ్లతో మాటలాడడం కుదరని పక్షంలో యాచకులు, ఉన్మత్తులు, మత్తులు (మద్యమదంలో ఉన్నవాళ్లు), నిద్రపోతూన్నవాళ్లూ పేలే పేలాపనలనుండి గాని (తమ గూఢచారు లందరూ అప్పుడప్పుడు కలవడానికి వీలైన ప్రదేశాలైన) పుణ్యస్థానాలలోను, దేవాలయాలలోను (ఆ గూఢచారులు) వ్రాసిన చిత్తరువులు, లిపులు - వీటివల్ల తెలిసే సంజ్ఞల (గుర్తులు codes) సహాయంచేత చారాన్ని (రహస్యవృత్తాంతాన్ని) సేకరించాలి. చారం తెలిసిన తరవాత తగువిధమైన ఉపాయాలచేత ప్రజలను రెచ్చగొట్టాలి. శత్రువు అడిగినా తన ప్రకృతుల పరిమాణాన్ని (సంఖ్యాబలాదికాన్ని) చెప్పకూడదు. "తమరికి తెలియనిది ఏ మున్నది" అనాలి. లేదా కార్యసిద్ధి కలిగే విధంగా చెప్పాలి.

మూ. కార్యస్య సిద్ధౌ ఉపరుధ్యమానః తర్కయేత్ - "కింభర్తుర్మే వ్యసనమాసన్నం పశ్యన్, స్వం వా వ్యసనం ప్రతికర్తుకామః, పార్ష్ణిగ్రాహసారౌ అన్తఃకోపమ్ ఆటవికం వా సముత్థాపయితుకామః, మిత్రమాక్రన్దం వా వ్యాపాదయితుకామః, స్వం వా పరతో విగ్రహమ్ అన్తఃకోపమాటవికం వా ప్రతికర్తుకామః, సంసిద్ధం మే భర్తుర్యాత్రాకాలమభిహన్తుకామః, సస్యకుప్యపణ్యసంగ్రహం దుర్గకర్మ బలసముత్థానం వా కర్తుకామః,



స్వసైన్యానాం వా వ్యాయామదేశకాలావాకాంక్షమాణః, పరిభవప్రమాదాభ్యాం వా సంసర్గానుబన్ధార్థీ వా మాముపరుణద్ధి" ఇతి. జ్ఞాత్వా వసేదపసరేద్వా. ప్రయోజనమవేక్షేత వా. శాసనమనిష్టముక్త్వా బన్ధవధభయాద విసృష్టోఽవ్యపగచ్ఛేత్. అన్యథా నియమ్యేత.

వ్యా. తాను వచ్చిన పని సిద్ధించడం విషయంలో శత్రురాజు ఆలస్యం చేస్తూ తనను తిరిగి వెళ్లకుండా అక్కడనే నిలిపేసినప్పుడు ఆ దూత ఇలా ఆలోచించుకోవాలి. "ఇతడు నా ప్రభువుకు సమీపంలోనే ఏదో ఆపద రానున్న దని తెలుసుకొన్నాడా, లేదా తనకు రానున్న వ్యసనానికి ప్రతిక్రియ చేసుకొనదలచుచున్నాడా, లేదా నా ప్రభువుకు వ్యతిరేకంగా పార్ష్ణిగ్రాహుణ్ణీ (స్వామికి-తన ప్రభువుకు- శత్రువైన శత్రుమిత్రుడు పార్ష్ణిగ్రాహుడు) ఆసారుణ్ణీ (శత్రుమిత్రుని మిత్రుడు) రెచ్చగొట్టదలచుచున్నాడా, లేదా రాజ్యంలో అంతఃకలహాలు సృష్టించడం కోసం ప్రయత్నిస్తున్నాడా, లేదా అటవికప్రభువును రెచ్చగొట్టదలచుచున్నాడా,మిత్రుణ్ణి (నా స్వామికి ముందున్న మిత్రుణ్ణి) గాని ఆక్రందుణ్ణి (వెనుక ఉన్న మిత్రుణ్ణి) గాని చంప ప్రయత్నిస్తున్నాడా, లేదా మరొక శత్రువుతో తన కున్న విరోధానికి, లేదా తన రాజ్యంలో అంతః కోపానికి(లోపల తిరుగుబాటుకి)లేదా ఆటవిక ప్రభువుకు ప్రతిక్రియ చేయదలుస్తున్నాడా, లేదా అంతా సిద్ధంగా ఉన్న నా స్వామియొక్క యుద్ధయాత్రా కాలానికి అడ్డుతగలాలని అనుకొంటున్నాడా, లేదా సస్యసంగ్రహమూ, కుప్య (అరణ్యధనం)సంగ్రహం, పణ్య (ఇతరవస్తువులు) సంగ్రహమూ, లేదా దుర్గకర్మ(దుర్గనిర్మాణం), బలసముత్థానం(సైన్యాన్ని సమీకరించడం) చేయాలని అనుకుంటున్నాడా, తన సైన్యాల వ్యాయామానికి (సైన్యప్రయోగానికి) తగిన దేశకాలాలకోసం నిరీక్షిస్తున్నాడా, లేదా తిరస్కారబుద్ధిచేతనా (పరిభవం Contempt) లేదా అనాదరంచేతనా (ప్రమాద-negligence) లేదా మన స్వామితో అవిచ్ఛిన్నమైన సంబంధం (సంసర్గానుబన్ధ) ఉండాలని కోరుతున్నాడా - నన్నెందుకు తిరిగి వెళ్లనీయడంలేదు?" ఇలా ఆలోచించి, విషయం తెలుసుకొని (అవసరాన్ని పట్టి) అక్కడనే ఉండిపోవాలి లేదా ఎవరికీ తెలియకుండా వెళ్లిపోవాలి.తన స్వామికి ఇష్టమైన ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రవర్తించాలి. శత్రువుకు ఇష్టం కాని శాసనాన్ని (తన స్వామి పంపిన వార్తను) తెలిపిన పిమ్మట, బంధభయమో, వధభయమో

ఉంటే అతడు వెళ్లవచ్చు నని చెప్పకపోయినా వెళ్ళిపోవాలి. అలా చేయకపోతే బంధించబడిపోతాడు.

శ్లో. ప్రేషణం సంధిపాలత్వం ప్రతాపో మిత్రసంగ్రహః,
ఉపజాపః సుహృద్భేదో దణ్డగూఢాతిసారణమ్.
బన్ధురత్నాపహరణం చారజ్ఞానం పరాక్రమః,
సమాధిమోక్షో దూతస్య కర్మ యోగస్య చాశ్రయః.

వ్యా. వార్తలు పంపడం, ఇతర రాజులలో తన స్వామి చేసుకొన్న సంధులను గట్టిచేయడం, తన స్వామి గొప్పతనాన్ని చాటడం, మిత్రుల్ని సంపాదించడం, కృత్యాదుల్ని రెచ్చగొట్టడం, శత్రువుల స్నేహితులలో భేదం కలిగించడం (వాళ్లని విడదీయడం), సైన్యాన్నీ, గూఢపురుషుల్ని శత్రురాజ్యంలోనికి ప్రవేశపెట్టడం, శత్రువుల బంధువులను, రత్నాలను (ధనాన్నీ) అపహరించడం, రహస్యసమాచారాలు తెలుసుకోవడం, పరాక్రమం చూపడం. సమాధిని (పూచీకత్తుకోసం పట్టుకోబడినవాడు Hostage)విడిపించడం, రహస్యమైన ఉపాయాలు పన్నడం - ఇవి దూతలు చేయవలసినపనులు.

శ్లో. స్వదూతైః కారయేదేతత్ పరదూతాంశ్చ రక్షయేత్,
ప్రతిదూతాపసర్పాభ్యాం దృశ్యాదృశ్యైశ్చ రక్షిభిః.

ఇతి కౌటిలీయార్థశాస్త్రే వినయాధికారికే ప్రథమాధికరణే షోడశోఽధ్యాయః
దూతప్రణిధిః.

వ్యా. రాజు ఈ పని అంతా తన దూతలచేత చేయించాలి.ప్రతిదూతలు (దూతలకు ఎదురుగా పంపబడిన దూతలు ), గూఢచారులు,పైకి కనబడే రక్షకభటులు, రహస్యంగా ఉన్న రక్షకభటులు-వీళ్లను ప్రయోగించి శత్రుదూతలు తన రాజ్యంలో చేస్తున్న పనులు కనిపెడుతూ ఉండాలి.

"బాలానందిని" అనే కౌటిలీయార్థశాస్త్రాంధ్రవ్యాఖ్యానంలో వినయాధికారికమైన ప్రథమాధికరణంలో 'దూతప్రణిధి' అనే పదహారవ అధ్యాయం సమాప్తం.



## అథ సప్తదశోఽధ్యాయః

### త్రయోదశే ప్రకరణే రాజపుత్రరక్షణమ్

మూ. రక్షితో రాజా రాజ్యం రక్షత్యాసన్నేభ్యః పరేభ్యశ్చ. పూర్వం దారేభ్యః పుత్రేభ్యశ్చ. దారరక్షణం నిశాన్తప్రణిధౌ వక్ష్యామః

వ్యా. దగ్గరవాళ్లనుండీ, దూరంగా ఉన్న శత్రువులనుండీ రక్షించబడిన రాజు రాజ్యాన్ని రక్షించకలుగుతాడు. ముందుగా భార్యనుండి, పుత్రులనుండి రాజు తనను రక్షించుకోవాలి. దారరక్షణాన్ని గూర్చి 'నిశాంతప్రణిధి' అనే ప్రకరణంలో చెప్పగలం.

మూ. 1. పుత్రరక్షణమ్ - జన్మప్రభృతి రాజపుత్రాన్ రక్షేత్. కర్కటకసధర్మాణో హి జనకభక్షాః రాజపుత్రాః.

2. తేషామ్ అజాతస్నేహే పితర్యుపాంశుదణ్డః శ్రేయానితి భారద్వాజః.

3. నృశంసమదృష్టవధః క్షత్రవినాశశ్చేతి విశాలాక్షః. తస్మాదేకస్థానావరోధః శ్రేయానితి.

వ్యా. 1. రాజు రాజపుత్రుల్ని వాళ్లు పుట్టినది మొదలు రక్షించాలి; అనగా వాళ్లని కనిపెడుతూ ఉండాలి. ఎందుచేత ననగా రాజపుత్రులు పీతల వంటివాళ్లు, కన్న వాళ్లనే భక్షించేస్తారు. [ పీత ఈనగానే చచ్చిపోతుందని (దాని పొట్ట చీల్చుకొని పిల్లలు పైకివస్తాయని) అంటారు].

2. "రాజపుత్రులమీద తండ్రికి ప్రేమ కలగక ముందే రహస్యంగా వాళ్లని చంపివేయడం (ఉపాంశుదండం) మంచిది" అని భారద్వాజుని అభిప్రాయం.

3. "చూడబడని వానిని, అనగా ఎటువంటివాడో తెలియని వానిని, చంపడం క్రూరత్వం అవుతుంది. ఇలా చేస్తే క్షత్రియవంశమే నశిస్తుంది. అందుచేత వాళ్లను ఒక్కచోట నిర్బంధించి ఉంచడం మంచిది" అని విశాలాక్షుడు అంటాడు.

మూ. అహిభయమేతదితి పారాశరాః. కుమారో హి విక్రమభయాన్మాం పితా రుణద్ధీతి తమేవాఙ్కే కుర్యాత్. తస్మాత్ అన్తపాలదుర్గే వాసః శ్రేయాన్ ఇతి.

వ్యా. "పుత్రుల్ని దగ్గరనే నిర్బంధలో ఉంచడం పామువల్ల భయంవంటిది, అనగా పాము ఉన్న ఇంట్లో నివసించడం వంటిది. ఎందుచేత ననగా "నేను పరాక్రమిస్తాననే భయంచేత నన్ను తండ్రి నిర్బంధంలో ఉంచాడు" అని తెలిసి రాజకుమారుడు దగ్గర ఉండే దానిని (పరాక్రమాన్ని) చేస్తాడు. అందువల్ల రాజ్యం సరిహద్దు పాలించేవాడు ఉండే దుర్గంలో (రాజకుమారుని) నివాసం (అక్కడ నివసింపచేయడం) మంచిది" అని పారాశరుల అభిప్రాయం.

మూ. ఔరభ్రకం భయమేతదితి పిశునః. ప్రత్యాపత్తేర్హి తదేవ కారణం జ్ఞాత్వా అన్తపాలసఖః స్యాత్. తస్మాత్ స్వవిషయాదపకృష్టే సామన్తదుర్గే వాసః శ్రేయానితి.

వ్యా. "ఇది గొఱ్ఱెవల్ల కలిగే భయంవంటిది. తాను తిరిగి రాజ్యంలోనికి రావడానికి ఇది ఒక్కటే మార్గం అని తెలుసుకొన్న ఆ రాజపుత్రుడు అంతదుర్గపాలునితో స్నేహం చేసుకొని తండ్రిమీద అధికబలంతో తిరగబడతాడు. అందుచేత తన దేశానికి దూరంగా సామంతరాజు దుర్గంలో రాజపుత్రుణ్ణి ఉంచడం మంచిది" ... పిశునుడు (నారదుడు).

... ను గొఱ్ఱెను గట్టిగా ఢీ కొనడానికి తగిన ... అతివేగంగా పరుగెత్తి వచ్చి ... అంతపాలదుర్గంలో రాజ్యానికి ... స్నేహం చేసికొని గొప్ప బలంతో ... పాయమే "ఔరభ్రకభయం".

... త్సేనేవ హి ధేనుం పితరమస్య ... సః శ్రేయానితి.

... లో ఉంచడం ఆవు దూడను ఒక ... ం). లేగదూడను చూపిస్తూ ఆవును



పాలు పితికే నట్లు ఆ సామంతరాజు ఈ రాజకుమారుణ్ణి చూపి, అనగా ఆతనిని పాలిస్తున్నందుకు ప్రతిఫలంగా, వాని తండ్రి దగ్గర (ధనాదికం) పిండుకుంటాడు. అందుచేత రాజకుమారుణ్ణి ఆతని తల్లి బంధువుల దగ్గర ఉంచడం మంచిది" అని కౌణపదంతుడు అంటాడు.

మూ. ధ్వజస్థానమేతదితి వాతవ్యాధిః. తేన హి ధ్వజేన అదితికౌశికవదస్య మాతృబాన్ధవా భిక్షేరన్. తస్మాద్ గ్రామ్యధర్మేష్వేనమవసృజేయుః. సుఖోపరుద్ధా హి పుత్రాః పితరం నాభిద్రుహ్యన్తీతి.

వ్యా. "ఇది ధ్వజస్థానం, అనగా ఆ విధంగా తల్లిబంధువుల వద్ద ఉంచబడిన రాజకుమారుడు ధ్వజంవంటివాడు అవుతాడు. ఏవేవో చూపి అదితికౌశికులు బిచ్చం ఎత్తినట్లు ఈ రాజకుమారుణ్ణి చూపించి ఆ మాతృబంధువులు (సామంతరాజులు, అధికారులూ మొదలైన వాళ్లవద్దనుండి) ధనాదికం తీసుకుంటారు. అందుచేత రాజు తన కుమారుణ్ణి స్వేచ్ఛగా అన్ని సుఖాలూ అనుభవించేటట్లు చెయ్యాలి. సుఖమయ జీవనం ద్వారా ఉపరుద్ధులైన (ఒక చోట నిర్బంధింపబడినట్లు ఉన్న) రాజకుమారులు తండ్రికి ఎదురుతిరగరు" అని వాతవ్యాధి (ఉద్ధవుడు) అంటాడు.

వి. కొందరు బిచ్చం ఎత్తుకొనే స్త్రీలు ఆ యా దేవతాప్రతిమలు మోసికొనిపోయి వాటిని చూపిస్తూ బిచ్చం ఎత్తుకొంటారు. వాళ్లు అదితులు. కౌశికు డనగా పాములవాడు. పాములను చూపించి వాటిని ఆడిస్తూ బిచ్చం ఎత్తుకుంటాడు. అదే విధంగా రాజకుమారుణ్ణి ధ్వజంగా (జండావలె ముందు నిలిపి) ధనాదులు వసూలు చేస్తారు అని వ్యాఖ్యాతలు వ్రాశారు. "అదితికౌశికులు" అనేది ఒకవిధ మైన సాధువుల పేరు అయిఉంటుంది. వీళ్లు కొన్ని దేవుళ్ల బొమ్మలు, వాళ్లకి సంబంధించిన ధ్వజాలు పట్టుకొని తిరుగుతూ యాచిస్తూ ఉంటారు. ఈ దేవుళ్లను చూపడంచేత ఎవరూ కాదనలేరు అని కాంగ్లే అభిప్రాయం.

గ్రామ్యధర్మం అనగా గ్రామాలలో ఏ పనీ పాటూ లేనివాళ్లు స్వేచ్ఛగా తగుల్కొనే తినడం, తాగడం, జూదం ఆడడం, వ్యభిచారం మొదలైన దుర్వ్యసనాలు అని అర్థం.

మూ. జీవన్మరణమేతదితి కౌటిల్యః. కాష్ఠమివ హి ఘుణజగ్ధం రాజకులమవినీతపుత్రమభియుక్తమాత్రం భజ్యేత. తస్మాత్ ఋతుమత్యాం

మహిష్యామ్ ఋత్విజః చరుమ్ ఐన్ద్రబార్హస్పత్యం నిర్వపేయుః. ఆపన్న సత్త్వాయాం కౌమారభృత్యో గర్భభర్మణి ప్రజనే చ వియతేత. ప్రజాతాయాః పుత్రసంస్కారం పురోహితః కుర్యాత్. సమర్థం తద్విదో వినయేయుః.

వ్యా. ఈ విధంగా చెయ్యడం అనగా రాజపుత్రుల్ని స్వేచ్ఛగా భోగాలు అనుభవించనీయడం, బ్రతికి ఉండగానే మరణించడం అని కౌటిల్యుని అభిప్రాయం. పురుగులు దొలిచివేసిన కఱ్ఱ వలె, వినీతులు (విద్యాభ్యాసాదులచేత వినయం నేర్పబడినవారు) కాని రాజపుత్రులు గల రాజవంశం శత్రువులొచ్చి ఆక్రమణం చేసినంతమాత్రంచేతనే విరిగిపోతుంది. అందువలన పట్టమహిషి ఋతుమతి అయి ఉన్నప్పుడు ఋత్విక్కులు ఐంద్రబార్హస్పత్యమైన అనగా బలాధిష్ఠాత అయిన ఇంద్రుడు, బుద్ధికి అధిష్ఠాత అయిన బృహస్పతీ దేవతలుగా గల, చరువును (పాయసం వంటి హోమద్రవ్యం) సిద్ధం చెయ్యాలి. అనగా ఆ చరువుతో ఇంద్ర బృహస్పతుల అనుగ్రహం కోసం హోమం చెయ్యాలి. ఆమె గర్భవతి అయినప్పుడు కౌమారభృత్యుడు (శిశువైద్యుడు) గర్భాన్ని సరిగా పోషించడానికీ, అనాయాసప్రసవానికీ ప్రయత్నం చెయ్యాలి. ఆమె కనిన తరవాత పుట్టిన పుత్రునికి పురోహితుడు. (జాతకర్మాది) సంస్కారం చెయ్యాలి. అతడు సమర్థుడైన తరవాత ఆ యా విద్యలు తెలిసిన ఉపాధ్యాయులు విద్యలు నేర్పాలి.

మూ. సత్త్రిణామేకశ్చైనం మృగయాద్యూతమద్యస్త్రీభిః ప్రలోభయేత్-
...నికమ్య రాజ్యం గృహాణేతి. తదన్యః సత్త్రీ ప్రతిషేధయేత్

...డు రాజకుమారుణ్ణి వేట, జూదం,
...డ్రిని ఆక్రమించి రాజ్యం లాగికో'
...మరొక సత్త్రి ఉపదేశించాలి" అని

రహ...
చేస్తున్న...
"బాల...
ప్రథమ...

... కౌటిల్యః. నవం హి ద్రవ్యం
...షతి; ఏవమ్ అయం నవబుద్ధిః
...భిజానాతి. తస్మాద్ ధర్మమర్థం



వ్యా. తెలియనివానికి ఇలాంటి వన్నీ తెలియచెప్పడం మహానర్థహేతువు అని కౌటిల్యుని అభిప్రాయం. ఎందుచేత ననగా కొత్త ద్రవ్యం (మట్టికుండ మొదలైనది) దానికి ఏది ఏది పూస్తే దానినే పీల్చుకొంటుంది. అదే విధంగా కొత్తబుద్ధి (మంచిచెడ్డలు పూర్తిగా తెలియని బుద్ధి) గల ఈ రాజకుమారుడు (ఇతరులు) ఏది చెపితే అదే శాస్త్రోపదేశం వంటిది అని అనుకుంటాడు. అందుచేత వీనికి ధర్మాన్నీ, అర్థాన్నీ మాత్రమే ఉపదేశించాలి గాని అధర్మాన్నీ, అనర్థాన్నీ ఉపదేశించకూడదు.

మూ. సత్త్రిణస్త్వేనం "తవ స్మః" ఇతి వగన్తః పాలయేయుః. యౌవనోత్సేకాత్ పరస్త్రీషు మనః కుర్వాణమ్ ఆర్యావ్యఞ్జనాభిః స్త్రీభిరమేధ్యాభిః శూన్యాగారేషు రాత్రావుద్వేజయేయుః. మద్యకామం యోగపానేన ఉద్వేజయేయుః, ద్యూతకామం కాపటకైః పురుషైరుద్వేజయేయుః, మృగయాకామం ప్రతిరోధకవ్యఞ్జనైః త్రాసయేయుః, పితరి విక్రమబుద్ధిం తథేత్యనుప్రవిశ్య భేదయేయుః - అప్రార్థనీయో రాజా; విపన్నే ఘాతః, సంపన్నే నరకపాతః, సంక్రోశః ప్రజాభిరేకలోష్టవధశ్చేతి.

వ్యా. అయితే సత్రులు "మేము నీ వాళ్లము" అని చెప్పి (ఆతనిదగ్గరనే ఉంటూ) ఆతనిని పాలించాలి. యౌవనమదంవల్ల అతడు పరస్త్రీలవిషయంలో మోహం చూపుతే ఉత్తమస్త్రీల వేషాలలో ఉన్న అపవిత్రలైన నీచస్త్రీలను తీసికొని వచ్చి, ఎవరూ లేని ఇళ్లలో రాత్రులందు ఆతనికి పరస్త్రీ లంటే అసహ్యం కలిగే టట్లు చెయ్యాలి. మద్యం తాగా లని అతడు అనుకుంటే మందు కలిపిన మద్యం ఇచ్చి దానియందు వెగటు కలిగే టట్లు చెయ్యాలి. జూదంమీద మనస్సు పొతే మోసం చేసే జూదగాళ్లని తీసికొని వచ్చి అతనికి జూదం అంటే గిట్ట నట్లు చెయ్యాలి. వేటయందు ఆసక్తిచూపితే కొందరిని దారిదోపిడి దొంగల వేషంలో పంపి భయపెట్టాలి. తండ్రి విషయంలో పరాక్రమం చూపాలి అనుకుంటే అందుకు (పైకి) అంగీకరిస్తూ భేదోపాయంచేత అతని ఆలోచన మార్చివెయ్యాలి- "రాజును ఎదిరించడం మంచిదికాదు. నీ ప్రయత్నం విఫలమైతే మరణం తప్పదు. సంపన్నం అవుతే (సఫలం అయితే) (తండ్రిని చంపిన పాపానికి) నరకమూ వస్తుంది. లోకనింద కలుగుతుంది. ప్రజ లందరూ ఒక్కొక్క మట్టిబెడ్డతో కొట్టి చంపివేస్తారు"- (అని రహస్యంగా ఉపదేశించాలి.)

మూ. విరాగం ప్రియమేకపుత్రం వా బధ్నీయాత్. బహుపుత్రః ప్రత్యన్తమన్యవిషయం వా ప్రాపయేత్ యత్ర గర్భః, పణ్యమ్, డిమ్బో వా న భవేత్. ఆత్మసంపన్నం సైనాపత్యే, యౌవరాజ్యే వా స్థాపయేత్.

వ్యా. (రాజు) తన పుత్రుడు తన విషయంలో ప్రేమలేనివా డయితే అతడు ఎంత ఇష్టుడైనా, ఒకడే అయినా అతనిని బంధించాలి. చాలామంది పుత్రులున్న రాజు తనను ద్వేషించే పుత్రుణ్ణి సరిహద్దులో ఉన్న దేశానికి గాని మరొక దేశానికి గాని పంపివెయ్యాలి. వానికి ఎక్కడ గర్భం (పొట్టకి తిండి) గాని, (కొనడానికి) విలాస వస్తువులు గాని, దొరకవో, రాజోపద్రవం కలిగించడానికి అవకాశం ఉండదో అక్కడికి పంపివేయాలి. సద్గుణవంతు డైన పుత్రుణ్ణి సేనాధిపతినిగా గాని, యువరాజునుగా గాని నియమించాలి.

వి. ఎక్కడైతే అతడు ప్రజలకు గర్భస్థశిశువు, అనగా జాగర్తగా రక్షించదగినవాడు కాని, అమ్మడానికి తగిన వస్తువుగా గాని, అనగా పైకి చూపి ధనం సంపాదించడానికి ఉపయోగించేవాడు కాని, తిరుగుబాటుకు కారణంగాని కాజాలడో అక్కడికి పంపాలి అని కాంగ్లే వ్యాఖ్య.

మూ. బుద్ధిమాన్, ఆహార్యబుద్ధిః, దుర్బుద్ధిః ఇతి పుత్రవిశేషాః. శిక్ష్యమాణో ధర్మార్థావుపలభతే చానుతిష్ఠతి చ బుద్ధిమాన్. ఉపలభమానో నానుతిష్ఠతి ఆహార్యబుద్ధిః. అపాయనిత్యో ధర్మార్థద్వేషీ చేతి దుర్బుద్ధిః.

వ్యా. బుద్ధిమంతుడు, ఆహార్యబుద్ధి, దుర్బుద్ధి అని పుత్రులు మూడు రకాలు. ధర్మార్థాలను బోధించగా వాటిని చక్కగా గ్రహించి అనుష్ఠించేవాడు, ఆచరణలో పెట్టేవాడు బుద్ధిమంతుడు. తెలుసుకొన్నా ఆచరించనివాడు ఆహార్యబుద్ధి. ఎల్లప్పుడు అపాయాలకి కారణభూతుడై ధర్మార్థాలను ద్వేషించేవాడు దుర్బుద్ధి.

మూ. స యద్యేకపుత్రః పుత్రోత్పత్తౌ అస్య యతేత. పుత్రికాపుత్రానుత్పాదయేద్వా. వృద్ధస్తు వ్యాధితో వా రాజా మాతృబన్ధుకుల్యగుణవత్సామన్తానామన్యతమేన క్షేత్రే బీజముత్పాదయేత్.నచైకపుత్రమవినీతం రాజ్యే స్థాపయేత్.

వ్యా. దుష్టబుద్ధియే రాజుకు ఏకైకపుత్రుడైతే వానికి కుమారుడు కలగడంకోసం



ప్రయత్నించాలి. లేదా పుత్రికకు పుత్రులు కలిగే టట్లు ప్రయత్నించి (ఆ పుత్రులలో ఒకనికి రాజ్యం ఇవ్వాలి). వృద్ధు డైపోయిన, లేదా వ్యాధితో బాధపడుతున్న రాజు తన భార్యయందు తల్లివైపు బంధువులు, సమానమైన కులంవాళ్లు (తన వంశానికే చెందినవాళ్లు), సద్గుణవంతులైన సామంతరాజులు-వీళ్లలో ఒకరిచేత (నియోగంచేత) పుత్రుణ్ణి ఉత్పాదింపచెయ్యాలి. అంతే కాని తన ఏకపుత్రుడైన అవినీతుణ్ణి (దుష్టబుద్ధిని) మాత్రం రాజ్యంలో రాజుగా స్థాపించకూడదు.

శ్లో. బహూనామేకసంరోధః పితా పుత్రహితో భవేత్,
అన్యత్రాపద ఐశ్వర్యం జ్యేష్ఠభాగి తు పూజ్యతే.

వ్యా. చాలామంది పుత్రులలో ఒకడు దుష్టుడైతే అతనిని ప్రత్యంతదేశాదులలో నిరోధించాలి. తండ్రి పుత్రులకు హితకారుడుగా ఉండాలి. ఏదైనా పెద్ద విపత్తు వచ్చినప్పుడు తప్ప (మామూలు పరిస్థితులలో) పెద్దకుమారునికే ఐశ్వర్యం (రాజ్యం) చెందడం ప్రశస్తం.

శ్లో. కులస్య వా భవేద్రాజ్యం కులసంఘో హి దుర్జయః,
అరాజవ్యసనాబాధః శశ్వదావసతి క్షితిమ్.

ఇతి కౌటిలీయార్థశాస్త్రే వినయాధికారికే ప్రథమాధికరణే సప్తదశోఽధ్యాయః
రాజపుత్రరక్షణమ్.

వ్యా. లేదా రాజ్యం మొత్తం కులానికే కావచ్చును. అనగా ఆ రాజవంశంలోని వాళ్లందరూ రాజ్యపాలకులుగా ఉండాలి. కులరూపమైన రాజ్యపాలకసంఘం (oligarchy) రాజుకు కలిగే ఆపదవల్ల ప్రజలకు ఏ బాధా లేకుండా భూమి మీద శాశ్వతంగా ఉంటుంది. (చిరకాలం రాజ్యపాలనం చేస్తుంది.)

"బాలానందిని అనే కౌటిలీయార్థశాస్త్రాంధ్రవ్యాఖ్యానంలో వినయాధికారికం అనే ప్రథమాధికరణంలో 'రాజపుత్రరక్షణం' అనే పదిహేడవ అధ్యాయం సమాప్తం.

## అథ అష్టాదశోఽధ్యాయః

### చతుర్దశపఞ్చదశప్రకరణయోః అవరుద్ధవృత్తమ్, అవరుద్ధే చ వృత్తిః

మూ. రాజపుత్రః కృచ్ఛ్రవృత్తిః అసదృశే కర్మణి నియుక్తః పితరమనువర్తేత; అన్యత్ర ప్రాణాబాధకప్రకృతికోపపాతకేభ్యః. పుణ్యకర్మణి నియుక్తః పురుషమధిష్ఠాతారం యాచేత. పురుషాధిష్ఠితశ్చ సవిశేషమాదేశ మనుతిష్ఠేత్. అభిరూపం చ కర్మఫలమ్ ఔపాయనికం చ లాభఫలం పితురుపానయేత్.

వ్యా. (అవరుద్ధు డనగా సరియైన దారిలోనికి తీసికొని రావడంకోసం కొన్ని నిర్బంధాలలో ఉంచబడిన రాజపుత్రుడు అని అర్థం. ఇక్కడ అతడు అనుసరించ వలసిన పద్ధతులను చెపుతున్నారు). తనకు తగని పని చేయడానికి నియుక్తుడై జీవిక కూడా కష్టంగా ఉన్న రాజపుత్రుడు తండ్రిని అనుసరించాలి. తండ్రి మాట జవదాటకూడదు. అయితే తన ప్రాణాలకే ముప్పు వచ్చినప్పుడు, ప్రకృతులలో తిరుగుబాటు వస్తుం దన్నప్పుడు, మహాపాపం కలుగుతుందన్నప్పుడూ తండ్రిని అనుసరించ వలసిన పని లేదు. అతడు మంచి పనులలో నియుక్తుడైతే తనకు అప్పగించిన పని పర్యవేక్షించే ఒక పురుషుణ్ణి (అధిష్ఠాతారం పురుషమ్) ఇమ్మని (తండ్రిని) కోరాలి. ఆ పురుషుని పర్యవేక్షణలో తండ్రి అప్పగించిన పనిని (ఆదేశం) ప్రత్యేకమైన శ్రద్ధ చూపుతూ నిర్వహించాలి. ఆ పనిచేయడంవల్ల లభించిన (మామూలుగా లభించిన) ఫలాన్ని, ప్రజ లిచ్చిన కానుకలు మొదలైనవాటిరూపంలో అధికంగా వచ్చిన వస్తుధాన్యాదిరూపఫలాన్నీ తండ్రికి సమర్పించాలి.

మూ. తథాప్యతుష్యన్తమ్ అన్యస్మిన్ పుత్రే దారేషు వా స్నిహ్యన్తమ్ అరణ్యాయ ఆపృచ్ఛేత. బన్ధవధభయాత్ వా యః సామన్తో న్యాయవృత్తిః, ధార్మికః, సత్యవాక్, అవిసంవాదకః, ప్రతిగ్రహీతా, మానయితా చాభిపన్నానాం తమాశ్రయేత. తత్రస్థః కోశదణ్డసంపన్నః ప్రవీరపురుషకన్యాసంబన్ధమటవీ సంబన్ధం, కృత్యపక్షోపగ్రహం వా కుర్యాత్.

వ్యా. ఈ విధంగా అనుకూలంగా ఉన్నా కూడ తండ్రి సంతోషించక మరొక



పుత్రునియందు, తన తల్లి కాని భార్యయందు అధికస్నేహం చూపించినట్లయితే "నేను అరణ్యవాసానికి వెళ్లిపోతాను, అనుజ్ఞ ఇమ్ము." అని తండ్రిని కోరాలి.బంధిస్తారని గాని, వధిస్తా రని గాని భయం ఉన్నట్లయితే ఎవరైనా ఒక సామంతరాజును ఆశ్రయించాలి. ఆ సామంతరాజు న్యాయప్రవర్తన కలవాడు, ధార్మికుడు, సత్యం పలికేవాడు, మోసంచేయనివాడు(అవిసంవాదకుడు, not given to breach of trust), శరణుజొచ్చినవాళ్లని చేరదీసేవాడు, వాళ్లని తగు విధంగా గౌరవించేవాడు అయి వుండాలి. (అలాంటివానినే ఆశ్రయించాలి). అక్కడనే ఉండి, కోశదండసమృద్ధుడై (అనగా ధనబలమూ, సైన్యబలమూ సంపాదించుకొని), వీరులైనవాళ్లతో కన్యాసంబంధాన్ని ఏర్పరచుకొని, (అనగా వీరులైన వాళ్ల కన్యలను వివాహమాడి) అటవీనాయకుల సంబంధం ఏర్పరచుకొని, (తండ్రిరాజ్యంలో ఉన్న) కృత్యుల పక్షాన్ని, తన వైపు తిప్పుకోవాలి.

మూ. ఏకచరః సువర్ణపాకమణిరాగహేమరూప్యపణ్యాకరకర్మాన్తానా జీవేత్. పాషణ్డసంఘద్రవ్యమశ్రోత్రియభోగ్యం దేశద్రవ్యమాఢ్యవిధవాద్రవ్యం వా గూఢ మనుప్రవిశ్య సార్థయానపాత్రాణి చ మదనరసయోగేనాతి సంధాయాహరేత్. పారగ్రామికం వా యోగమాతిష్ఠేత్; మాతుః పరిజనోప గ్రహేణ వా చేష్టేత. కారుశిల్పికుశీలవచికిత్సకవాగ్జీవనపాషణ్డచ్ఛద్మభిర్వా నష్టరూపః, తద్వ్యఞ్జనసఖః ఛిద్రే ప్రవిశ్య రాజ్ఞః శస్త్రరసాభ్యాం ప్రహృత్య బ్రూయాత్ - "అహమసౌ కుమారః, సహభోగ్యమిదం రాజ్యమేకో నార్హతి భోక్తుమ్; తత్ర యే కామయన్తే భర్తుం తానహం ద్విగుణేన భక్తవేతనేనోప స్థాస్యే" ఇతి. ఇత్యవరుద్ధవృత్తమ్.

వ్యా. (సామంతరాజు ఆశ్రయం లభించక) ఒంటరిగానే ఉండవలసివచ్చిన రాజపుత్రుడు సువర్ణపాకం (ఇతరలోహాలకి పుటం పెట్టి బంగారం వలె చేసే పని), వజ్రవైడూర్యాదిమణులు, రంగులు, బంగారం, వెండి, ఇతరవిక్రేయవస్తువులు (పణ్యం) వీటి వ్యాపారం చేస్తూ, లేదా గనులలోను కర్మాంతాలలోను (కార్ఖానాలు) పనిచేస్తూ జీవించాలి. లేదా గూఢంగా ప్రవేశం పొంది, అనగా మంచి మాటలు చెప్పి పూర్తి నమ్మకం కలిగించి నాస్తికుల సంఘాలవాళ్లు కూడబెట్టిన ధనాన్ని, శ్రోత్రియులకుభోగ్యం కాని (చెందని) ఆ యా ప్రాంతాలలోని ద్రవ్యాన్ని ('దేవద్రవ్యమ్', అనే పాఠంలో

దేవాలయాల ధనాన్ని అని అర్థం) ధనవతులైన విధవల ధనాన్నీ అపహరించాలి. లేదా మత్తు కలిగించే మందులు ఇవ్వడం ద్వారా వర్తకుల గుంపుల్నీ, ఓడలనూ కొల్లగొట్టాలి. (మున్ముందు చెప్పబడ నున్న) పారగ్రామికయోగాన్ని అనగా శత్రునగరాన్ని ముట్టడించే ఉపాయాలను అభ్యసించాలి. తల్లి పక్షంవాళ్ల సహాయం సంపాదించి పని చెయ్యాలి. లేదా కారువులు (వడ్రంగి, కమ్మరి మొదలైనవాళ్లు), శిల్పులు (చిత్రకారులు), కుశీలవులు, వైద్యులు, వార్తీవనులు (కథలు చెప్పే వృత్తికలవాళ్లు) పాషండులు వీళ్ల వేషాలలో రూపం మార్చుకొని (నష్టరూపః), ఈ వేషాలు ధరించిన ఇతరులతో కలిసి రాజుయొక్క (తన తండ్రియొక్క) ఛిద్రంలో (దెబ్బతీయడానికి తగిన సమయం లేదా స్థానం Vulnerable point)లో ప్రవేశించి, శస్త్రాలచేత, రసప్రయోగంచేత దెబ్బతీసి -"ఇదిగో-నేను రాజపుత్రుడను; రాజ్యం అనేది అందరూ కలిసి అనుభవించదగినది, దీనిని ఒకడే అనుభవించకూడదు. ఎవరైతే (అమాత్యాదిపదవులలో నాకు) సహాయం చేయడానికి ఇష్టపడతారో వాళ్లని (నా తండ్రి ఇచ్చిన దానికంటె) రెట్టింపు ఆహారమూ (భక్తం - బత్తెం food) జీతమూ ఇచ్చి పూజిస్తాను" అని ఘోషించాలి. ఇది అవరుద్ధుడు చేయవలసిన పని.

మూ. 1. అవరుద్ధం తు ముఖ్యపుత్రాపసర్పాః ప్రతిపాద్యానయేయుః, మాతా వా ప్రతిగృహీతా. త్యక్తం గూఢపురుషాః శస్త్రరసాభ్యాం హన్యుః. అత్యక్తం తుల్యశీలాభిః స్త్రీభిః, పానేన, మృగయయా వా ప్రసజ్య రాత్రావుపగృహ్య ఆనయేయుః

2. శ్లో. ఉపస్థితం చ రాజ్యేన మదూర్ధ్వమితి సాన్త్వయేత్,
ఏకస్థమథ సంరుధ్యాత్ పుత్రవాన్ వా ప్రవాసయేత్.

ఇతి కౌటిలీయార్థశాస్త్రే వినయాధికారికే ప్రథమాధికరణే అష్టాదశోఽధ్యాయః
అవరుద్ధవృత్తమ్, అవరుద్ధే చ వృత్తిః.

వ్యా. 1. ముఖ్యులైన అమాత్యాదుల పుత్రులు, అపసర్పులు (రాజు రహస్యంగా పంపగా అతని పని చేసేవాళ్లు - Secret agents) అవరుద్ధుడికి నచ్చచెప్పి (ప్రతిపాద్య="నీకు యౌవరాజ్యాదికం లభిస్తుంది; ఈ లాభం కలుగుతుంది అని చెప్పి) వెనుకకు తీసికొని రావాలి. లేదా రాజు గౌరవానికి పాత్రురాలైన (ప్రతిగృహీతా) అవరుద్ధుని తల్లి యైనా తీసికొని రావాలి. ఎంత చెప్పినా వినకపోవడం చేత రాజుచేత



త్యజించబడినవానిని గూఢపురుషులు శస్త్రాలచేత, రసప్రయోగం చేత చంపివేయాలి. రాజుకు ఇంకా ప్రేమ ఉండి ఆతనిని త్యజించని పక్షంలో వానికి సమానమైన శీలం గల స్త్రీలతో గాని, పానంతో గాని, వేటతో గాని సంబంధం ఏర్పరచి (ఈ వ్యసనాలు అలవర్చి) రాత్రి పట్టుకొని రాజుదగ్గరికి తీసికొనిరావాలి.

2. అలా తీసికొని వచ్చిన రాజకుమారునితో (అతడు ధార్మికు డైన పక్షంలో) రాజు "నా తరవాత ఈ రాజ్యం నీదే" అని చెప్పి వానితో మంచి చేసుకోవాలి. ఇంత చెప్పినా అతడు వినకపోతే అతనిని ఒక్కచోట బందీ చెయ్యాలి. ఇంకా కొందరు పుత్రులున్న రాజు ఈ అధార్మికుడైన పుత్రుణ్ణి చంపివేయ్యాలి".

"బాలానందిని" అనే కౌటిలీయార్థశాస్త్రాంధ్రవ్యాఖ్యానంలో వినయాధికారికం అనే మొదటి అధికరణంలో అవరుద్ధవృత్తం, అవరుద్ధే చ వృత్తిః అనే పద్దెనిమిదవ అధ్యాయం సమాప్తం.

## అథ ఏకోనవింశోఽధ్యాయః

### షోడశప్రకరణే రాజప్రణిధిః (రాజ్ఞః కర్తవ్యమ్)

మూ. రాజానముత్తిష్ఠమానమనూత్తిష్ఠన్తే భృత్యాః. ప్రమాద్యన్తమను ప్రమాద్యన్తి. కర్మాణి చాస్య భక్షయన్తి. ద్విషద్భిశ్చాతిసంధీయతే. తస్మాదుత్థానమాత్మనః కుర్వీత. నాలికాభిః అహః అష్టధా రాత్రిం చ విభజేత్, ఛాయాప్రమాణేన వా; త్రిపౌరుషీ, పౌరుషీ, చతురఙ్గులా చ చ్ఛాయా మధ్యాహ్న ఇతి చత్వారః దివసస్యాష్టభాగాః. తైః పశ్చిమా వ్యాఖ్యాతాః.

వ్యా. రాజు ఉత్సాహవంతు డైతే ఆతనిని అనుసరించి ఆతని భృత్యులు కూడా కార్యాల విషయంలో ఉత్సాహవంతులై ఉంటారు. రాజు కర్తవ్యవిముఖుడైతే భృత్యులు కూడా అలాగే ఉంటారు. రాజుకు సంబంధించిన పను లన్నీ భక్షించేస్తారు. శత్రువులు ఆ రాజును మోసం చేస్తారు కూడ. అందుచేత రాజు తనను తాను ఎల్లప్పుడూ ఉత్సాహవంతుణ్ణిగా (active)ఉంచుకోవాలి. పగటి భాగాన్ని రాత్రినీ నాలికలచేత ఎనిమిది భాగాలుగా విభజించాలి. లేదా నీడయొక్క ప్రమాణంచేత (పాదవుచేత) విభజించాలి. మనిషి ఎండలో నిలబడినప్పుడు ముగ్గురు పురుషుల ప్రమాణం ఉన్నట్లయితే (అనగా ఎండలో నిలబడినవాని నీడ పాదవు నిలబడినవాని పాదవుకు మూడు రెట్లు ఉన్నట్లయితే) అది మొదటి అష్టమభాగం. ఒక పురుషుని

ప్రమాణం ఉంటే అది రెండవ అష్టమభాగం. నాలుగు అంగుళాల పొడవు ఉన్నట్లయితే మూడవ అష్టమభాగం. మధ్యాహ్నసమయం నాల్గవ అష్టమభాగం, ఇది మొదటి నాలుగు అష్టమభాగాలు. వీటిచేత పగలుకు సంబంధించిన పశ్చిమభాగాలు (మధ్యాహ్నం తరువాతి భాగాలు) చెప్పి నట్లే, అనగా నీడ నాలుగు అంగుళాల పొడవు ఉంటే అది దివసపశ్చిమభాగానికి చెందిన మొదటి అష్టమభాగం. ఒక పురుషుని ప్రమాణం ఉంటే రెండవ అష్టమభాగం. మూడు పురుషప్రమాణాలు ఉంటే మూడవ చతుర్థభాగం. సాయంకాలసమయం చతుర్థాష్టమభాగం.

వి. 'పౌరుష' శబ్దానికి ఉన్న ప్రసిద్ధార్థాన్ని తీసికొని కొందరు హిందీవ్యాఖ్యాతలు పై విధంగా అర్థం చెప్పినారు. గణపతిశాస్త్రి ఆ పదాల అర్థం వివరించకుండా ఆ పదాలనే ఉపయోగించి వ్యాఖ్యానించారు. కాని పై వ్యాఖ్యానం అసంగతంగా కనబడుతుంది. సూర్యోదయం మొదలు ఒక అష్టమభాగం అంతా పురుషుని నీడ ఒకే విధంగా (త్రిపౌరుషప్రమాణంతో) మూడు రెట్లు ఉండి హటాత్తుగా రెండవ అష్టమభాగంలో ఏకపౌరుషప్రమాణం కాదు కదా? క్రమక్రమంగా తగ్గుతూ వస్తుంది కదా? అందుచేత పౌరుషశబ్దం పారిభాషికశబ్దంగా గ్రహించి ఆ రోజులలో సమయజ్ఞానం కోసం నిర్మించిన శిలాఫలకాదులకు (Sun–dial) సంబంధించిన విధంగా అర్థం చేసుకోవాలి. అన్నవరం కొండమీద, మద్రాసులోని సైన్‌ట్ థామస్ చర్చి వద్దా ఇంకా ఇతర ప్రదేశాలలోను ఇలాంటి సమయజ్ఞానఫలకాలు ఉన్నాయి. ఉజ్జయిని మొదలైన ప్రదేశాలలో ఇలాంటి యంత్రాలు చాలా ఉన్నాయి. అందుచేత 'త్రిపౌరుష' ఇత్యాదులకు ఆ యంత్రాల మీద కనబడే నీడయొక్క పొడవు అని అర్థం చెప్పుకోవాలి. కాంగ్లే అనువాదం ఆ విధంగానే ఉన్నది.

నాడికా లేదా నాలికా: ఒక నిశ్చితప్రమాణం గల గొట్టంలో నీళ్లుగాని, ఇసుక కాని పోసి దాని రంధ్రం నుంచి అవి కారడానికి పట్టే సమయాన్ని పట్టి ఘటికలు నిర్ణయించేశారు. ఈనాటి 24 నిమిషాలు ఒక ఘటిక. అరవై విఘడియలు ఒక ఘటిక లేదా గడియ. ఈ విధంగా నాళికాసహాయంచేత గాని, సూర్యచ్ఛాయా యంత్రసహాయంచేత గాని పగలు ఎనిమిది భాగాలు గాను, రాత్రి ఎనిమిది భాగాలు గాను విభజించాలి. మొత్తం 16 భాగాలు. ఒకొక్క భాగం ఒకటిన్నర గంటలు అవుతుంది.

మూ. తత్ర పూర్వే దివసస్యాష్టభాగే రక్షావిధానమాయవ్యయౌ చ



శృణుయాత్. ద్వితీయే పౌరజానపదానాం కార్యాణి పశ్యేత్. తృతీయే స్నానభోజనం సేవేత. స్వాధ్యాయం చ కుర్వీత. చతుర్థే హిరణ్యప్రతిగ్రహ మధ్యక్షాంశ్చ కుర్వీత. పఞ్చమే మన్త్రిపరిషదా పత్రసంప్రేషణేన మన్త్రయేత; చారగుహ్యాబోధనీయాని చ బుధ్యేత. షష్ఠే స్వైరవిహారం మన్త్రం వా సేవేత. సప్తమే హస్త్యశ్వరథాయుధీయాన్ పశ్యేత్. అష్టమే సేనాపతిసఖో విక్రమం చిన్తయేత్. ప్రతిష్ఠితేఽహని సంధ్యాముపాసీత.

వ్యా. పగటికి సంబంధించిన మొదటి అష్టమభాగంలో రక్షావిధానాన్నీ (రాజ్యంలోని రక్షణకి సంబంధించిన ఏర్పాట్లను), రాబడినీ, ఖర్చులనూ గూర్చి (అధికారులు) చెప్పగా వినాలి. రెండవ అష్టమభాగంలో పౌరుల కార్యాలు, పల్లెటూరి ప్రజల కార్యాలు చూడాలి. మూడవ అష్టమభాగంలో స్నానభోజనాలు సేవించాలి; స్వాధ్యాయాధ్యయనం (వేదాదిసద్గ్రంథాల పఠనం) చెయ్యాలి. నాల్గవ అష్టమభాగంలో ఆ యా అధికారులు తీసికొని వచ్చిన ధనం తీసికోవాలి, ఆ యా శాఖాధిపతులను వారి వారి పనులలో నియోగించాలి. ఐదవ అష్టమభాగంలో లేఖలు పంపడం ద్వారా మంత్రిపరిషత్తుతో సంప్రదించాలి; గూఢచారులనుండి రహస్యవార్తలు తెలుసుకోవాలి. ఆరవ అష్టమభాగంలో స్వేచ్ఛగా విహరించడం (విశ్రాంతి తీసికోవడం)గాని, మంత్రం (తగినవాళ్లతో ఆలోచన) గాని సేవించాలి (చెయ్యాలి). ఏడవ అష్టమభాగంలో గజ-అశ్వ-రథబలాలను, ఆయుధధారులైన కాలిబంట్ల బలాలను చూడాలి. ఎనిమిదవ అష్టమభాగంలో సేనాపతితో కలిసి పరాక్రమానికి సంబంధించిన విషయాలు ఆలోచించాలి. పగటి భాగం సమాప్తం అయిన తరవాత (అనగా సాయంసంధ్యవేళ) సంధ్యోపాసన చెయ్యాలి.

మూ. ప్రథమే రాత్రిభాగే గూఢపురుషాన్ పశ్యేత్. ద్వితీయే స్నానభోజనం కుర్వీత, స్వాధ్యాయం చ. తృతీయే తూర్యఘోషేణ సంవిష్టః చతుర్థపఞ్చమౌ శయీత. షష్ఠే తూర్యఘోషేణ ప్రతిబుద్ధః శాస్త్రమ్ ఇతికర్తవ్యతాం చ చిన్తయేత్. సప్తమే మన్త్రమధ్యాసీత, గూఢపురుషాంశ్చ ప్రేషయేత్. అష్టమే ఋత్విగాచార్యపురోహితసఖః స్వస్త్యయనాని ప్రతిగృహ్ణీయాత్, చికిత్సక మాహానసికమౌహూర్తికాంశ్చ పశ్యేత్. సవత్సాం ధేనుం వృషభం చ ప్రదక్షిణీకృత్యోపస్థానం గచ్ఛేత్.

(కార్యానుశాసనమే) యజ్ఞం. ప్రజలందరి విషయంలోను నిష్పాక్షికంగా ప్రవర్తించడమే దక్షిణ. రాజుకు రాజ్యాభిషేకమే దీక్ష.

వి. "దీక్షితస్యాభిషేచనమ్" కు బదులు "దీక్షా తస్యాభిషేచనమ్" అని పాఠం ఉండి ఉంటుంది. రాజు ఏ నాడు రాజ్యాభిషిక్తుడైనాడో ఆనాడే ప్రజాపాలనం అనే యజ్ఞానికి దీక్ష వహించినట్లు అని అర్థం.

మూ. ప్రజాసుఖే సుఖం రాజ్ఞః ప్రజానాం చ హితే హితమ్,
నాత్మప్రియం హితం రాజ్ఞః ప్రజానాం తు ప్రియం హితమ్.

వ్యా. ప్రజల సుఖంలోనే రాజు సుఖం ఉంది. ప్రజల హితంలోనే రాజు హితం ఉంది. రాజు తనకు ప్రియమైన దానినే హిత మనుకొనకూడదు. ప్రజలకు ఏది ప్రియమో అదే తన హితం.

మూ. తస్మాన్నిత్యోత్థితో రాజా కుర్యాదర్థానుశాసనమ్,
అర్థస్య మూల ముత్థానమనర్థస్య విపర్యయః.

వ్యా. అందువలన రాజు నిత్యమూ ఉత్థితుడై, (ఉద్యమశీలుడై) కార్యాల శాసనం (కార్యనిర్వహణం) చెయ్యాలి. ఉద్యమశీలుడై ఉండడమే కార్యసిద్ధికి మూలం. ఉద్యమశీలుడు కాకపోవడం అనర్థానికి (కార్యసిద్ధి కలగకపోవడానికి) మూలం.

మూ. అనుత్థానే ధ్రువో నాశః ప్రాప్తస్యానాగతస్య చ,
ప్రాప్యతే ఫలముత్థానాల్లభతే చార్థసంపదమ్.

ఇతి కౌటిలీయార్థశాస్త్రే వినయాధికారికే ప్రథమాధికరణే ఏకోనవింశోఽధ్యాయః
రాజప్రణిధిః.

వ్యా. రాజు ఉద్యమశీలుడు కాకపోతే లభించినదీ, లభించనున్నదీ కూడ నశించడం తప్పదు. ఉద్యమశీలుడై ఉండడం వల్ల ఫలం పొందుతాడు. కార్యసంపదను కూడా పొందుతాడు.

"బాలానందిని" అను కౌటిలీయార్థశాస్త్రాంధ్రవ్యాఖ్యానంలో వినయాధికారికమైన
ప్రథమాధికరణంలో రాజప్రణిధి అనే పందొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



## అథ వింశోఽధ్యాయః

### సప్తదశప్రకరణే నిశాన్తప్రణిధిః (రాజభవననిర్మాణమ్).

మూ. 1. వాస్తుకప్రశస్తే దేశే సప్రాకారపరిఖాద్వారమనేకకక్ష్యాపరిగతమ్, అన్తఃపురం కారయేత్.

2. కోశగృహవిధానేన వా మధ్యే వాసగృహమ్, గూఢభిత్తిసంచారం మోహనగృహం తన్మధ్యే వా వాసగృహమ్, భూమిగృహం వా ఆసన్నకాష్ఠచైత్య దేవతాపిధానద్వార మనేకసురుఙ్గాసంచారమ్, ప్రాసాదం వా గూఢభిత్తిసోపానం, సుషిరస్తమ్భప్రవేశాపసారం వా. వాసగృహం యన్త్రబద్ధతలావపాతమ్ కారయేత్. ఆపత్ప్రతీకారార్థమ్ ఆపది వా కారయేత్. అతోఽన్యథా వా వికల్పయేత్ సహాధ్యాయిభయాత్.

వ్యా. 1. గృహాదినిర్మాణంలో నేర్పుగలవారు, వాస్తుశాస్త్రజ్ఞులు ప్రశంసించిన (మంచి దని చెప్పిన) ప్రదేశంలో ప్రాకారాలు, పరిఖ (అగడ్త),ద్వారాలు, అనేకములైన కక్ష్యలు (విశాలములైన వాకిళ్లు halls) ఉన్న అంతఃపురం నిర్మింపచేయాలి.

2. రాజనివాసగృహాన్ని కోశగృహం నిర్మించే విధానంలో, అంతఃపురమధ్యంలో నిర్మింపచెయ్యాలి. లేదా గోడలలో రహస్యమైన సంచారం (నడిచే మార్గం)ఉన్న ఒక మోహనగృహం( లోపలికి వెళ్లినవాళ్లకి ఎటునుండి బైటకు రావాలో తెలియని గృహం maze-house) నిర్మింపచేసి దాని మధ్య రాజనివాసగృహం నిర్మింపచెయ్యాలి. లేదా దగ్గర ఉన్న చైత్య (దేవాలయంలోని) దేవత రూపం చెక్కి కఱ్ఱతో చేసిన కప్పివేసే ద్వారం గల, సురంగాల ద్వారా అనేకములైన మార్గాలు గల భూమిగృహాన్ని నిర్మింప చేయాలి. అనగా ఒక భూమిగృహం నిర్మింపచేసి అపాయసమయంలో దానినుండి బైటకు వెళ్లడానికి సురంగమార్గాలు ఏర్పరచి ఆ సురంగద్వారానికి దగ్గర ఉన్న దేవాలయంలోని దేవతామూర్తి చెక్కిన కఱ్ఱ తలుపు అమర్చాలి అని అర్థం. దానిపైన గోడలలో రహస్యంగా ఉన్న మెట్లు ఏర్పరచిన మేడ గాని సుషిరరూపమైన, అనగా మధ్య కాళీగా ఉన్న స్తంభం ద్వారా ప్రవేశించడానికీ, బైటకు వెళ్లడానికీ మార్గం ఉన్న మేడగాని రాజనివాసానికి నిర్మింపచేయాలి. రాబోయే ఆపదకు ప్రతిక్రియ కోసం కాని,

ఆపత్సమయంలో కాని ఆ ప్రాసాదం మీద రాజనివాసగృహానికి అవసరం వచ్చినప్పుడు మొత్తం ఆ నివాసగృహాన్ని క్రిందికి దింపడానికి అనువుగా యంత్రాన్ని అమర్చాలి.లేదా సహాధ్యాయులవల్ల భయం ఉండవచ్చు గాన చెప్పిన విధమే కాకుండా మరొక విధంగా కూడా నిర్మింపచేసుకోవాలి. అనగా ఈ శాస్త్రం చదివినవాళ్లకి కూడా ఈ పద్ధతులు తెలిసి ఉంటాయి. అందుచేత వాళ్ళకి ఈ రహస్యాలన్నీ తెలిసి అపాయం కలగవచ్చును. అందుచేత పై విషయాలన్నీ మనసుల్లో ఉంచుకొని మరొక విధంగా కూడా రాజనివాసగృహం నిర్మింపచేయాలి అని అర్థం.

మూ. మానుషేణాగ్నినా త్రిరపసవ్యం పరిగతమన్తఃపురమగ్నిరన్యో న దహతి; న చాత్రాన్యోఽగ్నిర్జ్వలతి;వైద్యుతేన భస్మనా మృత్సంయుక్తేన కరకవారిణావలిప్తం చ.

వ్యా. మానుషాగ్నిచేత అపసవ్యంగా (అప్రదక్షిణంగా) మూడు సార్లు చుట్టూ తిప్పబడిన అంతఃపురాన్ని మరొక అగ్ని కాల్చజాలదు; అక్కడ మరొక అగ్ని మండదు. లేదా పిడుగు పడి చచ్చిపోయిన చెట్టును కాల్చిన భస్మమూ, పుట్టమన్నూ కలిపి వాటిని వడగళ్ల నీళ్లతో తడిపి పూసినా కూడ ఆ అంతఃపురానికి అగ్నిభయం ఉండదు.

వి. "మానుషేణ అగ్నినా" - శత్రువు చేతిలో చచ్చిన మనిషియొక్క ఎముకలుగాని, మరణదండం విధించగా శూలం ఎక్కించి చంపబడిన మనిషి ఎముకలుగాని నల్లని వేణువుతో మథించగా పుట్టిన అగ్ని మానుషాగ్ని. అథర్వవేదంలోని కొన్ని మంత్రాలు చదువుతూ దీనిని అప్రదక్షిణంగా అంతఃపురం చుట్టూ త్రిప్పాలి.

మూ. జీవన్తీ - శ్వేతా - ముష్కక - పుష్పవన్దాకాభిరక్షీవే జాతస్యాశ్వత్థస్య ప్రతానేన వా గుప్తం సర్పా విషాణి వా న ప్రసహన్తే. మార్జారమయూరనకుల పృషతోత్సర్గః సర్పాన్ భక్షయతి. శుకః శారికా భృఙ్గరాజో వా సర్పవిషశఙ్కాయాం క్రోశతి. క్రౌఞ్చో విషాభ్యాశే మాద్యతి. గ్లాయతి జీవఞ్జీవకః. మ్రియతే మత్తకోకిలః. చకోరస్యాక్షిణీ విరజ్యేతే, ఇత్యేవ మగ్నివిషసర్పేభ్యః ప్రతికుర్వీత.

వ్యా. జీవన్తి,శ్వేత, ముష్కకం, పుష్పవందాకం - వీటి ఆకులు కట్టి ఏర్పరచిన దండతో గాని, తడి ఉన్న ప్రదేశంలో (అక్షీవే) పెరిగిన రావిచెట్టు ఆకులతో కట్టిన దండచేత గాని రక్షించిన అంతఃపురాన్ని సర్పాలు గాని, విషాలు కాని బాధించవు.



వి. జీవన్తీ=పాలకూర. ముష్కకః=మొక్కపుచెట్టు: అక్షీవే జాతస్య=అనగా "కరవీరవృక్షంమీద పుట్టిన" అని గణపతిశాస్త్రిగారు.

మార్జారేతి - పిల్లులు, నెమళ్లు, ముంగిసలు, చుక్కల లేళ్లు ఇవి స్వేచ్ఛగా సంచరించేటట్లు విడిచిపెట్టడం సర్పాలను భక్షించివేస్తుంది. సర్పశంక, విషశంకా కలగగానే చిలక, గోరింక, భృంగరాజం (వంకరతోక గల ఒక పక్షి), అరుస్తాయి. విషం దగ్గర ఉంటే క్రౌంచపక్షికి మత్తెక్కుతుంది. జీవంజీవకపక్షి ఉత్సాహశూన్యం అయిపోతుంది. మత్తకోకిల చచ్చిపోతుంది. చకోరపక్షి కళ్లు ఎఱ్ఱబడతాయి.ఈ విధంగా అగ్నివిషాల ప్రతిక్రియ చేసుకోవాలి.

మూ. పృష్ఠతః కక్ష్యావిభాగే స్త్రీనివేశో గర్భవ్యాధివైద్యప్రత్యాఖ్యాతసంస్థా వృక్షోదకస్థానం చ. బహిః కన్యాకుమారపురమ్. పురస్తాదలంకారభూమిః, మన్త్రభూమిః, ఉపస్థానమ్, కుమారాధ్యక్షస్థానం చ. కక్ష్యాన్తరేష్వన్తర్వంశిక సైన్యం తిష్ఠేత్.

వ్యా. రాజనివాసానికి వెనుక వేరుగా నిర్మించిన కక్ష్యలో రాజభార్యల నివాసస్థానం, దాని వెనుక గర్భసంస్థ (గర్భవతులకు నివాసం) (దాని వెనుక) వ్యాధి సంస్థ (వ్యాధితులకు నివాసం), దాని వెనుక "ఇంక వీళ్ల రోగం కుదరదు" అని చెప్పి వైద్యులు విడిచివేసినవాళ్ల నివాసం, వీటి వెనుక చెట్ల తోపు, దాని వెనుక నీటి స్థానం (నూతులు, దిగుడుబావి మొదలైనవి)ఉండాలి. వాటికి వెలుపల రాజపుత్రికల గృహం ఉండాలి. రాజనివాసానికి ముందు రాజు అలంకరించుకునే గృహం, మన్త్ర గృహం (మంత్రులు మొదలైన వాళ్లతో ఆలోచనలు చేసే గృహం) ఉపస్థానం (ఆస్థానమండపం), కుమారస్థానం(రాజకుమారుల నివాసం) అధ్యక్షస్థానం (ఆ యా కార్యాధ్యక్షుల స్థానం, అనగా సమాహర్త మొదలైన వాళ్ల కార్యాలయం అని గణపతి శాస్త్రి. 'కుమారాధ్యక్షస్థానమ్" అనేది ఒకదానికే పేరు అని గ్రహించి కాంగ్లే రాజకుమారులను తమ పర్యవేక్షణలో ఉంచుకొనే అధికారి స్థానం (officer in charge of Princes) అని అర్థం వ్రాశారు. కక్ష్యల మధ్యభాగాలలో అంతఃపురాధికారులైన కంచుకులు మొదలైన వాళ్ల సముదాయం ఉండాలి.

మూ. అన్తర్గృహగతః స్థవిరస్త్రీపరిశుద్ధాం దేవీం పశ్యేత్. న

కాంచిదభిగచ్ఛేత్. దేవీగృహే లీనో హి భ్రాతా భద్రసేనం జఘాన. మాతుః శయ్యాన్తర్గతశ్చ పుత్రః కారూశమ్. లాజాన్ మధునేతి విషేణ పర్యస్య దేవీ కాశిరాజం. విషదిగ్ధేన నూపురేణ వైరన్త్యమ్, మేఖలామణినా సౌవీరమ్, జాలూథమాదర్శేన, వేణ్యాం గూఢం శస్త్రం కృత్వా దేవీ విడూరథం జఘాన. తస్మాదేతాన్యాస్పదాని పరిహరేత్.

వ్యా. వృద్ధలైన స్త్రీలచేత పరిశోధించబడిన రాణీని తన ఇంటిలోనే ఉండి చూడాలి. (తన నివాసగృహానికి ఆమెను రప్పించి కలవాలి). ఏ స్త్రీవద్దకూ తాను వెళ్లకూడదు. రాణి ఇంటిలో దాగి ఉండి సోదరుడు భద్రసేనుణ్ణి చంపివేశాడు.పుత్రుడు తల్లి శయ్య క్రింద దాగి ఉండి కారూశదేశరాజును చంపివేశాడు. తేనె కలిపిన వని చెప్పి పేలాలకు విషం కలిపి కాశిరాజును రాణి చంపివేసింది. వైరంత్యు డనే వనవాసిదేశరాజును రాణి విషం పూసిన నూపురంతో చంపివేసింది. సౌవీరదేశరాజును అతని రాణి వడ్డాణంలోని మణితో చంపివేసింది. అద్దంతో జాలూథుణ్ణి ఆతని రాణి చంపివేసింది. విడూరథుణ్ణి ఆతని రాణి తన జడలో శస్త్రం దాచి తెచ్చి దానితో చంపివేసింది. అందుచేత ఈ స్థానాలను అనగా ఆపదల హేతువులను పరిహరించాలి. అందువలనే ముందు వృద్ధస్త్రీల ద్వారా పరీక్ష చేయించిన పిమ్మటనే రాణులతో కలవాలని అర్థం.

వి. భద్రసేను డనే కళింగరాజును అతని సోదరుడైన వీరసేనుడు, అంతఃపురంలో దాగి ఉండి, ఆమెతో మాటలాడి, చంపివేసినా డట. వజ్రుడనే కారూశదేశరాజు మరొక కుమారునికి యౌవరాజ్యపట్టాభిషేకం చేయడానికి నిశ్చయించినాడట, అందుచేత కోపించిన ఒక కుమారుడు తల్లి శయ్యాగృహంలో దాగి ఉండి ఆ రాజును చంపివేసినా డట. మహాసేనుడనే కాశిరాజును సుప్రభ అనే రాణి పేలాలలో విషం కలిపి చంపివేసిన దట. జాలూథుడు అయోధ్యరాజు. అతని భార్య రత్నవతి తనను రాజు ఉపేక్షిస్తున్నా డనే కోపంచేత విషం పూసిన అద్దంతో చర్మరోగం పుట్టించి చంపివేసిన దట. విదూరథుడు వృష్ణివంశరాజు. ఆతడు తన భార్య అయిన బిందుమతి ధనం అంతా ఖర్చు పెట్టి వేసినాడట. ఆ కోపంచేత ఆమె జడలో దాచిన శస్త్రంతో వానిని చంపివేసిన దట. పేర్లలో కొంచెం మార్పులతో ఈ కథలు హర్షచరితంలో కూడా ఉన్నాయి.



మూ. ముణ్డజటిలకుహకప్రతిసంసర్గం బాహ్యాభిశ్చ దాసీభిః ప్రతిషేధయేత్. న చైనాః కుల్యాః పశ్యేయు రన్యత్ర గర్భవ్యాధిసంస్థాభ్యః. రూపాజీవాః స్నానప్రఘర్షశుద్ధశరీరాః పరివర్తితవస్త్రాలంకారాః పశ్యేయుః, ఆశీతికాః పురుషాః, పఞ్చాశత్కాః స్త్రియో వా మాతాపితృవ్యఞ్జనాః స్థవిరవర్షవరాభ్యాగారికాశ్చావరోధానాం శౌచాశౌచం విద్యుః, స్థాపయేయుశ్చ స్వామిహితే.

వ్యా. బోడితలల సంన్యాసులతోను, జటాధారులైన సంన్యాసులతోను, వంచకులతోను లేదా బొమ్మలాట ఆడించేవాళ్లతోను, బైటనుండి వచ్చిన దాసీలతోను అంతఃపురస్త్రీలకు సంబంధాన్ని నిషేధించాలి. అంతఃపురస్త్రీల బంధుజనులు కూడ వాళ్లను గర్భసంస్థలలోను, వ్యాధిసంస్థలలోను తప్ప మరెక్కడా చూడకూడదు (కలవకూడదు). వేశ్యలు(అంతఃపురస్త్రీలను చూడవలసివచ్చినప్పుడు) స్నానంచేత, బాగా శరీరం రుద్దుకోవడంచేతా శరీరాలను పరిశుద్ధం చేసికొని, వస్త్రాలు అలంకారాలు మార్చుకొని వచ్చి చూడాలి. (వేశ్యలు ఈ విధంగా వచ్చి రాజును చూడా లని గణపతిశాస్త్రి). ఎనభై సంవత్సరాల వయస్సు ఉన్న పురుషులు గాని, యాభై సంవత్సరాల వయస్సు గల స్త్రీలు గాని అంతఃపురంలో ఉన్నవాళ్ల తండ్రులమూ తల్లులమూ అని చెప్పుకొంటూ అక్కడ ఉండి అంతఃపురస్త్రీశౌచాశౌచాలను పవిత్రత్వాపవిత్రత్వాలను తెలుసుకోవాలి. ముసలివాళ్లు, షండులు అయిన అభ్యాగారికులు (ఇంటి పనులు చక్కబెట్టేవాళ్లు) కూడ ఇట్లు చేస్తూ ఉండాలి. వీళ్లందరూ అంతఃపురస్త్రీలను ప్రభుహితంలో ఉంచాలి.

శ్లో. స్వభూమౌ చ వసేత్సర్వః పరభూమౌ న సంచరేత్,
న చ బాహ్యేన సంసర్గం కశ్చిదాభ్యన్తరో వ్రజేత్.

వ్యా. అంతఃపురంలో ఉండే ప్రతీవాడు తన స్థానంలోనే ఉండాలి. ఇతరుల స్థానంలో సంచరించకూడదు.ఎవడు ఎక్కడ పనిలో నియోగించబడ్డాడో అక్కడనే ఉండాలి అని అర్థం. అంతఃపురంలో ఉన్నవా ళ్లెవరూ బైటవాళ్లతో సంబంధం పెట్టుకొనగూడదు.

శ్లో. సర్వం చావేక్షితం ద్రవ్యం నిబద్ధాగమనిర్గమమ్,

నిర్గచ్ఛేదభిగచ్ఛేద్వా ముద్రాసంక్రాన్తభూమికమ్.

ఇతి కౌటిలీయార్థశాస్త్రే వినయాధికారికే ప్రథమాధికరణే వింశోధ్యాయః
నిశాన్తప్రణిధిః

వ్యా. ప్రతివస్తువూ బాగా పరీక్షించిన తరవాత అది అంతఃపురంలోనికి రావడాన్ని, బైటకు వెళ్లడాన్ని పుస్తకంలో వ్రాసుకొని (Recorded in a register), ఆ వస్తువు ఉన్న పెట్టె మొదలైన దానికి ముద్ర (సీలు) వేసి దానిని అంతఃపురంలోనికి తీసికొనిరావడం గాని, బైటకు పంపడం కాని చెయ్యాలి.

వి. "ముద్రాసంక్రాన్తభూమికమ్" అనేదానికి పై అర్థం గణపతిశాస్త్రి చెప్పినది.' 'ముద్రతో మాత్రమే, అనగా ముద్రవేసిన తరవాతనే, ఒక ప్రదేశంనుంచి మరొక ప్రదేశానికి పంపబడేది" అని కాంగ్లే చెప్పిన అర్థం.

"బాలానందిని" అనే కౌటిలీయార్థశాస్త్రాంధ్రవ్యాఖ్యానంలో వినయాధికారికమైన
ప్రథమాధికరణంలో "నిశాంతప్రణిధి" అనే ఇరవైయవ అధ్యాయం సమాప్తం.

## అథ ఏకవింశోఽధ్యాయః

### అష్టాదశే ప్రకరణే ఆత్మరక్షితకమ్

మూ. శయనాదుత్థితః స్త్రీగణైః ధన్విభిః పరిగృహ్యేత; ద్వితీయస్యాం కక్ష్యాయాం కఞ్చుకోష్ణీషిభిర్వర్షవరాభ్యాగారికైః, తృతీయస్యాం కుబ్జవామనకిరాతైః, చతుర్థ్యాం మన్త్రిభిః, సంబన్ధిభిః, దౌవారికైశ్చ ప్రాసపాణిభిః.

వ్యా. రాజు శయనంమీదనుండి లేవగానే ధనస్సులు ధరించిన స్త్రీల సముదాయాలు అతని చుట్టూ చేరాలి.రెండవ కక్ష్యలో ఒక విధమైన పొడవైన గౌనులు వంటి వాటిని (కంచుకాలను) తలపాగాలను ధరించిన, అంతఃపురంలో ఉండే వర్షవరులు (షండులు)రాజగృహంలోని పనులు చూచేవాళ్లు రాజు చుట్టూ చేరాలి. మూడవ కక్ష్యలో గూనువాళ్లు, పొట్టివాళ్లు, కిరాతులు చేరాలి.నాల్గవ కక్ష్యలో మంత్రులు, బంధువులు, ప్రాస అనే ఆయుధం హస్తంలో ధరించిన ద్వారపాలకులూ రాజు చుట్టూ చేరాలి.



మూ. పితృపైతామహం, మహాసంబన్ధానుబన్ధం, శిక్షితమ్, అనురక్తమ్, కృతకర్మాణమ్, జనమ్ ఆసన్నం కుర్వీత; నాన్యతోదేశీయమ్ అకృతార్థమానం, స్వదేశీయం వాప్యపకృత్యోపగృహీతమ్. అన్తర్వంశికసైన్యం రాజానమన్తః పురం చ రక్షేత్.

వ్యా. తండ్రితాతలనుండీ వస్తూన్నవాళ్లు ఏదో ఒక మంచి సంబంధంచేత తనకు సంబంధించినవాళ్లు, శిక్షణ పొందినవాళ్లు, తనపై అనురాగం కలవాళ్లు పనులు సాధించి ఉన్నవాళ్లు అయిన మనుష్యులనే తన దగ్గర ఉంచుకోవాలి. తన వలన ఏ విధమైన లాభమూ, సంమానమూ పొంది ఉందని విదేశీయుణ్ణి గాని, స్వదేశీయుడే అయినా ఏదో ఒక అపకారం చేసి తరవాత మళ్ళీ సేవలోనికి తీసికొనబడినవానిని గాని దగ్గరికి చేరనీయకూడదు. ప్రాసాదరక్షకుల సైన్యం (అంతర్వంశికసైన్యమ్) రాజునూ, రాజాంతఃపురాన్నీ రక్షిస్తూ ఉండాలి.

మూ. గుప్తే దేశే మాహానసికః సర్వమాస్వాదబాహుల్యేన కర్మ కారయేత్. తత్ రాజా తథైవ ప్రతిభుఞ్జీత పూర్వమగ్నయే వయోభ్యశ్చ బలిం కృత్వా.

వ్యా. వంటవాళ్ల అధ్యక్షుడు (chief cook) ప్రతివస్తువూ అనేక పర్యాయాలు రుచిచూస్తూ (లేదా మంచి రుచి ఉండే విధంగా) రహస్యమైన (భటులచేత రక్షింపబడుతున్న) ప్రదేశంలో వంట చేయించాలి. రాజు ఆ పదార్థాలు వండిన పదార్థాలు వండినట్లుగా (నిలవసరుకు కాకుండా, మరేమీ కలపకుండా), ముందు అగ్నికీ, పక్షులకు బలి ఇచ్చి (హోమం చేసి పక్షులకు తినిపించి) తినాలి.

మూ. అగ్నే ర్జ్వాలాధూమనీలతా శబ్దస్ఫోటనం చ విషయుక్తస్య; వయసాం విపత్తిశ్చ. అన్నస్యోష్మా మయూరగ్రీవాభః, శైత్యమాశు, క్లిష్టస్యేవ వైవర్ణ్యమ్, సోదకత్వమ్, అక్లిన్నత్వం చ. వ్యఞ్జనానామాశుశుష్కత్వం చ క్వాథః శ్యామఫేనపటలవిచ్ఛిన్నభావః గన్ధస్పర్శరసవధశ్చ. ద్రవేషు హీనాతిరిక్తచ్ఛాయాదర్శనం ఫేనపటలసీమాన్తోర్ధ్వరాజీదర్శనం చ. రసస్య మధ్యే నీలారాజీ, పయసస్తామ్రా, మద్యతోయయోః కాలీ, దధ్నః శ్యామా, మధునః శ్వేతా, ద్రవ్యాణామార్ద్రాణామ్ ఆశు ప్రమ్లానత్వమ్, ఉత్పక్వభావః, క్వాథనీలశ్యావతా చ. శుష్కాణామ్ ఆశుశాతనం వైవర్ణ్యం చ. కఠినానాం మృదుత్వం ...

అన్తరణప్రావరణానాం శ్యామమణ్డలతా, తన్తురోమపక్ష్మశాతనం చ. లోహమణిమయానాం పఙ్కమలోపదేహతా, స్నేహరాగగౌరవప్రభావవర్ణ స్పర్శవధశ్చ. ఇతి విషయుక్తఙ్గాని.

వ్యా. విషం కలిసిన పదార్థం అగ్నిలో వేస్తే మంటా, పొగా కూడ నీలవర్ణంలో ఉంటాయి. చటచట చప్పుడు అవుతుంది. అది పక్షులు తింటే చచ్చిపోతాయి. ఉడికిన అన్నంమీద వచ్చే ఆవిరి నెమలికంఠం రంగులో ఉంటుంది. తొందరగా చల్లబడిపోతుంది. చేతితో పిసికి నట్లు రంగు మారిపోతుంది. (కొంచెం నిలవ ఉంటే) నీళ్లు కారిపోతుంది. తడి ఉండదు. పచ్చళ్లు, పప్పు మొదలైన వ్యంజనాలు తొందరగా ఎండిపోతాయి.నిప్పుమీద పెట్టినప్పుడు మజ్జిగ ఉడికినట్లు ఉడికి, శ్యామవర్ణమైన నురుగు తెట్టు తేరి అది అసలు పదార్థంనుంచి వేరుపడిపోతుంది. వాటి వాసన, స్పర్శ, రుచీ కూడ చచ్చిపోతాయి. ద్రవపదార్థాలలో విషం కలిస్తే వాటి రంగు ఉండవలసినదానికంటె తక్కువగా గాని, ముదురుగా గాని ఉంటుంది. నురుగు బిళ్లలు బిళ్లలుగా పైకి తేలి కనబడుతుంది. పైన రేఖలు కనబడతాయి.రసానికి (నెయ్యి, నూనె, చెరుకురసం మొదలైనవాటికి) పైన నీలవర్ణంగల చారలు,పాలమీద ఎఱ్ఱని చారలు, మద్యం మీదా, నీటి మీదా నల్లని చారలు,పెరుగుమీద శ్యామవర్ణంగల చారలు, తేనెమీద తెల్లని చారలు కనబడతాయి.(మామిడిపండ్లు,దానిమ్మపండ్లు మొదలైన) తడిగల ద్రవ్యాలలో విషం కలిస్తే అవి తొందరగా వాడిపోతాయి. నిలవ ఉన్నట్లు పాసిపోతాయి. ఉడికించి నప్పుడు ముదురు నీలంరంగు కలవి అవుతాయి. శుష్కద్రవ్యాలు (జంతికలు మొదలైనవి)విషం కలిస్తే తొందరగా విడి చూర్ణం అయిపోతాయి. రంగు మారిపోతుంది. విషం కలిసిన కఠినపదార్థాలు మృదువుగా ఉంటాయి, మృదుపదార్థాలు కఠినం అవుతాయి. వాటి ప్రక్కకి చిన్నజంతువులు (చీమలు పురుగులు మొదలైనవి) చేరితే అవి చచ్చిపోతాయి. పక్కమీద పరచుకొనే ఆస్తరణాలకీ, కప్పుకొనే కంబళీలు మొదలైన వాటికీ విషస్పర్శ తగిలితే వాటి మీద నల్లని మండలాలు (గుండ్రని ఆకారాలు) ఏర్పడతాయి.వాటి దారాలకు రోమాలకు సంబంధించిన చిన్న ఏసిలు రాలిపోతాయి. బంగారం మొదలైన లోహాలతో తయారుచేసినవాటికీ, స్ఫటికాదిమణులు పొదిగినవాటికీ విషస్పర్శ తగిలితే అవి బురదవంటి మలంతో పూయబడతాయి. వాటి నునుపు, కాంతీ, బరువు,. ప్రభావమూ, రంగూ స్పర్శా నశిస్తాయి. ఇవి ఆ యా పదార్థాలకు విషస్పర్శ కలగడానికి చిహ్నాలు.



మూ. 1. విషప్రదస్య తు శుష్కశ్యావవక్త్రతా, వాక్సఙ్గః, స్వేదః, విజృమ్భణం, చాతిమాత్రం వేపథుః, ప్రస్ఖలనమ్,వాక్యవిప్రేక్షణమ్,ఆవేశః, కర్మణి స్వభూమౌ చానవస్థానమితి.

2 తస్మాదస్య జాఙ్గలీవిదో భిషజశ్చాసన్నాః స్యుః.

వ్యా. 1 ఆహారాదులలో విషం కలిపినవాని ముఖం ఎండిపోయి నల్లబడి పోతుంది. మాట తడబడుతుంది. చెమట పట్టుతుంది. ఆవలింతలు, ఎక్కువ వణకు, తొట్రుబాటు, పక్కవాళ్ల మాట వినబడకపోవడం లేదా మాటలాడుతూ ఇటూ అటూ చూడడం (వాక్యవిప్రేక్షణం) చేస్తున్న పనిలో కంగారు ఒకచోట నిలబడజాలకపోవడం కలుగుతాయి.

2. అందువలన భోజన సమయంలో విషవిద్యలో ప్రవీణులు, వైద్యులూ రాజుకు చుట్టుప్రక్కల ఉండాలి.

మూ. భిషక్ భైషజ్యాగారా దాస్వాదవిశుద్ధమ్ ఔషధం గృహీత్వా పాచకపేషకాభ్యామ్ ఆత్మనా చ ప్రతిస్వాద్య రాజ్ఞే ప్రయచ్ఛేత్. పానం పానీయం చౌషధేన వాఖ్యాతమ్.

వ్యా. వైద్యుడు తాను ముందుగా రుచి చూడడంచేత పరిశుద్ధమైనదని నిశ్చయించిన మందు, మందులు నిల్వచేసే ఇంట్లోనుండి తీసికొనివచ్చి, ముందుగా అది వంటవానిచేత, పప్పులు మొదలైనవి రుబ్బేవాడిచేత (పేషక) రుచి చూపింప చేసి, తానుకూడా రుచి చూచి అప్పుడు రాజుకు ఇవ్వాలి. పానము (మద్యం) పానీయమూ (మంచినీళ్లు) కూడ ఔషధంచేతనే వ్యాఖ్యానించబడింది. అనగా ఔషధం విషయంలో తీసికొనవలసిన జాగర్తలు వీటి విషయంలోకూడా తీసికోవాలి.

మూ. కల్పకప్రసాధకాః స్నాతశుద్ధవస్త్రహస్తాః సముద్రముపకరణమ్ అన్తర్వంశికహస్తాదాదాయ పరిచరేయుః.

వ్యా. మంగళ్లు, అలంకరించేవాళ్లూకూడ స్నానం చేసి, పరిశుద్ధములైన వస్త్రాలు ధరించి, చేతులు పరిశుద్ధంగా ఉంచుకొని ముద్రతో కూడిన, అనగా సీలువేసి ఉన్న సాధనాలు అంతఃపురరక్షకుడి దగ్గరనుండి తీసికొని రాజు దగ్గరికి (సేవార్థమై)రావాలి.

మూ. స్నాపకసంవాహకాస్తరకరజకమాలాకారకర్మ దాస్యః కుర్యుః, తాభిః అధిష్ఠితా వా శిల్పినః. ఆత్మచక్షుషి నివేశ్య వస్త్రమాల్యం దద్యుః.

స్నానానులేపన ప్రఘర్షచూర్ణవాసస్నానీయాని చ స్వవక్షోబాహుషు. ఏతేన పరస్మాదాగతకం చ వ్యాఖ్యాతమ్.

వ్యా. స్నానం చేయించేవాళ్ళు, ఒళ్లు పట్టేవాళ్లు, ఆసనశయనాదులమీద దుప్పట్లు మొదలైనవి (కప్పేవాళ్ళు) పరిచేవాళ్లు, చాకళ్లు, దండలు గుచ్చేవాళ్లు చేయవలసిన పనులన్నీ దాసీలు (ఆడబానిసలు female Slaves) చెయ్యాలి. లేదా ఆ దాసీల పర్యవేక్షణలో శిల్పులు (స్నాపకసంవాహకాదులు) చెయ్యాలి. వస్త్రాలు, పూలమాలలూ ముందుగా తమ నేత్రంమీద ఉంచుకొని (విషం లేదని పరీక్షకోసం) తరువాత రాజుకు ఇవ్వాలి. స్నానసమయంలో ఉపయోగించే ఒంటికి రాసుకునే వస్తువులు, ఒంటికి నలుగు పెట్టే చూర్ణాలు (ప్రఘర్షణచూర్ణ) వస్త్రాలు, స్నానసాధనాలు ముందుగా తమ వక్షస్థలాలమీదా, బాహువులమీదా కొంతసేపు ఉంచుకొని తరువాత రాజుకు ఇవ్వాలి. దీనిచేత ఇతరదేశాలనుండి వచ్చిన వస్తువు వ్యాఖ్యానించబడింది. అనగా ఇతర దేశాలనుండి, ఇతరులనుండి వచ్చిన వస్తువులను రాజుకు సమర్పించే ముందు ఈ జాగ్రత్తలు తీసుకోవాలి అని అర్థం.

మూ. కుశీలవాః శస్త్రాగ్నిరసవర్జం నర్మయేయుః. ఆతోద్యాని చైషామ్ అన్తస్తిష్ఠేయుః, అశ్వరథద్విపాలఙ్కారాశ్చ.

వ్యా. కుశీలవులు (అనగా రాజు ఎదుట నాట్యాభినయాదులు చేసేవాళ్లు (actors) శస్త్రప్రయోగమూ, అగ్నిప్రయోగమూ, రసప్రయోగము ఉండని ఆటలు మాత్రమే ప్రదర్శించాలి. వాళ్లు ఉపయోగించే వాద్యాలు, అశ్వాలంకారాలు, రథాలంకారాలు, గజాలంకారాలు అంతఃపురంలోనే ఉండాలి (ఆటల సమయంలో మాత్రమే అవి వాళ్లకి ఇవ్వాలని అర్థం).

మూ. మౌలపురుషాధిష్ఠితం యానవాహనమారోహేత్. నావం చాప్త నావికాధిష్ఠితమ్. అన్యనౌప్రతిబద్ధాం వాతవేగవశాం చ నోపేయాత్. ఉదకాన్తే సైన్యమాసీత. మత్స్యగ్రాహవిశుద్ధమవగాహేత. వ్యాలగ్రాహపరిశుద్ధముద్యానం గచ్ఛేత్.

వ్యా. విశ్వాసపాత్రులైన మనుష్యులు ఉన్న, లేదా పరీక్షించిన, యానమూ (బండి మొ.) వాహనమూ (అశ్వాదికమూ) ఎక్కాలి. అప్తుడైన నావికుడు (నావ నడిపేవాడు) ఉన్న పడవ ఎక్కాలి. మరొక పడవకి కట్టిన పడవనుగాని, గాలి ఎటు



ఉంటే అటు పోయే పడవ గాని ఎక్కకూడదు. (రాజు పడవలో ప్రయాణం చేస్తున్నప్పుడు రెండు గట్లమీదా) ఉదకసమీపంలో సైన్యం నిలిచి ఉండాలి. పల్లెవాళ్లు పరిశోధించిన పిమ్మటనే నీటిలో దిగాలి. పాములు పట్టేవాళ్లు పరిశోధించిన పిమ్మటనే ఉద్యానంలో ప్రవేశించాలి.

మూ. లుబ్ధకైః శ్వగణిభిః అపాస్తస్తేనవ్యాలపరాబాధభయం చలలక్ష పరిచయార్థం మృగారణ్యం గచ్ఛేత్.

2. ఆప్తశస్త్రగ్రాహాధిష్ఠితం సిద్ధతాపసం పశ్యేత్. మన్త్రిపరిషదా సామన్తదూతమ్. సన్నద్ధోఽశ్వం, హస్తినం, రథం వారూఢః సన్నద్ధమనీకం గచ్ఛేత్.

వ్యా. బోయవాళ్లు, కుక్కలు పెంచేవాళ్లు ముందుగా వెళ్లి దొంగలవల్ల, క్రూరమృగాలవల్ల, శత్రువులవల్ల భయం లేదని నిర్ణయించిన మృగారణ్యానికి (మృగాలు ఉండే అరణ్యానికి) చంచలమైన (కదిలే) లక్ష్యాన్ని కొట్టే నేర్పు సంపాదించడం కోసం (వేటాడడానికి) వెళ్లాలి.

2. శస్త్రం ధరించిన అప్తుడైన మనిషిని దగ్గర ఉంచుకొని (తన దర్శనంకోసం వచ్చిన) మునిని చూడాలి (ఇతడు శత్రువు పంపిన గూఢపురుషుడు కావచ్చును కదా?) సామంతరాజు పంపగా వచ్చిన దూతను మంత్రిపరిషత్తుతో కలిసి ఉండి చూడాలి. ఆయుధాదులతో సిద్ధంగా ఉన్న సైన్యాన్ని పరీక్షించడానికై వేళ్లేటప్పుడు సన్నద్ధుడై అనగా శిరస్త్రాణమూ కవచమూ మొదలైనవి ధరించి, అశ్వం గాని, గజం గాని, రథంగాని ఎక్కి వెళ్లాలి.

మూ. నిర్యాణేఽభియానే చ రాజమార్గముభయతః కృతారక్షం దణ్డిభిరపాస్తశస్త్రహస్త ప్రవ్రజితవ్యఙ్గం గచ్ఛేత్. న పురుషసంబాధమవగాహేత. యాత్రాసమాజోత్సవప్రహవణాని చ దశవర్గికాధిష్ఠితాని గచ్ఛేత్.

వ్యా. రాజప్రాసాదంనుంచి బైటకు వెళ్లేటప్పుడు గాని రాజప్రాసాదానికి వెళ్లేటపుడు గాని రాజమార్గానికి రెండు వైపుల రక్షకభటులు నిలిచి ఉండాలి. దండాలు చేతులలో ధరించిన రాజభటులు (దణ్డిభిః staff bearers ) రాజమార్గంలో ఉన్న శస్త్రహస్తులను (చేతులలో ఆయుధాలు ఉన్నవాళ్లను), సంన్యాసులను, అంగవికారం ఉన్న వాళ్లను రాజు కంట బడకుండా దూరంగా తొలగించాలి. కిక్కిరిసి

ఉన్న జనం మధ్యలోనికి వెళ్లకూడదు. దశవర్గికులు (కూడా పదిమంది భటులుండే రక్షాధికారులు (officers in command of ten soldiers each) ముందుగా వెళ్లి పరీక్షించిన పిమ్మటనే యాత్రలకి (fairs), సమాజాలకి (gatherings), ఉత్సవాలకీ, ప్రహవణాలకీ (ఉద్యానభోజనాదులు - parties ) వెళ్లాలి.

శ్లో. యథా చ యోగపురుషైరన్యాన్ రాజాధితిష్ఠతి
తథాయమన్యబాధేభ్యః రక్షేదాత్మానమాత్మవాన్.

*ఇతి కౌటిలీయార్థశాస్త్రే వినయాధికారికే ప్రథమాధికరణే ఏకవింశో ఽధ్యాయః ఆత్మరక్షితకమ్. ఏతావతా కౌటిలీయస్యార్థశాస్త్రస్య వినయాధికారికం ప్రథమమధికరణం సమాప్తమ్.*

వ్యా. రాజు యోగపురుషుల ద్వారా (గూఢపురుషాదుల ద్వారా) ఏ విధంగా ఇతర రాజులను పరీక్షిస్తూ ఉంటాడో (అనగా వాళ్లమీద ఒక కన్ను వేసి ఉంటాడో) అదే విధంగా ఇతరరాజులు యోగపురుషుల ద్వారా తనకు కలిగించే బాధలనుండి కూడా ప్రయత్నపూర్వకంగా తనను రక్షించుకోవాలి.

*"బాలానందిని" అనే కౌటిలీయార్థశాస్త్రాంధ్రవ్యాఖ్యానంలో వినయాధికారికమైన ప్రథమాధికరణంలో 'ఆత్మరక్షితకం' అనే ఇరవై ఒకటవ అధ్యాయం సమాప్తం. ఇంతటితో వినయాధికారికం అనే ప్రథమాధికరణం సమాప్తం.*

## అథ అధ్యక్షప్రచారః - ద్వితీయమ్ అధికరణమ్